www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 21-4-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 5 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 1.12 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తర సా. 5.08 తదుపరి హస్త; వర్జ్యం: రా. 2.31-4.19; దుర్ముహూర్తం: సా. 4.49-5.39; అమృతఘడియలు: ఉ. 9.00-10.49; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంకానా.. ఈ జగన్మాయలు!



అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం అని 'తాతా మనవడు' సినిమాలో ఒక పాట ఉంటుంది. అది అక్షరాలా నిజమని బాబాయ్ హత్య కేసులో జగన్మోహన్ రెడ్డి రుజువు చేస్తున్నారు. ఆయనకు అధికారం-డబ్బు మాత్రమే ముఖ్యం. మనుషులు, మమతలు కాదు అని చెప్పకనే చెబుతున్నారు.

జర్మనైజేషన్ పీరియడ్ అన్న హిట్లర్ మాటలను జర్మన్లు విశ్వసించారు. చివరకు దారుణంగా నష్టపోయారు. తాను పేదల పెన్నిధినని, ఆ పేదల జీవితాలు బాగుపడాలంటే, వాళ్లకు మేళ్లు జరగాలంటే తనకు అధికారం ఇవ్వాలని అంటున్న జగన్‌ను కూడా నాటి జర్మన్లవలె మన ప్రజల్లోనూ కొందరు ఎంతో కొంత నమ్ముతున్నారు.

ప్రజల బలహీనతలను ఔపోసనపట్టిన జగన్ రెడ్డి వంటి వారే క్లాస్ వార్ సిద్ధాంతాన్ని తెర మీదకు తెస్తారు. 'మీరు చెబుతున్నది నిజమే అయితే వేల కోట్ల సామ్రాజ్యాన్ని మీరు ఎలా నిర్మించుకున్నారు? మేమెందుకు పేదలుగానే మిగిలిపోయాం?' అని ఒకే ఒక ప్రశ్న వేస్తే జగన్ రెడ్డి వంటి వారి నిజ స్వరూపం బట్టబయలు అవుతుంది.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నవరస నటనా సార్వభౌముడు అన్న బిరుదు ఇవ్వవచ్చు. ముఖంలో దీనత్వం, క్రూరత్వాలను ఏకకాలంలో ప్రదర్శించగలరు. జనంలోకి వెళ్లినప్పుడు ఒకలా, జనంలో లేనప్పుడు మరోలా ఉంటారని ఆయన చుట్టూ ఉన్న వాళ్లు చెబుతారు.

తాను పేదల ప్రతినిధినని, పేదలకోసమే తన తపన అంతా అని చెప్పుకొంటూ చంద్రబాబు అండ్ కోను పెత్తందారులని దూషిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నిజంగా ఒంటరి వారేనా? 2019 ఎన్నికల వరకు పార్టీకి అండగా ప్రచారం చేసిన తల్లి వి జయమ్మ, చెల్లి షర్మిల ఇప్పుడెందుకు దూరమయ్యారో నిజాయితీగా చెప్పగలరా?

జగన్‌కు ఉన్నన్ని ఆస్తులు ఆయన చెబుతున్న పెత్తందారులకు లేవే? వేల కోట్ల రూపాయల విలువైన ప్యాలెస్‌లలో నివసించే జగన్ రెడ్డిని పేదల ప్రతినిధి అని అంగీకరిద్దామా? అధికారం అండతో ఇన్ని వేల కోట్ల రూపాయలు సంపాదించిన జగన్ రెడ్డి ఆపదలో ఉన్న ఏ ఒక్కరికైనా తన జేబులో నుంచి సొంత సొమ్ము తీసి ఇవ్వడాన్ని ఎవరైనా చూశారా? తన ముందుకు వచ్చి చేయి చాచిన వారికి రాజశేఖర రెడ్డి కాదనకుండా తన వద్ద లేకపోయినా అప్పు చేసి మరీ సహాయం చేసేవారు. ఈ లక్షణం జగన్‌లో ఉందని ఆయనకు చిడతలు కొడుతున్న వారు చెప్పగలరా?

కొత్త పలుకు

-ఆర్కే విశ్లేషణ 4లో..





కోరుకొండ సభలో పురందేశ్వరి, పవన్, రాజానగరం అభ్యర్థి బలరామకృష్ణ అభివాదం

సత్యవేడు నియోజకవర్గంలో జరిగిన ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ఉద్యోగాలు గంజాయి కావాలా?

ఏది కావాలో ప్రజలే తేల్చుకోవాలి: బాబు

- జగన్‌వి నకిలీ నవరత్నాలు.. మావి సూపర్ సిక్స్
- మేం గెలిచాక సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం
- సీఎం పదవి నాకు బాధ్యత.. జగన్‌కు దోపిడీ లైసెన్స్
- ఆయన కట్టింది ఊళ్లు కాదు.. పిచ్చుకగూళ్లు
- మేమొచ్చాక 2 సెంట్ల ఇళ్ల స్థలం
- నాసిరకం మద్యంతో జనాలకు జబ్బులు
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయే
- ప్రజాగళంలో టీడీపీ అధినేత ధ్వజం
- పొదలకూరు, సత్యవేడుల్లో భారీ సభలు
- గూడూరులో మహిళలతో ముఖాముఖి

దళితులకు మేమిచ్చిన 27 సంక్షేమ పథకాలనూ జగన్ రద్దుచేసి సామాజిక న్యాయం అంటాడు. దళితులపై 6 వేల కేసులు పెట్టించాడు. 188 మంది దళితులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి తెచ్చాడు. - చంద్రబాబు

(గూడూరు/పొదలకూరు/సత్యవేడు-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని.. జగన్ పార్టీ గెలిస్తే ఇంటింటికీ గంజాయి వస్తుందని.. అరాచకం పెరిగిపోతుందని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. తాము గెలిచాక అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా అమలు చేస్తామని.. ఏది కావాలో రాష్ట్ర ప్రజలే ఆలోచించుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత వారిదేనన్నారు. శనివారం ఆయన తిరుపతి

మిగతా 14వ పేజీలో...

పరదాల మహారాణి.. ఇక ఇంటికే!

జగన్‌కు ఆ సమయం వచ్చేసింది: పవన్

- ప్రతిసారీ నామీద పడి ఏడవడమే
- కనీసం పాలన కూడా చేతకానివాడు
- ఈ సీఎంతో అన్ని వర్గాలకు అన్యాయం
- బీసీల రిజర్వేషన్లు తగ్గించాడు
- కాపులకు ఈడబ్ల్యూఎస్ తీసేశాడు
- వైసీపీ కాపు నేతలు జవాబివ్వాలి
- నావల్ల తప్పు జరిగితే తల నరకండి
- క్రైస్తవులకు అండగా ఉంటా
- మళ్లీ వైసీపీ వస్తే ఆంధ్ర సర్వనాశనమే

మోదీ గ్యారెంటీతో జగన్‌ను జైలుకు పంపిస్తాం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఏలుతున్న పరదాల మహారాణి.. ఇంటికెళ్లిపోయే సమయం ఆసన్నమైందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. బస్సు యాత్రలో చిన్న పూలమూట తగిలితే డ్రామాలు కడుతూ కంటి పైన పెద్ద స్టిక్కర్ వేసుకుని తిరుగుతున్న సీఎంకు 30 వేలమంది

మిగతా 14వ పేజీలో...

65 ఏళ్లు దాటినా ఆరోగ్య బీమా

హెల్త్ ఇన్సూరెన్స్ వయో పరిమితి రద్దు

- క్యాన్సర్, గుండెజబ్బులు, ఎయిడ్స్ బాధితులకూ బీమా సదుపాయం కల్పించాలి
- ఇన్సూరెన్స్ వెయిటింగ్ కాలవ్యవధి 48 నెలల నుంచి 36 నెలలకు తగ్గింపు
- జబ్బుల గురించి పాలసీదారులు వెల్లడించకపోయినా బీమా వర్తించాల్సిందే
- వేర్వేరు వ్యాధుల చికిత్సకు నిర్ణీత బీమా సొమ్ము ఇచ్చేలా కంపెనీలు చర్యలు చేపట్టాలి
- మారటోరియం 8 ఏళ్ల నుంచి ఐదేళ్లకు.. ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయాలు
- నోటిఫికేషన్ విడుదల.. బీమా రంగ నిపుణుల హర్షం

2



మైగ్రెయిన్ మాయం!

- న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌తో బాధ నుంచి శాశ్వత విముక్తి
- ఆసియాలోనే తొలిసారి ఏఐజీలో చికిత్స
- నొప్పి సంకేతాలు మెదడుకెళ్లకుండా ఏర్పాటు
- మారిషస్ యువతికి ఆపరేషన్ సక్సెస్
- అన్ని రకాల దీర్ఘకాలిక నొప్పులకూ ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది: డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

2





బీజేపీ అధికారంలోకి వస్తే..

మళ్లీ ఎన్నికల బాండ్లు

- దీనిపై అన్ని వర్గాలతో సంప్రదింపులు
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- ఆమె వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

2

- దమ్ముంటే కేసు గురించి మాట్లాడండి
- మీరు చేసిన అభివృద్ధి గురించి చెప్పండి
- మీకు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పండి
- ఒకరి వ్యక్తిగత జీవితంతో మీకేంటి పని?
- నిందితుడికి ఎంపీ టికెట్ ఎందుకిచ్చారు?
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజం
- కడప ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు



రాయి తగిలితే హత్యాయత్నం..

గొడ్డలితో నరికితే గుండెపోటా?

కడప(ఆంధ్రజ్యోతి)/కోడుమూరు, ఏప్రిల్ 19: 'అధికారంలో ఉన్నవారు పెద్ద కొండల్లా తయారయ్యారు. ఇంత పెద్దవాళ్లు అడ్డుతగులుతుంటే.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతుంటే న్యాయమెలా జరుగుతుంది? జగన్మోహన్‌రెడ్డికి రాయి తగిలితే హత్యాయత్నం అంటూ పెద్దపెద్ద అక్షరాలతో కథనాలు రాస్తున్నారు. గొడ్డలితో ఏడుసార్లు నరికితే.. హార్ట్‌ఎటాక్ ఎలా అవుతుందో ఆయనే చెప్పాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. కడప పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల శనివారం నామినేషన్ దాఖలు చేశారు. సోదరి సునీత, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలసి కలెక్టర్ విజయరామరాజుకు నామినేషన్ పత్రాలు అందించారు. అనంతరం కలెక్టరేట్ వెలుపల ఆమె మీడియాతో మాట్లాడారు. 'వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి క్రూరంగా చంపిన విషయం మీకందరికీ తెలుసు. ఇప్పటికి ఐదేళ్లు అయింది. ఇప్పటి వరకు

మిగతా 3వ పేజీలో...

అన్నా వదినలకు షర్మిల బాకీ!

- రూ.82 కోట్లకుపైగా అప్పిచ్చారని వెల్లడి
- అన్న జగన్ ఇచ్చింది రూ.82.58 కోట్లు
- వదిన భారతి ఇచ్చింది రూ.19.56 లక్షలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో 8 కేసులు
- అఫిడవిట్‌లో వివరించిన పీసీసీ చీఫ్

14

'మార్గదర్శి'లో రోజాకు చిట్!

- రూ.39 లక్షల చిట్ వేసిన మంత్రి
- బెంజ్ సహా 9 కార్లు సొంతం
- ఐదేళ్లలో 40% పెరిగిన ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి
- ఇరకాటంలో అధికార పార్టీ

పరారే.. పరారే..

పరిశ్రమలు పరారే!

ఐదేళ్ల పాలనలో కొత్త పెట్టుబడుల్లేవ్

పట్టెడన్నంపై పగ

- 'అన్న క్యాంటీన్ల' అంతానికి జగన్ పంతం
- పట్టణ పేదలకు నాడు రూ. 5కే భోజనం
- రోజుకు రెండున్నర లక్షల మందికి వడ్డన

'ఆహా'..లో అదిరిపోయే రేట్లు



12 13

-సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..



పోస్టల్ బ్యాలెట్ మరింత సులభం!

- ఎలక్షన్ డ్యూటీ ఉన్నచోటే వినియోగం
- సెంట్రల్ ఎక్స్ఛేంజ్ విధానంలో ఉద్యోగి సొంత నియోజకవర్గానికి ఓటు చేరవేత
- దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 26

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగాన్ని ఎన్నికల సంఘం సరళతరం చేసింది. ఉద్యోగి ఏ జిల్లాలో, ఏ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైనా తాను విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును

మిగతా 2వ పేజీలో...

జగన్ కోసం హంస!

- నేడు కడపలో సర్వ సభ్య సమావేశం
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టని వైనం
- వెంకట్రామిరెడ్డికి అత్యంత సన్నిహితంగా సంఘం
- ప్రచారం కోసమే సమావేశమనే అనుమానాలు
- ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నేతల భేటీ
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకూ పిలుపు
- ఎన్నికల శిక్షణలో ఉన్న సచివాలయ సిబ్బంది



అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌ను ఆరాధిస్తూ, ఆయన కోసమే పని చేసే కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకులు స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారు. వారికి ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదు. జగన్ గెలుపు కోసం ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఇద్దరు ఉద్యోగ సంఘాల నేతలపై ఈసీ చర్యలు తీసుకున్నా జగన్‌ను ఆరాధించే ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు. తాజాగా ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే

మిగతా 14వ పేజీలో...

జగన్‌కూ జైలు తప్పదు!

- ఇక్కడి మద్యం స్కాం మా దృష్టికీ వచ్చింది: బీజేపీ
- వైసీపీ ప్రభుత్వ అవినీతిని బీజేపీ ఉపేక్షించడం లేదు
- విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మం!
- కేంద్ర విక్రయ జాబితాలో అది లేనేలేదు
- ఈసారి ప్రధాని పర్యటనలో అమరావతి, పోలవరంపై స్పష్టమైన ప్రకటన
- బీజేపీ సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ స్పష్టీకరణ
- మూడు పార్టీల సమన్వయ సమావేశం



11

వయనాడ్ నుంచీ రాహుల్ పరారే!

- వేరే సీటు చూసుకోవాల్సిందే: మోదీ
- కాంగ్రెస్ పాకుడు తీగలాంటిది
- ఆసరా ఇచ్చిన పార్టీలను మింగేస్తుంది
- ఎన్డీయే వైపే జనం మొగ్గు: ప్రధాని

2

తొలిదశలో 65%

- చాలా రాష్ట్రాల్లో గత ఎన్నికల కంటే తక్కువే
- లక్షద్వీప్‌లో అత్యధికంగా 83.88%
- బిహార్‌లో అత్యల్పంగా 48.50 శాతం

2

రేపే టెన్త్ ఫలితాలు

ఉదయం 11 గంటలకు విడుదల

3



ఎలక్టోరల్ బాండ్లు మళ్లీ తెస్తాం: నిర్మల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే అన్ని భాగస్వామ్య పక్షాలతో విస్తృత సంప్రదింపుల తర్వాత ఎలక్టోరల్ బాండ్లను ఏదో ఒక రూపంలో తిరిగి తీసుకురావాలని బీజేపీ భావిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు రద్దు చేసిన వివాదాస్పద రాజకీయ నిధుల పథకంపై తన విశ్వాసాన్ని ఆమె పునరుద్ఘాటించారు. 'భాగస్వామ్య పక్షాలతో ఇంకా చాలా సంప్రదింపులు జరపాల్సి ఉంది. అందరికీ ఆమోదయోగ్యమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి ఏం చేయాలో ఆలోచించాలి. పారదర్శకతను కొనసాగించడంతో పాటు ఇందులోకి నల్లధనం ప్రవేశించే అవకాశాలను పూర్తిగా తొలగించాలి' అని నిర్మల పేర్కొన్నారు. ఈ పథకంలోని కొన్ని అంశాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని సీతారామన్ అంగీకరించారు. నిర్మల వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఇప్పటికే రూ.4లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న తర్వాత కూడా ఇంకా దోపిడీని కొనసాగించాలని చూస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం అని సుప్రీంకోర్టు ప్రకటించిన బాండ్ల విధానాన్ని మళ్లీ వెనక్కు తెస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కర్ణాటకలో చెంబు రాజకీయం



'కేంద్రం కర్ణాటకకు ఇచ్చింది ఖాళీ చెంబు' అంటూ ఓ వార్తా పత్రికకు ఇచ్చిన ప్రకటన

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో చెంబు రాజకీయం జోరుగా సాగుతోంది. ప్రధాని మోదీ కర్ణాటకకు ఖాళీ చెంబు ఇచ్చారంటూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రకటనలు (అడ్వర్టయిజ్‌మెంట్స్) విడుదల చేసింది. కర్ణాటకకు ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చిన కానుక 'చెంబు' అంటూ... కరువు, వరదల పరిహారం చెంబు, రైతుల ఆదాయం రెట్టింపు చెంబు, అందరి ఖాతాలకు రూ.15లక్షలు జమ చెంబు.. అని ఆ ప్రకటనల్లో పేర్కొంది. తాము కట్టిన వంద రూపాయల పన్నులో రూ.13 వాపసు చేయడం చెంబేనని, రాష్ట్రం నుంచి ఎన్నికైన 25 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఇచ్చిన కానుక చెంబేనని పేర్కొంది. వీటిపై బీజేపీ రాష్ట్ర నేతలు తీవ్రంగా స్పందించారు. చెంబు పేరుతో అధికార కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కాగా, నగరంలో శనివారం మోదీ ఎన్నికల ప్రచారసభ జరిగే ప్యాలెస్ మైదానానికి సమీపంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా నేతృత్వంలో చెంబులతో ర్యాలీ చేశారు. సీఎం సిద్దరామయ్య ఇదే విషయమై మాట్లాడుతూ, కర్ణాటకకే కాకుండా దేశమంతటికీ ప్రధాని చెంబు ఇచ్చారన్నారు.

ఓటు వేయడం మరవకండి: జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఈ సాధారణ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పోగొట్టుకోవద్దని భారత చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ దేశ పౌరులకు ఉద్బోధించారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య దేశంలో ఇది పౌరుల ప్రధాన కర్తవ్యం అని పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్నికల సంఘం చేపట్టిన "మై వోట్... మై వాయిస్" కార్యక్రమానికి పంపిన వీడియోలో ఈమేరకు సందేశం ఇచ్చారు. పౌరులుగా ఓటు వేయడం మన అత్యంత ప్రధానమైన బాధ్యత.. అని తెలిపారు. "దేశం కోసం ప్రతి ఐదేళ్లకు ఐదు నిమిషాలు మాత్రమే మీరు వెచ్చించాలి... మనం ఆ పని చేయలేమా...?" అని ప్రశ్నించారు.

కేజ్రీవాల్ ఇన్సులిన్‌ను ఎప్పుడో ఆపేశారు

▸ మాత్రలే వేసుకుంటున్నారు: తిహాడ్ జైలు అధికారులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్..అరెస్టు కావడానికి కొద్ది నెలల ముందు నుంచే ఇన్సులిన్ తీసుకోవడాన్ని మానేశారని తిహాడ్ జైలు అధికారులు తెలిపారు. కేవలం మెటఫార్మిన్ మాత్రలు మాత్రమే తీసుకుంటున్నారని చెప్పారు. ఆయన శరీరంలో సుగర్ లెవెల్స్ మరీ ఆందోళనకరంగా లేవన్నారు. తెలంగాణకు చెందిన ఓ ప్రయివేటు డయాబెటిస్ వైద్యుని పర్యవేక్షణలో ఆయన చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వి.కె.సక్సేనాకు శనివారం సమర్పించిన నివేదికలో ఈ విషయాలను పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

మైగ్రెయిన్‌కు అత్యాధునిక చికిత్స

▸ న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌తో బాధ నుంచి శాశ్వత విముక్తి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక మైగ్రెయిన్‌కు ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. కొన్నేళ్లుగా మైగ్రెయిన్‌తో బాధపడుతున్న ఓ విదేశీ యువతికి ఏఐజీ ఆస్పత్రి.. న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్ వైద్య ప్రక్రియతో ఆ బాధ నుంచి విముక్తి కల్పించింది. ఈ ప్రక్రియ నిర్వహించిన రెండురోజులకే ఆ యువతికి మైగ్రెయిన్ పూర్తిగా తగ్గిపోయిందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ తరహా చికిత్సతో మైగ్రెయిన్‌ను నివారించటం ఆసియాలోనే ఇది మొదటిసారి అని చెప్పారు. మారిషస్‌కు చెందిన ఓ 24 ఏళ్ల యువతి దీర్ఘకాలికంగా మైగ్రెయిన్‌తో బాధపడుతున్నారు. తల, మెడ, కడుపు, వెన్ను భాగాల్లో భరించలేని నొప్పితో ఆమె సతమతమవుతున్నారు. గదిలో లైట్లు వేస్తే చూడలేని పరిస్థితి ఏర్పడటంతో ఆమె ఎక్కువసేపు చీకటిలోనే గడిపేవారు. పలు దేశాలకు వెళ్లి రకరకాల చికిత్స తీసుకున్నా కూడా ఉపశమనం లభించలేదు. చివరకు ఆమె హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు వైద్యులు హై సర్వైకల్ స్పైనల్ కార్డ్ స్టిమ్యులేటర్ ఇంప్లాంటేషన్ (న్యూరో స్టిమ్యులేటర్) ప్రక్రియను నిర్వహించారు. వెన్ను కింది భాగంలో పేస్‌మేకర్ లాంటి పరికరం ఏర్పాటు చేసి దాని ద్వారా సన్నని తీగలను తలలోని నరాలకు అనుసంధానించారు. దీని పనితీరును డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, న్యూరో మాడ్యులేషన్ డాక్టర్ సిద్ధార్థ్ చావలి వివరిస్తూ.. న్యూరోస్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌లో అమర్చిన సీసం ద్వారా చిన్న విద్యుత్ సంకేతాలు వెలువడతాయని, ఇవి నొప్పి సందేశాలు మెదడుకు చేరుకోక ముందే అడ్డగిస్తాయని, ఫలితంగా రోగులకు నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. తలనొప్పి, వెన్నునొప్పి మాత్రమే కాకుండా.. ఏ రకమైన దీర్ఘకాలిక నొప్పితో బాధపడే వారికైనా ఈ ప్రక్రియ ద్వారా నయం చేయవచ్చునన్నారు.

పోస్టల్ బ్యాలెట్... మరింత సులభం!

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా జిల్లా ఎన్నికల అధికారులకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న పీవోలు, ఏపీవోలు, పోలీసు సిబ్బంది, సెక్టార్ ఆఫీసర్లు, వీడియోగ్రాఫర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ డ్రైవర్లు, ఇతర అధికారులు ఈ నెల 26 లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫాం-12ను తాము పనిచేసే ప్రాంతంలోని ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు. వాటిని అధికారులు వారి సొంత నియోజకవర్గానికి పంపుతారు. ఒక జిల్లాలో విధుల్లో ఉన్న ఉద్యోగికి మరో జిల్లాలో ఓటు ఉంటే తాను పనిచేస్తున్న జిల్లా కేంద్రంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఈ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చు. ఇదే నిబంధన నియోజకవర్గాలకు కూడా వర్తిస్తుంది. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి మే 8 చివరి తేదీగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటు హక్కును వినియోగించుకోని ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లను మే 10న మూడో విడత ఎక్స్చేంజ్ ద్వారా ఆయా జిల్లాల నోడల్ అధికారులు సీఈవో కార్యాలయంలో మార్చుకుంటారు. కాగా, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకునేందుకు వీలుగా ఒక రోజు క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది.

శక్తిమంతులంతా ఏకమైంది నన్ను దించడానికే

కాంగ్రెస్ పాకుడు తీగ.. ఆసరా ఇచ్చిన పార్టీలను మింగేస్తుంది

అమేఠీలాగే వయనాడ్ నుంచీ రాహుల్ పరారే!.. మహారాష్ట్ర, కర్ణాటకల్లో మోదీ ప్రచారం

బెంగళూరు-ఆంధ్రజ్యోతి/నాందేడ్/పర్భణీ, ఏప్రిల్ 20: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. యూపీలోని కంచుకోట అమేఠీ మాదిరిగానే కేరళలోని వయనాడ్ నుంచీ ఆయన పారిపోవడం ఖాయమని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మహారాష్ట్రలోని నాందేడ్, పర్భణీ, కర్ణాటకలోని చిక్కబళ్లాపుర, బెంగళూరుల్లో జరిగిన ఎన్నికల సభల్లో ప్రసంగించారు. 'ఇండీ' కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, వామపక్షాలు కేరళలో పరస్పరం కుస్తీలు పడుతున్నాయని, అవమానించుకుంటున్నాయన్నారు. రాహుల్‌ను తాను కూడా అనని మాటలను(అమూల్ బేబీ) ఆ రాష్ట్ర సీఎం విజయన్ అంటున్నారని.. వయనాడ్‌లో ఈ నెల 26న పోలింగ్ ముగిశాక రాహుల్ కోసం కాంగ్రెస్ మరో సురక్షితమైన సీటు చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు (అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు కాంగ్రెస్ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు). దేశంలో నాలుగో వంతు సీట్ల కోసం విపక్ష కూటమి భాగస్వాములు పరస్పరం కొట్లాడుకుంటున్నాయని..జూన్ 4న ఫలితాల ప్రకటన తర్వాత జుట్లు జుట్లు పట్టుకుంటాయన్నారు. తొలిదశలో 102 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బూత్ స్థాయిలో బీజేపీ విశ్లేషించుకుందని.. ప్రజలు ఏకపక్షంగా ఎన్డీయేకే ఓట్లేశారని తేలిందని చెప్పారు. కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించేసిందన్నారు. తను ప్రధాని పదవి నుంచి దించివేయడానికి దేశ విదేశాల్లోని పెద్దపెద్ద, శక్తిమంతమైన వాళ్లంతా ఏకమయ్యారని మోదీ విమర్శించారు. అయితే నారీశక్తి, మాతృశక్తి ఆశీస్సులు, సురక్షాకవచంతో ఇలాంటి సవాళ్లను దాటుకుంటూ ముందుకుపోతానని తెలిపారు. కాంగ్రెస్ పాకుడు తీగలాంటిదని.. ఆసరా ఇచ్చిన పార్టీలను కబళిస్తుందని ధ్వజమెత్తారు. ప్రస్తుత ఎన్నికలు ప్రభుత్వ ఏర్పాటు కోసం మాత్రమే కాదని.. దేశాన్ని స్వావలంబన కలిగిన అగ్రరాజ్యంగా మలచడం కోసమని చెప్పారు. విపక్ష ఇండీ కూటమికి నాయకుడేలేడని.. భవిష్యత్తు విజన్ కూడా లేదని విమర్శించారు. వారిదంతా స్కాముల చరిత్రగా పేర్కొన్నారు. మూడో దఫా ప్రధానినైతే.. ఇంతవరకు ఇల్లు, గ్యాస్ కనెక్షన్, కుళాయి నీరు అందనివారికి కచ్చితంగా అందిస్తానని.. ఇది 'మోదీ గ్యారెంటీ' అని చెప్పారు. మహిళా సంక్షేమానికి తన ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. కర్ణాటకలో అవినీతి తారస్థాయికి చేరిందని.. దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ఓ విద్యార్థినిని కళాశాలలోనే హత్య చేశారని, భజన చేస్తే దాడులు చేస్తున్నారని విమర్శించారు. చిక్కబళ్లాపుర సభలో మాజీ ప్రధాని దేవెగౌడను మోదీ ప్రశంసించారు. 90 ఏళ్ల వయసులో కూడా ఉత్సాహం, నిబద్ధతతో పనిచేస్తున్నారని.. ఆయన తనకు స్ఫూర్తి అని తెలిపారు.

కమలం గూటికి ప్రియాంక సహాయకుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: కీలకమైన సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైన తర్వాత కూడా కాంగ్రెస్ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్.. హస్తం పార్టీని విలవిల్లాడేలా చేస్తోంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ సహాయకుడు తాజిందర్ బిట్టు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కార్యదర్శిగా, ఏఐసీసీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన శనివారం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సమక్షంలో కమలం గూటికి చేరిపోయారు. దీనికి ముందు పార్టీ ప్రాథమిక సభ్యత్వం, ఏఐసీసీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం.. ఫేస్‌బుక్ పోస్టులో మాత్రం.."బరువెక్కిన హృదయంతో పార్టీతో నాకున్న 35ఏళ్ల అనుబంధాన్ని వీడుతున్నా"అని పేర్కొన్నారు. దివంగత ఎంపీ సంతోఖ్ చౌధరి సతీమణి కరమ్‌జిత్ కౌర్ కూడా కాంగ్రెస్ వీడి బీజేపీ బాటపట్టారు. మధ్యప్రదేశ్‌లోనూ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ఎమ్మెల్యే హరివల్లభ్ శుక్లా సహా పలువురు సీనియర్లు పార్టీకి గుడ్‌బై చెప్పి కమలం గూటికి చేరారు. ఇటీవల అనేక మంది హైప్రొఫైల్ నేతలు పార్టీని వీడారు. అహ్మదాబాద్ తూర్పు నియోజకవర్గం లోక్‌సభ టికెట్ ఇచ్చాక కూడా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రోహన్ గుప్తా పార్టీకి గుడ్‌బై చెప్పారు.

మోదీ అవినీతి స్కూల్‌ను మూసేస్తాం

▸ రాహుల్ గాంధీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో నరేంద్రమోదీ అవినీతి స్కూల్‌ను నడుపుతున్నారని, తాము అధికారంలోకి రాగానే దాన్ని శాశ్వతంగా మూసేయిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ స్కూల్‌లో అవినీతి శాస్త్రం అనే సబ్జెక్టులోని ప్రతి అధ్యాయాన్ని ఆయనే బోధిస్తున్నారంటూ శనివారం ట్వీట్ చేశారు. వ్యాపార సంస్థలపై దాడులు చేయడం ద్వారా విరాళాలెలా సేకరించాలి? అవినీతిపరుల అవినీతిని వాషింగ్ మెషిన్‌తో ఎలా ప్రక్షాళన చేయొచ్చు? ఏజెన్సీలను రికవరీ ఏజెంట్లుగా మార్చడం ద్వారా బెయిల్-జైల్ ఆట ఎలా ఆడాలన్న పాఠాలను మోదీ బోధిస్తారని ఆరోపించారు.

రాహుల్ 7 విజయన్

▸ కేరళలో 'ఇండియా' పోరు తీవ్రం

▸ సీఎంపై కాంగ్రెస్ నేత విమర్శలు

▸ దీటుగా సమాధానం ఇచ్చిన కామ్రేడ్



తిరువనంతపురం, ఏప్రిల్ 20: ఇండియా కూటమిలో మిత్రపక్షాలైన కాంగ్రెస్-వామపక్షాల మధ్య కేరళలో మాత్రం రాజకీయ వేడి ఓ రేంజ్‌లో సాగుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కేరళ సీఎం పినరయి విజయన్‌ల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు వారం ముందు నుంచి వీరి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. "సీఎం పినరయి విజయన్‌ను ఈడీ, సీబీఐలు ఎందుకు ప్రశ్నించడం లేదు"అని శుక్రవారం రాహుల్ చేసిన వ్యాఖ్యలు.. విజయన్‌కు మంటపుట్టించాయి. దీంతో సీఎం విజయన్.. రాహుల్‌పై నిప్పులు చెరిగారు. అశోక్‌చవాన్ మాదిరిగా తాము భయపడబోమని కౌంటర్ ఇచ్చారు. కొజికోడ్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో విజయన్ మాట్లాడుతూ.. "వామపక్ష నేతలు జైలుకు వెళ్లేందుకు సైతం వెనుకాడరు. మీ నాయనమ్మ (ఇందిరా గాంధీ)ఎంతో మంది కమ్యూనిస్టు దిగ్గజాలను ఏడాదిన్నరకుపైగా జైల్లోపెట్టింది. అయినా అశోక్ చవాన్ మాదిరిగా మావాళ్లు ఏడవలేదు"అని బదులిచ్చారు. గతంలో మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్.. హస్తం పార్టీని వీడి బీజేపీ గూటికి చేరారు. దీనిని ప్రస్తావిస్తూ అప్పట్లో రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. "జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆయన(అశోక్ చవాన్) బాధపడ్డారు. మా అమ్మ (సోనియా) ముందు కన్నీరు పెట్టుకున్నారు"అని పేరు చెప్పకుండా వ్యాఖ్యానించారు. అయితే.. రాహుల్ వ్యాఖ్యలను చవాన్ కొట్టిపారేశారు. ఇవి నిరాధారమని, తాను ఏడవాల్సిన అవసరం లేదన్నారు. కాగా మోదీ ప్రభుత్వం సీఏఏ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడు రాహుల్ మౌనంగా ఎందుకున్నారని విజయన్ ప్రశ్నించారు. వయనాడ్ నుంచి పోటీచేస్తున్న సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై పోటీ చేసే స్థాయి రాహుల్‌కు ఉందా అని సీఎం ప్రశ్నించారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటల పోరు తీవ్రమైంది. ఈ క్రమంలోనే విజయన్‌పై ఆరోపణలున్నా సీబీఐ, ఈడీలు ఎందుకు ప్రశ్నించడంలేదని రాహుల్ అన్నారు.

విజయన్ రాజీపడ్డారు: ప్రియాంక

"సీఎం విజయన్ రాజీపడ్డారు. అందుకే బీజేపీని వదిలేసి, రాహుల్‌పై ఏకపక్షంగా విరుచుకుపడుతున్నారు"అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పతనంతిట్టలో పర్యటించిన ఆమె విజయన్‌పై విమర్శలు చేశారు. పలు కుంభకోణాలు, బంగారం స్మగ్లింగ్ వంటి తీవ్ర కేసుల్లో విజయన్ పేరు వెలుగుచూసినా బీజేపీనేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆయన విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు.

తొలిదశలో 65.5 శాతం పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: లోక్‌సభ తొలిదశ ఎన్నికల్లో 65.5 శాతం పోలింగ్ నమోదైంది. తొలిదశలో శుక్రవారం దేశవ్యాప్తంగా 102 నియోజకవర్గాలలో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. తమిళనాడులో మొత్తం 39 నియోజకవర్గాలు, రాజస్థాన్‌లో 12, యూపీలో 8, మధ్యప్రదేశ్‌లో 6 స్థానాలతో పాటు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలిదశలో ఎన్నికలు జరిగాయి. లక్షద్వీప్‌లో అత్యధికంగా 83.88 శాతం పోలింగ్ నమోదైంది. బిహార్‌లో అతితక్కువగా 48.5% మాత్రమే పోలింగ్ నమోదైంది. తమిళనాడులో 72.09% పోలింగ్ నమోదైనట్టు శుక్రవారం ప్రకటించిన ఎన్నికల సంఘం అధికారులు దానిని 69.46%గా శనివారం సవరించారు. కాగా, ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో 19న జరిగిన పోలింగ్ చెల్లదని, మళ్లీ నిర్వహించాలన్న ఈసీ ఆదేశాలతో సోమవారం మళ్లీ పోలింగ్ జరగనుంది.

మస్క్ భారత పర్యటన రద్దు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టెస్లా సీఈవో, మైక్రోబ్లాగింగ్ సంస్థ ఎక్స్ చీఫ్ ఈలాన్ మస్క్ భారత పర్యటన రద్దయింది. ఈ విషయాన్ని మస్క్ స్వయంగా ఎక్స్‌లో ప్రకటించారు. ఆది, సోమవారాల్లో ఆయన భారత్‌లో పర్యటించాల్సి ఉంది. ప్రధాని మోదీతో కూడా సమావేశానికి షెడ్యూల్ ఖరారైంది. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో 2-3 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఎంట్రీ-లెవల్ కార్ల తయారీ సంస్థ ఏర్పాటుపై ప్రకటన చేయాల్సి ఉండగా.. ఉన్నఫళంగా తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నెల 23న(మంగళవారం) అమెరికాలో టెస్లా ప్రథమ త్రైమాసిక పురోగతి సమావేశం సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. త్వరలో భారత్‌కు వస్తానని మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు. నిజానికి మస్క్ పెట్టుబడులను ప్రకటిస్తే.. మేకిన్ ఇండియా, ఉపాధికల్పన పరంగా గొప్ప పురోగతి ఉంటుందని మోదీ సర్కారు భావించింది. ఎన్నికల సమయంలో యువతను పెద్ద ఎత్తున ఆకట్టుకునే అవకాశాలుంటాయని రాజకీయవర్గాలు అభిప్రాయపడ్డాయి. కానీ, ఎన్నికల వేళ భారత్‌కు వెళ్లడం సరికాదని అమెరికా ప్రభుత్వ వర్గాలు చెప్పడం వల్లే.. మస్క్ తన పర్యటనను ఉన్నఫళంగా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో పరిస్థితులపై అమెరికా ఇటీవల నిరసన స్వరం వినిపిస్తోంది.

మోదీ ఓడిపోతారని తెలిసే

లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ ప్రధానిగా ఉండరని తెలిసినందువల్లే మస్క్ తన పర్యటనను రద్దు చేసుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ అన్నారు. "జరగబోయేదేమిటో మస్క్ తెలుసుకుని ఉంటారు. ఇండియా కూటమి కొత్త ప్రధాని మస్క్‌ను త్వరలో ఆహ్వానిస్తారు. విద్యుత్తు వాహనాలకు మరింత ప్రోత్సాహం ఉంటుంది' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

కన్నడనాట హోరాహోరీ!

దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోట

▸ బీజేపీకి దక్షిణాదిలో బలమున్న ఏకైక రాష్ట్రం

▸ ఉనికి కోసం జేడీఎస్ ఆరాటం

(బెంగళూరు-ఆంధ్రజ్యోతి)



కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల సమరం హోరాహోరీగా సాగుతోంది. మొత్తం 28 నియోజకవర్గాలకు రెండు విడతలుగా పోలింగ్ జరగనుంది. ఈనెల 26న 14 నియోజకవర్గాలకు, మే 7న మరో 14 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగనుంది. కాంగ్రెస్ పార్టీ సొంతంగా అన్ని స్థానాల్లో బరిలో ఉండగా.. బీజేపీ-జేడీఎస్ పొత్తుతో ముందుకెళ్తున్నాయి. బీజేపీ 25, జేడీఎస్ 3 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రాబల్యం కలిగిన లింగాయత సామాజికవర్గం నేత యడియూరప్ప ద్వారా బీజేపీ రాజకీయాలు కొనసాగిస్తోంది. జేడీఎస్‌తో పొత్తు వల్ల రెండో బలమైన సామాజికవర్గం ఒక్కలిగల మద్దతు కూటమికి కలిసి వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్‌లో సీఎం సిద్దరామయ్య బీసీ నేతగా గుర్తింపు కలిగి ఉన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు. బీజేపీకి లింగాయత, ఒక్కలిగల మద్దతు ఉండగా కాంగ్రెస్‌కు బీసీ, ఒక్కలిగలతోపాటు మైనారిటీలు అండగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు రెండు పార్టీలకూ ప్రతిష్ఠాత్మకమే. కాంగ్రెస్‌కు అనుకున్నన్ని స్థానాలు దక్కకపోతే ముఖ్యమంత్రి మార్పు, బీజేపీకి సీట్లు తగ్గితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు వంటి పరిణామాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లో కలహాలు..

కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక కంచుకోట అనే పేరుంది. ఒకప్పుడు దేశమంతటా కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం ఉన్నా, మాజీ ప్రధాని ఇందిరాగాంధీని చిక్కమగళూరు నుంచి గెలిపించడం దీనికి తార్కాణం. రాష్ట్రం నుంచి మరో కీలక ఎన్నికల్లో బళ్లారి నుంచి బీజేపీ నేత సుష్మాస్వరాజ్‌పై సోనియాగాంధీ విజయం సాధించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత కలహాలను తమకు అనుకూలంగా మార్చుకుని సత్తాచాటేందుకు బీజేపీ ఎత్తుగడలు వేస్తోంది. బీజేపీకి దక్షిణాదిలో ఆధిపత్యం ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. ప్రస్తుతం 28 మంది సిటింగ్ ఎంపీలలో 25 మంది బీజేపీ వారే. కాంగ్రెస్, జేడీఎస్‌లకు ఒక్కో ఎంపీ ఉన్నారు. మండ్య నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన సినీ నటి సుమలత బీజేపీకి మద్దతిస్తున్నారు. మొత్తంగా 28 స్థానాల్లో బీజేపీకి 26 మంది ఎంపీలున్నారు.

మోదీ ప్రచార హోరు..

గత కొన్ని సంవత్సరాలుగా జేడీఎస్ ప్రాబల్యం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం బీజేపీతో చేతులు కలపడం ద్వారా జేడీఎస్ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ ప్రచారంలో మోదీ కీలకంగా మారారు. ఇప్పటికే మోదీ ఆరు బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఇటీవల హిందువులపై చోటు చేసుకున్న సంఘటనలను, హుబ్బళ్లిలో విద్యార్థిని దారుణహత్యను బీజేపీ తన ప్రచారాస్త్రాలు తెరపైకి తెస్తోంది. మోదీ శనివారం ఎన్నికల ప్రచార సభలో కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. ఇదిలా ఉండగా, ఈసారి ఎన్నికల్లో రెబెల్స్ తీవ్ర ప్రభావం చూపుతున్నారు. బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్ప శివమొగ్గలో స్వతంత్రంగా పోటీ చేయడం, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పోటీ చేస్తున్న ధారవాడలో ఆరు లక్షలకుపైగా ఓటర్లు కలిగిన లింగాయత సామాజికవర్గానికి చెందిన మఠాధిపతి దింగాలేశ్వరస్వామి పోటీ చేయడం బీజేపీకి ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ పార్టీలోనూ రెబెల్స్ బెడద వెంటాడుతోంది. కాగా, మూడు సంస్థలు నిర్వహించిన ఎన్నికల సర్వేల్లో విభిన్నమైన ఫలితాలు వెలువడ్డాయి.

కలిసివచ్చిన 5 గ్యారెంటీలు..

కాంగ్రెస్ పార్టీకి శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీల హామీలు బాగా కలిసివచ్చాయి. వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. దీంతో, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన స్థానాలు వస్తాయని పలు సర్వేలు అంచనా వేస్తున్నాయి. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'పే సీఎం', 40% కమీషన్ వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు.. కేంద్రం కర్ణాటకకు అన్నింటా ఖాళీ చెంబు చూపుతోందని వ్యంగాస్త్రాలు సంధిస్తూ ప్రకటనలిస్తోంది.

ఆరోగ్య బీమా.. 65 ఏళ్లు దాటినా



హెల్త్ ఇన్సూరెన్స్ వయో పరిమితి రద్దు.. ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఆరోగ్య బీమా రంగంలో పాలసీదారుల ప్రయోజనానికి పెద్ద పీట వేస్తూ 'భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సాధికారిక సంస్థ' (ఐఆర్‌డీఏఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 65 ఏళ్ల వయో పరిమితిని తొలగించింది. తద్వారా ఇకపై 65 ఏళ్లకు పైబడిన వారు కూడా ఆరోగ్య బీమా చేసుకోవటానికి వీలవుతుంది. ఏప్రిల్ 1 నుంచే ఈ కొత్త నిర్ణయం అమల్లోకి వస్తుందని ఐఆర్‌డీఏఐ తెలిపింది. ఇక మీదట అన్ని వయసుల వారికి సరిపోయే ఆరోగ్య బీమా పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలు తీసుకొస్తాయని ఆశిస్తున్నామని పేర్కొంది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు అవసరమైన సేవలను అందించాలని, బీమా చెల్లింపులకు (క్లెయిమ్స్‌కు) సంబంధించి వారి కోసమే ప్రత్యేకంగా కొన్ని విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించింది. క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, ఎయిడ్స్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూడా ఆరోగ్య బీమా పథకాలను అందించాలని, ఆ వర్గాలకు ఇన్సూరెన్స్ నిరాకరించటం ఇక మీదట కుదరదని బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. ఆరోగ్య బీమా తీసుకున్న తర్వాత అన్ని వ్యాధులకూ అది వర్తించటానికి ప్రస్తుతం అమలులో ఉన్న 48 నెలల వెయిటింగ్ పీరియడ్‌ను 36 నెలలకు ఐఆర్‌డీఏఐ తగ్గించింది. పాలసీదారు తన జబ్బుల గురించి వెల్లడించినా, వెల్లడించకపోయినా.. బీమా తీసుకున్న 36 నెలల తర్వాత అన్ని జబ్బులకూ బీమా ఇవ్వాల్సిందేనని ఇన్సూరెన్స్ కంపెనీలను ఆదేశించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో తీసుకున్న చికిత్స వ్యయాన్ని భరించేలా ఆరోగ్య బీమా పథకాలు ఉంటున్న విషయం తెలిసిందే. దీని బదులుగా నిర్దిష్ట వ్యాధులకు నిర్దిష్ట బీమా సొమ్ము కంపెనీలు అందించాలని, తద్వారా పాలసీదారులకు తమ వద్ద ఉన్న బీమా పథకం గురించి ముందే స్పష్టత ఉంటుందని ఐఆర్‌డీఏఐ తెలిపింది. ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ మార్పు దిశగా క్రమంగా కార్యాచరణ చేపట్టాలని పేర్కొంది. ఆరోగ్య బీమాపై మారటోరియం వ్యవధిని కూడా ఇప్పుడున్న 8 ఏళ్ల నుంచి ఐదేళ్లకు తగ్గించింది. అంటే, ఐదేళ్లపాటు ప్రీమియం చెల్లిస్తే బీమా పథకంలోని అన్ని సేవలనూ పాలసీదారులకు కంపెనీ అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఆర్‌డీఏఐ తీసుకున్న నిర్ణయాలపై బీమా రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయాలతో దేశంలో మరింత సమ్మిళిత ఆరోగ్య సేవలకు అవసరమైన వాతావరణం నెలకొంటుందని, ఇన్సూరెన్స్ కంపెనీలు వైవిధ్యపూరిత సేవలు అందించటానికి వీలు కలుగుతుందన్నారు.


ఖాజీపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, పక్కన పుట్టా సుధాకర్ యాదవ్

జగన్‌ది సైకో పాలన

- ఇక ఈ జన్మలో అధికారంలోకి రాలేడు
- హంతకుల కుటుంబం పోటీలో ఉంది
- వివేకా కేసులో త్వరలో ఊహించని పరిణామాలు
- మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి

ఖాజీపేట, ఏప్రిల్ 20: 'సీఎం జగన్మోహన్‌రెడ్డి సైకో పరిపాలన చేస్తున్నాడు. ఈ జన్మలో ఇక అధికారంలోకి రాలేడు' అని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. శనివారం డీఎల్ స్వగృహంలో ఆయనను మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఇద్దరూ టీడీపీ ప్రజారథం ఎక్కారు. ఈ సందర్భంగా డీఎల్ మాట్లాడుతూ.. 'గత ఎన్నికల్లో తప్పుడు నిర్ణయాలతో తప్పుడు వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోపెట్టాం. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. నాకు తెలిసి ఇక ఈ జన్మలో జగన్ అధికారంలోకి రాలేడు. ఎంపీగా అయితే హంతకుడు పోటీలో ఉన్నాడు. వైసీపీకి మద్దతు ఇవ్వాలని హంతకుడి మామ, మరో హంతకుడు నా దగ్గరకు వచ్చారు. మావాడు హంతకుడు కాదంటే నేను నమ్ముతానా? వివేకానందరెడ్డి హత్య కేసులో ఊహించని పరిణామాలు ఉంటాయి. మృతిచెందిన వివేకానందరెడ్డిని చూసి గొడ్డలిపోటు అని చెప్పి, కోడికత్తి డ్రామా ఆడి గత ఎన్నికల్లో సింపతీ సంపాదించారు. ఇప్పుడేమో గులకరాయి అని డ్రామా ఆడుతున్నారు. ఇలాంటివి ప్రజలు గమనిస్తున్నారు' అని డీఎల్ అన్నారు.

రేపే టెన్త్ ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ విజయవాడలో ఫలితాలు విడుదల చేస్తారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు మొత్తం 7.24 లక్షల విద్యార్థులు నమోదు చేసుకోగా.. 96 శాతం మంది పరీక్షలు రాశారు. వారిలో 6.23 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 1.02 లక్షల మంది తిరిగి నమోదుచేసుకున్న వారున్నారు.

విద్యార్థుల వికాసానికి అధ్యాపకులు కృషి చేయాలి

- జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్



గుంటూరు(విద్య), ఏప్రిల్ 20: విద్యార్థుల సమగ్ర వికాసం కోసం అధ్యాపకులు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. శనివారం గుంటూరు హిందూ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. హిందూ విద్యా సంస్థల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు, ఉపాధ్యక్షులు మాజేటి వీఆర్ఎస్ ప్రసాద్, కార్యదర్శి చింతల పాటి వేంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయి తగిలితే హత్యాయత్నం.. గొడ్డలితో నరికితే గుండెపోటా?

(మొదటి పేజీ తరువాయి)

న్యాయం జరిగిందా? రాజశేఖర్‌రెడ్డి తమ్ముడి విషయంలోనే న్యాయం చేసుకోలేకపోయారంటే.. వైఎస్ కుటుంబం అధికారంలో ఉండి ఏం లాభం? న్యాయం కోసం వివేకానందరెడ్డి బిడ్డ తొక్కని గడప లేదు, తట్టని తలుపు, ఎక్కని మెట్లు లేవు. ఐదేళ్లుగా పోరాడుతూనే ఉంది. ఈ రోజు నేను పోటీ చేస్తున్నానంటే అది న్యాయం కోసమే. మీరు న్యాయం వైపా, లేక నేరం వైపా.. అనేది ప్రజలందరూ నిర్ణయించుకోవాలి.. జగన్ ఐదేళ్లుగా అవినాశ్‌రెడ్డిని కాపాడుతున్నారు. అవినాశ్‌రెడ్డి నిందితుడని సీబీఐ సాక్ష్యాలు, ఆధారాలు చూపుతోంది. చంపిన వాళ్లు, చంపించిన వాళ్లు ఒకే ప్రదేశంలో ఉన్నారు అని గూగుల్ టేకౌట్ ద్వారా గుర్తించామని చెబుతోంది. ఫోన్‌లో మాట్లాడుకున్నారని, లావాదేవీలు జరిగాయని, అడ్వాన్స్‌లు తీసుకున్నారని స్పష్టం చేస్తోంది. ఇవన్నీ హత్య జరిగినరోజు మాకు తెలియవు. సీబీఐ దర్యాప్తు చేసి చెబుతున్నదే మేమూ చెబుతున్నాం. సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నప్పటికీ ఎందుకు శిక్ష పడలేదు?

సీబీఐ విచారణంటే భయమెందుకు?

జగన్మోహన్‌రెడ్డికి మొన్న ఒక రాయి తగిలింది.. దానిపై ఆయన పేపర్‌లో హత్యాయత్నం అని పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు. గురిచూసి కాల్చడం కాదు.. ఒక రాయితో హత్య చేయాలని చూశాడట... అది కూడా ఒక కుర్రోడు. దానికి హత్యాయత్నం అని పెద్ద బ్యానర్ రాశారు. జగన్ సమాధానం చెప్పాలి. ఒక రాయి తగిలితే మీకది హత్యాయత్నంలా కనిపించింది.. అదే వివేకానందరెడ్డిని గొడ్డలితో ఏడుసార్లు నరికి నరికి చంపితే... ఆయన తలలో ఎముకలు, మెదడు బయటకు కనిపించాయి. అలాంటిది మీకు హార్ట్‌అటాక్ అని ఎలా అనిపించింది? వివేకానందరెడ్డి చనిపోతే సీబీఐ ఎంక్వైరీ కావాలన్న జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎందుకు వద్దన్నారు? సీబీఐ విచారణ చేసుకుంటే మీకేంటి భయం? సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నా ఐదేళ్లుగా అవినాశ్‌రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారు? అదే అవినాశ్‌రెడ్డికి టికెట్ ఎందుకు ఇచ్చారో జగన్ సమాధానం చెప్పాలి. వీటి గురించి జగన్ మాట్లాడరు. అయితే వివేకానందరెడ్డి వ్యక్తిగత జీవితం గురించి ఎంతగా అవమానిస్తున్నారో చూస్తున్నాం. ఎవరి వ్యక్తిగత జీవితం వారిది కాదా? ప్రజానాయకుడు అయితే... వ్యక్తిగత జీవితం ఉండకూడదా? కేసు గురించి మాట్లాడే దమ్ముంటే మాట్లాడండి, మీరు చేసిన అభివృద్ధి గురించి మాట్లాడండి, మీకు ఎందుకు ఓట్లు వేయాలో చెప్పండి.. ఇదంతా మానేసి వివేకానందరెడ్డి వ్యక్తిగత జీవితాన్ని బయటపెట్టి అవమానించే హక్కు మీకెక్కడిది? ఎమ్మెల్సీగా పోటీ పెట్టినపుడు ఆయన వ్యక్తిగత జీవితం గురించి మీకు తెలియదా? అవినాశ్‌రెడ్డి కోసం ఆఖరి నిమిషం వరకు ఎన్నికల ప్రచారానికి తిరిగాడే.. అప్పుడు తెలియదా ఆయన వ్యక్తిగత జీవితం గురించి? అందుకే రాజశేఖర్‌రెడ్డి బిడ్డ, వివేకానందరెడ్డి బిడ్డ కొంగుచాచి అడుగుతున్నారు..


కడప ఎంపీ స్థానానికి కాంగ్రెస్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్ షర్మిల

న్యాయం చేయండి. మేము మీ ఆడబిడ్డలం.. ఇక్కడ పుట్టిన వాళ్లం. ఎక్కడెక్కడో తిరిగి న్యాయం జరగకపోతే ప్రజాకోర్టుకు వచ్చాం. ప్రజలే న్యాయం చేస్తారని ఆశపడుతున్నాం.. మీరు న్యాయంవైపు నిలబడతారని, నేరం వైపు కాదని నిరూపించాలి' అని షర్మిల కోరారు. 'ఐదేళ్లుగా సునీత ఎంతగా పోరాటం చేసిందో ప్రజలందరూ చూశారు. ఈ ఐదేళ్లలో న్యాయం జరిగి ఉంటే ఆమెకు రోడ్లమీద తిరిగే పరిస్థితి ఉండేది కాదు. నేను ఇక్కడకు వచ్చి పోటీ చేయాల్సిన అవసరం కూడా ఉండేది కాదు. న్యాయం జరగలేదు కాబట్టి ఇపుడు ప్రజాకోర్టులో న్యాయం కోరే అవకాశం వచ్చింది కాబట్టి, కొంగుచాచి న్యాయం చేయండని అడుగుతోంది. ఇందులో తప్పేముంది?' అని షర్మిల ప్రశ్నించారు.

కడపలో షర్మిలకు ఘనస్వాగతం

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడప పార్లమెంట్‌కు నామినేషన్ వేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఇడుపులపాయలో నామినేషన్ పత్రాలను వైఎస్ సమాధిపై ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం కడపకు చేరుకుని ఐటీఐ, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు, కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యారు. కడపలో చాలా ఏళ్ల తర్వాత షర్మిల రాకతో కాంగ్రెస్ జెండాలు మళ్లీ పెద్ద సంఖ్యలో కనిపించాయి.

పోలీసుల అత్యుత్సాహం

షర్మిల నామినేషన్ సందర్భంగా ర్యాలీగా వస్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం వైసీపీ సిటింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తే ఆయనవెంట పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులను అనుమతించారు. శనివారం మాత్రం 100 మీటర్ల దూరంలో ఉన్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు. షర్మిల రాక సందర్భంగా ఇద్దరు డీఎస్పీలు బందోబస్తును పర్యవేక్షించారు. షర్మిల నామినేషన్ సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వివేకా హత్యను ఎన్నికలకు వాడుకున్నారు: షర్మిల

'2019లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగితే నారాసుర రక్తచరిత్ర అని ఎన్నికలకు బాగా వాడుకున్నారు. ఐదేళ్లు అయినా న్యాయం జరగకపోతే.. ఇప్పుడు మేము అడుగుతుంటే మాట్లాడకూడదని అంటున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రజలు గమనించాలి' అని షర్మిల అన్నారు. శనివారం కడప పార్లమెంట్‌కు నామినేషన్ వేసిన అనంతరం ఆమె రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కడప ఎంపీ స్థానానికి నామినేషన్ వేశా. రాజశేఖర్‌రెడ్డిని, వివేకానందరెడ్డిని వాళ్లు చేసిన పనులను గుర్తుపెట్టుకుని ఓటు వేస్తారని పూర్తి నమ్మకంతో ఉన్నా. రైట్ టు స్పీచ్ అనే రాజ్యాంగ హక్కుకు కూడా విలువ లేకుండా మేము మాట్లాడకూడదు అన్నట్లు గ్యాగ్ ఆర్డర్ తీసుకొచ్చారు. చిన్న రాయితో కొడితేనే మీకు హత్యాయత్నంలా ఉంటే వివేకానందరెడ్డిని ఏడుసార్లు నరికితే మీ పత్రికలో హార్ట్‌అటాక్ అని ఎందుకు వచ్చిందో జగన్ సమాధానం చెప్పాలి. అవినాశ్‌రెడ్డి దోషి అని సీబీఐ చెబుతున్నా.. కర్నూలులో నిందితుడిని అరెస్టు చేయడానికి వస్తే రాష్ట్ర పోలీసులనే కంచెగావేసి అధికార దుర్వినియోగానికి పాల్పడి ఎందుకు కాపాడారు? వివేకాను చంపించడం ఒక ఎత్తు అయితే..ఈ ఐదేళ్లలో ఆయన వ్యక్తిత్వాన్ని 500సార్లు హత్య చేశారు. ఆయన బిడ్డను కూడా వదిలిపెట్టకుండా దూషిస్తూనే ఉన్నారు, బెదిరిస్తూనే ఉన్నారు. మీకోసం పాదయాత్ర చేసి, మీ గెలుపు కోసం పనిచేసిన నన్ను కూడా రాజశేఖర్‌రెడ్డి బిడ్డవు కావు అని విజయమ్మను అవమానించే స్థాయికి దిగజారారే.. అసలు మీది గుండెనా బండనా.. మనసు, మానవత్వం అనేవాటి గురించి మీకు తెలుసా? మేం న్యాయం కోసం పోరాడుతున్నాం, హత్యా రాజకీయాలను ప్రోత్సహించకండి. ఇలాంటి వారు చట్టసభలకు వెళ్లకూడదు. వీళ్లు అధికారంలో ఉండడానికి వీలు లేదు. రాజశేఖర్‌రెడ్డి బిడ్డను గెలిపించండి.. ఇక్కడే మీకు తోడుగా, అండగా ఉంటా.. మీకోసం కొట్లాడతా' అని షర్మిల హామీ ఇచ్చారు.

ఓట్ల కోసం జనంలోకి జగన్: షర్మిల

'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని చూస్తే కుంభకర్ణుడు గుర్తుకొస్తున్నాడు. ఐదేళ్లపాటు ఇంట్లో కుంభకర్ణుడిలా ఉంటూ ఇప్పుడు ఓట్ల కోసం జనంలో తిరుగుతున్నాడు' అంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఏపీ న్యాయ్‌యాత్ర'లో భాగంగా శనివారం కర్నూలు జిల్లా కోడుమూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. 'గుండ్రేవుల ప్రాజెక్టు వైఎస్ కల. ప్రాజెక్టు పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగు నీరు అందించాలని వైఎస్ఆర్ అనుకున్నారు. ఆయన మరణం తర్వాత దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. జగన్ హామీ ఇచ్చి కూడా ఇంతవరకూ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయాడు. తుంగభద్ర నుంచి చుక్క నీరు తీసుకురాలేదు. కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాడు. 2019 ఎన్నికల ముందు చేనేత కార్మికులకు రుణమాఫీ అన్నారు. ఇచ్చిన హామీని మరిచి చేనేత కష్టాల వైపు కన్నెత్తి చూడలేదు. రైతులకు ధర స్థిరీకరణ నిధి కింద రూ.3వేల కోట్లు ఏర్పాటు చేస్తానని వారిని నట్టేట ముంచేశాడు. మద్యపాన నిషేధం అని చెప్పి ప్రభుత్వమే నాసిరకం మద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదా కల్పించడంతో పాటు ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుంది' అని షర్మిల హామీ ఇచ్చారు.

నిలదీశాడని జనసేన నేతపై వైసీపీ దాడి

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని అనుచరుల వీరంగం
- ముస్లిం నేతపై దాడితో ఆగ్రహించిన గ్రామస్థులు
- ఎమ్మెల్యే ప్రచార రథం ముట్టడి.. ఉద్రిక్తత
- మా ఊరికొచ్చి మాపైనే దాడి చేస్తారా అని నిలదీత
- క్షమాపణలు చెప్పాలని రోడ్డుపై బైఠాయింపు
- ప్రచారం ముగించి కాటసాని పలాయనం


తడకనపల్లె గ్రామంలో ఆందోళనకారులకు సర్దిచెబుతున్న పోలీసులు

కర్నూలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో లబ్ధికి ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం తగదని నిలదీసిన ముస్లిం యువకుడు, జనసేన నాయకుడు షేక్ సలాంపై పాణ్యం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు దాడికి దిగారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో ఈ ఘటన జరిగింది. కల్లూరు మండలం తడనకపల్లెలో రాంభూపాల్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారానికి వచ్చారు. సాయంత్రం రామయ్యతాత దేవాలయం సర్కిల్ వద్ద ప్రచారం రథంపై నుంచి కాటసాని మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబుపై విమర్శలు చేశారు. 'టీడీపీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలు ఫేక్.. వాటిని చంద్రబాబు రద్దు చేశారు' అని చెప్పడంతో సలాం అభ్యంతరం వ్యక్తం చేశారు. 'అన్నా..! మీరు ప్రజలకు తప్పుడు సమాచారం ఎందుకు ఇస్తున్నారు.. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు రద్దు చేశారు' అని నిలదీశారు. దీంతో 'మా నాయకుడినే ప్రశ్నిస్తావా..' అంటూ ఎమ్మెల్యే అనుచరులు రెచ్చిపోయి సలాంపై దాడికి దిగారు. అయితే.. గ్రామస్థులంతా ఏకమై మా ఊరికి వచ్చి మా గ్రామ యువకుడిపైనే దాడి చేస్తారా..? అంటూ కాటసాని ప్రచారాన్ని అడ్డుకుని రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉల్లిందకొండ ఎస్ఐ నరేశ్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. ఆ తరువాత ఎమ్మెల్యే ప్రచారాన్ని అర్థాంతరంగా ముగించి వెళ్లిపోయారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇంకానా... ఈ జగన్మాయలు!

■ ఆర్కే RK



కొత్తపలుకు

వ్యూహాలైనా, పథకాలైనా రాజకీయాల్లో ఒక్కసారే ఉపయోగపడతాయి. ఒక ఎన్నికల్లో అమలు చేసిన వ్యూహాన్నే మరో ఎన్నికలో కూడా అమలు చేస్తే ఫలితాన్ని ఇవ్వదు. ప్రజలను ఆకర్షించే పథకాలు కూడా అంతే! అమలులో ఉన్న పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తారు. 2019 ఎన్నికల్లో బాబాయ్ హత్య కోడి కత్తి కేసు జగన్మోహన్ రెడ్డికి ఉపయోగపడ్డాయి. ప్రస్తుత ఎన్నికల్లో అదే బాబాయ్ హత్య కేసు ఆయనకు రాజకీయంగా ఎంతో కొంత నష్టం కలిగించబోతోంది. దీంతో వైసీపీ నాయకుడు ఒకరు కడప న్యాయస్థానాన్ని ఆశ్రయించి బాబాయ్ హత్య కేసు గురించి డాక్టర్ సునీత, వైఎస్ షర్మిలతో పాటు ప్రతిపక్ష నాయకులు ఎవరూ ఆరోపణలు చేయకుండా స్టే తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా న్యాయస్థానం తన పరిధిని

> ఎక్కడో పులివెందులలో వివేకానంద రెడ్డిని నరికి చంపితే మాకొచ్చిన నష్టం ఏమిటి? అని ప్రజలు భావించడాన్ని మించిన దౌర్భాగ్యం ఉంటుందా? రేపు తమకు కూడా అదే గతి పడితే పరిస్థితి ఏమిటి? అని ఆలోచించకుండా చేయడమే జగన్ అనుసరిస్తున్న క్లాస్ వార్ లక్ష్యం. డాక్టర్ సునీత ఐదేళ్లుగా అలుపెరుగని పోరాటాన్ని చేస్తున్నప్పటికీ ఆమెను అభినందించక పోగా విమర్శిస్తున్న వాళ్లు ఉన్నారంటే అందుకు జగన్ అమలు చేస్తున్న మోడల్ కారణం కాదా? విషాదమేమిటంటే వైఎస్ కుటుంబంలో రాజారెడ్డిని దారుణంగా హత్య చేశారు. ఆయన కుమారుడైన రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దారుణ పరిస్థితుల్లో మరణించారు. శరీర భాగాలు కూడా సరిగ్గా దొరకలేదు. ఐదేళ్ల క్రితం రాజశేఖర్ రెడ్డి సోదరుడైన వివేకానంద రెడ్డిని అత్యంత కిరాతకంగా నరికి చంపారు. అధికారంగానీ, డబ్బుగానీ ఈ చావులను నివారించ లేదే? పులివెందుల రక్తచరిత్ర కాదా ఇది?


అతిక్రమించింది. ఆ విషయం తర్వాత చర్చించుకుందాం! గత ఎన్నికల్లో కోడి కత్తి తరహాలో ఇప్పుడు గులకరాయి కేసును జగన్ అండ్ కో తెర మీదకు తెచ్చారు. విజయవాడలో బస్సుయాత్ర సందర్భంగా జనంలో నుంచి ఎవరో చిన్న రాయి విసరగా అది తగిలి జగన్మోహన్ రెడ్డి ఎడమ కంటి పైన స్వల్పంగా గాయమైంది. అంతే.. ముఖ్యమంత్రిని హత్య చేయడానికి చంద్రబాబు అండ్ కో కుట్ర పన్నారని వైసీపీ నాయకులు మూకుమ్మడిగా ఆరోపించారు. గాయం చిన్నదే అయినా కుట్లు వేశారని చెప్పుకొన్నారు. నిజానికి వైద్యులు కుట్లు వేయాలంటే గాయం లోతుగా ఉండాలి. మనం చూసిన దాని ప్రకారం ముఖ్యమంత్రి గాయం లోతుగా లేదు. అయితే ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించినట్టు ఫొటోలు దిగి ప్రచారం చేసుకున్నారు. కోడి కత్తి ఘటన సందర్భంగా ఇలాగే కుట్లు వేశామని చెప్పుకొన్న వైద్యుడికి జగన్ ప్రభుత్వంలో పదవి కట్టబెట్టారు. గులక రాయి ఘటన జరిగి వారం రోజులవుతోంది. అయినా ముఖ్యమంత్రి జగన్ కంటి పైభాగంలో బాండెయిడ్ వేయించుకొని జనంలో తిరుగుతున్నారు. మనబోటి వాళ్లకు అలాంటి గాయమై ఉంటే ఈపాటికి ఎప్పుడో మానిపోయి ఉండేది. జగన్‌రెడ్డికి ప్రజల సానుభూతి కావాలి కనుక ఎన్నికల ప్రచారం జరిగినన్ని రోజులూ నుదిటిపై ఆ పట్టీ అలాగే ఉండవచ్చు. కోడి కత్తి సంఘటన జరిగినప్పుడు విజయసాయిరెడ్డి వంటి వారు మీడియాతో మాట్లాడుతూ, కోడి కత్తి కొంచెం లోతుగా దిగి ఉంటే జగన్ ప్రాణం పోయుండేదని చెప్పుకొచ్చారు. అప్పుడు జనం కూడా కొంత వరకు నమ్మారు. జగన్ కూడా హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి కుట్లు వేయించుకున్నారు. ఎన్నికల తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. ఇప్పుడూ అదే ఎత్తుగడతో గులక రాయి కేసును ఎత్తుకున్నారు. అయితే ఇప్పుడు జగన్ ఆశించినట్టు ప్రజల్లో సానుభూతి ఏర్పడక పోగా, మరో డ్రామాకు తెర లేపారని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒకే వ్యూహం పదే పదే పనిచేయదనడానికి గులక రాయి సంఘటనే నిదర్శనం.

ఆహా ఏమి నటన...

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నవరస నటనాసార్వభౌముడు అన్న బిరుదు ఇవ్వవచ్చు. ముఖంలో దీనత్వం, క్రూరత్వాలను ఏకకాలంలో ప్రదర్శించగలరు. జనంలోకి వెళ్లినప్పుడు ఒకలా, జనంలో లేనప్పుడు మరోలా ఉంటారని ఆయన చుట్టూ ఉన్న వాళ్లు చెబుతారు. గత ఎన్నికల్లో తండ్రిని కోల్పోయిన బిడ్డను అని, తండ్రి రాజశేఖర రెడ్డిని హత్య చేయించారని ప్రచారం చేసి ప్రజల సానుభూతిని పొందారు. అప్పుడు ఆయనకు తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల వంతపాడారు. మద్దతుగా ప్రచారం చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇడుపులపాయ అంతఃపురానికి బీటలు వారాయి. తల్లీ చెల్లీ దూరమయ్యారు. దీంతో ప్రజలను మరో మారు మాయచేయడానికై 'నేను ఒంటరి వాడిని, నాకు వ్యతిరేకంగా తోడేళ్ల గుంపు ఒక్కటైంది' అంటూ ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిస్టులకు మాత్రమే పరిమితమైన క్లాస్ వార్ పదాన్ని కూడా అందిపుచ్చుకున్నారు. తాను పేదల ప్రతినిధినని, పేదలకోసమే తన తపన అంతా అని చెప్పుకొంటూ చంద్రబాబు అండ్ కోను పెత్తందారులని దూషిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నిజంగా ఒంటరి వారేనా? అయితేగియితే.. ఒంటరివాడు ఎలా అయ్యారో చూద్దాం! 2019 ఎన్నికల వరకు పార్టీకి అండగా ప్రచారం చేసిన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల ఇప్పుడెందుకు దూరమయ్యారో జగన్మోహన్ రెడ్డి నిజాయితీగా చెప్పగలరా? రాజశేఖర రెడ్డి బిడ్డగా ఆస్తిలోనూ, అధికారంలోనూ షర్మిలకు కూడా ఎంతో కొంత వాటా దక్కడం న్యాయం. అయితే ఇక్కడ షర్మిలకు న్యాయం జరగలేదు. ఆస్తిలోనే కాదు— అధికారంలో కూడా ఆమెకు వాటా దక్కలేదు. దీంతో ఒళ్లు మండిన షర్మిల సోదరుడిపై కత్తి దూశారు. ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షర్మిల.. జగన్ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. షర్మిల సభలకు జనం కూడా పెరుగుతున్నారు. తన ఇద్దరు బిడ్డల దారులు వేరవడంతో ఎటువైపు వెళ్లాలో తేల్చుకోలేని సందిగ్ధంలో చిక్కుకున్న విజయమ్మ ఉభయ కుశలోపరిగా అమెరికాకు వెళ్లిపోయారు. ఈ పరిస్థితికి ప్రజలుగానీ, ప్రతిపక్ష నాయకులుగానీ, మీడియాగానీ కారణం కాదుగదా? అవునా? కాదా? అనేది జగన్మోహన్ రెడ్డే చెప్పాలి. మరి ఒంటరి వాడిని అని జనం ముందుకు వచ్చి ఏడవడం ఎందుకు? ఈ ఏడుపునకు అర్థం ఉందా? మరో సోదరి డాక్టర్ సునీత విషయమే తీసుకుందాం! తన తండ్రిని కిరాతకంగా నరికి చంపిన వారిని శిక్షించాలని మాత్రమే ఆమె కోరుతున్నారు. ఈ విషయంలో జగనన్న తమకు న్యాయం చేయకుండా నిందితులకు అండగా నిలబడటాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతున్నారు. చిన్నాన్న చావును రాజకీయంగా వాడుకొని ఇప్పుడు నిందితులకు అండగా నిలవడం ఏమిటి? అని ఆమె ఆక్రోశిస్తున్నారు. ఆమె అలా ఎందుకు భావిస్తున్నారు? ఆమె ఆక్రందనలో హేతుబద్ధత ఉందా? లేదా? అని కనీసం పరిశీలించకుండానే అవినాశ్ రెడ్డి గురించి మాట్లాడ వద్దని జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక హుకుం జారీ చేశారు. ఆయన ఈ హుకుం జారీ చేయడం వెనుక కూడా పెత్తందారులు ఉన్నారా? సోదరి సునీతకు న్యాయం చేయకపోగా వివేకానంద రెడ్డిని డాక్టర్ సునీత భర్తే హత్య చేయించారని తన రోత మీడియాతో పాటు కూలి మీడియాలో జగన్‌రెడ్డి ప్రచారం చేయించారు. ఇందులో కూడా ప్రతిపక్షాల పాత్ర ఉందా? మాకంటే నీకు అవినాశ్ రెడ్డి ఎందుకు ముఖ్యమయ్యారని అక్కచెల్లెళ్లు వేస్తున్న ప్రశ్నకు జగన్మోహన్ రెడ్డి ఎందుకు సమాధానం చెప్పడం లేదో? పాపాల భైరవుడు చంద్రబాబు ఉన్నాడు అన్నట్టుగా అన్నిటికీ ఆయన వైపు వేలెత్తి చూపుతున్నారు. షర్మిల, సునీత వెనుక చంద్రబాబు ఉన్నది నిజమే అయితే, చంద్రబాబుకు అంత సామర్థ్యం ఉండి ఉంటే 2019 ఎన్నికల్లోనే, అధికారంలో ఉన్నప్పుడే వారిని తన వైపు తిప్పుకొని ఉండేవారు కదా? 'తనను తాను రక్షించుకోలేక పోతున్న చంద్రబాబు మమ్మల్ని ఏం రక్షిస్తాడు' అన్న డాక్టర్ సునీత మాటల్లో వాస్తవం ఉంది. ఇప్పుడు కూడా అందరూ కలసి తనను ఒంటరివాడిని చేశారని జగన్ చెబుతున్న మాటలను నమ్ముదామా?

ఎలా పేదల ప్రతినిధి?

క్లాస్ వార్ గురించి, తాను పేదల ప్రతినిధినని జగన్మోహన్ రెడ్డి చెబుతున్న విషయాలకు వద్దాం. చరిత్రలో పేదల ప్రతినిధులం అని చెప్పుకొన్న నాయకులు, ముఖ్యంగా వామపక్ష నాయకులు సాదాసీదా జీవితాన్నే గడిపారు. జగన్మోహన్ రెడ్డి వలె తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఏపీలలో రాజ ప్రాసాదాలు నిర్మించుకోలేదు. వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోలేదు. 2004కు ముందు తన వద్ద కోటి రూపాయలు కూడా లేని జగన్మోహన్ రెడ్డి ఈ 20 ఏళ్లలో ఆర్థికంగా ఇంతలా బలపడటం ఎలా సాధ్యమైంది? అధికారం అండ ఉండివుండకపోతే జగన్మోహన్ రెడ్డి ఇన్ని వేల కోట్లు సంపాదించగలిగే వారా? 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి రాకపోతే తనకు ఆత్మహత్య చేసుకోవడం మినహా మరో మార్గం లేదని వైఎస్ రాజశేఖర రెడ్డి ఇప్పుడు జగన్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న ఒకరి వద్ద వాపోవడం నిజం కాదా? గతంలో రాజశేఖర రెడ్డి, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కలిపి పదేళ్లు అధికారంలో ఉన్నారు. 2004కు ముందు తలకు మించిన అప్పుల భారంతో ఉండిన వైఎస్ కుటుంబం ఇప్పుడు ఏ స్థాయిలో ఉందో చూస్తున్నాం. ఎగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన జగన్మోహన్ రెడ్డి ఇవాళ దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా ఎలా ఎదిగారు? ఆయన అనుసరించిన చిట్కా ఏమిటో చెబితే ప్రజలు కూడా కోటీశ్వరులు అయ్యేవారు కదా? అదే జరిగితే అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేసే అవసరం ఏర్పడదు కదా? తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు పంచానని చెప్పుకొంటున్న జగన్మోహన్ రెడ్డి, ఏ ఒక్క కుటుంబంలోనైనా వారి బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు నిల్వ ఉన్నాయని నిరూపించగలరా? పేదలను పేదలుగానే ఉంచుతున్న జగన్మోహన్ రెడ్డి పేదల ప్రతినిధి ఎలా అవుతారు? పేదలకు ఇళ్ల కోసం సెంటు స్థలం సరిపోతుందని చెబుతున్న జగన్, తాను మాత్రం ఎకరాలకు ఎకరాలలో ప్యాలెస్‌లు నిర్మించుకోవలసిన అవసరం ఏమిటో చెప్పగలరా? జగన్‌కు ఉన్నన్ని ఆస్తులు ఆయన చెబుతున్న పెత్తందారులకు లేవే? వేల కోట్ల రూపాయల విలువైన ప్యాలెస్‌లలో నివసించే జగన్‌రెడ్డిని పేదల ప్రతినిధి అని అంగీకరిద్దామా? అధికారం అండతో ఇన్ని వేల కోట్ల రూపాయలు సంపాదించిన జగన్‌రెడ్డి ఆపదలో ఉన్న ఏ ఒక్కరికైనా తన జేబులో నుంచి సొంత సొమ్ము తీసి ఇవ్వడాన్ని ఎవరైనా చూశారా? తన ముందుకు వచ్చి చేయి చాచిన వారికి రాజశేఖర రెడ్డి కాదనకుండా తన వద్ద లేకపోయినా అప్పు చేసి మరీ



సహాయం చేసేవారు. ఈ లక్షణం జగన్‌లో ఉందని ఆయనకు చిడతలు కొడుతున్న వారు చెప్పగలరా? అయితే, జగన్‌రెడ్డిలో ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే, 'నన్నేమీ అడగవద్దు — ప్రభుత్వ సొమ్మును మాత్రం అందినంత దోచుకోండి' అని తన వాళ్లకు స్వేచ్ఛ ఇస్తారు. అందుకే ఈ ఐదేళ్లలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు ఎవరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కనీసం చర్యలు తీసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. నెల్లూరు జిల్లాలో ఫలానా మాజీ మంత్రి పలుగు రాయిని అడ్డగోలుగా తవ్వుకొని అక్రమంగా అమ్ముకుంటున్నారని పార్టీ ముఖ్యుడొకరు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. 'వదిలేయన్నా! మనకు పోయేది ఏముంది? చేతనైనంత సంపాదించుకోనివ్వండి!' అని ఆయన బదులిచ్చారట. తాను అనుసరిస్తున్న మోడల్‌నే ఇతరులు అనుసరించి సంపాదించుకోవడాన్ని జగన్ అనుమతిస్తున్నారు. అందుకే కొంత మంది ఆయనకు భక్తులుగా మారిపోయారు. అధికారులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాలు గాలికి పోయినా ఫర్వాలేదు— అందిన కాడికి దోచుకోండని తన వాళ్లకు జగన్ స్వేచ్ఛను ఇచ్చారు. తమ దోపిడీని ప్రజలు గుర్తించి ప్రశ్నించకుండా సంక్షేమం పేరిట వాళ్ల ముఖాన కూడా ఎంతో కొంత పడవేస్తున్నారు. ఇందులోని మర్మం తెలియని ప్రజలు అతని మాయలో పడకుండా ఉంటారా? అధికారం ఉన్నంత కాలం దోచుకుందాం... అధికారం పోతే పొరుగు రాష్ట్రాలకు పోదాం... ఇంకా అవసరమైతే విదేశాలకు వెళ్లిపోదాం! అనే ధోరణి జగన్ అండ్ కో లో కనిపిస్తోంది.

అధికారులదీ అదే దారి...

జగన్ ప్రభుత్వంలో అధికారులు ఇలా ఎందుకు మారిపోయారని చాలామంది ఆశ్చర్యపోతుంటారు. పోలీసు శాఖనే తీసుకుందాం! ఆ శాఖలో ఎవరికి వారే స్వతంత్రులు. డీజీపీకి కూడా తన శాఖపై పట్టు ఉండదు. జిల్లాలలో ఎస్పీల నుంచి ఎస్‌ఐ వరకు స్వతంత్రులే. ఎవరిపైనా ఎవరికీ అదుపు లేదు. ఈ పరిస్థితులను స్వేచ్ఛగా భావిస్తున్న అధికారులు జగన్ సేవలో తరిస్తున్నారు. వ్యవస్థ కుప్పకూలితే ఏమవుతుందో ఊహించుకుంటే భయం ఏర్పడటం సహజం. ఈ ధోరణి వల్ల ఉన్మాదులు పుట్టుకొస్తున్నారు. జగన్ చెబుతున్న క్లాస్ వార్ వెనుక ఉన్న మర్మం ఇదే! ఇంతకంటే వంచన వేరొకటి ఉంటుందా?

> ఐదేళ్ల పాలనలో ప్రజలకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు పంచానని చెప్పుకొంటున్న జగన్మోహన్ రెడ్డి ఏ ఒక్క కుటుంబంలోనైనా వారి బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు నిల్వ ఉన్నాయని నిరూపించగలరా? పేదలను పేదలుగానే ఉంచుతున్న జగన్మోహన్ రెడ్డి పేదల ప్రతినిధి ఎలా అవుతారు?

ముసుగు తొలగే సరికి...

అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం అని 'తాతా మనవడు' సినిమాలో ఒక పాట ఉంటుంది. అది అక్షరాలా నిజమని బాబాయ్ హత్య కేసులో జగన్మోహన్ రెడ్డి రుజువు చేస్తున్నారు. ఆయనకు అధికారం—డబ్బు మాత్రమే ముఖ్యం. మనుషులు, మమతలు కాదు అని చెప్పకనే చెబుతున్నారు. నియంతలు—దుర్మార్గుల గురించి జనం తెలుసుకోవడానికి కొంత సమయం పడుతుంది. హిట్లర్‌లోని నియంతను గుర్తించడానికి జర్మన్లకు టైమ్ పట్టింది. హిట్లర్ గురించి తెలుసుకొనేసరికి జర్మనీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. మన మధ్య తిరుగుతూ, మన ఓట్లతో అధికారం వెలగబెడుతున్న నియంతలు మారీచుల వలె రూపాలను మార్చుకుంటున్నారు. జర్మనైజేషన్ పీరియడ్ అన్న హిట్లర్ మాటలను జర్మన్లు విశ్వసించారు. చివరకు దారుణంగా నష్టపోయారు. తాను పేదల పెన్నిధినని, ఆ పేదల జీవితాలు బాగుపడాలంటే, వాళ్లకు మేళ్లు జరగాలంటే తనకు అధికారం ఇవ్వాలని అంటున్న జగన్‌ను కూడా నాటి జర్మన్లవలె మన ప్రజల్లోనూ కొందరు ఎంతో కొంత నమ్ముతున్నారు. ప్రజల బలహీనతలను జొపోసనపట్టిన జగన్‌రెడ్డి వంటి వారే క్లాస్ వార్ సిద్ధాంతాన్ని తెర మీదకు తెస్తారు. 'మీరు చెబుతున్నది నిజమే అయితే వేల కోట్ల సామ్రాజ్యాన్ని మీరు ఎలా నిర్మించుకున్నారు? మేమెందుకు పేదలగానే మిగిలిపోయాం?' అని ఒకే ఒక ప్రశ్న వేస్తే జగన్‌రెడ్డి వంటి వారి నిజ స్వరూపం బట్టబయలు అవుతుంది. అమరావతి మాత్రమే రాజధానిగా ఉంటుందని 2019కి ముందు చెప్పిన జగన్‌రెడ్డి ఆ తర్వాత ఏం చేశారో చూశాం. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే మూడు రాజధానులు కడతారని నమ్మే పిచ్చివాళ్లు ఉంటే ఉండవచ్చు. జగన్‌కు కావాల్సింది అలాంటి వాళ్లే! అందుకే ప్రజలను శాశ్వతంగా ప్రభుత్వాలపై ఆధారపడేలా మార్చేస్తున్నారు. తనతోపాటు తన మనుషులు మాత్రం అపర కుబేరులు అవుతున్నారు. ఏదో ఒక రోజు జగన్ చెబుతున్న క్లాస్ వార్ గుట్టు బయటపడి ప్రజలు తిరగబడతారు. ఆ రోజు కోసం ఎదురు చూద్దాం!

> జగన్ రెడ్డిలో ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే, 'నన్నేమీ అడగవద్దు – ప్రభుత్వ సొమ్మును మాత్రం అందినంత దోచుకోండి' అని తన వాళ్లకు స్వేచ్ఛ ఇస్తారు. అందుకే ఈ ఐదేళ్లలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు ఎవరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కనీసం చర్యలు తీసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. నెల్లూరు జిల్లాలో ఫలానా మాజీ మంత్రి పలుగు రాయిని అడ్డగోలుగా తవ్వుకొని అక్రమంగా అమ్ముకుంటున్నారని పార్టీ ముఖ్యుడొకరు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. 'వదిలేయన్నా! మనకు పోయేది ఏముంది? చేతనైనంత సంపాదించుకోనివ్వండి!' అని ఆయన బదులిచ్చారట. తాను అనుసరిస్తున్న మోడల్‌నే ఇతరులు అనుసరించి సంపాదించుకోవడాన్ని జగన్ అనుమతిస్తున్నారు. అందుకే కొంత మంది ఆయనకు భక్తులుగా మారిపోయారు. అధికారులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాలు గాలికి పోయినా ఫర్వాలేదు– అందిన కాడికి దోచుకోండని తన వాళ్లకు జగన్ స్వేచ్ఛను ఇచ్చారు. తమ దోపిడీని ప్రజలు గుర్తించి ప్రశ్నించకుండా సంక్షేమం పేరిట వాళ్ల ముఖాన కూడా ఎంతో కొంత పడవేస్తున్నారు.

ఎవరు రాసిన 'రక్త చరిత్ర'?

వివేకానంద రెడ్డి హత్య విషయానికి మళ్లీ వద్దాం! ఐదేళ్ల క్రితం జరిగిన ఈ హత్య వెనుక ఏం జరిగింది, ఎవరు ఉన్నారో ప్రజలందరికీ అవగతం అయింది. అయినా జగన్ అనుసరిస్తున్న క్లాస్ వార్ అనే మోడల్ కారణంగా ఎవరిని ఎవరు ఎందుకు హత్య చేశారో మాకు అవసరం లేదు — మాకేం వస్తుంది అన్న మానసిక దౌర్బల్యంలోకి ఒక వర్గం ప్రజలు వెళ్లిపోయారు. బాబాయ్ హత్య విషయంలో జగన్ అనుసరిస్తున్న వైఖరి గురించి ప్రజలకు తెలియక కాదు. ఎక్కడో పులివెందులలో వివేకానంద రెడ్డిని నరికి చంపితే మాకొచ్చిన నష్టం ఏమిటి? అని ప్రజలు భావించడాన్ని మించిన దౌర్భాగ్యం ఉంటుందా? రేపు తమకు కూడా అదే గతి పడితే పరిస్థితి ఏమిటి? అని ఆలోచించకుండా చేయడమే జగన్ అనుసరిస్తున్న క్లాస్ వార్ లక్ష్యం. డాక్టర్ సునీత ఐదేళ్లుగా అలుపెరుగని పోరాటాన్ని చేస్తున్నప్పటికీ ఆమెను అభినందించక పోగా విమర్శిస్తున్న వాళ్లు ఉన్నారంటే అందుకు జగన్ అమలు చేస్తున్న మోడల్ కారణం కాదా? విషాదమేమిటంటే వైఎస్ కుటుంబంలో రాజారెడ్డిని దారుణంగా హత్య చేశారు. ఆయన కుమారుడైన రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దారుణ పరిస్థితుల్లో మరణించారు. శరీర భాగాలు కూడా సరిగ్గా దొరకలేదు. ఐదేళ్ల క్రితం రాజశేఖర రెడ్డి సోదరుడైన వివేకానంద రెడ్డిని అత్యంత కిరాతకంగా నరికి చంపారు. అధికారంగానీ, డబ్బుగానీ ఈ చావులను నివారించలేదే? పులివెందుల రక్తచరిత్ర కాదా ఇది? చావులను రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే వాడుకుంటున్న రోజులు ఇవి. అవసరం తీరింది కనుక జగన్మోహన్ రెడ్డిని తన కుటుంబంలోని చావులు బాధించడం లేదు కాబోలు. ఇప్పుడు ఎవరితో అవసరం ఉందో వారి పక్షం వహిస్తున్నారు.

> 2019 ఎన్నికల వరకు పార్టీకి అండగా ప్రచారం చేసిన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల ఇప్పుడెందుకు దూరమయ్యారో జగన్మోహన్ రెడ్డి నిజాయితీగా చెప్పగలరా? రాజశేఖర రెడ్డి బిడ్డగా ఆస్తిలోనూ, అధికారంలోనూ షర్మిలకు కూడా ఎంతో కొంత వాటా దక్కడం న్యాయం. అయితే ఇక్కడ షర్మిలకు న్యాయం జరగలేదు. ఆస్తిలోనే కాదు– అధికారంలో కూడా ఆమెకు వాటా దక్కలేదు. దీంతో ఒళ్లు మండిన షర్మిల సోదరుడిపై కత్తి దూశారు. ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షర్మిల.. జగన్ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. షర్మిల సభలకు జనం కూడా పెరుగుతున్నారు. తన ఇద్దరు బిడ్డల దారులు వేరవడంతో ఎటువైపు వెళ్లాలో తేల్చుకోలేని సందిగ్ధంలో చిక్కుకున్న విజయమ్మ ఉభయ కుశలోపరిగా అమెరికాకు వెళ్లిపోయారు. ఈ పరిస్థితికి ప్రజలుగానీ, ప్రతిపక్ష నాయకులుగానీ, మీడియాగానీ కారణం కాదుగదా? అవునా? కాదా? అనేది జగన్మోహన్ రెడ్డే చెప్పాలి. మరి ఒంటరి వాడిని అని జనం ముందుకు వచ్చి ఏడవడం ఎందుకు? ఈ ఏడుపునకు అర్థం ఉందా?

కడప కోర్టు తీర్పు సరైనదేనా?


గత ఎన్నికల్లో తనకు ఉపయోగపడిన వివేకా చావు ఈ ఎన్నికల్లో నష్టం చేయకుండా ఉండేందుకు న్యాయస్థానాలను ఉపయోగించుకొనే ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి చేస్తున్నారు. తన పార్టీకి చెందిన సురేశ్ బాబు అనే వ్యక్తితో కడప సెషన్స్ కోర్టులో పిటిషన్ వేయించారు. వివేకా హత్య గురించి షర్మిల, సునీతతోపాటు ప్రతిపక్షాలకు చెందిన వారెవరూ ప్రస్తావించకుండా న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వులను పరిశీలిస్తే న్యాయ వ్యవస్థపై ఉండే గౌరవం సన్నగిల్లుతుంది. పిటిషనర్ కోరింది మాత్రమే కాకుండా ప్రతిపక్షాలపై మరిన్ని పరిమితులు విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటో అర్థం కాదు. ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందా? అహేతుకమైన ఉత్తర్వులు ఇచ్చిన న్యాయస్థానంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసే అవకాశం ఉండదా? ప్రభుత్వ యంత్రాంగంలో కింది స్థాయిలో తప్పు జరిగినట్టు ఫిర్యాదు వస్తే పైస్థాయిలో చర్యలు తీసుకుంటారు కదా? న్యాయ వ్యవస్థలో కూడా కింది స్థాయి కోర్టులు తప్పుచేసినా, పరిధి దాటినా ఉన్నత న్యాయస్థానం చర్యలు తీసుకోలేదా? అంటే తీసుకోవచ్చు! కడప న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణకు ప్రధాన న్యాయమూర్తి ఆదేశించడం సహజ ప్రక్రియే. కింది స్థాయి కోర్టులలో అపసవ్య తీర్పులు వెలువడకుండా ఉండాలంటే అలాంటి సందర్భాలలో ఫిర్యాదులు చేయడం ప్రారంభం కావాలి. కడప న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఇది మొదలు కావాలి. ఎవరో ఒకరు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. కింది స్థాయి కోర్టులు ఇస్తున్న తీర్పులు, ఆదేశాలపై హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పలు సందర్భాలలో అసహనం వ్యక్తం చేయడాన్ని గమనిస్తున్నాం. తమకు కూడా జవాబుదారీతనం ఉంటుందని కింది స్థాయి న్యాయ వ్యవస్థకు గుర్తు చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. లేని పక్షంలో బాధితులు నిందితులుగా మారిపోతారు. నిందితులు నిర్దోషులుగా ప్రకటించుకుంటూ విర్రవీగుతారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్

ఆ అప్పుల భారం మోయాల్సింది మనమే!

ఎన్నికల ధ్వని, వేడి మధ్య, సుప్రీంకోర్టులో ఒక పిటిషన్‌పై వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రాల రుణ పరిమితి నిబంధనపై ఆర్టికల్ 131 కింద కేరళ రాష్ట్రం భారత యూనియన్‌పై ఆ వ్యాజ్యం వేసింది. రాష్ట్రం తెచ్చుకునే నికర రుణాలపై జాతీయ స్థాయి ప్రభుత్వం పరిమితి విధించి చర్యలు తీసుకుంటోందని, ఇది ఆర్టికల్ 293 ప్రకారం యూనియన్ అధికారాల్ని ఉల్లంఘించటమేనని కేరళ వాదన. ద్రవ్య నిబంధనలను ఉల్లంఘించి రాష్ట్రం అప్పులు తెచ్చుకునేందుకు యూనియన్ విధిగా అనుమతిచ్చేలా కోర్టు ఆదేశం ఇవ్వాలని రాష్ట్రం కోరింది. పిటిషన్‌పై సుప్రీంకోర్టు విజ్ఞతతో స్పందించింది. రాష్ట్ర అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఏప్రిల్ 1న ఆదేశం ఇచ్చింది. ఈ కేసులో రాజ్యాంగపరంగా ఉత్పన్నమయ్యే కీలక ప్రశ్నలను న్యాయమూర్తులు సూర్యకాంత్, కె.వి విశ్వనాథన్‌ల బెంచ్ అయిదుగురు జడ్జీల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది.

రాబోయే తరాల భవిష్యత్తు కేవలం ఎన్నికల తీర్పుల వల్ల నిర్ణయం కాదు. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పులు, ఖర్చు తీరు, భవిష్యత్తు భారాలు కూడా కీలక పాత్ర వహిస్తాయి. ఈ నేపథ్యంలో, పౌరులుగా, పన్ను చెల్లించేవారుగా సుప్రీంకోర్టు ముందున్న ఈ కీలకాంశాన్ని మనం కూడా పట్టించుకోవాలి. ప్రజలుగా మన భవిష్యత్తు ప్రమాదంలో ఉంది. అందువల్ల, ఈ కీలక వాదనల్లో మనందరం పరోక్షంగా భాగమవ్వాలి. ఒక వ్యక్తి, కుటుంబం, సంస్థ లేదా ప్రభుత్వం ఏదైనా కావచ్చు, తమ ఆర్థిక వనరుల్ని జాగ్రత్తగా, వివేకంతో నిర్వహించుకోవాలి; లేకుంటే, దివాలా తీస్తాయి. ఆరోగ్యకరమైన ఆర్థిక నిర్వహణకు ప్రాతిపదిక నాలుగు అంశాలు. మొదటిది, మన రోజువారీ ఖర్చు మన స్థిర ఆదాయం పరిధి లోపే ఉండాలి. ఆదాయం కంటే రోజువారీ ఖర్చుకి ఎక్కువ వ్యయం చేస్తే, అప్పు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఖర్చు పోగా మన ఆదాయంలో అదనంగా ఏమీ మిగలదు కాబట్టి, అప్పు తిరిగి చెల్లించటం మాట అలా ఉంచి, వడ్డీ కట్టటం కూడా సాధ్యం కాదు. అప్పుకి వడ్డీ కోసం మళ్లీ అప్పు చేయాల్సి ఉంటుంది. చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుంది. రోజువారీ బడ్జెట్ ఖర్చులో అటువంటి లోటు ఏర్పడితే (మనం ప్రభుత్వంలో రెవెన్యూ లోటు అని పిలుస్తాం) మనుగడ అసాధ్యమవుతుంది. మన పిల్లలు, వారసులకు తమ తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి కొండలా పేరుకుపోయిన అప్పులు వారసత్వంగా సంక్రమిస్తాయి. అదికూడా బాకీల్ని తీర్చటానికి ఎటువంటి ఆస్తుల్ని, ఆదాయాల్ని చూపకుండా. ఏ కుటుంబం, సంస్థ అటువంటి దుబారా ఖర్చుని తట్టుకుని నిలబడలేవు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతాయి.

> ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతల పరిధిలో తాము సరైన విధానమని భావించిన రీతిలో ప్రజాధనాన్ని వినియోగించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. కానీ ఖజానా డబ్బును దుబారా చేయటం, ఇష్టారాజ్యంగా అప్పులు చేయటం రాష్ట్రాల హక్కుల్లో భాగం కాదు. ఎందుకంటే, ఏ రాష్ట్రం చర్యలైనా మొత్తం దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి.



రెండో అంశం, భవిష్యత్తుపై పెన్షన్ల చెల్లింపు వంటి భారాల్ని మోపితే, వాటికి కేటాయింపుల్ని ఇప్పుడే చేయాలి. లేకుంటే, ఆదాయ మార్గంలేని భవిష్యత్తు వ్యయం పెరిగిపోతుంటుంది, సంస్థ ఖాయిలా పడుతుంది. కుటుంబాలు సాధారణంగా ఏం చేస్తుంటాయి? ప్రతి నెలా డబ్బును పొదుపు చేసి, భవిష్యత్తు వ్యయానికి భద్రపరచుకుంటాయి. ఆ తర్వాత, ఆస్తులు కొంటాం, లేదా భవిష్యత్తులో ఆదాయం కోసం స్టాక్‌లలో, డిపాజిట్లలో పెట్టుబడి పెడతాం. కానీ, భారత్‌లో చాలా ప్రభుత్వాలు రోజువారీ ఖర్చులకు కూడా భారీగా అప్పులు చేస్తున్నాయి. అందుకు తగ్గ ఆస్తులు, భవిష్యత్తు ఆదాయం లేక అప్పు ఇంతింతై అన్నట్టు పెరిగిపోతోంది.

మూడోది, అప్పుల్ని పెట్టుబడులకు ఉపయోగించినంత మాత్రాన సరిపోదు. ఆస్తుల్ని పెంచటంపై చేసే వ్యయం సద్వినియోగమయ్యేలా ఉండాలి. ఖర్చుకు తగ్గ ఫలితం వచ్చేలా సరైన విశ్లేషణ చేయాలి. ఖర్చుల కంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని నిగ్గుతేల్చుకోవాలి. ఆస్తుల పేరుతో దారీతెన్నూలేని వంతెనల్ని, నివాసానికి జనం ఇష్టపడని పట్టణాల్ని నిర్మిస్తే అప్పు తెచ్చిన డబ్బు వృథా అయినట్లు. తెలంగాణలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకైన అసంబద్ధ భారీ వ్యయంపై పెద్దఎత్తున వివాదం కొనసాగుతోంది. సాగునీరు అందించటానికి ఎకరాకి రూ.4—5 లక్షలు పెట్టుబడి వ్యయం చేశారు. నిర్వహణ, వగైరాల కోసం ప్రతి సంవత్సరం రూ.40—50వేల దాకా ఎకరాకి వెచ్చించాల్సి ఉంటుంది. పెట్టిన ఖర్చుతో పోలిస్తే, ఈ సాగునీటి ప్రాజెక్టు వల్ల రైతుకి నికరంగా పెరిగే ఆదాయం తక్కువ. అప్పుల డబ్బుని ఆ రకంగా ఖర్చు చేస్తే, అది 'పెట్టుబడుల' కోసమైనా సరే, చివరికి రాష్ట్రాన్ని దివాలా తీయిస్తాయి. కాబట్టి అప్పు చేసి తెచ్చిన డబ్బు ఆస్తుల నిర్మాణానికి, భవిష్యత్తు ఆదాయాన్ని పెంచటానికి ఉపయోగపడటంతోపాటు ఆ పెట్టుబడి అర్థవంతంగా, కచ్చితంగా ఖర్చుకు తగ్గ ఫలితమిస్తుందని కూడా మనం నిర్ధారించుకోవాలి.

నాలుగోది, అప్పు తెచ్చిన డబ్బుని మనం ఆస్తుల నిర్మాణానికి వినియోగించినా కూడా, ఆ అప్పుకి ఒక పరిమితి ఉంటుంది. ఆ పరిధి దాటి అప్పు మనకి మోయలేని భారమవుతుంది. తాహతుకు మించి అప్పు తెచ్చుకుంటే, మళ్లీ మనం అప్పుల ఊబిలో కూరుకుపోతాం. బయటపడటం కష్టమవుతుంది. అలాంటి అప్పులు తీర్చటానికి ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది, లేదా దివాలా తీయాల్సి వస్తుంది.

ఆర్థిక స్థిరత్వం, భారతదేశ పరపతి యూనియన్ ప్రభుత్వ బాధ్యతలని మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో విజ్ఞతతో ఆలోచించి నిర్ణయించారు. ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతల పరిధిలో తాము సరైన విధానమని భావించిన రీతిలో ప్రజాధనాన్ని వినియోగించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. కానీ ఖజానా డబ్బును దుబారా చేయటం, ఇష్టారాజ్యంగా అప్పులు చేయటం రాష్ట్రాల హక్కుల్లో భాగం కాదు. ఎందుకంటే, ఏ రాష్ట్రం చర్యలైనా మొత్తం దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి. ఆర్టికల్ 293, ఆర్టికల్ 360లను జాగ్రత్తగా, ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగంలో చేర్చారు. ఆర్థికంగా దేశం అవిభాజ్యమని, భారత్ లోని ఏ ప్రాంత ఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఏర్పడినా మొత్తం దేశ ఆర్థిక స్థిరత్వానికి, మన బిడ్డల భవిష్యత్తుకి ప్రమాదంగా పరిణమిస్తుందని స్పష్టమైన అవగాహనతో మన జాతి నిర్మాతలు వ్యవహరించారు. దీన్ని విస్మరించి ఎడాపెడా అప్పులు చేసి, అందుకు తగ్గ ఆస్తుల్ని సమకూర్చకుండా వచ్చేతరం మీద రుణభారాన్ని పెడితే, మన బిడ్డల భవిష్యత్తు అంధకారమవుతుంది; దేశం ప్రమాదంలో పడుతుంది.

• డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అలనాటి కథ

నిజాం కోడలైన టర్కీ రాకుమారి

కొందరిని ఒక్కసారి కలిస్తే చాలు... మనపై చెరగని ముద్ర వేస్తారు. అలాంటి వారిలో ప్రిన్సెస్ దురేషెవార్ ఒకరు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వ్యవస్థాపకుల్లో ఒకరుగా, బేగంపేట ఎయిర్‌పోర్ట్ మొదటి టెర్మినల్‌కు శంకుస్థాపకురాలిగా హైదరాబాద్ చరిత్రలో ఆమెకు ఒక సుస్థిరమైన స్థానం ఉంది. నాకు 11 ఏళ్లు ఉన్నప్పుడు- నేను తొలి సారి ప్రిన్సెస్ దురేషెవార్‌ను చూశాను. ఆ తర్వాత ఆమెతో నా పరిచయం పెరిగింది. ఓటోమన్ సామ్రాజ్యానికి వారసురాలైన ప్రిన్సెస్ దురేషెవార్ హైదరాబాద్‌కు రావటం, ఇక్కడ స్థిరపడటం ఒక ఆసక్తికరమైన కథ.

ఓటోమన్ సామ్రాజ్యంపై తిరుగుబాటుదారులు దాడి చేసినప్పుడు- సుల్తాన్ ముజీబ్ తన ముద్దుల కూతురు దురేషెవార్‌తో, ఇతర కుటుంబ సభ్యులతో కలిపి ఇస్తాంబుల్ నుంచి లండన్‌కు చిన్న బోటులో వెళ్లిపోయారు. ఈ ప్రయాణం దురేషెవార్ జీవితాన్నే మార్చేసింది. టర్కీలో యువరాణిగా దురేషెవార్ అసలైన రాజభోగాలు అనుభవించేది. కానీ లండన్‌కు వచ్చే ముందు తన నగలను, తనకు ఇష్టమైన వస్తువులను వదిలేసి వచ్చేయాల్సి వచ్చింది. ఆఖరికి తను ధరించే వజ్రాల కిరీటాన్ని కూడా వదిలేయాల్సి వచ్చింది. లండన్‌లో సుల్తాన్ ముజీబ్‌కు, ఆయన కుటుంబానికి సాయం చేసేంది హైదరాబాద్ నిజామే! లండన్‌లో ఉన్న హైదరాబాద్ హౌస్‌లో వారికి బస ఏర్పాటు చేయటమే కాకుండా- వారి హోదాకు తగినట్లు పరివారాన్ని, ఇతర సౌకర్యాలను కూడా నిజాం అందించారు. ఇలా కొద్ది కాలం గడిచింది. దురేషెవార్ పెద్దదయింది. ఆ సమయంలో ఆమెను ప్రపంచంలోని అందగత్తెలలో ఒకరిగా చెప్పుకొనేవారు. ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్‌ల నుంచి అనేకమంది రాజకుమారులు ఆమెను పెళ్లిచేసుకోవటానికి ముందుకు వచ్చారు. రాయబారాలు పంపారు.



ప్రిన్సెస్ దురేషెవార్

కానీ సుల్తాన్- తనకు నిజాం చేసిన సాయాన్ని మర్చిపోలేదు. నిజాం కుమారుడు ప్రిన్స్ ఆజాంతో ఆమెకు వివాహం చేశారు. లండన్‌లో జరిగిన ఆ వివాహానికి ప్రపంచంలోని ముఖ్యమైన రాజకుటుంబాలకు చెందిన వారందరూ హాజరయ్యారు.

ప్రిన్సెస్ దురేషెవార్ హైదరాబాద్‌కు తొలిసారి వచ్చినప్పుడు- హైదరాబాద్‌లో అనేక ఉత్సవాలు జరిగాయి. ప్రిన్స్ ఆజంకు, ప్రిన్సెస్ దురేషెవార్‌కు హైదరాబాద్ ప్రజలు ఘన స్వాగతం చెప్పారు. తొలి రోజుల్లో వారు బెల్లా విస్టా ప్యాలెస్‌లో నివాసం ఉండేవారు. నిజాం ఆమెకు 'ప్రిన్సెస్ ఆఫ్ బీరర్' అనే బిరుదు కూడా ఇచ్చారు. ప్రిన్సెస్‌ను నేను తొలిసారి చూసింది మా ఇంట్లోనే! నాన్న ధన్‌రాజ్‌గిరి వారి గౌరవార్థం ఒక పార్టీ ఇచ్చారు. నాకు అప్పుడు 11 ఏళ్లు అనుకుంటా. ప్రిన్స్ ఆజాం, ప్రిన్సెస్ దురేషెవార్ వస్తున్నారనే వార్త మాకు ముందే తెలిసింది. ఆమె గురించి ఇంట్లో వారు మాట్లాడుకుంటుంటే వి న్నామేమో... ఆమెను చూడాలనే ఆతృతతో పిల్లలందరం డైనింగ్ రూమ్ పైన ఉన్న రూమ్‌లో చేరాం. అక్కడ నుంచి ఆమెను తొలిసారి చూశా! 'నిజంగానే ప్రిన్సెస్‌లా ఉంది' అనుకున్నా! ఆ తర్వాతి కాలంలో ప్రిన్సెస్ దురేషెవార్ అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనటం మొదలుపెట్టారు. మహిళలకు విద్య అవసరమని వాదించిన వారిలో, పరదాకు వ్యతిరేకంగా కూడా మాట్లాడినవారిలో ఆమె కూడా ఒకరు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రిన్సెస్ నిలోఫర్‌కు ప్రిన్సెస్ దురేషెవార్ కజిన్ అవుతారు. దాంతో వారిద్దరి మధ్య మంచి స్నేహం ఉండేది. ఆ రోజుల్లో సాధారణంగా రాజకుటుంబాలలో మహిళలు బయటకు వచ్చేవారు కారు. కానీ నిజాం తన కోడళ్లకు స్వేచ్ఛను ఇచ్చారు. వారు ఫ్రెంచ్ పత్రికల్లో వ్యాసాలు రాసినట్లు జ్ఞాపకం.

ప్రిన్సెస్ దురేషెవార్‌ను నేను ఆ తర్వాతి కాలంలో అనేక సందర్భాలలో కలిసాను. ఒకసారి మహబూబియా కాలేజీలో బహుమతి ప్రదానోత్సవానికి ఆమె వచ్చారు. నిజాం రాజవంశానికి చెందిన మహిళ ఒక బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రావటం అదే తొలిసారి. చాలా మందికి అది ఒక మరచిపోలేని సందర్భం. లండన్‌లో ప్రిన్సెస్ ఎస్రా ఒకసారి పార్టీ ఇచ్చారు. ఆ పార్టీకి నేను వెళ్లాను. నాకు దేరేషెవార్ కనిపిస్తే- ఆదాబ్ చేశా. ఆమె నవ్వుతూ నన్ను పలకరించారు. తన పక్క కూర్చోమని పిలిచారు. ప్రిన్సెస్ ఇస్రా స్నేహితురాలినని తెలుసుకొని నాతో సంభాషించటం ప్రారంభించారు. నా గురించి, నా కుటుంబం గురించి మాట్లాడారు. ఆ సంభాషణ తర్వాత నాకు ఆమెపై ఉన్న గౌరవం మరింత పెరిగింది. చౌమహల్లా ప్యాలెస్ ప్రారంభోత్సవంలో కూడా ఆమె నన్ను గుర్తుపట్టి పలకరించిన జ్ఞాపకం ఉంది. నేను ఆల్ ఇండియా ఉమెన్ కాన్ఫరెన్స్‌కు





అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో అనేకసార్లు ఆమెను మీటింగ్‌లలో కలిసాను. ఆ మీటింగ్‌ల తర్వాత ప్రిన్సెస్ దురేషెవార్ నాకు రాసిన అనేక ఉత్తరాలు ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉన్నాయి.

ఎక్కడో టర్కీలో పుట్టి, లండన్‌లో గడిపి, హైదరాబాద్ వచ్చి స్థిరపడిన దురేషెవార్- మన సంస్కృతి సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. హైదరాబాద్ వచ్చిన తర్వాత ఆమె ఉర్దూ నేర్చుకున్నారు. ఎప్పుడూ మన చీరలోనే కనిపించేవారు. రచయితలను, కళాకారులను ప్రోత్సహించేవారు. ఒకసారి ఆమె నాకు ఒక పుస్తకాల షాపులో కనిపించారు. ఆమెకు ఆదాబ్ చెప్పాలో, నమస్కారం పెట్టాలో తెలియక ఒక క్షణం తటపటాయించి... నమస్కారం చేశాను. ఆమె వెంటనే నవ్వుతూ నాకు నమస్కారం చేశారు. నిజాం కుటుంబీకులు నమస్కారం చేయటం అరుదైన విషయం. కానీ ప్రిన్సెస్ దురేషెవార్- హైదరాబాద్ సంస్కృతిలో మమేకం అయిపోయారనటానికి ఇదొక ఉదాహరణగా చెప్పవచ్చు. మనకు స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఆమె లండన్‌లో స్థిరపడ్డారు. అక్కడే మరణించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో అనేక మంది పాత్ర పరోక్షంగా ఉంది. అలాంటి వారిలో ప్రిన్సెస్ దురేషెవార్ ఒకరు. అందుకే ఆమె గురించి తలుచుకోవాల్సిన అవసరం ఉంది.

- రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

సండే సెలబ్రిటీ



తెలుగు చలనచిత్ర రంగంలోని సీనియర్ నటుల్లో రాజా రవీంద్ర ఒకరు. కేవలం నటుడిగానే కాకుండా అనేకమంది హీరోలకు మేనేజర్‌గా, నిర్మాతగా బహుముఖ పాత్రలు పోషిస్తున్నారు. ఆయన ప్రధానమైన పాత్రలో నటించిన 'సారంగదరియా' చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రాజారవీంద్రను 'నవ్య' పలుకరించింది.

వేషం చిన్నదైనా... పెద్దదైనా అదే ఉత్సుకత!

'సారంగదరియా' ఎలా ఉండబోతోంది?

ఇది మన చుట్టూ ఉన్న సమాజంలోని కథ. దీనిలో పాత్రలన్నిటినీ మనం ప్రతిరోజూ చూస్తేనే ఉంటాం. ఒక మధ్యతరగతి తండ్రి... తాను ఎన్నో ఆశలు పెట్టుకొని పెంచిన ముగ్గురు పిల్లలు మూడు చెడు మార్గాల్లోకి వెళితే, ఆ సమస్యను ఎలా పరిష్కరించాడనేదే ఈ కథ. చాలా హృద్యంగా ఉంటుంది. మన సమాజంలో వస్తున్న మార్పులకు అద్దం పడుతుంది. చాలా మంది తండ్రులు ఈ కథకు కనెక్ట్ అవుతారు. సన్నివేశాలన్నీ మనకు తెలిసినట్లే అనిపిస్తాయి. చాలాకాలం తర్వాత ఒక మంచి పాత్ర... ఒక ముఖ్యమైన పాత్రలో నటించాను.

ఇటీవల... మధ్యతరగతి వారికి సంబంధించిన కథలు తక్కువగా వస్తున్నాయి కదా!

ప్రేక్షకుల్లో 90శాతం మంది మధ్యతరగతివారే. కానీ వారిలో ఎక్కువమంది పాన్ ఇండియా ఆకర్షణలో పడ్డారు. సమాజంలోని వాస్తవికతకు దూరం అయిపోతున్నారు. భారీగా రకరకాల హంగులతో తీస్తేనే సినిమా చూస్తున్నారు. లోబడ్జెట్ సినిమాలు థియేటర్‌లో రిలీజ్ కావటం కష్టమవుతోంది. దీనికి ఓటీటీ కూడా ఒక కారణమే. ఓటీటీలో భారీ బడ్జెట్ చిత్రాలే కొంటున్నారు. దాంతో నిర్మాతలు కూడా వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా మధ్యతరగతి వారికి సంబంధించిన కథలు తగ్గిపోతున్నాయి. అయితే ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. కొన్నిసార్లు కంటెంట్ బలంగా ఉన్న కథలకు ఆదరణ లభిస్తోంది. 'బలగం'లాంటివి ఆ కోవకు వస్తాయి.

నేటి సినిమాల్లో హీరో క్యారెక్టర్ల ప్రవర్తన పట్ల కూడా కొంత విమర్శ వినబడుతోంది?

'అర్జున్‌రెడ్డి, డీజే టిల్లు' లాంటి విజయవంతమైన సినిమాలను దృష్టిలో పెట్టుకొని అడుగుతున్నారనుకుంటున్నా! నా ఉద్దేశంలో సినిమాకు ప్రేక్షకులు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం వస్తారు. దీనిలోనే సందేశం కూడా ఉండాలి. మందును తీపి గుళికల్లో పెట్టి ఇచ్చినట్లు ఉంటే మంచిది. లేకపోతే ప్రేక్షకుడికి బోర్ కొడుతుంది. సోషల్ మీడియా వ్యాప్తి తర్వాత ఏకాగ్రతతో కూర్చుని ఎవరూ ఏ కంటెంట్ చూడటంలేదు. ఏకాగ్రత చెదురుతోందనే సమయానికి వారికో థ్రిల్, కొత్తదనం కావాలి. ఈ మధ్య 'డీజే టిల్లు' లాంటి సినిమాలు హిట్ కావటానికి కారణం... పాత్రల చిత్రీకరణలో కొత్తదనం. కొత్త తరాన్ని ఆకర్షించే డైలాగులు. ఇవి చురుక్కుమనిపించాలి. సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలి. అప్పుడే సినిమా హిట్ అవుతుంది.

అయితే కథకు ప్రాధాన్యత పోయినట్లేనా? మన దగ్గర మంచి కథలు రావటం లేదనే వాదన ఉంది కదా!

మనకు మంచి కథలు రావటంలేదనేది పాక్షికంగా సత్యం. అయితే మంచి రైటర్స్ కొరత అయితే ఉంది. ఎందుకంటే గత 20 ఏళ్లుగా రైటర్సే డైరక్టర్స్‌గా మారిపోతున్నారు. ఒకప్పుడు రైటర్స్ వేరు. డైరక్టర్స్ వేరు. రచన వేరు. అన్నీ వేర్వేరు క్రాఫ్ట్. ఒక రచయిత రాసింది చదివి మనకు నచ్చినట్లు ఊహించుకోవచ్చు. అందరికీ నచ్చేలా కథను తెరకెక్కించేవాడే నిజమైన డైరక్టర్. కొందరికి రెండింటినీ సమర్థించే సామర్థ్యముంటుంది. లేకపోతే సమస్యలు ఎదురవుతాయి. శ్రీదర్శి పన్నా, డైమండ్ రత్నబాబు, మచ్చ రవి లాంటి మంచి రైటర్స్ దర్శకత్వం మార్గంలోకి వెళ్లారు. నిరాశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఇక్కడ ఇంకో విషయం... మంచి కథలు దొరకకపోవటంవల్ల ప్రాజెక్ట్ టేకప్ చేయని దర్శకులు కూడా ఉన్నారు.

మీ దృష్టిలో ఓటీటీవల్ల చిత్ర నిర్మాణంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి?

నా ఉద్దేశంలో సినిమాలు తీయాలా వద్దా అని కొందరు పెద్ద నిర్మాణ సంస్థలు సందిగ్ధంలో పడటానికి ఓటీటీలే కారణం. ఓటీటీ రాకముందు బడ్జెట్‌లు కంట్రోల్‌లో ఉండేవి. అవి వచ్చాక ఒక దశలో ఆ కంపెనీలు సినిమాకు అయిన ఖర్చును చెల్లించి సినిమాలు కొనటం మొదలుపెట్టాయి. ఉదాహరణకు ఒక సినిమాకు 40 కోట్లు అయిందనుకొందాం. 40 కోట్లు పెట్టి ఒక ఓటీటీ కంపెనీ కొనేస్తే నిర్మాతకు థియేటర్స్ మీద.. ఇతర మార్కెట్ల మీద.. మిగిలిన మార్గాల ద్వారా వచ్చేది లాభమే కదా! దీంతో హీరోలు, డైరక్టర్లు రెమ్యూనిరేషన్స్ పెంచేశారు. ప్రొడక్షన్ కాస్ట్ కూడా పెరిగిపోయింది. ప్రస్తుతం ఎదురవుతున్న చిక్కేమిటంటే... ఓటీటీ కంపెనీలు భారీ బడ్జెట్ సినిమాలు మాత్రమే కొనటం మొదలుపెట్టాయి. వారిని ఆకర్షించాలంటే భారీ బడ్జెట్ చిత్రాలే తీయాలి. అయితే ఆ సినిమాకు అంత రికవరీ సామర్థ్యం ఉందా? లేదా? అనే ఆలోచన లేకుండా కొందరు సినిమాలు తీస్తున్నారు. హిట్ అయితే సరే... లేకపోతే మొత్తానికే మోసం వస్తోంది. వీటిని గమనించే చాలా కాలంగా నిర్మాణ రంగంలో ఉన్న నిర్మాతలు పక్కకు తప్పుకున్నారు. మీరు గమనిస్తే... 'సురేష్ ప్రొడక్షన్స్, అన్నపూర్ణ స్టూడియోస్' వంటివారు సినిమాలు తీయటంలేదు. ఒకటి రెండేళ్లలో ఫలితాలు కనబడతాయి. చెరువుల్లో చేపలు తేలినట్లు చాలా మంది తేలిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

> **ప్రతి రోజూ కొత్తదే...**
>
> 
>
> వేషం చిన్నదైనా.. పెద్దదైనా.. నాకు ఒకే విధమైన ఎక్సైట్‌మెంట్ ఉంటుంది. ఎందుకంటే వేసే పాత్ర కొత్తగా ఉంటుంది. పని చేసే టీమ్ కొత్తదే అయి ఉంటుంది. దాంతో చాలా ఉత్సాహంగా అనిపిస్తుంది. ఇంట్లో కూర్చుంటే ఈ ఉత్సాహం ఉండదు. అందుకే నిజమైన నటుడు చచ్చేదాకా నటిద్దామనే అనుకుంటాడు.

కొన్నిసార్లు భారీ బడ్జెట్ సినిమాలు దెబ్బ తింటున్నాయి. దీనికి ప్రేక్షకుల దగ్గరకు సినిమాను తీసుకువెళ్లకలేకపోవటం కూడా ఒక కారణమంటారా?

సోషల్ మీడియా ఒక గేమ్ ఛేంజర్ రోల్‌ను పోషిస్తోంది. పట్టణ ప్రాంతాలే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. అయితే నా ఉద్దేశంలో సోషల్ మీడియాకు ఎలాంటి వ్యూహాలను అనుసరించాలి? ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? అనే విషయంలో చాలా మంది నిర్మాతలకు సరైన అవగాహన లేదు. ఉదాహరణకు ఒక సినిమా విడుదలకు ముందు కొన్ని కోట్ల రూపాయలతో మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ మార్కెటింగ్‌వల్ల ఎంత లాభముంది? ఎంత మందికి సినిమా గురించి తెలుస్తోంది? అనే విషయంపై శాస్త్రీయ అంచనాలేవీ లేవు. ఎక్కువ మంది నిర్మాతలు మార్కెటింగ్ స్టాఫ్‌పైనే ఆధారపడతారు. ఒక సినిమా ప్రమోషన్ ఒక కాలేజీలో చేశారనుకుందాం. అది హిట్ అయితే అందరూ కాలేజీలకు వెళ్లిపోతారు. ఒక గేమ్‌షోకు వెళ్తే ప్రేక్షకులకు దగ్గరవుతామని ఎవరో చెబుతారు. ప్రమోషన్‌కు అక్కడకు వెళ్లిపోతారు. ఒకప్పుడు సీరియల్స్‌లో గెస్ట్ ఆర్టిస్టులుగా వెళ్లేవారు. ఇలా ఒక కచ్చితమైన వ్యూహం లేకుండా మార్కెటింగ్ చేయటంవల్ల ప్రయోజనం ఉండదు. నా ఉద్దేశంలో ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. దీనిపై ప్రొడ్యుసర్స్ కౌన్సిల్, ప్రొడ్యుసర్స్ గిల్డ్ వంటివి చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది.

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే నిర్మాతలు మార్కెటింగ్ విషయంలో అజాగ్రత్తగా ఉంటారంటారా?

ఉండరు. కానీ సినిమా విడుదలయ్యే టెన్షన్‌లో ఉంటారు. ఒకేసారి వంద పనులు చూసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఇతరులపై ఎక్కువ ఆధారపడతారు. ఎక్కడో తప్పు జరుగుతోందని తెలుస్తుంది. సినిమా ఫలితం వచ్చిన తర్వాత ఇక ఈ విషయాన్ని పట్టించుకోరు. రిలాక్స్ అయిపోతారు. నా ఉద్దేశంలో ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. అందరు నిర్మాతలు కలిసికట్టుగా కూర్చుని చర్చించాలి. అప్పుడే ఒక పరిష్కారం దొరుకుతుంది.

> **పైరసీ రాక్షసి...**
>
> పైరసీ కొన్ని వేల కోట్ల వ్యాపారం. మన పురాణాల్లో ఒక రాక్షసికి ఒక రక్తపు బొట్టు కింద చిందినా... ఆ రక్తపు బొట్టు నుంచి మళ్లీ పుట్టే అవకాశం బ్రహ్మ ప్రసాదిస్తాడు. అప్పుడు ఆ రాక్షసి ఎవరికీ లొంగదు. పైరసీ కూడా అలాంటిదే! ఎప్పటికప్పుడు దీనిపై పోరాటం చేస్తూనే ఉండాలి. కొత్త సినిమాలు వచ్చిన వెంటనే ఇంతకు ముందు వెబ్‌సైట్లలో పెట్టేవారు. ఇప్పుడు లింక్స్ వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా అందరికీ చేరిపోతున్నాయి. ఈ మధ్య 'ఫ్యామిలీ స్టార్' సినిమానే తీసుకోండి. విపరీతంగా పైరసీ అయింది. పైరసీ లింక్ అందుబాటులోకి వచ్చేస్తే ప్రేక్షకుడు థియేటర్‌కు రాడు. కలెక్షన్లు పడిపోతాయి. ఫోన్‌లో సినిమాలు చూసే సౌలభ్యం వచ్చిన తర్వాత దీనిని అరికట్టడానికి కొత్త మార్గాలు అన్వేషించాలి. ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ దీనిపై పోరాటానికి ఒక సెల్‌ను కూడా ఏర్పాటు చేసింది. కానీ పెద్దగా ఫలితం ఉన్నట్లు అనిపించటం లేదు.

- సీవీఎల్ఎన్ ప్రసాద్

ఆమె ఒకప్పుడు విశ్వసుందరిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ఆ తర్వాత నటిగా రాణించింది. ప్రస్తుతం సినిమాలతో పాటు ఓటీటీల్లోనూ నటిస్తోంది. ఆమే.. లారా దత్తా. ఆమె నటించిన 'రణ్‌నీతి- బాలాకోట్ బియాండ్' వెబ్‌సిరీస్ త్వరలో విడుదలవుతున్న సందర్భంగా లారా దత్తా గురించి కొన్ని విషయాలు...

అలాంటి రోల్స్‌లో నటించాలనుంది



ఇన్‌స్టాగ్రామ్‌లో లారా దత్తాకు పదమూడు లక్షల ఫాలోవర్లు ఉన్నారు. సినిమా విశేషాలతో పాటు యాడ్స్, కుటుంబ విశేషాలను షేర్ చేస్తుంటుంది. అధిక శాతం తన భర్త (టెన్నిస్ ప్లేయర్ మహేష్ భూపతి), కూతురు సైరాతో దిగిన ఫొటోలే ఉంటాయి. ఆ మధ్య 'హీరోల గాళ్‌ఫ్రెండ్‌గానో, భార్యగానో నటించటం పరమబోర్. విసిగిపోయా. కొత్త పాత్రలు కావాలి' అంటూ ఓ ఇంటర్వ్యూలో లారా మాట్లాడింది. ఆ తర్వాత ఆమె పంథానూ మార్చుకున్నట్లు అనిపిస్తుంది.

అలా ఇండస్ట్రీలోకి...

లారా దత్తా ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో పుట్టి పెరిగింది. తండ్రి సిక్కు కుటుంబానికి చెందిన వ్యక్తి. అమ్మ ఆంగ్లో ఇండియన్. తన తండ్రి వింగ్ కమాండర్‌గా పని చేశారు. అంతేనా మూడు యుద్ధాల్లో కూడా పాల్గొన్నారు. తండ్రి వల్లనే తనలో క్రమశిక్షణ అలవడిందని చెబుతారీమె. ఇక పోతే చిన్నప్పుడే బెంగుళూరుకి వాళ్ల కుటుంబం షిఫ్ట్ అయింది. బెంగుళూరులోనే లారా దత్తా చదివింది. ఎకనిమిక్స్‌లో డిగ్రీ చదవటానికి ఆమె ముంబయి యూనివర్శిటీలో చేరింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, కన్నడ, పంజాబీ భాషలు మాట్లాడగలదు. అలా ఆమె ఆ తర్వాత ఫ్యాషన్ వరల్డ్‌లోకి వచ్చింది. ర్యాంప్ మీద నడవటమే కాదు.. 2000 సంవత్సరంలో ఏకంగా విశ్వసుందరి కిరీటం అందుకుంది. అలా ఆమె పేరు మార్మోగిపోయింది. ఆ పేరుతో ఆమెకు బాలీవుడ్ అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. అలా ఆమె నటించిన తొలి చిత్రం 'అందాజ్'. ఇది విడుదలైంది 2003లో. తొలి చిత్రంతోనే బెస్ట్ డెబ్యుడెంట్‌గా ఫిల్మ్ ఫేర్ అవార్డు దక్కించుకుంది. 'నో ఎంట్రీ', 'హౌస్ ఫుల్', 'బిల్లు బార్బర్', 'డాన్ 2', 'బ్లూ' లాంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.



కెరీర్, పర్సనల్ లైఫ్...

టెన్నిస్ ప్లేయర్ మహేష్ భూపతితో కలసి 2011లో ఏడడుగులు నడిచింది. వీరికి సైరా అనే కూతురు ఉంది. ఎంత బిజీగా ఉన్నా.. కుటుంబ జీవితం మీద పడకూడదనేది లారా దత్తా ఆలోచన. పెళ్లయ్యాక 'చలో ఢిల్లీ' అనే చిత్రంలో నటించటంతో పాటు నిర్మాణ బాధ్యతలూ చూసుకుంది. 'అజహర్', 'వెల్‌కమ్ టు న్యూయార్క్' తర్వాత బ్రిటీష్ హిస్టారికల్ డ్రామా సిరీస్‌లో నటించింది. మూడేళ్ల కిందట వచ్చిన 'బెల్‌బాటమ్' సినిమా బాక్సాఫీస్ వద్ద కుదేలయినప్పటికీ ఇందిరాగాంధీగా లారా దత్తా నటన ప్రశంసలు అందుకుంది. అలా ఆమె మళ్లీ మార్కెట్‌లో క్రేజ్ సంపాదించుకుంది.

అలాంటి పాత్రలే కావాలి..

ఐఫా అవార్డుల ఫంక్షన్ హోస్ట్, మిస్ దివా కాంటెస్టులకు హాజరవ్వటంతో పాటు యాడ్స్, యోగా వీడియోలతోనూ ప్రేక్షకులకు ఎప్పుడూ టచ్‌లోనే ఉంది లారా. 'రొడ్డకొట్టుడు పాత్రలను ఆపేసి ఆడవాళ్ల సమస్యలపై ఇప్పుడు సినిమాలొస్తున్నాయంటే ప్రముఖ కారణం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌నే' అంటుందీమె. 'నటనంటే ఇష్టం. ఫ్యామిలీ సపోర్టు ఉంది. అందుకే సైరా నెలల పిల్ల ఉన్నప్పుడూ 'డేవిడ్' చిత్రం సెట్స్‌కు వెళ్లాను. ఫీడింగ్ ఇవ్వటంతో పాటు చేయాల్సిన సన్నివేశాలూ చేశాను' అంటుంది లారా దత్తా. తన కూతురు సైరా వల్ల తన ఆలోచనలు మారిపోవటంతో పాటు హ్యూమనిస్టుగా తయారయ్యానంటుంది లారా. ఈ విషయంలో తన కూతురే టీచర్ అంటుంది. 'విభిన్నమైన కథలతో ఓటీటీ దర్శకులు వస్తున్నారు. ఇందిరాగాంధీ లాంటి కొత్త పాత్రలు కావాలి. భవిష్యత్‌లో స్ఫూర్తివంతమైన రోల్స్‌లో నటించాలని ఉంది' అంటుంది లారా దత్తా.

ఎముకల్లో గట్టిదనం...

ఇంటికి పిల్లర్లు ఉన్నట్లు.. మన శరీరానికి ఎముకలు ఉన్నాయి. ముఖ్యంగా ఎముకల ఆరోగ్యానికి కాల్షియం ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. పాల ఉత్పత్తుల్లో ఇది పుష్కలం. అయితే పాల ఉత్పత్తులను తీసుకోనివారు ఎలాంటి ఫుడ్‌ను తీసుకోవాలో తెల్సుకుందాం.

- చేపల్లో కాల్షియం, విటమిన్-డి, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. దీని వల్ల ఎముకలు గట్టితనానికి ఎంతో మంచి ఆహారమిది.
- స్వీట్ పొటాటోల్లో మాంగనీస్‌తో పాటు కాల్షియం ఉంటుంది. పాల కూర, బ్రొకోలీ, తోటకూరతో పాటు తాజా కూరగాయలూ తినాలి. పల్లీలు, జీడిపప్పు, బాదం లాంటి నట్స్‌లో కాల్షియం పుష్కలం. దీని వల్ల ఎముకలు గట్టిగా ఉంటాయి.
- నిమ్మ, నారింజ, బొప్పాయి, స్ట్రాబెర్రీ, మామిడిపండ్లు లాంటివి కొల్లాజిన్ అనే పదార్థాన్ని విడుదల చేస్తాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
- బీన్స్ గింజలు ఎముకలకు మేలు చేస్తాయి. ముఖ్యంగా తెల్లని బీన్స్‌లో కాల్షియం, పొటాషియం, మాంగనీసు పుష్కలం.



'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7YxI6hYలో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TA1DxkH లో చదవండి.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
361 (7 మ్యాచ్‌లు)	13 (7 మ్యాచ్‌లు)

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x బెంగళూరు	మ.3.30 గం. నుంచి
పంజాబ్ x గుజరాత్	రాత్రి 7.30 గం. నుంచి

టాస్ గెలిచిన ప్రత్యర్థి సన్‌రైజర్స్‌కు బ్యాటింగ్‌కు ఆహ్వానించడం.. కసితీరా చితక్కొట్టించుకోవడం పరిపాటయ్యింది. ఇప్పటికే 277, 287 పరుగుల రికార్డు స్కోర్లతో మోతెక్కించిన రైజర్స్ ఈసారి 266 పరుగులతో కాస్త శాంతించింది. కానీ ఆరంభంలో హెడ్, అభిషేక్ విధ్వంసం చూస్తే స్కోరు 300-350 కూడా సాధ్యమయ్యేలా అనిపించింది. ఎందుకంటే.. ఓవర్‌కు 20 పరుగుల చొప్పున పవర్‌ప్లేలోనే 125 పరుగులతో వామ్మో అనేలా ఆడారు. మధ్య ఓవర్లలో నెమ్మదించినా.. చివరకు ఎస్‌ఆర్‌హెచ్ అలవోకగా 250 దాటేసింది. ఇక డీసీ ఛేదనలో ఫ్రేజర్ ఒక్కడే ఆకట్టుకోగా, కెప్టెన్ పంత్ తన బ్యాటింగ్ తీరుతో నిరాశపర్చడంతో ఓటమి తప్పలేదు

రన్‌రైజర్స్

మరోసారి 250పైగా స్కోరు

ఢిల్లీపై ఘనవిజయం
పోరాడిన ఫ్రేజర్
నటరాజన్‌కు 4 వికెట్లు

హెడ్, షాబాజ్, నితీశ్ సూపర్ ఇన్నింగ్స్



హెడ్ (32 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 89)

1

ఐపీఎల్‌లోనే కాదు.. టీ20 ఫార్మాట్‌లోనే పవర్‌ప్లేలో అత్యధిక స్కోరు (125) చేసిన జట్టుగా సన్‌రైజర్స్. అలాగే ఈ లీగ్ తొలి పది ఓవర్లలో ఎక్కువ పరుగులు (158/4) చేసిన జట్టుగానూ నిలిచింది. ఐపీఎల్ చరిత్రలో అతి వేగంగా వంద పరుగులు (5 ఓవర్లలో) పూర్తి చేసిన జట్టు కూడా ఇదే.

రైజర్స్ తరఫున వేగం (16 బంతుల్లో)గా 50 పరుగులు చేసిన బ్యాటర్‌గా అభిషేక్‌తో సమంగా నిలిచిన హెడ్. అలాగే పవర్‌ప్లేలో ఎక్కువసార్లు (3) 50+ స్కోర్లు సాధించిన రెండో బ్యాటర్‌గా హెడ్.

ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఎక్కువ సార్లు (3) 250+ స్కోర్లు చేసిన జట్టుగా సర్రేతో సమంగా నిలిచిన రైజర్స్

ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో తమ అత్యధిక సిక్సర్ల (22) రికార్డును మరోసారి సమం చేసిన రైజర్స్.

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి మరో విధ్వంసకర ప్రదర్శన. ఈసారి ఆ జట్టు బ్యాటర్లకు ఢిల్లీ క్యాపిటల్స్ బలైంది. తమ చివరి మ్యాచ్‌లో గుజరాత్‌ను 89 పరుగులకే ఆలౌట్ చేసిన డీసీ బౌలర్లను ట్రావిస్ హెడ్ (32 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 89), అభిషేక్ శర్మ (12 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 46) తమ ఊచకోతతో చేష్టలుడిగేలా చేశారు. ఆ తర్వాత రికార్డు ఛేదనలో డీసీ ఆరంభం బాగున్నా.. ముగింపులో తేలిపోయింది. పేసర్ నటరాజన్ (4/19) కెరీర్ బెస్ట్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో 67 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన హైదరాబాద్ 10 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. ఈ జట్టుకిది వరుసగా నాలుగో విజయం. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 266 పరుగులు చేసింది. షాబాజ్ అహ్మద్ (29 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 59 నాటౌట్), నితీశ్ కుమార్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) సహకరించారు. కుల్దీప్‌నకు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.1 ఓవర్లలో 199 రన్స్‌కు ఆలౌటైంది. ఫ్రేజర్ (18 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 65), అభిషేక్ (22 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 42) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా పంత్ (44) ఫర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హెడ్ నిలిచాడు.


ఫ్రేజర్ ఒక్కడే..: కష్టసాధ్యమైన ఛేదనలో ఢిల్లీకి మెరుపు ఆరంభమే లభించింది. యువ బ్యాటర్ ఫ్రేజర్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో రైజర్స్‌కు వణుకు పుట్టించాడు. కానీ వికెట్లు కాపాడుకోలేకపోవడం డీసీని దెబ్బతీసింది. వాస్తవానికి 12 ఓవర్ల దాకా పోటీలోనే ఉన్నా ఛేదన వైపు సాగలేకపోయింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ పృథ్వీ షా వరుసగా 4 ఫోర్లతో స్పిన్నర్ సుందర్‌కు స్వాగతం పలికాడు. కానీ ఐదో బంతికే దొరికిపోయాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ వార్నర్ (1).. భువీకి చిక్కాడు. ఈ స్థితిలో ఫ్రేజర్-పోరెల్ జోడీ చెలరేగింది. ముఖ్యంగా మూడో ఓవర్‌లో ఫ్రేజర్ 4,4,6,4,6,6తో 30 పరుగులతో డీసీని జోష్‌లో నింపాడు. అలాగే ఐదో ఓవర్‌లో అతడి 4,6.. పోరెల్ 4,4తో మరో 20 రన్స్ వచ్చాయి. 15 బంతుల్లోనే ఫ్రేజర్ ఫిఫ్టీ పూర్తి చేయడం విశేషం. వీరి ధాటికి పవర్‌ప్లేలో జట్టు 88/2 స్కోరుతో నిలిచింది. కానీ ఏడో ఓవర్‌లో ఫ్రేజర్ హ్యాట్రిక్ సిక్సర్లు బాదినా.. మార్కండే అతడిని అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత నెమ్మదిగా ఢిల్లీ పోటీలో నుంచి తప్పుకో సాగింది. పోరెల్ 8వ ఓవర్‌లో 4,4,6,4తో 22 రన్స్ సాధించి రన్‌రేట్ తగ్గకుండా చూశాడు. కానీ మార్కండే మరోసారి షాకిస్తూ పోరెల్ వికెట్ తీయడంతో రైజర్స్ ఆధిపత్యం చూపింది. క్రీజులో హిట్టర్లు పంత్, స్టబ్స్ (10) ఉండడంతో సంచలన ఫలితం వస్తుందని ఆశించినా నిరాశే ఎదురైంది. 9-15 ఓవర్ల మధ్య వీరి నుంచి కనీసం ఒక్క సిక్సర్ కూడా రాలేదు. ముఖ్యంగా పంత్ భారీ షాట్లు ఆడడంలో ఇబ్బందిపడ్డాడు. స్టబ్స్‌ను నితీశ్, లలిత్ (7)ను నటరాజన్ అవుట్ చేయగా 166/6తో డీసీ పోరు నామమాత్రమే అయ్యింది. 19వ ఓవర్‌లో నటరాజన్ 3 వికెట్లు తీయగా, చివరి ఓవర్ తొలి బంతికి పంత్‌ను నితీశ్ అవుట్ చేయడంతో ఢిల్లీ ఆలౌటైంది.

బౌలర్ల దిమ్మతిరిగేలా..: 19, 21, 22, 21, 20, 22.. తొలి ఆరు ఓవర్లలో సన్‌రైజర్స్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సాగించిన విధ్వంసమిది. ఐపీఎల్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఆటతీరుతో ఈ ఇద్దరూ బ్యాట్లతో చెలరేగిన విధానం అద్భుతః అనిపించింది. ఈ దెబ్బకు పవర్‌ప్లేలోనే రైజర్స్ 125 పరుగులు సాధించి ఔరా అనిపించేలా చేసింది. బౌలర్ ఎవరైనా ఆకాశం వైపు చూడడంతోనే సరిపోయింది. చక్కటి బ్యాటింగ్ వికెట్‌తో పాటు బౌండరీల విస్తీర్ణం కూడా తక్కువగానే ఉండడంతో ఈ ఇద్దరూ పండగ చేసుకున్నారు. కానీ పవర్‌ప్లే తర్వాత రైజర్స్ మెరుపు ఇన్నింగ్స్‌ను డీసీ బౌలర్లు కట్టడి చేయగలిగారు. తొలి ఓవర్‌లోనే హెడ్ 6,4,4,4తో జరుగబోయే ఊచకోతను ఢిల్లీ బౌలర్లకు గుర్తుచేశాడు. రెండో ఓవర్‌లో తను 6,6,4 బాదగా.. మూడో ఓవర్‌లో నోకియాను 4,4,0,4,4,6తో బెదరగొట్టాడు. అటు 16 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మరో ఎండ్‌లో స్పిన్నర్లు లలిత్, కుల్దీప్‌లను లక్ష్యంగా చేసుకుని అభిషేక్ అలవోకగా సిక్సర్లు కొట్టడంతో స్కోరు 5 ఓవర్లలోనే రికార్డు స్థాయిలో 103కి చేరింది. ఇక ఆరో ఓవర్‌లో హెడ్ 4,4,4,4,0,6 బాదడంతో ఈసారి పేసర్ ముకేశ్ బలయ్యాడు. మరోవైపు ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ (13 బంతుల్లో) హాఫ్ సెంచరీని అభిషేక్ అధిగమిస్తాడనిపించింది. కానీ ఏడో ఓవర్‌లో అతడిని కుల్దీప్ అవుట్ చేయడంతో ఈ పరుగుల తుఫాన్ నుంచి డీసీకి అతి పెద్ద రిలీఫ్ లభించింది. అదే ఓవర్‌లో మార్‌క్రమ్ (1) వికెట్‌ను కూడా తీశాడు. స్పిన్నర్ అక్షర్ తర్వాతి ఓవర్‌లో రైజర్స్‌కు ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. కుల్దీప్ మరో ఓవర్‌లో డేంజరస్ హెడ్ వికెట్ తీయడంతో ఢిల్లీ సంబరాల్లో మునిగింది. అలాగే క్లాసెన్ (15) తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో రైజర్స్ 131/0 నుంచి 151/4కి చేరింది. ఈ దశలో మరో వికెట్ కోల్పోకుండా నితీశ్, షాబాజ్ కుదురుగా ఆడారు. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో ముందుకు సాగడంతో 14.5 ఓవర్లలోనే స్కోరు 200కి చేరింది. ఈ దశలో కుల్దీప్ మరోసారి మ్యాజిక్ చూపుతూ జోరు మీదున్న నితీశ్‌ను అవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత షాబాజ్ చెలరేగి 19వ ఓవర్‌లో రెండు, సమద్ ఓ సిక్సర్‌తో 20 పరుగులు వచ్చాయి. ఇక ఆఖరి ఓవర్‌లో సమద్ (13), కమిన్స్ (1) వెనుదిరిగినా షాబాజ్ 4,4,6తో 28 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసి జట్టును 260 పరుగులు దాటించాడు.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 89, అభిషేక్ శర్మ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 46, మార్‌క్రమ్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 1, క్లాసెన్ (బి) అక్షర్ 15, నితీశ్ కుమార్ (సి) వార్నర్ (బి) కుల్దీప్ 37, షాబాజ్ (నాటౌట్) 59, సమద్ (సి) నోకియా (బి) ముకేశ్ 13, కమిన్స్ (రనౌట్) 1, వాషింగ్టన్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 266/7; వికెట్ల పతనం:** 1-131, 2-133, 3-154, 4-154, 5-221, 6-250, 7-256; **బౌలింగ్:** ఖలీల్ 3-0-51-0, లలిత్ 2-0-41-0, నోకియా 3-0-31-0, కుల్దీప్ 4-0-55-4, ముకేశ్ 4-0-57-1, అక్షర్ 4-0-29-1.

ఢిల్లీ: పృథ్వీ షా (సి) సమద్ (బి) వాషింగ్టన్ 16, వార్నర్ (సి) కమిన్స్ (బి) భువనేశ్వర్ 1, ఫ్రేజర్ (సి) క్లాసెన్ (బి) మార్కండే 65, పోరెల్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) మార్కండే 42, స్టబ్స్ (సి) షాబాజ్ (బి) నితీశ్ 10, పంత్ (సి) నటరాజన్ (బి) నితీశ్ 44, లలిత్ (బి) నటరాజన్ 7, అక్షర్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 6, నోకియా (బి) నటరాజన్ 0, కుల్దీప్ (ఎల్బీ) నటరాజన్ 0, ముకేశ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 8, మొత్తం: 19.1 ఓవర్లలో 199 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-16, 2-25, 3-109, 4-135, 5-154, 6-166, 7-199, 8-199, 9-199, 10-199; **బౌలింగ్:** వాషింగ్టన్ 2-0-46-1, భువనేశ్వర్ 4-0-33-1, కమిన్స్ 4-0-35-0, నటరాజన్ 4-1-19-4, మార్కండే 2-0-26-2, షాబాజ్ 1-0-22-0, నితీశ్‌కుమార్ 2.1-0-17-2.



నితీశ్ కుమార్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 37)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
హైదరాబాద్	7	5	2	0	10	0.914
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	7	4	3	0	8	0.529
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
ముంబై	7	3	4	0	6	-0.133
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



అన్ను



రీతిక

వినేశ్.. చలో పారిస్

రీతిక, అన్షు కూడా..
భారత్‌కు మూడు ఒలింపిక్ బెర్తులు
ఆసియా రెజ్లింగ్ క్వాలిఫయర్స్



బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళా రెజ్లర్లు అదరగొట్టారు. ఏకంగా మూడు పారిస్ బెర్తులు పట్టేశారు. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ (50కి), రీతిక (76కి.), అన్షూ మాలిక్ (57కి.) తమతమ విభాగాల్లో ఫైనల్‌కు చేరడం ద్వారా పారిస్ విశ్వక్రీడల 'టిక్కెట్' ఖాయం చేసుకున్నారు. కాగా..వరల్డ్ చాంపియన్‌షిప్స్ ద్వారా అంతిమ్ పంగల్ (53కి.) ఇంతకు ముందే విశ్వక్రీడలకు క్వాలిఫై అయ్యింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ప్రస్తుత, మాజీ అధ్యక్షులపై చేస్తున్న పోరాటం తన సత్తాకు అడ్డు రాదని స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ నిరూపించింది. 50 కి. విభాగంలో తిరుగులేని ప్రదర్శన చేస్తూ ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా టైటిల్ ఫైట్‌కు చేరింది. 29 ఏళ్ల వినేశ్ వరుసగా మూడో ఒలింపిక్స్ బరిలో దిగనుండడం విశేషం. రియో (2016), టోక్యో (2020) క్రీడల్లో ఆమె తలపడిన సంగతి తెలిసిందే. శనివారం..తొలి బౌట్‌లో కొరియా ప్రత్యర్థి మిరాన్ చియాన్‌ను ఒక నిమిషం 39 సెకన్లలోనే చిత్తు చేసిన వినేశ్..ఆపై క్వార్టర్‌ఫైనల్లో కంబోడియాకు చెందిన మనంగ్ దిత్‌ను కేవలం 67 సెకన్లలోనే మట్టి కరిపించి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. సెమీస్‌లో 19 ఏళ్ల కజక్ రెజ్లర్ లారా గనికిజి తొలుత ఫొగట్‌ను ఒకింత ప్రతిఘటించింది. కానీ తన అనుభవాన్ని రంగరించిన భారత స్టార్ వినేశ్ ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్ ఫైట్‌కు చేరింది. ఇక..57 కేజీల క్వార్టర్స్‌లో కల్మిరా (కిర్గిస్థాన్)పై నెగ్గిన అన్షు.. సెమీస్‌లో లేలోఖోవ్ (ఉజ్బెక్)ని ఓడించింది. 76 కిలోల మొదటి రౌండ్‌లో వాంగ్ (కొరియా)పై సునాయాసంగా నెగ్గిన రీతిక..తదుపరి దవానసన్ (మంగోలియా)ను ఓడించింది. గ్రూప్ చివరి బౌట్‌లో జువాంగ్ (చైనా)పై, సెమీఫైనల్లో చాంగ్ (తైపీ)పై రీతిక విజయం సాధించింది. 62 కేజీలలో..మాన్సీ అహ్లావత్ సెమీఫైనల్లో పరాజయంతో త్రుటిలో పారిస్ బెర్త్ కోల్పోయింది. తొలి రోజు పోటీల్లో బరిలో దిగిన భారత రెజ్లర్లలో నిషా దహియా (68కి.) మాత్రమే సెమీస్‌కు చేరలేపోయింది.

భారత్‌కు నాలుగు స్వర్ణాలు



టోక్యో: ఆసియా పారా కనోయింగ్ స్ప్రింట్‌లో భారత అథ్లెట్లు నాలుగు స్వర్ణాలతో అదరగొట్టారు. జైదీప్ (వీఎల్3 పురుషుల 200 మీ.), పూజా ఓజా (కేఎల్3 మహిళల 200 మీ.), ప్రాచీ యాదవ్ (కేఎల్2 మహిళల 200 మీ.), సురేందర్ కుమార్ (వీఎల్1 పురుషుల 200 మీ.) పసిడి పతకాలు సాధించారు. షబానా (కేఎల్3 మహిళల 200 మీ.), రజని (కేఎల్2 మహిళల 200 మీ.), సోనాల్‌బెన్ (కేఎల్1 మహిళల 200 మీ.), యష్ కుమార్ (వీఎల్1 పురుషుల 200 మీ.), గజేంద్ర సింగ్ (వీఎల్2 పురుషుల 200 మీ.) రజతాలు దక్కించుకొన్నారు. కేఎల్3 మహిళల 200 మీ. విభాగంలో సంగీత రాజ్‌పుత్ కాంస్యం సొంతం చేసుకొంది.

అదరగొట్టిన మను, అనిష్

న్యూఢిల్లీ: ఒలింపిక్ సెలెక్షన్ ట్రయల్స్-1 రెండో రోజు పోటీల్లో మను భాకర్, అనిష్ భన్వాలా అదరగొట్టారు. శనివారం ఇక్కడి కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 25 మీటర్ల పిస్టల్ విభాగంలో మను 583 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మొత్తం 10 రౌండ్లలో మను ఏడింట్లో 5/5 స్కోరు చేసి సంచలనం సృష్టించింది. మను టాప్‌లో నిలవగా, రిథమ్ సంగ్వాన్, అభిద్న్యా పాటిల్ తర్వాతి రెండు స్థానాలను దక్కించుకున్నారు. తొలి రోజు పోటీల్లో హోరెత్తించిన హైదరాబాద్ షూటర్ ఇషాసింగ్ రెండో రోజు ఏడో రౌండ్లో నిష్క్రమించింది. పురుషుల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో అనిష్ 578 పాయింట్లతో టాప్‌లో నిలవగా, విజయ్‌వీర్ సిద్ధు 2వ, ఆదర్శ్ సింగ్ 3వ స్థానాలను దక్కించుకున్నారు.

60 గంటలపాటు ఏకధాటిగా ఆడి..

చెస్‌లో నైజీరియా ఆటగాడు టుండే రికార్డు ఫీట్



న్యూయార్క్: మారథాన్ చెస్ ఆడిన నైజీరియా చెస్ చాంపియన్ టుండే అనాకొయా సరికొత్త గిన్నిస్ రికార్డును నెలకొల్పాడు. న్యూయార్క్‌లోని టైమ్‌స్క్వేర్ వద్ద టుండే ఏకధాటిగా 60 గంటపాటు చెస్ ఆడాడు. అతడికి ప్రత్యర్థిగా అమెరికా చెస్ చాంపియన్ షాన్ మార్టినెజ్ వ్యవహరించాడు. ఈ క్రమంలో 2018లో నార్వే ప్లేయర్లు హల్వర్డ్ హగ్ ఫ్లాటిబో-సుజుర్ ఫెర్కింగ్‌స్టాడ్ 56 గంటల 9 నిమిషాల 37 సెకన్ల రికార్డు బద్దలైంది. అయితే, ఈ ఫీట్ గురించి గిన్నిస్‌బుక్ అధికారులు ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఆఫ్రికా చిన్నారుల విద్యకు విరాళాలు సేకరించడం కోసం టుండే రికార్డు ఫీట్‌కు ఉపక్రమించాడు.

రాహుల్, రుతురాజ్‌లపై జరిమానా

లఖ్‌నవూ: స్లో ఓవర్ రేట్ కారణంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్-చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్లు రాహుల్, రుతురాజ్‌లపై జరిమానా పడింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరికీ ఇదే తొలి తప్పిదం కావడంతో చెరి రూ.12 లక్షల ఫైన్‌తో సరిపెట్టారు. మరోవైపు పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై బ్యాటింగ్ కోచ్ పొలార్డ్, బ్యాటర్ టిమ్ డేవిడ్‌లపైనా జరిమానా విధించారు. డగౌట్ నుంచే వీరు క్రీజులోని బ్యాటర్లకు డీఆర్‌ఎస్ తీసుకోవాలని సిగ్నల్ ఇవ్వడంతో ఇద్దరి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధిస్తున్నట్టు అడ్వైజరీ కమిటీ పేర్కొంది.

రెండో టీ20లో పాక్ గెలుపు

రావల్పిండి: న్యూజిలాండ్‌తో రెండో టీ20లో పాకిస్థాన్ ఏడు వికెట్లతో నెగ్గింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత న్యూజిలాండ్ 18.1 ఓవర్లలో 90 పరుగులకే కుప్పకూలింది. మార్క్ చాప్‌మన్ (19) టాప్ స్కోరర్. అఫ్రీది 3, ఆమిర్, అబ్రార్ చెరి రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆతిథ్య జట్టు 12.1 ఓవర్లలో 92/3 స్కోరు చేసి నెగ్గింది. రిజ్వాన్ 45 రన్స్ చేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దయింది.

బిజినెస్

వజ్రానికి పసిడి పోటు!

వజ్రాభరణాలపైనా బంగారం ధరల పెరుగుదల ప్రభావం

- 15 శాతం వరకు తగ్గిన డైమండ్ జువెలరీ విక్రయాలు
- అమ్మకాలు పెంచుకునేందుకు వర్తకుల కొత్త ప్రయత్నాలు
- 18 క్యారెట్లకు బదులు 14 క్యారెట్ల ఉత్పత్తులపై దృష్టి



ఇటీవలి కాలంలో అనూహ్యంగా పెరిగిన పసడి ధర వజ్రాభరణాల డిమాండ్‌కూ గండికొట్టిందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. కొనుగోలుదారులపై భారం పెరగకుండా ఉండటంతో పాటు విక్రయాల పునరుద్ధరణ కోసం నగల వర్తకులు వజ్రాభరణాల తయారీకి ఉపయోగించే బంగారం స్వచ్ఛతను తగ్గిస్తున్నట్లు తెలిసింది. 22, 18 క్యారెట్లకు బదులు 14 క్యారెట్ల బంగారంతో చేసిన డైమండ్ జువెలరీని అందుబాటులోకి తేవడంపై ఆభరణ వర్తకులు దృష్టిసారించారు. అంతేకాదు, బంగారం నగల కొనుగోలుకు వచ్చిన వారిలోనూ చాలా మంది ఇప్పుడు 22 క్యారెట్లకు బదులు 18 క్యారెట్ల మోడళ్ల కోసం వాకబు చేస్తున్నారు. వేగంగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు డైమండ్ నగల గిరాకీపైనా ప్రభావం చూపాయని జెమ్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) వైస్ చైర్మన్ కిరీట్ బన్సాలీ అన్నారు ఈ ఫిబ్రవరి వరకు వృద్ధి పథంలో పయనించిన వజ్రాభరణాల డిమాండ్.. గోల్డ్ రేట్ల పెరుగుదలతో గడిచిన ఒకటిన్నర నెలలో 15 శాతం వరకు తగ్గిందన్నారు.

దాంతో కల్యాణ్ జువెలర్స్, మలబార్ వంటి ప్రముఖ రిటైల్ ఆభరణ విక్రయ కంపెనీలు 14 క్యారెట్ల బంగారంతో కూడిన డైమండ్ జువెలరీతో పాటు 18 క్యారెట్ల స్వర్ణాభరణాల ఉత్పత్తులను అధికంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిసింది. "బంగారం ధరల అనూహ్య పెరుగుదలతో కొనుగోలుదారుల వైఖరిలోనూ గణనీయ మార్పులొచ్చాయి. వారిప్పుడు పసిడిని పెట్టుబడి సాధనంగా.. అధిక ధరల కాలంలో తమ ఆదా సొమ్ము విలువను పెంచే మార్గంగా చూస్తున్నార"ని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ అన్నారు. 14 క్యారెట్ల బంగారంతో కూడిన వజ్రాభరణానికి డిమాండ్ పెరగడానికి గోల్డ్ రేట్ల పెరుగుదలతో పాటు ఈ స్వచ్ఛత ఆభరణానికి మన్నిక ఎక్కువ కావడం కూడా మరో కారణమని అహమ్మద్ పేర్కొన్నారు. కాబట్టి రోజువారీగా ధరించేందుకూ పనికొస్తుందని అన్నారు.

18 క్యారెట్ల ఆభరణంలో 75 శాతం బంగారం ఉంటుంది. 14 క్యారెట్ల ఆభరణంలో ఈ వాటా 58 శాతం. అంటే, ఈ రెండింటి మధ్య స్వచ్ఛత వ్యత్యాసం 17 శాతం. కాబట్టి, బంగారం రేట్లు భారీగా పెరిగిన నేపథ్యంలోనూ 14 క్యారెట్ బంగారంతో తయారు చేసిన వజ్రాభరణాలను కస్టమర్లకు అందుబాటు ధరల్లో విక్రయించేందుకు వీలుంటుందని డబ్ల్యూహెచ్‌పీ జువెలర్స్ భాగస్వామి ఆదిత్య పేఠే అన్నారు. మన దేశంలో 22, 18తో పాటు 14 క్యారెట్ల బంగారం ఆభరణాలనూ హాల్‌మార్కింగ్ చేసుకునే వీలుంటుంది కాబట్టి వీటిని కొనుగోలు చేయడం వల్ల నష్టం ఉండదని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా తెలిపారు.

పబ్లిక్ ఇష్యూకి ప్రీమియర్ ఎనర్జీస్

రూ. 1,500 కోట్ల సమీకరణకు సన్నాహాలు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సోలార్ సెల్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ.1,500 కోట్ల విలువైన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్) ద్వారా ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 2.82 కోట్ల షేర్లను విక్రయించనున్నట్లు డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ పేర్కొంది. ఓఎఫ్‌ఎస్‌లో భాగంగా సౌత్ ఏషియా గ్రోత్ ఫండ్ 2 హోల్డింగ్స్ ఎల్‌ఎల్‌సీ 2.38 కోట్ల షేర్లు, సౌత్ ఏషియా ఈబీటీ ట్రస్ట్ 1.53 లక్షల ఈక్విటీ షేర్లు, ప్రమోటర్ చిరంజీవ్ సింగ్ సలూజా 43 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్‌లో భాగంగా కంపెనీ రూ.300 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఒకవేళ ప్రీ-ఐపీఓ ద్వారా నిధులు సమీకరిస్తే కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరించే మొత్తం రూ.1,168 కోట్లకు తగ్గనుంది. ఈ ఇష్యూకి కోటక్ మహీంద్రా క్యాపిటల్, జేపీ మోర్గాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

హైదరాబాద్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు: పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ అనుబంధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టడంతో పాటు 4గిగావాట్స్ సోలార్ పీవీ టాప్‌కాన్ (టన్నెల్ ఆక్సైడ్ ప్యాసివ్డ్ కాంట్రాక్ట్) ఏర్పాటుకు అవసరమైన నిధులు అందించటం సహా హైదరాబాద్ 4 గిగావాట్ల సోలార్ పీవీ టాప్‌కాన్ మాడ్యుల్ తయారీ కేంద్రం ఏర్పాటుకు వెచ్చించనుంది. మిగిలిన మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.

1995లో ఏర్పాటైన ప్రీమియర్ ఎనర్జీస్ సమీకృత సోలార్ సెల్, మాడ్యుల్ తయారీదారుగా ఉంది. ప్రస్తుతం కంపెనీ 2 గిగావాట్స్ సెల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో పాటు 3.36 గిగావాట్స్ మాడ్యుల్స్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అంతేకాకుండా ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ఈపీసీ సొల్యూషన్స్, ఓ అండ్ ఎం సర్వీసులను అందిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో మొత్తం ఐదు ప్లాంట్స్‌ను నిర్వహిస్తోంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.17,622 కోట్లు

ఒక్కో షేరుకు రూ.19.5 డివిడెండ్

ముంబై: మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో హెచ్‌డీఎఫ్ బ్యాంక్ ఏకీకృత నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన 2.11 శాతం పెరిగి రూ.17622.38 కోట్లకు చేరుకుంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో బ్యాంక్ లాభం రూ.17,257.87 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ4లో స్టాండ్‌ఎలోన్ నికర లాభం సైతం స్వల్ప పెరుగుదలతో రూ.16,511.85 కోట్లకు ఎగబాకింది. గత ఏడాది జూలైలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన మాతృసంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను తనలో విలీనం చేసుకుంది.

- క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.29,080 కోట్లకు , ఇతర ఆదాయం రూ.18,170 కోట్లకు చేరుకుంది. బ్యాంక్ మొత్తం ఆస్తులపై నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.44 శాతంగా నమోదైంది.
- డిసెంబరు 31 నాటికి 1.26 శాతంగా నమోదైన బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు ఈ మార్చి 31 నాటికి 1.24 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.31% నుంచి 0.33 శాతానికి పెరిగాయి.
- గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.19.5 డివిడెండ్‌ను ప్రకటించింది.
- గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ మొండి బకాయిలను పూడ్చుకోవడంతో పాటు ఇతర అవసరాల కోసం రూ.13,500 కోట్ల కేటాయింపులు జరిపింది.
- 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి బ్యాంక్ లాభం రూ.64,060 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.1,57,770 కోట్లకు పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ



హైదరాబాద్	390	విజయవాడ	397
వరంగల్	392	గోదావరి	397
చిత్తూరు	493	విశాఖపట్నం	411

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	131
వరంగల్	118	విజయవాడ	131
కరీంనగర్	118	గుంటూరు	131
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	131
కర్నూలు	118	చిత్తూరు	134
విశాఖపట్నం	118		


కొత్త మార్కెట్లపై గోద్రేజ్ జెర్సీ దృష్టి

రిటైల్ కార్యకలాపాల విస్తరణపై నజర్

హైదరాబాద్: గోద్రేజ్ జెర్సీ.. కొత్త మార్కెట్లలోకి కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. కంపెనీ రిటైల్ ఉత్పత్తులను మరింత మంది వినియోగదారులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో కార్యకలాపాలను విస్తరించాలని చూస్తున్నట్లు గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి తెలిపారు. ఇందులో భాగంగా దక్షిణాది రాష్ట్రాల్లోని గ్రామీణ మార్కెట్లపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్లు చెప్పారు. అంతేకాకుండా కంపెనీ పోర్టుఫోలియోలోని కొత్త ఉత్పత్తులతో పాటు మరికొన్నింటిని ఉత్తరాది రాష్ట్రాల్లో విడుదల చేయనున్నట్లు సూరి పేర్కొన్నారు.

రిటైల్ మార్కెట్లో కంపెనీ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో రూ.10 ధరతో కూడిన మిల్క్ షాట్స్‌తో పాటు వివిధ రకాలైన ఫ్లేవర్లతో కూడిన బాదం మిల్క్‌ను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. వాల్యూ యాడెడ్ విభాగంలో కొత్త ఉత్పత్తుల కోసం ఈ మధ్యనే కొత్త ఉత్పత్తి లైన్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారులకు మరింత చేరువ కావాలన్న యోచనతో వివిధ సైజులతో పాటు అందుబాటు ధరల్లో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు చెప్పారు. కాగా కంపెనీ దేశవ్యాప్తంగా రోజుకు 12-13 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుండగా అందులో 7.5 లీటర్ల వరకు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రోజుకు 2 లక్షల లీటర్ల వరకు విక్రయాలు చేపడుతున్నట్లు సూరి పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కంపెనీ మార్కెట్ వాటా 10-12 శాతంగా ఉందన్నారు. బాదం మిల్క్, పెరుగు ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని ఆయన తెలిపారు. కాగా నాలుగు రకాల్లో తీసుకువచ్చిన ఫ్లేవర్డ్ పెరుగుకు కూడా ఆదరణ లభిస్తోందన్నారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ అనుబంధ సంస్థ అయిన గోద్రేజ్ జెర్సీ హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది.





హ్యాపీ బర్త్ డే..

టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గుణదల మూడో డివిజన్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన వేడుకల్లో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు కేక్ కట్ చేశారు.

ఎట్టకేలకు వదిలారు

సీఎంపై గులకరాయి దాడి కేసులో రెండో నిందితుడికి విముక్తి

- వేముల దుర్గారావును వదిలిపెట్టిన పోలీసులు



విడుదల అనంతరం భార్య పిల్లలతో దుర్గారావు

విజయవాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి జగన్‌పై గులకరాయి విసిరిన కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న రెండో నిందితుడు వేముల దుర్గారావును శనివారం రాత్రి వదిలిపెట్టారు. దుర్గారావును మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ సీసీఎస్‌లో విచారించారు. కేసులో ఏ2 దుర్గారావేనని లీకులు కూడా ఇచ్చారు. ఈ దశలో అకస్మాత్తుగా అతనిని విడుదల చేయడం చర్చనీయాంశమైంది. దుర్గారావు ఆచూకీ చెప్పకపోతే హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేస్తానని న్యాయవాది అబ్దుస్ సలీం వెల్లడించిన కొద్దిగంటలకే ఈ విడుదల జరిగింది. దుర్గారావును.. విచారణ సమయంలో దాడి ఎవరు చేయమన్నారని పోలీసులు పదేపదే ప్రశ్నించినట్టు తెలిసింది. దుర్గారావు సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. కొద్దిరోజుల క్రితం వరకు జనసేనలో తిరిగిన అతడు కూటమి ఏర్పడ్డాక టీడీపీలో చేరాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న వేముల సతీష్‌కుమార్ తన పేరు చెప్పాడని, దాంతో పోలీసులు తనను విచారించారని దుర్గారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. అయితే ఈ దాడితో తనకు ఎటువంటి సంబంధం లేదని చెప్పడంతో పోలీసులు విడిచిపెట్టారని పేర్కొన్నాడు. తదుపరి విచారణలో తన పాత్ర ఉన్నట్టు ఆధారాలు లభిస్తే అరెస్టు చేస్తామని చెప్పి తన తల్లిదండ్రులతో సంతకాలు తీసుకున్నారని వివరించాడు.

ఉపాధ్యాయుడే కీచకుడు



ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

- మండల విద్యాశాఖాధికారి విచారణ
- ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బంటుమిల్లి మండలంలో ఘటన

బంటుమిల్లి, ఏప్రిల్ 20 : అభం శుభం తెలియని ఎనిమిదేళ్ల చిన్నారిపై ఉపాధ్యాయుడే లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న చిన్నారిపై అదే పాఠశాలలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు బి.రామానందసాగర్ (46) పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లిన చిన్నారి కొద్దిసేపటికే ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు కుమార్తెను ఆరా తీయగా, విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి రామానందసాగర్‌ను నిలదీశారు. సమాచారం అందడంతో మండల విద్యాశాఖ అధికారి-2 విచారణ చేపట్టారు. అనంతరం రామానందసాగర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో తాహెరా సుల్తానా ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడ్ని అరెస్టు చేసినట్లు సమాచారం.



నదులు.. అభివృద్ధికి నిధులు. ఎక్కడైతే జల సంపద సంవృద్ధిగా ముందుకు పారుతుందో.. అక్కడ జనజీవనం ఆటుపోట్లు లేకుండా ముందుకు సాగుతుంది. కానీ, ఐదేళ్ల వైసీపీ పాలనలో జల వనరులను సృష్టించిందీ లేదు.. ఉన్న వాటిని ఉపయోగించిందీ లేదు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలే పట్టిసీమ, వేదాద్రి ఎత్తిపోతల పథకాలు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు కృష్ణాడెల్టాకు సకాలంలో నీరందించాలన్న టీడీపీ ప్రభుత్వం రూ.కోట్లతో పట్టిసీమ ప్రాజెక్టును చేపడితే, ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని వట్టిసీమగా మార్చింది. ఇక.. జగ్గయ్యపేట వాసుల చిరకాల స్వప్నం వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని శంకుస్థాపనతో చేతులు దులిపేసి ఉత్తిపోతలు చేసింది. ఫలితంగా నిత్యం బంగారు పంటలతో కళకళలాడాల్సిన కృష్ణాడెల్టా నేడు బీడుగా మారే పరిస్థితికి వైసీపీ ప్రభుత్వమే తీసుకొచ్చింది.

- (ఆంధ్రజ్యోతి-విజయవాడ/జి.కొండూరు/జగ్గయ్యపేట రూరల్)

సుజలం.. విఫలం..

టీడీపీ హయాంలో పట్టిసీమ పరవళ్లు.. (ఇన్‌సెట్‌లో) వేదాద్రి ఎత్తిపోతలు నిర్మిస్తామని చెప్పిన ప్రాంతంలో పిచ్చి మొక్కలు

వట్టిసీమగా మారిన పట్టిసీమ.. / ఉత్తిపోతలుగా వేదాద్రి ఎత్తిపోతలు

- టీడీపీ హయాంలో నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టు
- కృష్ణా, గోదావరి నదుల అపూర్వ సంగమం
- కృష్ణాడెల్టా రైతులకు చంద్రబాబు ఇచ్చిన వరం
- నాలుగేళ్లలో రూ.44 వేల కోట్ల విలువైన పంటలు
- వైసీపీ వచ్చాక నిరుపయోగంగా ప్రాజెక్టులు
- ఐదేళ్లలో ఒక్కసారే పట్టిసీమ పంపింగ్
- కృష్ణాడెల్టాకు సాగునీరు అందని దుస్థితి
- వేదాద్రి ఎత్తిపోతలకు శంకుస్థాపనతో సరి
- తండ్రి పేరు పెట్టుకున్నా పూర్తిచేయని జగన్

టీడీపీ హయాంలో పట్టిసీమ

కృష్ణానది ఎప్పుడు నీటితో పరవళ్లు తొక్కుతుందో అంతుబట్టదు. గోదావరి మాత్రం ఏడాది పొడవునా ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ రెండు నదులను అనుసంధానిస్తూ పట్టిసీమ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు టీడీపీ అధినేత చంద్రబాబు. వర్షాలు ఆలస్యమైతే కృష్ణాడెల్టాలో జూన్‌లో ప్రారంభం కావాల్సిన వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయి, ఆగస్టు, సెప్టెంబరులో ప్రకృతి వైపరీత్యాలు వస్తే పంటలన్నీ నీటిపాలవుతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చి ప్రకృతి వైపరీత్యాలు రావడానికి ముందే రైతుల చేతికి పంట అందేలా చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వం భావించింది. రాష్ట్ర విభజనతో తీరని నష్టాల్లో ఉన్నా రైతులకు మంచి జరగాలని చంద్రబాబు పట్టిసీమ ప్రాజెక్టును నిర్మించారు. గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా పరవళ్లు తొక్కించి కృష్ణాలోకి తీసుకొచ్చారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో సంబంధం లేకుండా ప్రకాశం బ్యారేజీ ఆయకట్టు రైతులకు జూన్‌లోనే సాగునీటిని ఇచ్చారు. 2015, మార్చి 29న అప్పటి సీఎంగా చంద్రబాబు పట్టిసీమ నిర్మాణానికి శ్రీకారం చుట్టి 11 నెలల్లో పూర్తిచేశారు. నిర్మాణ వేగంలో ఆసియాలోనే మొదటి స్థానంలో నిలిచి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించింది ఈ ప్రాజెక్టు. శంకుస్థాపన చేసిన ఆరు నెలల్లో తొలిపంపును పని చేయించారు. 24 పంపులతో రూ.1,360 కోట్ల ఖర్చుతో ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేశారు. ప్రారంభం నుంచి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని వేల కోట్ల రూపాయల సంపదను సృష్టించిన ప్రాజెక్టు ఇది. గోదావరి జలాల రాకతో నాలుగు జిల్లాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు సాగునీరు అందించడమే కాకుండా ప్రకాశం జిల్లా పర్చూరు వరకు గోదావరి జలాలు తరలివెళ్లాయి. కొమ్మూరు కాల్వకు కొత్తకళ వచ్చింది. తాత్కాలిక ప్రాతిపదికన నిర్మించినా పోలవరం కుడికాల్వ ద్వారా ఏడాదికి 80 టీఎంసీలను పట్టిసీమ ద్వారా తీసుకోవచ్చు. గోదావరి జలాల రాకతో వరి దిగుబడులు గణనీయంగా పెరిగాయి. అప్పటి వరకు ఎకరాకు 40 బస్తాలు పండేవి. పశ్చిమగోదావరి జిల్లాలోని కాల్వ వెంట ఉన్న నల్లజర్ల, దేవరాపల్లి, విజయరాయి, దెందులూరు, నూజివీడు, గన్నవరాల్లో మూడో పంటను సైతం సాగుచేసి లాభాల బాట పట్టారు. ప్రకాశం బ్యారేజీ ద్వారా గుంటూరు చానల్ మీదుగా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ పట్టిసీమ నీరు సిరులు పండించింది. నాలుగేళ్లలో సుమారు రూ.44 కోట్ల విలువైన పంట రైతుల చేతికందింది.

వేదాద్రికి దారేదీ..?

జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో కృష్ణానదిపై రూ.489 కోట్ల అంచనాతో చేపట్టిన వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పథకం వైసీపీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఈ పథకానికి 2020, ఆగస్టు 28న ఆన్‌లైన్ విధానంలో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని, 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామని అప్పట్లో సీఎం ప్రకటించారు. ఈ ఎత్తిపోతల పూర్తయితే జగ్గయ్యపేట మండలంలోని 8 గ్రామాలు, వత్సవాయి మండలంలోని 10 గ్రామాలు, పెనుగంచిప్రోలు మండలంలోని 10 గ్రామాల్లో సుమారు 39 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సుమారు 39 వేల ఎకరాలకు సాగునీరుతో పాటు డీబీఆర్ బ్రాంచి కాల్వ పరిధిలోని 30 గ్రామాలకు, వాటితో పాటు జగ్గయ్యపేట మున్సిపాలిటీకి కూడా ఈ ఎత్తిపోతల ద్వారా తాగునీరు అందాల్సి ఉంది. సుమారు 2.7 టీఎంసీల నీటిని సాగు, తాగునీటి అవసరాలకు అందించాల్సి ఉంది. ఈ ఎత్తిపోతల పనులను చేపట్టిన కాంట్రాక్టు సంస్థ నిధుల లేమితో 30 శాతం పనులు పూర్తిచేసి చేతులెత్తేసింది.

వైసీపీ వచ్చాక వట్టిసీమ

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టిసీమను పూర్తిగా పక్కనపెట్టింది. ఐదేళ్ల కాలంలో 2023లో మాత్రమే పట్టిసీమ నుంచి కృష్ణాలోకి నీటిని తీసుకొచ్చింది. అభివృద్ధి చేసిందీ శూన్యమే..

రివర్స్ టెండరింగ్‌తో ఎసరు..!

వాస్తవానికి వేదాద్రి ఎత్తిపోతల పథక నిర్మాణానికి టీడీపీనే శ్రీకారం చుట్టింది. జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల వద్ద ముక్త్యాల ఎత్తిపోతల పథకం పేరుతో అప్పటి సీఎం చంద్రబాబు 2019, ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. రూ.489 కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. పనులు ప్రారంభమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ.. సాగునీటి ప్రాజెక్టుల్లో భారీగా అక్రమాలు జరిగాయని 15 నెలల పాటు పనులను నిలిపివేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో హడావిడి చేసింది. ముక్త్యాల వద్ద నిర్మించాల్సిన ఈ పథకాన్ని సుమారు 8 కిలోమీటర్ల దిగువన ఉన్న వేదాద్రికి మార్చింది. వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పథకం పేరుతో ప్రాజెక్టుకు ఓకే చెప్పింది. రివర్స్ టెండరింగ్‌తో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.489 కోట్ల నుంచి రూ.369 కోట్లకు తగ్గించామని గొప్పలు చెప్పుకొంది. శంకుస్థాపన సమయానికి ప్రాజెక్టు వ్యయాన్ని తిరిగి రూ.489 కోట్లుగానే పేర్కొంటూ సీఎం జగన్ శిలాఫలకాన్ని వర్చువల్ విధానంలో ఆవిష్కరించడం కొసమెరుపు.


గన్నవరం.. గరంగరం

ఈనెల 25న అనుమతి కోరుతూ ఇద్దరూ దరఖాస్తు

- ర్యాలీకి కూడా అనుమతి కావాలని విజ్ఞప్తి
- శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయన్న రిటర్నింగ్ అధికారి
- తొలుత తానే దరఖాస్తు చేసుకున్నానంటున్న యార్లగడ్డ వెంకట్రావు
- వంశీవి కవ్వింపు చర్యలని టీడీపీ శ్రేణుల మండిపాటు

యార్లగడ్డ వెంకట్రావు, వంశీ మధ్య నామినేషన్ రగడ

గన్నవరంలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల సునామీని జీర్ణించుకోలేని వంశీ వర్గం ప్రత్యర్థులపై కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఇందులో భాగంగా టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ వేసేందుకు సిద్ధమైన రోజే తామూ నామినేషన్ వేసేందుకు వంశీ దరఖాస్తు చేసుకోవడం వివాదంగా మారింది.



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు ఈనెల 25న నామినేషన్ వేస్తానని ఎప్పటి నుంచో ప్రచారం చేసుకుంటున్నారు. అందులో భాగంగా గన్నవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యర్థిని ప్రజల్లో తక్కువ చేసి చూపించేలా డ్రామాలు ఆడటం.. తన ఆధిపత్యాన్ని చాటుకునేలా మైండ్‌గేమ్ ఆడటం తొలి నుంచీ వంశీకి వెన్నతో పెట్టిన విద్య. అందులో భాగంగా యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ వేసే రోజే తానూ నామినేషన్ వేస్తానని వంశీ కూడా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకున్నారు. పైగా ఇద్దరూ 25న నామినేషన్ రోజు ఒకే సమయానికి ర్యాలీలు నిర్వహించుకునేందుకు అనుమతి కూడా కోరారు. ఇద్దరి దరఖాస్తులను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతి నిరాకరించారు. ఈ మేరకు అభ్యర్థులిద్దరికీ రిటర్నింగ్ అధికారి మెయిల్ పంపారు. 24న ఒకరు.. 25న మరొకరు నామినేషన్ వేసుకోవాలని సూచించారు. అయితే, ఈ సూచనకు ఇద్దరూ ససేమిరా అంటున్నారు. దీంతో 25న వేర్వేరు సమయాల్లో నామినేషన్ వేసుకునేందుకు ఉన్న అవకాశాలను రిటర్నింగ్ అధికారి పోలీసులతో చర్చిస్తున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసుకుంటామని పోలీసుల నుంచి హామీ వస్తే, అదేరోజు వేర్వేరు సమయాల్లో నామినేషన్లు వేసుకునేందుకు అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఓటమి భయంతో కవ్వింపు చర్యలు

వైసీపీ అభ్యర్థి వంశీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే నామినేషన్ పేరుతో కవ్వింపు చర్యలకు దిగుతున్నారని టీడీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. ప్రతి ఎన్నికల్లోనూ వంశీ ఇలాంటి మైండ్‌గేమే ఆడుతుంటారని వారు ఆరోపిస్తున్నారు. తాను ప్రత్యర్థికన్నా బలవంతుడినని బిల్డప్ ఇచ్చుకునే క్రమంలో ఇలాంటి చిల్లర వ్యవహారాలు చేస్తుంటాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలోనూ అప్పటి వైసీపీ అభ్యర్థి అయిన యార్లగడ్డ వెంకట్రావు ఇంటి వద్దకు వెళ్లి కారులో కూర్చుని, ఫోన్‌చేసి బయటకు రమ్మనడం, కొద్దిరోజుల క్రితం ఎనికేపాడులో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలు, నాయకులపై చేస్తున్న దాడులకు నిరసనగా యార్లగడ్డ వెంకట్రావు దీక్ష చేస్తే ఆ శిబిరం వద్దకు వచ్చి కవ్వింపు చర్యలకు దిగడం వంటి విషయాలను వారు గుర్తు చేస్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ నుంచి భారీ ఎత్తున టీడీపీలోకి వలసలు జరుగుతున్నాయి. కేడర్ ఖాళీ అవుతుండంతో వంశీ తీవ్ర అసహనానికి గురవుతున్నారని సొంత పార్టీ వారే చెబుతున్నారు. దీంతో సొంత పార్టీ కార్యకర్తలను కాపాడుకునేందుకు ఆయన ఇలాంటి చిల్లర వ్యవహారాలకు దిగుతున్నారని, వీటివల్ల పార్టీ ఇమేజ్ మరింత డ్యామేజ్ కావడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని వైసీపీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

మూడోరోజూ ఉత్సాహంగా..

ఎన్టీఆర్‌లో 23, కృష్ణాలో 13 నామినేషన్లు దాఖలు

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మూడోరోజు శనివారం పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 23 మంది నామినేషన్లు వేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకరు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 22 మంది నామినేషన్లు వేశారు. టీడీపీ తరఫున ఒకటి, వైసీపీ తరఫున ఒకటి నామినేషన్లు పడ్డాయి. మిగిలిన 21 నామినేషన్లు ఇతర పార్టీలకు చెందినవారు, స్వతంత్రులవే.

నామినేషన్లు ఇలా..

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా మద్దినేని అనిల్‌కుమార్ నామినేషన్ సమర్పించారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా పరసా సురేష్ కుమార్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా జగదీష్ రామచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నక్కల సాయిబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా బొబ్బిలి లక్ష్మి, షేక్ రబ్బాని నామినేషన్ వేశారు. సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కొణిజేటి ఆదినారాయణ, మన్నం రాజశేఖర్, బొప్పన గాంధీ నామినేషన్ వేశారు. టీడీపీ తరఫున బొండా ఉమామహేశ్వరరావు, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీకి చెందిన ఎల్.హిమవద్వతి, నేషనల్ పార్టీకి చెందిన శ్రీధర దక్షిణామూర్తి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మలపోగు ప్రశాంత్‌కుమార్ నామినేషన్లు వేశారు. విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున గొట్టూరి శివనాగలక్ష్మి, జై భారత్ నేషనల్ పార్టీకి చెందిన యనమల మురళీకృష్ణనాయుడు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జల్లి అనిల్ కుమార్ నామినేషన్ సమర్పించారు. మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు అభ్యర్థులు.. వైసీపీ తరఫున సర్నాల తిరుపతిరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడిన రాంబాబు, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థిగా చింతమల నవీన్ అంబేడ్కర్ నామినేషన్ వేశారు. నందిగామ అసెంబ్లీ పరిధిలో జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా బెజవాడ గోపీ, తిరువూరు అసెంబ్లీ పరిధిలో బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా లక్కెపోగు మందన్‌కుమార్, గంగవరపు శామ్యూల్ దేవసహాయం, స్వతంత్ర అభ్యర్థిగా లాము ప్రసన్న కుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

కృష్ణాజిల్లాలో..

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి శనివారం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం సెలవు కావడంతో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉండదు. దీంతో సోమవారం అత్యధికంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి అంబళ్ల రాజ్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గన్నవరం అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్, ఆయన సతీమణి పంకజశ్రీ నామినేషన్ వేశారు. గన్నవరంలో మరో రెండు, గుడివాడలో ఒకటి, పెడనలో ఒకటి, మచిలీపట్నం రెండు, పామర్రులో ఒకటి, పెనమలూరులో ఒకటి నామినేషన్లు పడ్డాయి.



మద్యం దుకాణం వద్దే తాగేస్తున్న వైసీపీ కార్యకర్తలు

ఫుల్లుగా..

- మైలవరం వైసీపీ అభ్యర్థి నామినేషన్‌లో కిక్కేకిక్కు
- వైసీపీ కార్యాలయాల్లా స్థానిక వైన్‌షాపులు

మైలవరం, ఏప్రిల్ 20 : మైలవరం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు నామినేషన్ ర్యాలీలో మద్యం ఏరులై పారింది. తిరుపతిరావు శనివారం నామినేషన్ దాఖలు చేయగా, పార్టీ శ్రేణులు జన సమీకరణకు కష్టపడాల్సి వచ్చింది. మద్యం, మనీ ఇస్తే గానీ వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఒక్కో మోటార్ బైకుకు పెట్రోల్, ఒక్కో మనిషికి రూ.200, ఆటోకైతే డీజిల్ ఖర్చులు, మనిషికి రూ.200 ఇచ్చారు. ఇబ్రహీంపట్నం నుంచి మైలవరం వరకు ర్యాలీ సాగగా, మధ్యలో ఉన్న వైన్ షాపులు కార్యకర్తలతో ఫుల్ అయిపోయాయి. మైలవరంలోని వైన్‌షాపు అయితే, వైసీపీ కార్యాలయాన్ని తలపించింది. ఏ కార్యకర్త చేతిలో చూసినా ఫుల్ బాటిళ్లు, బీరు బాటిళ్లు దర్శనమిచ్చాయి. మద్యం కొనుక్కున్న వైసీపీ కార్యకర్తలు అక్కడే తాగేశారు. మత్తులో హైస్పీడ్‌తో మోటార్ బైక్‌లు నడిపి హడలెత్తించారు.

మైలవరం వైన్‌షాపు వద్ద వైసీపీ కార్యకర్తల సందడి




స్వామి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవిశంకర్ దంపతులు

సుబ్బారాయుడి సేవలో హైకోర్టు జడ్జి

మోపిదేవి, ఏప్రిల్ 20 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవిశంకర్ దంపతులు శనివారం ఉదయం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు రవిశంకర్ దంపతులకు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డి.హేమంత్, అశోక్‌లు రూ.1,00,001 విరాళం అందజేశారు. శనివారం ఉదయం వారు కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.


చంద్రబాబు జన్మదిన కేక్ కట్ చేస్తున్న కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్

రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబు రావాలి

» కేశినేని శివనాథ్

భారతీనగర్, ఏప్రిల్ 20 : వైసీపీ పాలనలో జగన్ ఐదేళ్ల కాలంలో గాడి తప్పిన ఏపీని తిరిగి గాడిలో పెట్టాలంటే చంద్రబాబునాయుడు రావాల్సిందేనని కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ తూర్పునియోజకవర్గం 3వ డివిజన్‌లోని స్థానిక అపార్ట్‌మెంట్ నివాసితులతో శనివారం ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కేశినేని చిన్ని, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ హాజరయ్యారు. అనంతరం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నేత అమ్మిశెట్టి వాసుతో కలిసి కేశినేని చిన్ని కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబుకు ముఖ్యమంత్రి పదవి కొత్త కాదని, ప్రస్తుతం గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జగన్‌ను ఇంటికి పంపించే సమయం దగ్గర పడిందని, ఇందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, తెలుగుదేశం సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, యలమంచిలి రాజేంద్రప్రసాద్, గుత్తికొండ కృష్ణమోహన్, తెలుగుమహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.


ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న ఆచంట సునీత తదితరులు

డ్వాక్రా మహిళలకు బెదిరింపులపై ఈసీకి ఫిర్యాదు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 20 : వైసీపీ నిర్వహిస్తున్న సిద్ధం సభలకు హాజరు కాకపోతే సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని డ్వాక్రా మహిళలను వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని రాష్ట్ర తెలుగునాడు, డ్వాక్రా సాధికార సమితి అధ్యక్షురాలు ఆచంట సునీత ఎన్నికల అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వరరావును శనివారం రాత్రి కలిసి ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేతలు బెదిరింపుల వల్ల ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా కనిపించటం లేదని, ఇలాంటి దుశ్చర్యలను నియంత్రించాలని ఆమె కోరారు. వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తల్లిపై కొడుకు హత్యాయత్నం.. తీవ్ర గాయాలు

నందిగామ రూరల్, ఏప్రిల్ 20 : ఆస్తి పంపకాల విషయంలో నిరాకరించిన తల్లిపై కొడుకు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని ఐతవరం గ్రామంలో చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మాగంటి ఉమామహేశ్వరి గ్రామంలో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నది. ఆమె కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు నరేష్ చెడు అలవాట్లకు బానిసై ఆస్తి పంచమని తల్లితో గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తల్లి ఉమామహేశ్వరిపై కత్తితో దాడి చేయటంతో తీవ్రంగా గాయపడిన ఆమెను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా శుభం నోఖ్వాల్

వన్‌టౌన్, ఏప్రిల్ 20 : ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా శుభం నోఖ్వాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తర్వాత ఆయన కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లపై ఢిల్లీరావును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, బహుళ ప్రయోజన కమాండ్ కంట్రోల్ రూమ్ కార్యకలాపాలు, ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, రిపోర్టింగ్ నిర్వహణ వ్యవస్థ, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్‌పై శుభం నోఖ్వాల్‌కు ఢిల్లీరావు వివరించారు.

వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరిక

గుడివాడ : ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో 18వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో టీడీపీలో చేరారు. జి.శివశంకరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, ఎం.శివ భోగి సుధాకరరావు, ఎ.హరిబాబు, కె.వెంకటేశ్వరరావు, వెంకటరత్నం, పి.రమేష్, ఎస్.రామారావు, జి.వెంకటేష్, కె.త్రినాథ్‌కుమార్, బి.నాంచారయ్య, ఎం.శ్రీనివాసరావు, డి.చిన్నా, బి.రంగా, బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, ఎస్.సుబ్బయ్య, ఎం.వేణు, ఎం.తిరుమల, కె.వెంకటేష్, ఎ.బాబు, ఎస్.శ్రీనివాసరావు, టి.నారాయణ, టి.నాగేశ్వరరావు, ఎ.చంటి, వి.హేమ వెంకటరావు, రవి హేమంత్, జి.రామకృష్ణ, జి.కిరణ్‌కుమార్, రమేష్, ఎస్.బుజ్జి తదితరులు టీడీపీలో చేరినవారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, దింట్యాల రాంబాబు, యలవర్తి శ్రీనివాసరావు, అల్లాడ శ్రీనివాస్, మానం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

» కూటమి అభ్యర్థుల ఆత్మీయ సమావేశాలు
» ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు
» పలుచోట్ల వైసీపీని వీడి టీడీపీలో చేరికలు


కొండపల్లి శాంతినగర్‌లో చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న వసంత వెంకట కృష్ణ ప్రసాద్

జి.కొండూరు/మైలవరం/రెడ్డిగూడెం, ఏప్రిల్ 20 : ఏపీకి చంద్రబాబు నాయుడు అవసరం ఎంతో ఉందని, బాబు సీఎం అయితేనే రాష్ట్రం గాడిలో పడుతుందని మైలవరం కూటమి టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరం, రెడ్డిగూడెంలలో శనివారం రాత్రి ఆయన చంద్రబాబు జన్మదిన కేక్‌లు కట్‌చేసి పంచారు. అనంతరం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈనెల 22న జరిగే నామినేషన్ పర్వాన్ని విజయవంతం చేయాలని కోరారు. అందరూ ఐక్యంగా పనిచేసి రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ పాలంకి మోహన్ మురళీ రెడ్డి, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు, ఉయ్యూరు అంజిరెడ్డి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, చేబ్రోలు రాజు తదితరులు పాల్గొన్నారు.

● వెల్లటూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత మల


సైకిల్ ర్యాలీలో వెనిగండ్ల, రావి తదితరులు

రాజు నారాయణ టీడీపీలో చేరారు. ఇబ్రహీంపట్నంకు చెందిన మోపిదేవి చంటి, నడకుదిటి హరి, నడకుదిటి నరసింహారావు, శ్రీనివాసరావు, కాలేశ్వరరావు, హర్షవర్ధన్ తదితరులు వసంత సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. జంపాల సీతారామయ్య ఉయ్యూరు వెంకట నరసింహారావు, కె.విజయ్‌బాబు, నెల్లూరు లీలా శ్రీనివాసరావు, పచ్చిగోళ్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి..

ఇబ్రహీంపట్నం : రాష్ట్ర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొండపల్లి శాంతినగర్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం చంద్రబాబు నాయుడు జన్మదినం కేక్‌ను కట్ చేసి పంచారు. పలు చర్చిల్లో, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సూపర్‌సిక్స్ పథకాల బ్రోచర్లను ఇంటింటికీ పంచి తనతో పాటు విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది చంద్రబాబే : వెనిగండ్ల

గుడివాడ : వెంటిలేటర్‌పైన ఉన్న రాష్ట్రాన్ని బతికించేది చంద్రబాబు మాత్రమేనని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శనివారం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఏలూరురోడ్డులోని పార్టీ కార్యాలయం వరకు ఆధ్వర్యంలో 400 మంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత వెనిగండ్ల రాము, ఆయన సతీమణి సుకదా, కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జీలతో కలిసి కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. గుట్కా నానికి చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. ర్యాలీలో పట్టణ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

వైసీపీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో 18వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు వెనిగండ్ల రాము సమక్షంలో టీడీపీలో చేరారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రజావేదికకు తరలివచ్చారు.

నందిగామలో టీడీపీ బలోపేతం

నందిగామ, ఏప్రిల్ 20 : భారీగా చేరికలతో నందిగామ టీడీపీ బలపడుతోంది. కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైసీపీ, కాంగ్రెస్‌ల నుంచి భారీగా టీడీపీలో చేరారు. చందర్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కురగంటి ధర్మారావు ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కురగంటి జ్యోతి, కురగంటి శ్రీరామమూర్తి, కురగంటి రాజారావు, కురగంటి సురేష్, రాజశేఖర్, బాలస్వామి, కస్తాల కిరణ్, కూరగంటి రాజీవ్‌గాంధీలు టీడీపీలో చేరారు. పట్టణానికి చెందిన టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, చేతివృత్తుల సంఘాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించిన చిన్ని, సౌమ్యలు మాట్లాడుతూ, ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. దేశం నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, బొందలపాటి రామలింగేశ్వరరావు, కూనపనేని ప్రసాద్, ముక్కపాటి నరసింహారావు, వెంకటేశ్వరరావు, ఏచూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణానికి చెందిన ఏడు, తొమ్మిది వార్డులకు చెందిన ఆటో వర్కర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు ఆయా వార్డులకు చెందిన వారు మండవ పిచ్చయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

నియంత పాలనకు స్వస్తి చెబుదాం

వల్లభనేని బాలశౌరి, కొల్లు రవీంద్ర


పాదయాత్ర చేస్తున్న బాలశౌరి, కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 20 : రాష్ట్రాన్ని పాలించే సత్తా ఎన్డీఏ కూటమికే ఉందని, నియంత పాలనకు స్వస్తి పలకాలని ఎంపీ, మచిలీపట్నం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి పిలుపునిచ్చారు. శనివారం పెదయాదరలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా నాగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి బాలశౌరి, మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్రలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యాన్ని మంటగలిపారన్నారు. దళితులకు అందాల్సిన 27 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, బ్రాహ్మణ కార్పొరేషన్ల నిధులను దారి మళ్లించారన్నారు. సబ్సిడీ రుణాలు రాక ఆర్థికంగా దెబ్బతిన్నారన్నారు. దళితుల హక్కులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. జగ్జీవన్‌రామ్, జ్యోతీరావుఫూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ వంటి సమతావాదులు పుట్టిన ఏప్రిల్ నెలలోనే చంద్రబాబు పుట్టారన్నారు. నేటి తరానికి ఉత్తమ జీవితం, రేపటి తరాలకు బంగారు భవిష్యత్తు కల్పించే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. రవీంద్ర మాట్లాడుతూ, ఉజ్వల భవిష్యత్తును ఆశించే యువతకు చంద్రబాబు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ, గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, కుంచే నాని, తలారి సోమశేఖర్, గల్లా తిమోతి, కొట్టె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఇంటింటికీ కుళాయి.. రోడ్లు బాగుచేస్తాం

వైసీపీ పాలనలో గ్రామాల్లో రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని, కాలువలు వదిలినా ఇంకా గ్రామాల్లో చెరువులు నిండలేదని బాలశౌరి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పెదయాదరలో కూటమి నేతలు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి రాగానే రోడ్లు వేయిస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పంపిన 14, 15 ఆర్థిక సంఘ నిధులను జగన్‌రెడ్డి తమ ఎకౌంట్‌లోకి డైవర్ట్ చేశారని, సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లా మారారన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలకులు గ్రామాలను పట్టించుకోలేదన్నారు. పెదయాదర గ్రామసర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీ నిధులు దారి మళ్లించడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పాదయాత్రలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవకు చిరునామా చిరంజీవి

» మెగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఏప్రిల్ 20 : అభిమాన సంఘాలను సేవా కార్యక్రమాల వైపు మళ్లించిన ఘనత ఒక్క చిరంజీవికే దక్కుతుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో మెగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో బుద్ధప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా తనకు ఎన్నికల్లో మద్దతిచ్చేందుకు వచ్చిన అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రమణం స్వామినాయుడుకు బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం చిరంజీవి యువత తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీల మద్దతుతో కృషి చేయాలని కోరారు. పవన్ ఆలోచనలకు అనుగుణంగా రానున్న రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా వల్లభనేని బాలశౌరిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రమణం స్వామినాయుడు మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి అత్యంత ఇష్టపడే నేతల్లో మండలి బుద్ధప్రసాద్ ముఖ్యులని, బుద్ధప్రసాద్ గెలుపు కోసం కృషి చేయాలని నాగేంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలో పనిచేసేందుకు ముందుకు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత నేతలు, జనసేన పార్టీ ముఖ్య నేతలు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


మెగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

వైసీపీ నుంచి టీడీపీలోకి 200 మంది..

నాగాయలంక : మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు 200 మంది శనివారం నాగాయలంక శుభమస్తు కళ్యాణ మండపంలో జరి


టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతిస్తున్న కొనకళ్ల తదితరులు

గిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మన్ దివంగత సైకం అర్జునరావు మనమడు సైకం దినేశ్ ఆధ్వర్యంలో ఎదురుమొండి, సొర్లగొంది, నాచుగుంట గ్రామాల నుంచి 120 మంది వైసీపీ కార్యకర్తలు, కమ్మనమోలు గ్రామం నుంచి చింతా శంకరరావు నేతృత్వంలో 50 మంది, ఇదే గ్రామం నుంచి కూరాకుల పంచనాథం ఆధ్వర్యంలో 30 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, జగన్ పాలనా విధానాలు ఏ వర్గానికి నచ్చకపోవటంతో ఆ పార్టీలోని ముఖ్యనేతలు, కార్యకర్తలు టీడీపీ, జనసేనలోకి వలసపోతున్నారన్నారు. కార్యక్రమంలో మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, ఉప్పల ప్రసాద్, ఆరు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు.

కారులో వచ్చి కన్పించకుండా పోయాడు!

» సెటిల్‌మెంట్ అని జగ్గయ్యపేటకు..
» పోలీసులకు సవాల్‌గా మారిన సూర్యాపేట కాంగ్రెస్ నేత కేసు
» రెండు రాష్ట్రాల నుంచి ఆరు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 20 : సెటిల్‌మెంట్ అని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు వచ్చిన తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం బాలెం గ్రామానికి చెందిన సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె ఎల్లయ్య(55) అదృశ్యం మిస్టరీగా మారింది. మూడు రోజుల క్రితం గురువారం కోదాడకు చెందిన స్నేహితుడితో కలిసి జగ్గయ్యపేటకు కారులో వచ్చిన ఆయన కనిపించకుండా పోవటంతో శుక్రవారం ఎల్లయ్య సోదరుడు సూర్యాపేట, జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ అనే మహిళకు శ్రీనివాస్ అనే వ్యక్తికి మధ్య వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదంలో మధ్యవర్తిత్వం కోసం కోదాడకు చెందిన అంజయ్య అనే స్నేహితుడితో కలిసి కారులో


కాంగ్రెస్ నేత వచ్చినట్టు చెబుతున్న కారు ఇదే

ఎల్లయ్య జగ్గయ్యపేటకు వచ్చాడు. శ్రీనివాస్ జగ్గయ్యపేటలో మాట్లాడుకుందామని చెప్పటంతో వారంతా ఇక్కడకు వచ్చినట్టు ఎల్లయ్య సోదరుడు సతీష్ చెబుతున్నాడు. వారంతా జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డులో మాట్లాడుకున్నాక, డబ్బులు ఇస్తానని శ్రీనివాస్ ఎల్లయ్యను తీసుకుని వెళ్లడం, ఆ తర్వాత అపర్ణ వాష్‌రూమ్‌కు అని చెప్పి వెళ్లడం, వెళ్లినవారు తిరిగి రాకపోవడం, వారి మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ కావటంతో అంజయ్య సూర్యాపేటలోని స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో ఎల్లయ్య సోదరుడు సూర్యాపేట, జగ్గయ్యపేటలలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగ్గయ్యపేట సమీపంలో ఒక చోట వీరు సమావేశమైనట్టు చెప్పిన ప్రాంతాన్ని రెండు జిల్లాల పోలీసులు పరిశీలించారు. జగ్గయ్యపేట, సూర్యాపేటకు చెందిన పోలీసులతో ఆరు బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

పథకం ప్రకారమే చేశారా..?

అదృశ్యమైన కాంగ్రెస్ నేత ఎల్లయ్యపై అనేక కేసులు ఉండటంతో ఆయన ప్రత్యర్థులు పథకం ప్రకారం సెటిల్‌మెంట్‌కు అని తీసుకువచ్చి ఏదైనా చేశారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీనివాస్ జగ్గయ్యపేటకు చెందినట్టు చెబుతున్నా.. ఇక్కడి వ్యక్తి కాదని, పేరు కూడా మార్చి చెప్పి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొబైల్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అక్కడ అధికార పార్టీ నేత కావటంతో పోలీసులు మరింత సవాల్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాంను వివరణ కోరగా ఎల్లయ్య సోదరుడు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని, ప్రత్యేక దర్యాప్తు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని తెలిపారు.



ఎట్టకేలకు తొలగించారు



గుడివాడ : 'నిబంధనల బేఖాతరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులోని వైసీపీ ఎన్నికల కార్యాలయం పక్కన, స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కోదండరామాలయంలో ఏర్పాటు చేసిన బ్యానర్లు తొలగించారు.

సరిహద్దులు దాటించేస్తున్నారు!

» మినుములు అక్రమ రవాణా
» ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారుల గండి
» పట్టించుకోని అధికారులు

ఉయ్యూరు, ఏప్రిల్ 20 : కృష్ణా జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు మినుములు పెద్దఎత్తున్న అక్రమంగా ఎగుమతి చేస్తూ మార్కెటింగ్ ఫీజు చెల్లించకుండా పెద్దమొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారస్తులు గండికొడుతున్నారు. జిల్లాలో మినుము పంటను వ్యాపారులు కొనుగోలుచేసి పలు జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు ఏవిధమైన మార్కెటింగ్ ఫీజు, సెస్ చెల్లించకుండా యథేచ్ఛగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఎగుమతి చేస్తున్న మినుముల విలువలో ఒకశాతం మార్కెటింగ్ ఫీజు చెల్లించాల్సి ఉండగా మార్కెటింగ్ శాఖ చెక్‌పోస్టుల కళ్లుకప్పి రవాణా చేస్తున్నారు. మరికొందరు జిల్లా నుంచి ఎగుమతి చేస్తూ యానాం నుంచి లోడు చేసినట్టుగా చూపిస్తూ సెస్ చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. దీంతో లారీకి రూ. 25వేల వరకు ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్నట్టు సమాచారం. వ్యాపారస్తులే స్వయంగా పర్మిట్ బుక్ ప్రింట్‌చేసి ఉపయోగిస్తున్నట్టు సమాచారం. అక్రమ రవాణాపై జిల్లా ఏడీఎం నిత్యానందంను వివరణ కోరగా.. రెండు విజిలెన్స్ టీములు పనిచేస్తున్నాయని, మినుములు అక్రమ రవాణా విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దీనిపై గట్టి నిఘా పెట్టినట్టు చెప్పారు.


మినుములు లారీలో లోడుచేస్తున్న కూలీలు



ఓటు దక్కాలంటే.. పెట్టె పట్టాలంతే..!

విజయవాడ తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన భార్య గద్దె అనూరాధ శనివారం స్థానిక 2వ డివిజన్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ క్రమంలో ఓ ఇంటి వద్ద ఇలా ఇస్త్రీ చేసి ఓట్లు అడిగారు.

- గుణదల

సెంట్రల్ తీర్పు విలక్షణం

ఒక్కో ఎన్నికల్లో ఒక్కో పార్టీవైపు ఓటర్లు

ఇదీ లెక్క..!

నియోజకవర్గం జనాభా	: 3,37,196
పురుషులు	: 1,69,098
స్త్రీలు	: 1,68,098
మొత్తం ఓటర్లు	: 2,73,701
పురుషులు	: 1,32,851
స్త్రీలు	: 1,40,803
థర్డ్ జెండర్	: 47
నియోజకవర్గంలో డివిజన్లు	: 1, 5, 19, 20, 21, 42, 43, 44, 45, 46, 47, 51, 52, 53, 54, 55, 56, 57, 58, 59.

నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రదేశాలు :



- 2009లో ఏర్పడిన నియోజకవర్గం
- నియోజకవర్గంలో 20 డివిజన్లు
- ప్రతి ఎన్నికలో ఎమ్మెల్యేను మార్చేస్తున్న తీర్పు

విజయవాడ సెంట్రల్. నగరానికి గుండెకాయ వంటి నియోజకవర్గం. ఇది రాజకీయ రంగానికే కాదు వాణిజ్యానికి, మధ్యతరగతి, పేద వర్గాలకు సెంటర్ పాయింట్. నగరంలో అత్యధికంగా మధ్యతరగతి, పేద వర్గాలు నివసించే నియోజకవర్గం ఇది. ఈ నియోజకవర్గ భౌగోళిక స్వరూపం ఎంత విలక్షణంగా ఉంటుందో ప్రతి ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పు అలాగే ఉంటుంది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో వరుసగా ఒకే పార్టీకి ఓటర్లు పట్టం కట్టలేదు. ప్రతి ఎన్నికల్లో ఒక్కో పార్టీవైపు ఓటర్లు నిలబడుతున్నారు. ఈ నియోజకవర్గ స్వరూపం అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌కు ముందు, వెనుక అన్నట్టు ఉంటుంది. 2009లో రాజకీయ చిత్రపటంలోకి ఎక్కిన ఈ నియోజకవర్గంపై ప్రత్యేక కథనం.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 2009లో నూతనంగా ఏర్పడింది. విజయవాడ తూర్పు, పశ్చిమ, కంకిపాడు నియోజకవర్గాల్లో ఉన్న ప్రాంతాలను కలిపి సెంట్రల్ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 20 డివిజన్లు ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఫైపుల రోడ్డుకు అవతలి వైపున ఉన్న ప్రాంతం, పాయకాపురం కంకిపాడు నియోజకవర్గంలో ఉండేవి. సత్యనారాయణ, మధురానగర్, ఏలూరు రోడ్డులోని కొంతభాగం, గవర్నరుపేట, బీసెంట్ రోడ్డు ప్రాంతాలు తూర్పు నియోజకవర్గంలో ఉండేవి. బుడమేరు వంతెన, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతాలు పశ్చిమ నియోజకవర్గంలో ఉండేవి. ఇప్పుడు ఇవన్నీ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చాయి. సెంట్రల్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మూడు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. నాలుగో ఎన్నిక ఈ ఏడాది జరగబోతోంది. విజయవాడ నగరంలో కూలీలు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం ఇదే.

ఒక్కో ఎన్నికలో ఒక్కో పార్టీవైపు తీర్పు

సెంట్రల్ నియోజకవర్గ ఓటర్ల తీర్పు విలక్షణంగా ఉంటుంది. ఏ అభ్యర్థిని వరుసగా గెలిపించిన దాఖలాలు ఈ నియోజకవర్గంలో లేవు. ప్రతి సార్వత్రిక ఎన్నికలోనూ ఒక్కో పార్టీకి ఇక్కడ ఓటర్లు పట్టం కడతారు. ఈ నియోజకవర్గానికి మల్లాది విష్ణు రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సెంట్రల్ నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యే. 2009లో నియోజకవర్గం ఏర్పడినప్పు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున మల్లాది విష్ణు, ప్రజారాజ్యం పార్టీ తరపున వంగవీటి రాధాకృష్ణ పోటీ చేశారు. రాధాకృష్ణపై విష్ణు 850 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయలేదు. 2009 మహాకూటమిలో భాగంగా ఇక్కడ సీపీఎం పోటీ చేసింది. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా బొండా ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన పూనూరు గౌతంరెడ్డిపై బొండా ఉమా 27,161 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా మల్లాది విష్ణు, టీడీపీ అభ్యర్థిగా బొండా ఉమా బరిలోకి దిగారు. ఉమాపై విష్ణు 25 ఓట్ల తేడాతో గెలుపొందారు.


ఉమా
శ్రీనివాసరావు
విష్ణు

ఈసారి ఎటువైపు?

సెంట్రల్ నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి ఈ ఏడాది ఎన్నికల్లో కనిపిస్తోంది. టీడీపీ వైపు నుంచి బొండా ఉమామహేశ్వరరావు ఎన్నికల బరిలోకి దిగారు. ఈసారి వైసీపీ 'కొత్త' ప్రయోగం చేస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మల్లాది విష్ణుకు సీటును నిరాకరించింది. పొరుగు నియోజకవర్గం పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావును సెంట్రల్‌కు తీసుకొచ్చింది. ఆయనకు నియోజకవర్గం కొత్త. పైగా స్థానికేతరుడిని ఇక్కడ నుంచి బరిలోకి దింపారన్న భావన ఓటర్ల నుంచి వినిపిస్తోంది. వెలంపల్లి దేవదాయ శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు అనేక ఆరోపణలు ఉన్నాయి. బొండా ఉమా 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గంలో తన పని తాను చేసుకుంటూనే ఉన్నారు. వెలంపల్లి స్థానికేతరుడు కావడంతో తన గెలుపు సులువుగా ఉంటుందని బొండా ఉమా భావిస్తున్నారు. వెలంపల్లి సీటు కేటాయించడంతో మల్లాది విష్ణు వర్గం ఆయనకు సహాయ నిరాకరణ చేస్తోంది. నియోజకవర్గంలో బీసీలు, ఎస్సీలు అధికం. కాపు సామాజికవర్గం గణనీయంగా ఉంది. బ్రాహ్మణ సామాజికవర్గ ఓట్లు కీలకపాత్ర పోషిస్తాయి.



జన హితమే లక్ష్యంగా.. జన చైతన్య యాత్ర సాగగా..!

జన హితాన్ని కాంక్షిస్తూ.. జన సమస్యలను ఎత్తిచూపుతూ.. వివిధ సంఘాలు చేపట్టిన జన చైతన్య యాత్ర శనివారం నగరానికి చేరుకుంది. తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) చైర్మన్ విమలక్క ఈ యాత్రలో పాల్గొన్నారు. నవ్యాంధ్రకు ప్రత్యేకహోదాతో పాటు ప్రజా ఎజెండాను చాటుతూ ఈనెల 14న నెల్లూరులో ప్రారంభమైన యాత్ర మే 5 వరకు సాగుతుంది. ఆఖరి రోజు శ్రీకాకుళంలో ముగుస్తుంది.

ఓటరు నాడి


ఐఆర్ కంటే పీఆర్సీ తక్కువ ఇచ్చిన ఏకైక ప్రభుత్వమిదే



ఐఆర్ కంటే పీఆర్సీ తక్కువగా ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే. పెన్షనర్లకు కనీసం ఒకటో తేదీన పెన్షన్ ఇవ్వటం మర్చిపోయింది. మూడేళ్లగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఇవ్వటం లేదు. డీఏలు, పీఆర్సీలపై ప్రభుత్వం ఇచ్చిన జీవోలు కూడా అమలు కావటంలేదు. వృద్ధాప్యంలో ఉన్న మమ్మల్ని వేధించటం తగదు. గతంలో ఏ ప్రభుత్వమూ పెన్షనర్లను ఇబ్బంది పెట్టలేదు. పెన్షనర్లంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం.

- కొత్తపల్లి కోటేశ్వరరావు, జగ్గయ్యపేట, పెన్షనర్స్ అసోసియేషన్ నేత

ఉద్యోగులు, ఉపాధ్యాయులను జగన్ వంచించారు



అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చాక ఉపాధ్యాయులు, ఉద్యోగులను జగన్ వంచించారు. జీతాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. 27 నెలలుగా ఎర్న్‌లీవ్‌లు ఇవ్వటంలేదు. నెలలోపు ఇవ్వాల్సిన పీఎఫ్ సంవత్సరాలు గడిచినా ఇవ్వరు. ఒకటో తేదీ జీతాల కోసం పోరాటం చేయాల్సి వస్తోంది. ఏ కారణాల వల్లనైతేనేమి ఒక్కొక్క ఉద్యోగి రూ.3 లక్షల వరకు నష్టపోయారు. యాప్‌లలో అటెండెన్స్‌లు, టాయిలెట్ల ఫొటోల పనులతో అసలు పని అటకెక్కింది. గతంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఈ దుస్థితి లేదు.

- మన్నెపల్లి కృష్ణయ్య, జగ్గయ్యపేట, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

నానీ.. ఇదేం పని?



స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానికి చెందిన స్థానిక శరత్ థియేటర్‌లోని వైసీపీ కార్యాలయానికి ఎన్నికల నిబంధనలు వర్తించడం లేదు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. వైసీపీ మూడు రంగుల ఎల్ఈడీ లైట్లు అమర్చి రాత్రికి వెలిగిస్తున్నారు. రహదారి వెంబడి వెళ్లే వారికి కనిపించేలా ఆ పార్టీ అధినేత జగన్ చిత్రపటాన్ని పెద్దగా ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారులకు మాత్రం కోడ్ ఉల్లంఘనలు కనిపించకపోవడం గమనార్హం. - గుడివాడ

వల్లభనేని వంశీపై మూడు కేసులు

విజయవాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై మూడు కేసులు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆయన నామినేషన్ అఫడవిట్‌లో పేర్కొన్నారు. క్రైం నంబరు 276/2019, క్రైం నంబరు 339/2019, క్రైం నంబరు 342/219తో పటమట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ మూడు కేసులు విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్నాయి. వంశీమోహన్ ఆదాయం 2018-19 నుంచి పెరిగింది. ఈ ఏడాది రూ.24.59లక్షలు ఉండగా, 2019-20లో రూ.27.77లక్షలకు పెరిగింది. 2020-2021లో రూ.29.27లక్షలు, 2022-23లో రూ.29.51లక్షలకు చేరుకుంది. ఆయన భార్య పంకజశ్రీ ఆదాయం మాత్రం తగ్గింది. 2018-19లో రూ.9.35లక్షలు ఉండగా, 2019-20లో 9.62లక్షలు, 2020-21లో 13.06లక్షలు, 2021-22లో రూ.8.40లక్షలు, 2022-23లో రూ.8.19లక్షలుగా చూపించారు.



అసంపూర్తిగా మిగిలిపోయిన గుణదల ఫ్లైఓవర్ నిర్మాణం (ఫైల్)

ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది

గుణదల ఫ్లై ఓవర్ విషయంలో ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధిగా ఉంది. ఫ్లై ఓవర్‌కు సంబంధించిన అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. అసంపూర్తిగా వదిలేసిన పనులను, అడ్డంకులను తెలుసుకున్నాం. ప్రభుత్వానికి విన్నవించాం. ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక, జిల్లా యంత్రాంగం ముందుకు వెళుతుంది. అతి త్వరలో విజయవాడ - నున్న ప్రజల చిరకాల వాంఛ సాకారం కానుంది.

- ఎంఏయూడీ ప్రధాన కార్యదర్శిని పనిచేసిన కరికాల వలవన్ గతంలో చెప్పిన మాట ఇది.

ఏడాదిలో పూర్తి చేస్తాం

మా ప్రియతమ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2009లో తలపెట్టిన ప్రాజెక్టు ఇది. కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. మా ప్రియతమ నాయకుడి తనయుడు ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. తండ్రి తలపెట్టిన ప్రాజెక్టును తనయుడు పూర్తి చేస్తాడు. ఈ ప్రాజెక్టుకు ఎంఏయూడీ స్థాయిలో పర్యవేక్షణ జరుగుతోంది. ఏడాదిలో దీన్ని పూర్తిచేసి విజయవాడ, నున్న ప్రజలకు అంకితం చేస్తాం.

- 2020లో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పలికిన పలుకులివి.

కట్టలేక కాడి వదిలేసి..

- గుణదల ఫ్లై ఓవర్ నిర్మాణంపై చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం
- తొలి నుంచీ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు దేవినేని నెహ్రూ కుటుంబం కుట్ర
- ఐదేళ్లలో రూ.45 కోట్లతో చిన్న ఫ్లై ఓవర్‌ను కట్టలేని ప్రభుత్వం
- ఆలస్యమవడంతో రూ.60 కోట్లకు పెరిగిన అంచనాలు
- చివరికి ఫ్లై ఓవర్ కట్టలేమని తేల్చేసి.. కేంద్రానికి అప్పగింత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుణదల - నున్న రూట్‌లో 2009లో గుణదల ఫ్లై ఓవర్‌కు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పనులు కూడా కొంత మేర జరిగాయి. ఈ ఫ్లై ఓవర్ తన నివాసానికి అభిముఖంగా ఏలూరు రోడ్డుపై ల్యాండ్ అవుతుండటంతో అప్పట్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవినేని రాజశేఖర్ దీని నిర్మాణానికి మోకాలడ్డారు. ట్రాఫిక్ సమస్యలు ఉంటాయని, రణగొణధ్వనులు వస్తాయన్న కారణంతో.. ఫ్లై ఓవర్ డిజైన్ మార్చాల్సిందిగా పట్టుబట్టి ప్రభుత్వాన్ని ఒప్పించారు. డిజైన్ మార్పు ప్రకారం పనులు చేయటానికి కాంట్రాక్టర్ అంగీకరించలేదు. దీంతో పనులు తొలి దశలోనే ఆగిపోయాయి. ఆ తర్వాత ఎప్పుడు ఈ ప్రతిపాదన తీసుకొచ్చినా.. ఇళ్లు పోతాయన్న భయోత్పాతాన్ని స్థానికుల్లో రేకెత్తించి వారిని రెచ్చగొట్టి ఫ్లై ఓవర్‌కు స్థానికంగా నివశిస్తున్నవారు సహకరించకుండా ఉండేలా ఆయన చేసేవారు.

అడుగడుగునా అడ్డుకునేందుకు వైసీపీ వ్యూహం

టీడీపీ అధికారంలోకొచ్చాక అమరావతిని రాజధానిగా ప్రకటించి విజయవాడ రూపురేఖలు మార్చే అంశంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో కనకదుర్గ ఫ్లై ఓవర్, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ల మాదిరిగానే గుణదల ఫ్లై ఓవర్‌ను పూర్తి చేసేందుకు సంకల్పించింది. దీన్ని అడ్డుకునేందుకు వైసీపీ రాజకీయ కుయుక్తులు పన్నింది. స్థానికులను రెచ్చగొట్టి కేసుల మీద కేసులు వేయించింది. ఫ్లై ఓవర్‌ను సాకారం కానీయకుండా చేయటానికి కేసులను అస్త్రాలుగా చేసుకుంది. ఈ కేసులన్నీ తేలటానికి మూడేళ్ల పట్టింది. అప్పటికే మళ్లీ ఎన్నికలు సమీపించాయి. ఎన్నికలు సమీపిస్తున్నా.. సవరించిన అంచనాలు టీడీపీ తయారు చేయించింది. గుణదల ఫ్లై ఓవర్ నిర్మాణంలో మిగిలిన పనులు పూర్తి చేయటానికి రూ.45 కోట్లు ఖర్చు అవుతుందని ఆర్అండ్‌బీ అధికారులు అంచనా వేశారు. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ గుణదల ఫ్లై ఓవర్‌పై మైండ్‌గేమ్ ఆడింది.

డిజైన్లు మార్చి తాత్సారం

టీడీపీ ప్రభుత్వ హయాంలో డీపీఆర్ వచ్చిందన్న కారణంతో.. ఆ ప్రతిపాదనను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. రెడ్డొచ్చి మొదలు అన్నట్టుగా.. 2020లో ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నపుడు అప్పటి జిల్లా యంత్రాంగంతో ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వళవన్ సమీక్ష జరిపారు. గుణదల ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అంతిమంగా డిజైన్‌లో మార్పులు, చేర్పులు చేయించారు. గతంలో మాదిరిగా టీ జంక్షన్ కాకుండా వై జంక్షన్ ప్రతిపాదనలు అన్నారు. డిజైన్లు మారటంతో.. భూ సేకరణ సమస్య వచ్చింది.

ట్రాఫిక్ చక్రబంధంలో జనం

గుణదల ఫ్లై ఓవర్ సాకారం కాకపోవటంతో.. కొత్త వంతెన మార్గం ప్రతి పది నిమిషాలకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. చిన్న వంతెన మీద ఎదురెదురుగా రాకపోకలు సాగించలేక నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రైల్వే సిగ్నల్ కారణంగా తరచూ గేట్లు పడతాయి. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. గేటు తెరవగానే.. హడావిడిగా ముందుకు దూసుకువెళ్ళటం వల్ల వాహనాలు ట్రాక్ మీదనే అడ్డదిడ్డంగా ఆగిపోతున్నాయి. ఈ ట్రాఫిక్ కారణంగా ఎన్నో సందర్భాలలో రైళ్లను నిలుపుదల చేయాల్సి వచ్చింది. ఈ మార్గంలో నెలకొంటున్న ట్రాఫిక్ ఏలూరు రోడ్డు మీదకు సాగి తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

చైతన్యంతో కదిలిన జనం

ఈసారి ప్రజలు విజ్ఞత చూపారు. రాజకీయ నేతల మాటలు విన్నందుకు అభివృద్ధి ఆగిపోయిందన్న చైతన్యం ప్రదర్శించారు. తమకు ఇళ్లు కల్పిస్తే వెళ్లిపోతామని ప్రతిపాదించారు. దీంతో వారికి జక్కంపూడి, గంగిరెద్దులదిబ్బ తదితర చోట్ల ఇళ్లు కేటాయించారు. ఈ ఇళ్ల కేటాయింపుల్లో కూడా అంతులేని జాప్యం జరిగింది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావటానికి ప్రభుత్వానికి నాలుగేళ్ల పట్టింది. చివరి ఏడాదిలో ఇళ్లను తొలగించింది. పనులు చేయటానికి అంచనాలు తయారు చేయమని ప్రతిపాదించింది. దాదాపుగా రూ.60 కోట్ల వ్యయంతో ఆర్అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేశారు. అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినా ఇప్పటి వరకు ఎలాంటి ఆమోదం తెలపలేదు. ఎన్నికలు సమీపించే సరికి వైసీపీ ప్రభుత్వ మరో కొత్త నాటకానికి తెరదీసింది.

కాడి వదిలేసి కేంద్రంపై మోపి..

గుణదల ఫ్లై ఓవర్‌ను నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం కాడి వదిలేసింది. దీని నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఫ్లైఓవర్ మార్గంలో రైల్వేలైన్ ఉండటం వల్ల రైల్వే ఆర్ఓబీ ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చింది. పైసా ఖర్చుపెట్టకుండా కేంద్ర ప్రభుత్వానికి బదలాయించి చేతులు దులుపుకుంది. రైల్వే కూడా ఈ అంశాన్ని పక్కన పెట్టింది. దీంతో గుణదల ఫ్లై ఓవర్ కథ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది.

● చిన్న ఫ్లై ఓవర్‌నే కట్టలేనివారు మూడు రాజధానులు ఎలా కడతారు?



తెలుగుదేశం పార్టీ హయాంలో దేశంలోనే రెండో అతిపెద్ద ఆరు వరుసలతో కూడిన కనకదుర్గ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఆ తర్వాత బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్లను కట్టారు. వాటితో పోల్చుకుంటే ఇది చాలా చిన్నది. వ్యయం రూ.50 కోట్లలోపే ఉంటుంది. దీన్నే నిర్మించలేనివారు మూడు రాజధానులు ఎలా నిర్మిస్తారు? ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ పాటికి ఫ్లై ఓవర్‌ను నిర్మాణం పూర్తి అయ్యేది.

- జమలయ్య, గుణదల

● ట్రాఫిక్ సమస్యలతో రోజూ సతమతం



అసంపూర్తిగా వదిలేసిన ఫ్లై ఓవర్‌ను కట్టడమన్నది పెద్ద కష్టం కాదు. ఒక్క రూపాయిని కూడా ప్రభుత్వం ఖర్చు చేయటానికి సిద్ధంగా లేదు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు లేవు. ఫలితంగా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉంది. ఈ ఫ్లై ఓవర్ సాకారం కాకపోవటం వల్ల ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఆగిపోతోంది. రైల్వే ట్రాక్ ఉండటం వల్ల గేటు తీయగానే ట్రాఫిక్ బిలబిలమంటూ ముందుకు వెళ్ళి ఆగిపోవటం వల్ల రైళ్ళు దగ్గరగా వచ్చేసిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

- ఆనంద్, గుణదల

నగరాల దేవస్థానంలో అన్నవితరణ



వన్‌టౌన్, ఏప్రిల్ 20: శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం కొత్తపేట కోమలావిలాస్ సెంటర్‌లోని నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 2వేల మందికి అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు అన్నవితరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా సాయంత్రం స్వామివారికి పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.97



చీరలు పంపిణీ చేస్తున్న భాస్కరరావు

వృద్ధాశ్రమంలో అన్నదానం, చీరల పంపిణీ

పాయకాపురం, ఏప్రిల్ 20 : వాంబేకాలనీలోని అమ్మప్రేమ ఆదరణ వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం, చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. వాసవీ క్లబ్ పాస్ట్ అధ్యక్షుడు కేవీ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది వృద్ధులకు భోజనం అందజేసి చీరలను పంపిణీ చేశారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ తమ కుమారుడు, కోడలు పెళ్లి రోజును పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

పాయకాపురం, విజయవాడ రూరల్, ఏప్రిల్ 20 : విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన నున్న గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం బోడపాడుకు చెందిన పెయ్యల గిరిధర్(22) శనివారం ఉదయం 11 గంటల సమయంలో స్నానానికి విద్యుత్ మోటార్ స్విచ్ వేశాడు. మోటార్ స్విచ్ నుంచి విద్యుత్ షాక్ తగలడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. బంధువులు చికిత్స నిమిత్తం ఆటోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొంత సేపటికి యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

వన్‌టౌన్, ఏప్రిల్ 20: అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు(90) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గవర్నరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. విజయవాడ ప్రభుత్వ పాత ఆసుపత్రి గేటు ఎదురుగా ఇతను అచేతనంగా పడి ఉండడాన్ని చూసి స్థానికుల చొరవతో పోలీసులు కొత్త ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ నెల 17న అతనిని ఆసుపత్రిలో చేర్చగా శనివారం మృతి చెందాడు. అనారోగ్యంతో మృతి చెందిన ఇతని తాలుకు బంధువులు గాని, ఎవరైనా తెలిసిన వారు గాని ఉన్నట్లయితే గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్లపంచె ఉంది.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 20 : బాలికను వేధిస్తున్న ఓ యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక(16)ను లూనా సెంటర్ ప్రాంతానికి చెందిన కల్యాణ్ అనే యువకుడు వేధింపులకు గురి చేస్తున్నాడు. శుక్రవారం కూడా కల్యాణ్ బాలికను వేధింపులకు గురి చేయడంతో బాలిక తల్లిదండ్రులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

గుణదల, ఏప్రిల్ 20: కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు నిరంతరం పనిచేస్తున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం స్థానిక 2వ డివిజన్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కొండ ప్రాంతంలో మంచినీటి సమస్య ఉందని స్థానికులు చెప్పడంతో టీడీపీ హయాంలో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. శాంతిభద్రతలు కాపాడాలన్నా, అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో జరగాలంటే టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందని అన్నారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణ ప్రసాద్, రత్నశ్రీ, ముత్యాల కృష్ణయ్య, చిన్నా, కోయా శివనారాయణ, మంతెన దుర్గాప్రసాద్, రాజా, నాళం నరేంద్ర, కొండెపి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

పటమట: 14వ డివిజన్ శ్రీనివాసనగర్ ఏరియాలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం, గద్దె రాజేష్, గద్దె హేమాన్షులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చాక అందించే సంక్షేమ పథకాలను వివరించారు. నర్రా కిషోర్, యడ్లపల్లి శివనాగరాజు, రాధారపు యల్లబాబు, గరికపాటి శ్రీనివాస్, సాంబయ్య, నాసర్‌వలీలు పాల్గొన్నారు.



చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా 7వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో కేక్ కట్ చేస్తున్న గద్దె అనురాధ

చంద్రబాబు పాలనలో కానుకలు

జగన్ పాలనలో భారాలు

మొగల్రాజపురం: చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు పండగ సమయాల్లో నిరుపేదలకు కానుకలు ఇచ్చేవారని, జగన్ పాలనలో కానుకలు సంగతి దేవుడెరుగు మోయలేని భారాలు వేస్తున్నారని గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె రాజేష్ చెప్పారు. 8వ డివిజన్‌లో శనివారం గాయత్రీనగర్ మెట్రోపాలిటన్ హోటల్ పరసర ప్రాంతాల్లో గద్దె రాజేష్, గద్దె హేమాన్ష్ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాల గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, మల్లెల రామకృష్ణ, ధూళిపాళ్ల రమేష్, నారు రామారావు, కొత్తపల్లి రమేష్, పాల్గొన్నారు.

● 7వ డివిజన్ ఉడ్‌పేట, నెహ్రూనగర్‌లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు సైకిల్ గుర్తుమీద ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష చంద్ర, సంజయ్ వర్మ, దొమకొండ అశోక్, శిరీషా గాంధీ, దిలీప్, శ్రీనివాస్, కనక దుర్గ, శివాణి, సుజిత పాల్గొన్నారు.

● రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా టీడీపీ ప్రజాప్రభుత్వాన్ని స్థాపిద్దామని, అరాచకపు వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని గద్దె క్రాంతికుమార్ చెప్పారు. 8వ డివిజన్‌లో సాయంత్రం గాయత్రీనగర్‌లో సిద్దార్థ నగర్, బ్యాంకు కాలనీ ఏరియాలో బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు సైకిల్ గుర్తుమీద ఓటేసి గెలిపించాలని ప్రచారం చేశారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వన్‌టౌన్, ఏప్రిల్ 20: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శనివారం నగరంలోని పరిశ్రమలు, హోటళ్ల వారికి, సాధారణ ప్రజలకు శనివారం అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని నిరోధక పరికరాలు, అగ్నిమాపక నిర్వహణ కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రదర్శన చేసి చూపించారు. జీఆర్‌టీ హోటల్ మేనేజ్‌మెంట్, డీవీ మానర్ హోటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డీఎఫ్‌వో ఏవీ శంకరరావు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కే.వినయ్ పాల్గొన్నారు.

సిటిజన్ పబ్లిక్ స్కూల్‌లో విన్నర్స్ డే సెలబ్రేషన్స్

భారతీనగర్, ఏప్రిల్ 20: గురునానక్ రోడ్డు లోని సిటిజన్ పబ్లిక్ స్కూల్‌లో ప్రిన్సిపల్ జి.లక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం విన్నర్స్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 2023-24 విద్యా సంవత్సరానికి అన్ని తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గత సంవత్సరం పదవ తరగతిలో అత్యధికంగా 589 మార్కులు సాధించిన బి.మహేష్‌కుమార్‌కి తల్లిదండ్రుల సమక్షంలో ప్రిన్సిపల్ రూ.పదివేల నగదు బహుమతిని అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ క్లాస్ టీచర్స్‌కి ట్రోఫీలను బహుకరించి సన్మానించారు.

బీఆర్‌ఎస్ సెంట్రల్ అభ్యర్థిగా ఆదినారాయణ నామినేషన్

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ సీనియర్ నేత కొణిజేటి ఆదినారాయణ శనివారం నామినేషన్ వేశారు. వీఎంసీ కార్యాలయంలోని సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

పశ్చిమ అభ్యర్థులుగా ఐదుగురు నామినేషన్

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా శనివారం ఐదుగురు నామినేషన్‌లు దాఖలు చేశారు. జై భీమ్ భారత్ పార్టీ అభ్యర్థిగా పరసా సురేష్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా షేక్ రబ్బానీ, బొబ్బిలి లక్ష్మి, జగదీష్ రామచంద్రరావు, నక్కల సాయిబాబులు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి నామినేషన్‌లను స్వీకరించారు..

సుధాకర్‌కు ఘన నివాళి

పాత రాజరాజేశ్వరిపేట, ఏప్రిల్ 20 : సిమెంట్ ఫ్యాక్టరీ కార్మిక హక్కుల సాధనలో తుది వరకు పోరాడి అశువులు బాసిన కంటెపూడి సుధాకర్ చిరస్మరణీయుడని మాజీ కార్పొరేటర్ బుట్టి రాయప్ప అన్నారు. సిమెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంటెపూడి సుధాకర్ 34వ వర్ధంతి కార్యక్రమం 34వ డివిజన్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో బుట్టి రాయప్ప సుధాకర్ స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేతలు కాళ్ల చిన్నప్ప, జోసఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.సతీష్‌రెడ్డి

పురుషుల్లో వంధత్వంపై అవగాహన సదస్సు

పటమట, ఏప్రిల్ 20 : వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో పురుషుల్లో వంధత్వానికి కారణాలు అనే అంశంపై ప్రముఖ యాండ్రాలజిస్ట్ డాక్టర్ ఎం.సతీష్‌రెడ్డి సవివరంగా ప్రసంగించారు. గర్భం దాల్చకపోవడానికి మూడింట ఒక వంతు స్త్రీలల్లో లోపాలు కారణమైతే, మరొక వంతు పురుషుల్లోను, ఇంకొక వంతు ఇద్దరిలోనూ లోపం ఉండటం కారణమన్నారు. జీవనశైలిలో మార్పులు సంతానలేమికి మరింత కారణమని, స్థూలకాయం, ధూమపానం, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, జంక్‌ఫుడ్ కూడా సంతానలేమికి కారణమన్నారు. డాక్టర్ సమరం, మారులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



44వ డివిజన్ ఎన్డీఏ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బొడ్డుపల్లి శ్రీనివాసరావు



40వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న పొనుగుపాటి చిన్నసుబ్బయ్య తదితరులు

భవానీపురం, ఏప్రిల్ 20 : ఎన్నికల జోష్‌తో మాజీ సీఎం నారాచంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. 45వ డివిజన్ సితార సెంటర్‌లో టీడీపీ జిల్లా మాజీ నాయకుడు గంగవరపు మురళీ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని భారీ కేక్ కట్ చేశారు. 44వ డివిజన్ విద్యాధరపురంలో ఎన్డీఏ కూటమి కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రబాబు బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు.

40వ డివిజన్‌లో ...

విద్యాధరపురం: భవానీపురం 40వ డివిజన్‌లో మాజీ సీఎం చంద్రబాబునాయుడి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్నసుబ్బయ్య, డివిజన్ కార్యదర్శి గాదు గణేష్, బూత్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు సురేష్, నారాయణ తదితరుల సమక్షంలో 25 కిలోల కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. చంద్రబాబునాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగల సమస్యలు పరిష్కరిస్తా

కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి



మాట్లాడుతున్న సుజనా చౌదరి

చిట్టినగర్, ఏప్రిల్ 20: అధికారంలోకి వచ్చిన వెంటనే మాదిగల సమస్యలు పరిష్కరిస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు పల్లెపోగు ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో మాదిగల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరపాలని మూడు దశాబ్దాలుగా ఎంఆర్‌పీఎస్ పోరాటాలు చేస్తుందని, ఈ పోరాటాలకు ఎన్డీఏ కూటమి అండగా ఉంటుందన్నారు. మాదిగలు ఐక్యంగా ఉండి కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ వర్గీకరణ జరగాలన్నా, అందరికీ సమాన అవకాశాలతోపాటు ఏపీ అభివృద్ధి చెందాలన్నా ఎన్డీఏ కూటమిని గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మానికొండ శ్రీధర్, పల్లెపోగు ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు పైలా సోమి నాయుడు, బాడిత శంకర్, అమ్మిశెట్టి వాసు, ఎంఎస్ బేగ్, రజిని, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్‌టీ పన్నుల విధానంపై అవగాహన ఉండాలి

చార్టర్డ్ అకౌంటెంట్ రాజేష్

వన్‌టౌన్, ఏప్రిల్ 20: జీఎస్‌టీ పన్నుల విధానంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని చార్టర్డ్ అకౌంటెంట్ జి. రాజేష్ అన్నారు కేబీఎన్ కాలేజీలో కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది.



అవగాహన కల్పిస్తున్న ఛార్టర్డ్ అకౌంటెంట్ రాజేష్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్‌టీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా ఉంటుందన్నారు. కామర్స్ విద్యార్థులు దీనిపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ జీఎస్‌టీ తదితర అంశాలపై పట్టు సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరో నిపుణుడు అజయ్ జైన్ సందేహాలను నివృత్తి చేశారు. విభాగాధిపతి హేమంత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అదనపు నైపుణ్యాలు అవసరం

లబ్బీపేట, ఏప్రిల్ 20: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీపడాలంటే అదనపు నైపుణ్యాలు, అధునాతన టెక్నాలజీలలో ప్రావీణ్యం పొందేలా వివిధ సర్టిఫికేషన్ కోర్సులు నేర్చుకోవాలని నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో శనివారం అదనపు కోర్సుల సర్టిఫికేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికపుడు ఇండస్ట్రీలో అవసరానికి ఉపయోగపడే నైపుణ్యాలు కళాశాలలో విద్యార్థులకు అందజేయడానికి కృషి చేస్తున్నామని, విద్యార్థులకు డిగ్రీతో పాటు పలు అదనపు సర్టిఫికేషన్ కోర్సులు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి డిగ్రీ పూర్తయ్యే లోపు రెండు సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేస్తారని, తమ కళాశాల ఎడ్యూస్కిల్స్, ఐటీసీ అకాడమీతో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు సర్టిఫికేషన్ కోర్సులు, అధ్యాపకులకు ఎఫ్‌డీపీ ప్రోగ్రామ్ నిర్వహిసున్నామని తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికేషన్ పొందిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

పశ్చిమ రిటర్నింగ్ అధికారిణి కిరణ్మయి

వన్‌టౌన్, ఏప్రిల్ 20: పశ్చిమలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.కిరణ్మయి తెలిపారు. శనివారం భవానీపురంలోని తన కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం వరకు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. ఇప్పటివరకు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై 4 కేసులు నమోదు చేశామన్నారు. పశ్చిమ పరిధిలో 97 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పై స్థాయి అధికారులకు నివేదిక పంపామన్నారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.

నున్నలో ఫ్లాగ్‌మార్చ్

విజయవాడ రూరల్, ఏప్రిల్ 20 : మేమున్నాం.. ధైర్యంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోండి అంటూ నగర పోలీసు సిబ్బంది శనివారం నున్నలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐలు ఎన్. దుర్గాప్రసాద్, నరసింహమూర్తి సిబ్బందితో నున్న గ్రామ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ వాక్ చేశారు. గ్రామంలోని చెరువు సెంటర్ వద్ద నుంచి కోటగట్టు సెంటర్, హృదయ్ నగర్ కాలనీ, వికాస్ కాలేజీ రోడ్డు తదిర ప్రాంతాల్లో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ, ఇప్పటికే పోలీసుస్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించామని ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగేశ్వరరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త పంపుసెట్ సామగ్రి కాల్చివేత!

- లావు శ్రీకృష్ణదేవరాయలు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాడనే..
- కారంపూడి మండలం రెడ్డిపాలెంలో వైసీపీ నేతల దారుణం


దహనమైన వ్యవసాయ పంపుసెట్ సామగ్రి వద్ద బాధితుడు పేరయ్య

కారంపూడి, ఏప్రిల్ 20: టీడీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాడని ఆ పార్టీ కార్యకర్తకు చెందిన వ్యవసాయ పంపుసెట్ సామగ్రిని వైసీపీ నేతలు దహనం చేశారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం పెదకొదమగుండ్ల పంచాయతీ రెడ్డిపాలెం గ్రామంలో జరిగిందీ ఘోరం. నరసరావుపేట లోక్‌సభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ నెల 18న నరసరావుపేటలో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి రెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త కొమ్ము పేరయ్య కూడా హాజరయ్యారు. దీంతో కోపోద్రిక్తులైన వైసీపీ నేతలు.. పేరయ్య పొలంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ బోరు, దానికి అనుబంధంగా ఉన్న 12.5 కేవీ డైనమో, వాటర్ పైపులను తగులబెట్టారు. కేబుల్ వైర్లను దొంగిలించారు. దీనిపై కారంపూడి పోలీస్‌స్టేషన్లో పేరయ్య ఫిర్యాదు చేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

కలప రికవరీ చేశాం

- సిబ్బందిని సస్పెండ్ చేశాం: డీఎఫ్‌వో నరేంద్రన్

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భారీ టేకు చెట్లు నరికిన వ్యవహారంలో బాధ్యులపై చర్య తీసుకుని కలప రికవరీ చేసినట్లు రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్ తెలిపారు. దట్టమైన మారేడుమిల్లి ప్రాంతంలో టేకు చెట్ల నరికివేతపై 'మారేడుమిల్లిలో షెకావత్!' శీర్షికతో ఏప్రిల్ 19న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. అటవీశాఖలోని కొందరు అసంతృప్తులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, తాను బాధ్యతలు చేపట్టాక గతంలో పనిచేసిన అధికారుల కన్నా ఎక్కువ కేసులు నమోదుచేశానని వివరించారు. మారేడుమిల్లి ప్రాంతంలో టేకు అడవుల నిర్మూలనకు పథక రచన చేశారన్న ఆరోపణల్ని ఖండించిన నరేంద్రన్... బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పడం గమనార్హం. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించినట్లు 450 చెట్లు నరకలేదని, 400 మాత్రమే తాము గుర్తించి రహస్యంగా దాచిన కలపను రికవరీ చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే విజిలెన్స్ నివేదికలో ఎన్ని చెట్లు నరికారు, వాటి ఖరీదు ఎంత? అనే వివరాలు స్పష్టంగా చెప్పలేదు. రికవరీ చేసిన కలప గురించి కూడా అందులో పేర్కొనలేదు. కాగా, తిరుపతిలో పనిచేసే సమయంలో మహిళా గార్డు భర్త సహకారంతో ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరించారన్న వార్తల్లో వాస్తవం లేదని నరేంద్రన్ పేర్కొన్నారు.

నేడు అక్కడక్కడా వాన జల్లులు

- కోస్తాలో ఎండతీవ్రత, వడగాడ్పులు

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 35 నుంచి 46 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరాంధ్రలో కొన్ని మండలాల్లో తీవ్రవడగాడ్పులు, కోస్తాంధ్రలో మోస్తరు వడగాడ్పులు వీస్తుండగా, రాయలసీమతో సహా రాష్ట్రవ్యాప్తంగా పగలూరాత్రీ అసౌకర్యవంతమైన వాతావరణం నెలకుంటోంది. రానున్న రెండు రోజులు 35-44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ తెలిపింది. ఆదివారం రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వాన జల్లులు పడతాయని హెచ్చరించింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని 45 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతి జిల్లా వరకు 197 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శనివారం ప్రకాశం జిల్లా దరిమడుగులో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

జగన్‌కూ జైలు తప్పదు!

- ఇక్కడి మద్యం స్కాం మా దృష్టికీ వచ్చింది: బీజేపీ
- ఈసారి ప్రధాని పర్యటనలో అమరావతి, పోలవరంపై స్పష్టమైన ప్రకటన
- బీజేపీ సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ స్పష్టీకరణ
- మూడు పార్టీల సమన్వయ సమావేశం

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వ అవినీతిని బీజేపీ ఉపేక్షిస్తోందన్న అభిప్రాయం నిజం కాదు. ఇక్కడ మద్యం వ్యవహారంలో చోటు చేసుకుంటున్న అవినీతి కేంద్రం దృష్టికీ వచ్చింది. అరవింద్ కేజ్రీవాల్ ఇదే అంశంలో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. జగన్‌కు కూడా అది తప్పదు' అని బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఈ విషయం గతంలో విలేకరుల సమావేశంలో చెప్పామని, మళ్లీ చెబుతామని తెలిపారు. అలాగే కేంద్ర విక్రయ జాబితాలో విశాఖ ఉక్కు కర్మాగారం లేదని చెప్పారు. శనివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన ప్రచార విభాగాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. బీజేపీ తరఫున సింగ్, టీడీపీ నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దనరావు, జనసేన అధికార ప్రతినిధి గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కును విక్రయిస్తున్నారన్న అంశం ప్రజల్లో బలంగా వెళ్లిందని, దీనిపై బీజేపీ నేతలు స్పష్టమైన ప్రకటన చేయాలని జనార్దన్ సూచించారు. సింగ్ స్పందిస్తూ.. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ జాబితాలో విశాఖ స్టీల్ ప్లాంటు లేనేలేదన్నారు. 'దానిని విక్రయించే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదు. పెట్టుబడుల ఉపసంహరణకు ఎంపిక చేసిన ప్రభుత్వ సంస్థలతో కేంద్రం ఒక జాబితా రూపొందించింది. అందులో విశాఖ ఉక్కు పేరే లేదు. కేంద్ర కేబినెట్ పెట్టుబడుల ఉపసంహరణకు ఆమోదం తెలిపిన సంస్థల జాబితాలో కూడా ఇది లేదు. మేం ఈ విషయాలన్నీ గతంలోనే చెప్పాం. మళ్లీ చెబుతాం' అని తెలిపారు. చిలకలూరిపేట ఉమ్మడి సభలో ప్రధాని మోదీ అమరావతి, పోలవరంపై ప్రకటన చేయలేదన్న అసంతృప్తి ప్రజల్లో నెలకొందని, ఈసారి ఆయన వీటిపై మాట్లాడితే బాగుంటుందని కూడా జనార్దన్ అన్నారు. 'ఇది మా దృష్టికి కూడా వచ్చింది. ఈసారి రాష్ట్ర పర్యటనలో ఈ అంశాలపై ప్రధాని తన వైఖరి స్పష్టంగా చెబుతారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతే ఉంటుందన్నది మా పార్టీ వైఖరి. పోలవరం పూర్తికి కూడా కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రం ఇచ్చిన రూ.4 వేల కోట్లను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి ఇతర పనుల కోసం వాడింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గతంలోనే చెప్పారు' అని సింగ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా అధికార పార్టీ అధికార దుర్వినియోగం కొనసాగుతోందని, కొందరు పోలీసు అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని టీడీపీ, జనసేన నేతలు చెప్పారు. త్వరలోనే దీనికి అడ్డుకట్ట పడుతుందని, ఎన్నికల కమిషన్ ఇటువంటి వాటినిచూస్తూ ఊరుకోదని సింగ్ చెప్పారు. జగన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్న కోణాన్ని మూడుపార్టీల ప్రచారంలో ప్రముఖంగా చాటాలని సమన్వయ సమావేశం నిర్ణయించింది. సామాజిక మాధ్యమాల్లోనూ కూటమి తరపు ప్రచారం సమన్వయంతో సాగాలని నిశ్చయించారు. ఈఅంశంలో బీజేపీ తరఫు ప్రచారం కొంత తక్కువగా ఉంటోందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఇక నుంచి పెంచుతామని సింగ్ చెప్పారు. 'జాతీయ స్థాయిలో బీజేపీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో కనీస ఉమ్మడి ప్రణాళిక విడుదల చేయడానికి ఇబ్బంది లేదు. కావాలంటే కేంద్ర మేనిఫెస్టోలో మీకు అనువుగా ఉన్న వాటిని తీసుకోండి. మీ రాష్ట్ర ప్రాధాన్యాల ప్రకారం మీ ప్రణాళిక మీరు తయారు చేసుకోండి' అని సూచించారు.

బస్సులన్నీ ఊడ్చేశారు


వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

- సగానికిపైగానే సర్వీసులు జగన్ సేవలో..
- గంటలకొద్దీ ప్రయాణికుల పడిగాపులు
- అనకాపల్లిలో కొనసాగుతున్న బస్సుయాత్ర

అనకాపల్లి/విశాఖపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడి ప్రజలకు ఇబ్బందులే. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ అదే జరిగింది. ఆయన ఎన్నికల ప్రచారం కోసం శనివారం అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నక్కపల్లి నుంచి ఎలమంచిలి నియోజకవర్గం మీదుగా సాయంత్రానికి అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట మండలం చింతలపాలేనికి జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర చేరుకుంది. అక్కడ ఏర్పాటుచేసిన సభలో ఆయన పాల్గొన్నారు. సభ కోసం జనాలను తరలించడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో పది డిపోల నుంచి అధికారికంగా 380, అనధికారికంగా మరో 120 బస్సులు తరలించారు. విశాఖ జిల్లాలో ఏడు డిపోలు, అనకాపల్లి జిల్లాలోని రెండు డిపోలు, అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు డిపో నుంచి 50 శాతం సాధారణ, ఎక్స్‌ప్రెస్ బస్సులను జగన్ సభకు పంపించేశారు. మొత్తం బస్సులు 1,064 కాగా, అందులో చాలావరకు జనాన్ని తరలించేందుకు ఇవ్వడంతో మూడు జిల్లాల్లోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లి జిల్లాలో అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను జగన్ సభకు అధికారులు తరలించారు. జనం తరలింపు కోసం ఆర్టీసీ బస్సులను ఉదయాన్నే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపించారు. సభకు వచ్చేవారికి రూ.200 నుంచి రూ.300తో పాటు భోజనం, మజ్జిగ ప్యాకెట్‌లు ఇచ్చినట్టు తెలుస్తోంది. చింతలపాలెంలో 'మేమంతా సిద్ధం' సభ ప్రాంగణం జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు.. పది కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోయాయి. చింతలపాలెం సభ కోసం తరలించిన జనాలంతా ఎండకు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం ఐదు గంటలకు జగన్ తన ప్రసంగం ప్రారంభించారు. పాత అంశాలనే ప్రస్తావిస్తూ సొంత డబ్బా కొట్టుకోవడంతో విసుగుచెంది చాలామంది ఆయన ప్రసంగిస్తుండగానే వెనుతిరిగారు.

మళ్లీ నేను రాకపోతే అంధకారమే: జగన్

తనను మళ్లీ సీఎంగా ఎన్నుకోకపోతే పేదల జీవితాలు అంధకారంలోకి వెళ్లిపోతాయని వైసీపీ అధినేత అన్నారు. ఆయన శనివారం అనకాపల్లి జిల్లా చింతలపాలెంలో జరిగిన 'మేమంతా సిద్ధం' సభలో ప్రసంగించారు. పేదల కోసం తాను ఎంతో చేశానంటూ జగన్ ఊదరగొట్టారు. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునే ఎన్నికలు కావని, పేదల భవిష్యత్తు మార్చే ఎన్నికలన్నారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే పథకాలన్నీ కొనసాగుతాయని, లేకపోతే పథకాలన్నింటికీ ముగింపేనంటూ...ప్రజల్లో భయాందోళన కలిగించే ప్రయత్నం చేశారు. తన హయాంలో జరిగిన మంచిని చూసి ఓట్లు వేయాలన్నారు.

పవన్‌కు అనుకూలంగా యువత నినాదాలు

జగన్ నక్కపల్లి నుంచి కశింకోట మండలం చింతలపాలెంలో ఏర్పాటుచేసిన సభకు బస్సులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఎస్.రాయవరం మండలం గోకులపాడు సమీపంలో సీఎం బస్సు దిగి కొందరు మహిళలతో మాట్లాడారు. తిరిగి బస్సులోకి వెళ్లే సమయంలో...అక్కడ ఉన్న కొందరు యువకులు పవన్‌కల్యాణ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా కలకలం రేగడంతో పోలీసులు అప్రమత్తమై యువకులను వారించారు. అనంతరం జగన్ బస్సు అక్కడినుంచి కదిలింది.

రేషన్ వాహనాల ద్వారా ఓటర్లకు డబ్బులు!

- రూ.5వేల చొప్పున పంపిణీకి వైసీపీ ఏర్పాట్లు
- ఈ-మెయిల్ ఫిర్యాదుపై స్పందించిన సీఈసీ
- నివేదిక కోరుతూ పౌరసరఫరాలశాఖకు లేఖ

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి చెందిన లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు ఇంటింటికీ రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాల (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ద్వారా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారంటూ వచ్చిన ఈ-మెయిల్ ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. "లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, అధికార పార్టీ నాయకులు ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావడం కోసం ఓట్ల కొనుగోలుకు ఎండీయూ ఆపరేటర్లను ఎంచుకుంటున్నారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ప్రతి ఓటరునూ గుర్తించి డబ్బులు పంపిణీ చేయడానికి ఇదే సులువైన మార్గంగా వారు భావిస్తున్నారు. గుంటూరు జిల్లాలోని నగరాల్లో ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇప్పటికే డబ్బుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. వచ్చే నెలలో ప్రతి రేషన్‌కార్డుదారునికీ ఎండీయూ ఆపరేటర్లు, వారి బంధువుల సహాయంతో రూ.5వేల చొప్పున పంచేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు సర్వం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇలా రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఓట్ల కొనుగోలుకు డబ్బు పంపిణీ కార్యకలాపాలు సాగిస్తున్నారు" అని ఎన్నికల సంఘానికి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం.. దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ రాష్ట్ర అధికారులకు లేఖ రాసింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ఈనెల 16న అన్ని జిల్లాల కలెక్టర్లకు అత్యవసర సర్క్యులర్ జారీ చేశారు. దీనిపై వెంటనే వివరణాత్మక నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన విషయాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా, ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, డబ్బు పంపిణీ, బహుమతుల పంపిణీ, రాజకీయ పార్టీ సభ్యుల కరపత్రాల పంపిణీలో ఎండీయూ ఆపరేటర్ల ప్రమేయం ఉండకూడదని స్పష్టంచేశారు. ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్వాక్రా, అంగన్వాడీ మహిళలకు వైసీపీ బెదిరింపులు

- సీఈవోకు ఆచంట సునీత ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలను సిద్ధం సభలకు తరలిస్తోంది. సభలకు రాకపోతే సంక్షేమ పథకాలు రావని వైసీపీ నాయకులు వారిని భయపెడుతున్నారు' అని టీడీపీ అంగన్వాడీ, డ్వాక్రా మహిళా సంఘాల అధ్యక్షురాలు ఆచంట సునీత ఆరోపించారు. శనివారం ఈ మేరకు రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారికి ఆమె ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'డ్వాక్రా మహిళలకు రకరకాల తాయిలాలు ప్రకటిస్తూ వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అంగన్వాడీ మహిళలకు, డ్వాక్రా సంఘాలకు చీరలు, కుక్కర్లు పంచిపెడుతున్నారు. దీనిని నివారించాలని సీఈవోకి ఫిర్యాదు చేశాం. వైసీపీ అభ్యర్థికి ఓటు వేయాలని బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరాం' అని సునీత తెలిపారు.

చీకట్లోకి తీసుకెళ్లి తుపాకీతో బెదిరించారు!

- సతీశ్‌ను రాజకీయాలకు బలిచేస్తున్నారు
- దీనిపై న్యాయస్థానంలో పోరాటం చేస్తాం
- న్యాయవాది అబ్దుస్ సలీం వ్యాఖ్యలు

విజయవాడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): "గులకరాయి ఘటనలో అమాయకుడైన సతీశ్‌ను పోలీసులు చీకట్లోకి తీసుకువెళ్లి, తుపాకీతో బెదిరించారు. ఈ విషయాన్ని సతీశ్ సహా ఆయన తల్లిదండ్రులు చెబుతున్నారు. ఓ అమాయకుడిని రాజకీయంగా బలిచేసే కుట్ర జరుగుతోంది. దీనిపై న్యాయపోరాటం చేస్తాం" అని న్యాయవాది అబ్దుస్ సలీం తెలిపారు. "జగన్ 2019 ఎన్నికలకు వేసిన కోడికత్తి డ్రామా బాహుబలి-1. ఇప్పుడు ఎన్నికలకు వేసిన గులకరాయి డ్రామా బాహుబలి-2" అని అన్నారు. విజయవాడలోని జిల్లా జైలులో ఉన్న గులకరాయి కేసు నిందితుడు వేముల సతీశ్ కుమార్‌తో శనివారం ఆయన ములాఖత్ అయ్యారు. ఆయనతో పాటు సతీశ్ తల్లిదండ్రులు దుర్గారావు, రమణమ్మ వెళ్లారు. సుమారు అరగంట పాటు సతీశ్‌తో సంభాషించారు. అనంతరం న్యాయవాది సలీం మీడియాతో మాట్లాడుతూ.. "నేను ఏ తప్పు చేయలేదని సతీశ్ చెప్పాడు. పోలీసులు బెదిరించి.. చేయని తప్పును చేసినట్టుగా చెప్పించారని ఆవేదన వ్యక్తం చేశాడు. మా బిడ్డను పోలీసులు తుపాకీతో బెదిరించారని అతడి తల్లిదండ్రులు చెబుతున్నారు. సతీశ్‌ను చీకట్లోకి తీసుకెళ్లి బెదిరించారు. రాజకీయాలకు మరోసారి అమాయకుడిని బలి చేస్తున్నారు. దీనిపై న్యాయస్థానంలో పోరాటం చేస్తాం. పోలీసులు, కుట్రదారుల గురించి కోర్టుకు వివరిస్తాం" అని చెప్పారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న దుర్గారావు ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదన్నారు. దీనిపై హైకోర్టులో సోమవారం హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. సతీశ్ తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడికి ఏ పాపం తెలియదని, మత్తు పదార్థాలు తీసుకుంటున్నాడని పోలీసులు ఇంటి నుంచి తీసుకెళ్లారన్నారు. గుణదల వైపు చీకట్లోకి తీసుకెళ్లి తుపాకీతో బెదిరించారని ఆరోపించారు.

వాంగ్మూలం ఇప్పించండి

నిందితుడు సతీశ్‌కుమార్ నుంచి సీఆర్పీసీ 164 ప్రకారం వాంగ్మూలం ఇప్పించాలని పోలీసులు విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవానికి సతీశ్‌ను విజయవాడలోని జిల్లా జైలు నుంచి నెల్లూరు జైలుకు తరలించాల్సి ఉంది. పోలీసులు సతీశ్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత సీఆర్పీసీ 161 ప్రకారం వాంగ్మూలం తీసుకున్నారు. ఇప్పుడు సీఆర్పీసీ 164 ప్రకారం వాంగ్మూలం ఇప్పించాలని పిటిషన్ దాఖలు చేయడం, కోర్టు ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించకపోవడంతో నెల్లూరు జైలుకు తరలించే ప్రక్రియ నిలిచిపోయింది. పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేస్తామని న్యాయవాది సలీం తెలిపారు.

దుర్గారావును ఎట్టకేలకు వదిలిపెట్టారు

సీఎం జగన్‌పై అదుపులోకి తీసుకున్న వేముల దుర్గారావును పోలీసులు శనివారం రాత్రి వదిలిపెట్టారు. దుర్గారావును మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ సీసీఎస్‌లో విచారించారు. కేసులో ఏ2 దుర్గారావునని లీకులు ఇచ్చారు. ఈ దశలో అకస్మాత్తుగా అతనిని విడుదల చేయడం చర్చనీయాంశమైంది. దుర్గారావు ఆచూకీ చెప్పకపోతే హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేస్తానని న్యాయవాది అబ్దుస్ సలీం వెల్లడించిన కొది గంటలకే దుర్గారావును వదిలిపెట్టడం గమనార్హం.



సతీశ్ మైనరే..!

- రిమాండ్ రిపోర్టులోనూ అన్నీ తప్పులే: పట్టాభిరాం

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 'ఎవరైనా ఫేక్ సర్టిఫికెట్లు సృష్టిస్తే పోలీసులు కేసు పెట్టి దర్యాప్తు చేస్తారు. కాని ఇక్కడ పోలీసులే ఫేక్ సర్టిఫికెట్ల సృష్టికర్తలుగా మారారు' అని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. శనివారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో మరో అధికార ప్రతినిధి రఫీతో కలసి విలేకరులతో మాట్లాడారు. 'సీఎం జగన్‌పై గులకరాయి విసిరిన ఘటనలో ఏకంగా హత్యాయత్నం కేసు పెట్టి ప్రధాన నిందితునిగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలుడు వేముల సతీశ్‌ను అరెస్టు చేశారు. మైనర్ బాలుడు వడ్డెర సతీశ్‌ను జైలుకు పంపడానికి విజయవాడ పోలీసులు దుర్మార్గమైన రీతిలో ఫేక్ పుట్టిన రోజు సర్టిఫికెట్ పుట్టించారు. సతీశ్‌ను మేజర్ అని చూపించి జైలుకు పంపడం కోసం పోలీసులు నకిలీ పుట్టిన రోజు సర్టిఫికెట్లు సృష్టించి అడ్డంగా దొరికిపోయారు. ఈ కేసులో వేముల దుర్గారావు అనే వ్యక్తిని ప్రధాన సాక్షిగా చూపించారు. దుర్గారావు పోలీసులకు ఇచ్చిన తన స్టేట్‌మెంట్‌లో ఈ నెల 14న సతీష్ పుట్టిన రోజు కావడంతో అతని ఇంటికి వెళ్లి కేక్ తిని వచ్చానని చెప్పారు. కాని పోలీసులు తాము తెచ్చిన పుట్టిన రోజు సర్టిఫికెట్లలో ఆ తేదీ మార్చేశారు. సతీష్ పుట్టిన రోజు అక్టోబరు 14 అని చూపించారు. అక్టోబరులో పుడితే సతీష్ ఏప్రిల్‌లో పుట్టిన రోజు వేడుకలు ఎలా జరుపుకొంటాడు? సతీష్‌ను మేజర్‌గా చూపించడం కోసం ఆ తేదీ మార్చేసి సర్టిఫికెట్ పుట్టించారు' అని పట్టాభి ఆరోపించారు. అమాయకులను కేసులో ఇరికించడానికి పోలీసులు ఎన్ని కుట్రలు చేశారో దీనిని బట్టి తెలుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రిపై గులకరాయి దాడి జరిగిన సమయాన్ని పోలీసులు తమ రిమాండ్ రిపోర్టులో పేజీకి ఒక రకంగా రాశారని విమర్శించారు. పోలీసుల తప్పుడు కేసులకు స్థానికులు ఎవరూ సాక్షులుగా ముందుకు రాకపోవడంతో చివరకు పులివెందులకు చెందిన వ్యక్తిని సాక్షిగా పెట్టారని తెలిపారు. నందినేని మనోహర్ నాయుడు అనే పులివెందుల వ్యక్తిని ఈ కేసులో సాక్షిగా పోలీసులు పేర్కొన్నారని, మిగిలిన సాక్షులు కూడా అయితే పోలీసులు లేదా వైసీపీ నేతలేనని చెప్పారు. మైనర్ బాలుడిని పోలీసులు జైలుకు పంపిస్తే బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు ఏం చేస్తున్నారని పట్టాభి ప్రశ్నించారు. ప్రజాదరణ కోల్పోయిన వైసీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు పనికిమాలిన కారు కూతలు కూస్తున్నారని టీడీపీ మరో అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ ధ్వజమెత్తారు.

గులకరాయి కేసు సీబీఐకి అప్పగించాలి

- నా కోసం వడ్డెర కాలనీవాసుల్ని హింసిస్తున్నారు: బొండా ఉమ

విజయవాడ, ఏప్రిల్ 20: 'సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కేసును రాష్ట్ర పోలీసులు తప్పుదారి పట్టిస్తున్నారు. తక్షణం కేసును సీబీఐకి అప్పగించాలి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. 'పోలీసుల పనితీరు జగన్‌కు అనుకూలంగా ఉంది. కొందరు ఐపీఎస్‌లు జగన్ చెప్పుచేతల్లో పని చేస్తున్నారు. గులకరాయి కేసును అడ్డంపెట్టుకుని ఏ సంబంధం లేని టీడీపీకి చెందిన బీసీ నాయకుడు వేముల దుర్గారావును చిత్రహింసలు పెడుతున్నారు. దుర్గారావును అదుపులోకి తీసుకుని ఆరు రోజులైన అతని ఆచూకీ చెప్పకుండా రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారు. అతన్ని హింసించి ఎలాగైన నా పేరును చెప్పించాలని పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే రెండు రోజులుగా పోలీసులు వందల సంఖ్యలో మా ఇల్లు, కార్యాలయాలకు వస్తున్నారు. దుర్గారావుతో పాటు అతని కుటుంబ సభ్యులను కూడా చిత్రహింసలకు గురి చేస్తున్నారు. వడ్డెర కాలనీలో ఉండటమే దుర్గారావు చేసిన పాపమా? బొండా ఉమ కోసం మొత్తం వడ్డెర కాలనీని పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శుక్రవారం నామినేషన్ వేసిన నన్ను భయపెట్టి, ప్రచారానికి తిరగనీయకుండా చేయాలన్న వైసీపీ ప్లాన్‌ను నగర పోలీసులు అమలు చేస్తున్నారు. ఏపీ పరిణామాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం. రాష్ట్ర డీజీపీ, నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటాలను చూస్తే ఐపీఎస్ వ్యవస్థ సిగ్గుతో తలదించుకునేలా ఉంది. తెలంగాణలో కేసీఆర్ మాటలు విని ఐపీఎస్‌లు అడ్డమైన పనులుచేశారు. ప్రభుత్వం మారిన తరువాత ఐపీఎస్‌లు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. జగన్ మాట విని తెలుగుదేశం పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయించాలని చూస్తే జూన్ 4వ తేదీ తరువాత రాష్ట్రంలో కూడా అవే పరిస్థితులు పునరావృతం అవుతాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గులకరాయి కేసును సీబీఐకి అప్పగించాలి.' అని ఉమా డిమాండ్ చేశారు.


ఎర్రబాలెం గ్రామంలోని సంధ్య స్పైసెస్ కంపెనీలో మహిళలతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

'సూపర్-6'తో మహిళలకు ఆర్థిక భరోసా

- మహిళల ఉన్నత విద్య కోసం 'కలలకు రెక్కలు'
- లోకేశ్‌ను ఆశీర్వదిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు
- మంగళగిరి ఎన్నికల ప్రచారంలో నారా బ్రాహ్మణి

మంగళగిరి, ఏప్రిల్ 20: మహిళల ఆదాయాన్ని పెంచి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలకు రూపకల్పన చేశారని నారా బ్రాహ్మణి అన్నారు. మంగళగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి లోకేశ్ తరపున శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని సంధ్య స్పైసెస్ కంపెనీని సందర్శించి, అక్కడ పనిచేస్తున్న మహిళలతో మాట్లాడి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం చంద్రబాబు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారని, ఈ విషయంలో ఆయనకు మరెవరూ సాటిరారని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో మహిళలు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో 'కలలకు రెక్కలు' అనే కార్యక్రమాన్ని ఇటీవల ప్రకటించారని తెలిపారు. దీనిద్వారా ఎంత పెద్ద చదువుకైనా బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణ సౌకర్యం లభిస్తుందని చెప్పారు. మంగళగిరిలో మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం స్త్రీశక్తి పథకాన్ని లోకేశ్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. లోకేశ్ తన సొంత నిధులతో 29 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో లోకేశ్‌ను మంగళగిరి ప్రజలు ఆశీర్వదిస్తే భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తారని బ్రాహ్మణి చెప్పారు.

సమస్యలు విన్నవించిన మహిళా కూలీలు

సంధ్య స్పైసెస్ కంపెనీలో పనిచేస్తున్న మహిళా కూలీలు తమ సమస్యలను బ్రాహ్మణికి విన్నవించారు. గతంలో అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే ఆకలి తీర్చుకునే వారమని, జగన్ ప్రభుత్వం వచ్చాక వాటిని మూసివేసి తమ పొట్టగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణి స్పందిస్తూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తామని, నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు.

టీడీపీలో కొద్దిమంది అభ్యర్థుల మార్పు

- పాడేరుకు గిడ్డి ఈశ్వరి, మడకశిరకు ఎంఎస్ రాజు

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కొద్ది మంది అభ్యర్థుల మార్పు జరిగినట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పాడేరు అసెంబ్లీకి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని, మడకశిరలో ఎంఎస్ రాజును అభ్యర్థిగా ఎంపిక చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణను ఎంపిక చేశారు. గతంలో ఆయన కుమార్తెను అభ్యర్థిగా ప్రకటించారు. కమలాపురం, కందుకూరులో కూడా మార్పు యోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్పు జరిగితే కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి, కందుకూరులో కోటపాడు జనార్దన్‌కు టికెట్టు లభించే అవకాశం ఉంది.


నేడు టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు

టీడీపీ అభ్యర్థులకు అమరావతిలో ఆదివారం బీ ఫారాల పంపిణీ జరగనుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో ఉదయం 10 గంటలకు జరిగే ఒక కార్యక్రమంలో వాటిని పంపిణీ చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆంధ్రజ్యోతి

ప్రజా అజెండా

జన కేతనం



మీ ఓటు భవిష్యత్తు

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

ఆదివారం ◇ 21-4-2024

కౌంట్ డౌన్ 22 రోజులు

లక్షల కోట్ల డబ్బా

సీఎం జగన్ నోరు తెరిస్తే.. లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాల కల్పన అంటూ మాటలు కోటలు దాటుతాయి. నిజానికి జగన్ సర్కారు దెబ్బకు కొత్త కంపెనీలు రాకపోగా ఉన్న పరిశ్రమలు పారిపోయాయి. ఇప్పటికే ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలపైనా కక్షే! లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఆయన పాలనలో 1200 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నట్లు అంచనా. అయినా ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ 'లక్షల కోట్ల' మాటలు చెబుతారు.

చంద్రబాబు తెచ్చినవి..



కియా కార్ల పరిశ్రమ, హీరో టూవీలర్, ఇసుజు, అశోక్ లేల్యాండ్, ఫ్లెక్స్ ట్రానిక్స్, ఫాక్స్‌కాన్-ఐఫోన్ల తయారీ కేంద్రం, జియోమీ, సెల్‌కాన్, కార్బన్, డిక్సన్ మొబైల్ ఫోన్ల తయారీ పరిశ్రమలు, ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్, టీవీఎస్ గ్రూప్ బ్రేక్స్ ఇండియా ఆటోమొబైల్ పరిశ్రమ, ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్, రామ్‌కో సిమెంట్స్, ఫ్లోరా సిరామిక్స్, చెట్టినాడ్ సిమెంట్, కల్యాణి స్టీల్, కోకాకోలా యూనిట్, బ్రిటానియా, పెప్సీ, సెయింట్ గోబెయిన్ గ్లాస్ పరిశ్రమ, గూగుల్ ఎక్స్, భారత్ ఫోర్జ్, అపోలో టైర్స్, జియో తదితర పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి. 2014-2019 మధ్యకాలంలో 5 లక్షల మందికి ఉద్యోగాలొచ్చాయి.

జగన్ తరిమేసినవి..



శ్రీకాకుళం జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు, విశాఖలో లులూ గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, హెచ్ఎస్‌బీసీ, అదానీ డేటా సెంటర్ తన ప్రాజెక్టును రూ.70,000 కోట్ల నుంచి రూ.4,000 కోట్లకు కుదించుకుంది. గోదావరి జిల్లాలలో ఆక్వా పరిశ్రమలు, కృష్ణాలో ఐటీ కంపెనీలు, అమరావతిలో సింగపూర్ స్టార్టప్ కంపెనీలు, ప్రకాశంలో ఏషియన్ పేపర్ మిల్స్, నెల్లూరులో విండ్-సోలార్ కంపెనీలు, చిత్తూరులో రిలయన్స్ జియో, హోలీటెక్, అమర్‌రాజా, రాజపలాయం మిల్స్, ట్రైటన్ సోలార్, కర్నూలులో మెగాసీడ్ పార్క్, అనంతపురంలో కియా అనుబంధ సంస్థలు, జాకీ, కడపలో జువారి సిమెంట్స్.

అమర్‌రాజాపై కసి..



'అమర్ రాజా' అంతర్జాతీయంగా పేరొందిన బ్రాండ్! సొంత ప్రాంతానికి మేలు చేయాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని చిత్తూరు జిల్లాలో దీనిని ఏర్పాటు చేశారు. అయితే... ఇది టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కుటుంబానికి చెందినది కావడంతో జగన్ సర్కారు కక్ష పెంచుకుంది. 'కాలుష్యం' పేరుతో వెంటాడి వేధించింది. ఏకంగా పరిశ్రమకు తాళం వేయించింది. దీని ఫలితమే... రాష్ట్రంలో విస్తరణ ప్రణాళికలకు అమర్‌రాజా స్వస్తి పలికింది. పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. దీనివల్ల నష్టం ఎవరికి?

మచ్చుకు రెండు..

ఆగిన 'కియా' విస్తరణ

హ్యుండయ్ మాతృసంస్థ 'కియా'! దీనిని అనంతపురం జిల్లాకు రప్పించేందుకు చంద్రబాబు పడిన కష్టం అంతా ఇంతా కాదు! రికార్డు స్థాయిలో అక్కడ కార్ల కర్మాగారం సిద్ధమైంది. భారీ స్థాయిలో అనుబంధ పరిశ్రమల రాకకు తగిన వాతావరణం ఏర్పడింది. 'కియా' సైతం ఇక్కడ మరింత విస్తరించాలని భావించింది. కానీ... జగన్ సర్కారు తిరోగమన విధానాల కారణంగా ఇవన్నీ ఆగిపోయాయి. ఇది రాష్ట్రానికి చేసిన అన్యాయం కాదా?



చిత్ర జో!



చింటూ: ఎప్పుడైనా బిహార్ పోయావ్రా!
చిన్నూ: ఐదేళ్లుగా బిహార్లో ఉన్నట్లే ఉంది.. ఇంకెందుకూ పోవడం!
చింటూ: శాండ్ వాక్ చేస్తే ఎక్కువ ఆరోగ్యమట తెలుసా?
చిన్నూ: వాక్ ఓకే కానీ... శాండ్ ఎక్కడా లేదురా సామీ!
చింటూ: ఏదేమైనా... కాస్త నడుము వంచితేనే మంచిది!
చిన్నూ: గోతుల దెబ్బకు ఎప్పుడో వంగిపోయిందిలే!
చింటూ: సర్వభ్రష్టత్వం పట్టిందంటావ్!
చిన్నూ: మరో చాన్స్ ఇస్తే జరిగేది అదే!



పరారే.. పరారే..
పరిశ్రమలు పరారే!

ఇంజనీరింగ్ పూర్తయిందా? అయితే... ఉద్యోగం కోసం హైదరాబాద్ బస్సెక్కాల్సిందే! లేదా... బెంగళూరు, చెన్నై రైలు పట్టుకోవాల్సిందే! ఏపీ యువత వలస బాటే! ఇటు సర్కారు కొలువులు లేవు. ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలూ రావు! ఇది... జగన్ సర్కారు అస్థిర విధానాలు, కక్షపూరిత నిర్ణయాల ఫలితం! దీనిని అనుభవిస్తున్నది మాత్రం రాష్ట్ర యువత!

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు రావాలన్నా, ఖజానాకు ఆదాయం రావాలన్నా... కొత్తగా పెట్టుబడులు రావాలి. పరిశ్రమలు ఏర్పాటు కావాలి. దీని కోసం... పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించాలి. పెట్టుబడులకోసం పరితపించాలి. ఏ ప్రభుత్వమైనా ఇదే చేస్తుంది. జగన్ సర్కారు మాత్రం అంతా 'రివర్స్'. అప్పుల కోసం, స్వీయ రక్షణ కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం... ప్రతిపక్షనేతలను, ప్రశ్నించినవారిని వేధించడం తప్ప పెట్టుబడులు తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలే చేయలేదు. ఐదేళ్ల పాలనలో మొక్కుబడిగా జగన్ ఒకేఒక్కసారి దావోస్ పర్యటనకు వెళ్లొచ్చారు. ప్రతిపక్షాలు, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు, వ్యతిరేకత రావడంతో గతేడాది మార్చిలో విశాఖపట్నంలో హడావుడిగా పెట్టుబడుల సదస్సు ఏర్పాటు చేశారు. గతంలో ఒప్పందాలు చేసుకున్న కంపెనీలతోనే మళ్లీ చేసుకోవడంతో పాటు ఊరూపేరూ లేని వాటితో కూడా ఎంవోయూలు కుదుర్చుకుని.. ఇక రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చేసినట్టేనన్నంత బిల్డప్ ఇచ్చారు. లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాలు వస్తాయని కలరింగ్ ఇచ్చారు. ఇప్పటికీ వాటి జాడలేదు. జగన్ ఐదేళ్ల పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి ఉన్న పరిశ్రమలు కూడా పొరుగు రాష్ట్రాల బాట పట్టాయి. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు ప్రభుత్వం ఏమాత్రం చేయూత ఇవ్వలేదు. కొవిడ్ దెబ్బకు కుదేలైన చిన్నపరిశ్రమలను ఆదుకునేందుకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల విషయంలో చేతులెత్తేసింది. ఐదేళ్ల పాలనలో జగన్ సర్కారు పారిశ్రామిక రంగంలో సాధించిన 'ఘనత' ఇదీ. దీని ఫలితం... దేశంలోనే అత్యధికంగా 24 శాతం నిరుద్యోగం ఏపీలోనే ఉంది.

గతంలో ఓ బ్రాండ్...

టీడీపీ హయాంలో ప్రపంచస్థాయి సంస్థలు, విదేశీ పెట్టుబడులు, దేశంలోనే దిగ్గజ కంపెనీల పెట్టుబడుల రాకతో రాష్ట్రం కళకళలాడుతుండేది. రాష్ట్రానికి మరిన్ని కంపెనీలు, పెట్టుబడులను ఆకర్షించడం కోసం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనువైన వాతావరణం కల్పించారు. ఏపీకి ఒక బ్రాండ్ సృష్టించారు. పెద్దపెద్ద కంపెనీల రాకతో విడిపోయిన రాష్ట్రానికి, ప్రజలకు అభివృద్ధిపై ఒక ఆశ కల్పించారు.

జగన్ రాకతో 'తిరోగమనం'

2019లో జగన్ ప్రభుత్వం రావడంతో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం తిరోగమన బాట పట్టింది. వైసీపీ నాయకుల కమీషన్ల కక్కుర్తి, జగన్ రాజకీయ కక్షతో పరిశ్రమలు, పెట్టుబడులను తరిమేశారు. ఒకేఒక్కసారి దావోస్ వెళ్లి... అరబిందో ప్రతినిధులకు షేక్‌హ్యాండ్ ఇచ్చి వచ్చేశారు. గత ఏడాది మార్చిలో విశాఖ పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా... 'మొత్తం ఆరు శాఖలు.. 18 రంగాలు.. 386 ఒప్పందాలు.. రూ.13.11 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు.. 6 లక్షల ఉద్యోగాల కల్పన.. దేశంలోనే ఏపీ కీలకంగా మారబోతోంది'... అని జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. అదంతా ఉత్తిదే! కోటి రూపాయలు కూడా పెట్టుబడి పెట్టే స్థాయి లేని కంపెనీలు.. ఊరూ పేరూ లేని కంపెనీలతో పాటు చివరికి యూట్యూబ్ చానళ్లు, టీవీ యాంకర్లతో కూడా ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. ఏడాది అయినా ఒప్పందాలు చేసుకున్నట్టుగా లక్షల కోట్ల పెట్టుబడులు రాలేదు. జగన్ చెప్పిన ఉద్యోగాలూ ఇవ్వలేదు. ఎంవోయూలు చేసుకున్న చాలామంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపే చూడటం లేదు.

ఐదేళ్ల పాలనలో కొత్త పెట్టుబడుల్లేవ్

- ఆ దిశగా ప్రయత్నాలే చేయని జగన్ సర్కారు
- ఒకే ఒక్కసారి దావోస్ పర్యటన
- గొప్పకోసం విశాఖ సదస్సులో 'షో'
- పాత కంపెనీలతో మరోసారి ఒప్పందాలు
- 13 లక్షల కోట్ల పెట్టుబడులంటూ షో
- 6 లక్షల ఉద్యోగాల కల్పనంటూ బిల్డప్
- వైసీపీ సర్కారు అస్థిర విధానాలతో రాష్ట్రంవైపు చూడని పారిశ్రామికవేత్తలు
- ఎంఎస్ఎంఈలకూ ప్రోత్సాహకాలు కరువు
- 4 వేల కోట్లకుపైగా బకాయిలు పెండింగ్
- రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కుదేల్
- ఉపాధి అవకాశాల్లేక యువత విలవిల

ఆ కంపెనీల జాడేదీ...

విశాఖ సదస్సులో పలు కంపెనీలతో ఒప్పందాలలో పేర్కొన్న గణాంకాలను చూసి ఆర్థిక నిపుణులు విస్తుపోతున్నారు. ఉదాహరణకు ఎన్టీపీసీ ఏకంగా రూ.2,35,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఆ కంపెనీ మొత్తం మూలధనం కేవలం 25 వేల కోట్లు. ఏబీసీ లిమిటెడ్ రూ.12,000 కోట్లు, రెన్యూ పవర్ 97,550 కోట్లు, ఇండోసోల్ 76,033 కోట్లు, ఏసీఎంఈ 68,976 కోట్లు, టీసీపీఎస్‌పీఎల్ 65,000 కోట్లు, జేఎస్‌డబ్ల్యూ 50,632 కోట్లు, హంచ్ వెంచర్స్ 50,000 కోట్లు, గ్రీన్‌కో 47,600 కోట్లు, ఓసీఐవోఆర్ 40,000 కోట్లు, హీరో ఫ్యూచర్స్ సంస్థ 30,000 కోట్లు చొప్పున పెట్టుబడులు పెడతామంటూ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీలన్నీ పత్తా లేకుండా పోయాయి.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ప్రోత్సాహకాలపై వంచన

'రాష్ట్రంలో దాదాపు 25 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలున్నాయి. దాదాపు 70 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. కొవిడ్ దెబ్బతో చిన్నపరిశ్రమలు ఒక్కసారిగా కుదేలైపోయాయి. తిరిగి కోలుకునేలా రీస్టార్ట్ ప్యాకేజీ అమలు చేస్తాం. విద్యుత్ చార్జీల రీయింబర్స్‌మెంట్, అమ్మకం పన్ను మూలధన రాయితీ తదితర ప్రయోజనాలు కల్పిస్తాం. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందిస్తాం' అని గొప్పలు చెప్పిన జగన్ సర్కారు పారిశ్రామికవేత్తలను నమ్మించి గొంతు కోసింది. ఎంఎస్ఎంఈలకు చెల్లించాల్సిన పారిశ్రామిక ప్రోత్సాహకాల పాత బకాయిలే రూ.4 వేల కోట్లకుపైగా పేరుకుపోయాయి. కొత్తగా వచ్చిన క్లెయిములు మరో రూ.3 వేల కోట్ల వరకు ఉంటాయని సమాచారం. జగన్



ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందకపోవడంతో యూనిట్ల నిర్వహణ భారంగా మారిపోయిందని పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనకు దిగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎంఎస్ఎంఈలకు ప్రతి ఏటా ఆగస్టులో ప్రోత్సాహకాలు అందజేస్తామంటూ జగన్ ప్రభుత్వం సంక్షేమ క్యాలెండరులో ప్రకటించింది. కానీ, దానిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైంది. ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా.. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, విద్యుత్ డ్యూటీ, గ్రిడ్ మద్దతు చార్జీలు అంటూ రకరకాల పేర్లతో భారం మోపింది. మరోవైపు ఇంధన ధరలు, ముడిసరుకులు, లాజిస్టిక్స్, లేబర్ చార్జీలు విపరీతంగా పెరిగిపోవడంతో ఈ మూడేళ్లలోనే ఉత్పత్తి వ్యయం రెట్టింపు అయింది. ఈ నేపథ్యంలో పరిశ్రమలను నడపలేక, బ్యాంకులకు అప్పుల వాయిదాలు చెల్లించలేక నలిగిపోతున్నారు.

కరెంటు షాకులే...

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంలో విద్యుత్తు చార్జీలు, ప్రోత్సాహకాలు చాలా కీలకం. కానీ.. 'మీరు రానక్కర్లేదు. మీరు మాకు అక్కర్లేదు' అన్నట్లుగా పెట్టుబడిదారులకు జగన్ సర్కారు షాకులు ఇస్తోంది. ఒడిసా, గుజరాత్‌లలో పారిశ్రామిక విద్యుత్తుకు భారీ రాయితీలు ఇస్తుండగా.. ఏపీలో అంతకు రెండింతలు వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి కరెంటు షాకులు భరించేకంటే.. పక్క రాష్ట్రాలకు పోవడమే మేలని పెట్టుబడిదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్తు టారిఫ్ బెదిరించేలా ఉందని పారిశ్రామికవేత్తలు బెంబేలెత్తిపోతున్నారు.

ఆనాటి ముచ్చట

ఇందిరనే వణికించిన 'కాసు'!

- కాంగ్రెస్ నుంచి ఆమెను బహిష్కరించిన బ్రహ్మానందరెడ్డి

కాంగ్రెస్ పార్టీని తన కనుసన్నలతో శాసించిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన రాజకీయ నేత ఒకరు వణికించారు. ఆమెను ఏకంగా పార్టీ నుంచి సస్పెండ్ కూడా చేసి సంచలనం రేపారు. ఆయనే 1964-71 వరకూ ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాసు బ్రహ్మానందరెడ్డి. 1955లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో అప్పటి ఫిరంగిపురం నియోజకవర్గం నుంచి ఎన్నికైన కాసు తొలిసారి చట్టసభలో అడుగుపెట్టారు. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మొదటిసారిగా ఓటమి పాలైంది. ఆ సమయంలో పార్టీ అధ్యక్ష పదవికి నిర్వహించిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత సిద్ధార్థ శంకర్ రేపై విజయం సాధించి బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఓటమితో కుదేలైన పార్టీలో జవజీవాలు నింపడానికి శాయశక్తులా కృషి చేశారు. ఈ క్రమంలో ఇందిరాగాంధీతో విభేదాలు తలెత్తడంతో ఆమెను ఏకంగా పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోయింది. ఒక వర్గానికి ఇందిర, మరో వర్గానికి కాసు బ్రహ్మానందరెడ్డి సారథ్యం వహించారు. ఆయన నేతృత్వం వహించిన పార్టీనే ఆ తర్వాత రెడ్డి కాంగ్రెస్‌గా రూపాంతరం చెందింది. కాగా, 1978లో ఏపీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ వర్గం ఘనవిజయం సాధించింది. దీంతో ఆయన ఆత్మపరిశీలన చేసుకుని రెడ్డి కాంగ్రెస్‌ను 1980లో ఇందిరా కాంగ్రెస్‌లో విలీనం చేశారు.


-గుంటూరు, ఆంధ్రజ్యోతి



ఇందిరాగాంధీతో బ్రహ్మానందరెడ్డి

అట్లుంటది అన్నతోని..





కూల్చక ముందు 'ప్రజా వేదిక' సముదాయం

శుభం పలకరా పెళ్లి కొడకా... అంటే ఇంకేదో అన్నాడట! అధికారంలోకి రాగానే ఎవరైనా మంచి పనితో పాలన మొదలుపెడతారు. కానీ... సీఎం జగన్ మాత్రం కూల్చివేతలతో మొదలుపెట్టారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లు, అధికారులతో సమీక్షలు, సమావేశాల కోసం చంద్రబాబు సర్కారు 'ప్రజావేదిక'ను నిర్మించింది. ముఖ్యమంత్రి నేరుగా ప్రజలను కలిసేందుకూ ఇదే వేదికగా మారింది. కానీ... సీఎంగా నిర్వహించిన తొలి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనే ప్రజా వేదికపై జగన్ 'అక్రమ కట్టడం' అనే ముద్ర వేశారు. 'మీకు తెలుసా... మనం అక్రమ కట్టడంలో కూర్చుని చర్చలు జరుపుతున్నాం. ఇక్కడ ఇదే ఆఖరి సమావేశం కావాలి. ఈ సమావేశం పూర్తి కాగానే దీనిని కూల్చి వేయండి' అని 2019 జూన్ 24న జగన్ ఆదేశాలు జారీ చేశారు. రాత్రికి రాత్రే ప్రజావేదికను కూల్చివేశారు. జగన్ కూల్చిన మొదటి, ఆఖరి 'అక్రమ' కట్టడం అదొక్కటే. రూ.8 కోట్ల ప్రజాధనంతో వెచ్చించి నిర్మించిన ఆ కట్టడాన్ని తాను వాడుకోవడం ఇష్టంలేకుంటే... ఆస్పత్రిగా మార్చొచ్చు. హాస్టల్ భవనంలా ఉపయోగించవచ్చు. ఇంకేదైనా ప్రజోపయోగ పనులకోసం వాడుకోవచ్చు. కానీ... దానిని నేలమట్టం చేసేశారు. జగన్ హింసానందానికి ఇదో మచ్చు తునక!

కట్టడం కాదు... కూల్చడం!



ప్రస్తుతం ప్రజావేదిక శిథిలాలు



ప్రజావేదికను కూల్చివేస్తున్న దృశ్యం

కావాల్సిన నాయకుడిని ఎన్నుకునేందుకు తెలివిగా సిద్ధమైతే తప్ప ప్రజాస్వామ్యం విజయం సాధించదు.



- ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్



సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు

అబ్బ ఛా!

మేమే బాధితులం...!

టీడీపీ దుకాణం బంద్ అవుతుండటంతో ఏం చేయాలో తెలియక... రాష్ట్రమంతా మాపై దాడులు చేస్తున్నారు. తిరిగి వాళ్లే బాధితుల మాదిరి పోజులిస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. నిజానికి మేమే బాధితులం. మా నిగ్రహాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు. మేం కన్నెర్ర చేస్తే టీడీపీ వాళ్లు రోడ్లపై తిరగలేరు.

రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు నడిచినప్పుడు భవన నిర్మాణ కార్మికులు మధ్యాహ్నాలు అక్కడే ఆకలి తీర్చుకునేవారు. క్యాంటీన్లలో రూ. 5కే భోజనం లభించడంతో వారికి ఖర్చులు బాగా కలిసివచ్చేవి. జగన్ అధికారంలోకి రాగానే వారికి క్యాంటీన్ భోజనం దూరం చేశారు. అన్నక్యాంటీన్ల కోసం నిర్మించిన అవుట్ లెట్‌లను వేరే అవసరాలకు వాడుతున్నారు. ఔత్సాహికులు, టీడీపీ నేతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సొంత ఖర్చుతో కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన క్యాంటీన్లనూ బలవంతంగా మూతేయించారు. భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, చిన్న జీతాలకు పనిచేసేవారు, యాచకులు.. రూ.5కు భోజనం పెట్టిన అన్న క్యాంటీన్లను తలుచుకుని బాధపడుతున్నారు.

బ్రిటిషర్ల హయాంలో డొక్కా సీతమ్మ వంటి మంచి మనసు ఉన్న తల్లులు అన్నార్తుల కడుపు నింపారు. భారతీయులపై కఠిన చట్టాలు మోపిన తెల్లదొరలు సైతం ఆనాడు ఇలాంటి కార్యక్రమాలను అడ్డుకోలేదు. తమిళనాడులో జయలలిత అమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన స్టాలిన్ ప్రభుత్వం వాటిని కొన సాగించింది. క్యాంటీన్లలోని జయ ఫొటో కూడా తొలగించలేదు. కానీ, కక్ష సాధింపు రాజకీయాలకు తెరతీసిన జగన్.. పేదల కడుపు నింపే కార్యక్రమాలను ప్రోత్సహించ కపోగా, వాటిని మూసేయించేదాకా నిద్ర పోవడం లేదు. వాటిని చంద్రబాబు ప్రారంభించడం వల్లే పగ పట్టినట్టు వ్యవహరిస్తున్నారు.

పట్టెడన్నంపై పగ



అనంతపురం బళ్లారి బైపాస్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్..

నాడు



నేడు శిథిలావస్థలో..

'అన్న క్యాంటీన్ల' అంతానికి జగన్ పంతం
చంద్రబాబు పెట్టారనే కారణంగా మూసివేత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజలకు పట్టెడన్నం పెట్టడం ప్రభుత్వాల బాధ్యత. అన్నపూర్ణగా పేరుపడిన రాష్ట్రానికి 'అన్నమో రామచంద్రా' అనే పరిస్థితి రాకూడదని చంద్రబాబు ప్రభుత్వం భావించి ఏర్పాటుచేసినవే అన్న క్యాంటీన్లు. అప్పట్లో ప్రభుత్వం జనం కడుపు చూసింది. పట్టణ పేదలకు పూటకు రూ.5లకే భోజనం పెట్టింది. పేదల ఆకలి తీర్చడానికి రూ.2కే కిలోబియ్యం అందించిన అన్న ఎన్టీఆర్ స్ఫూర్తికి క్యాంటీన్లు కొనసాగింపు. అందుకే అవి 'అన్న క్యాంటీన్లు'గా రాష్ట్రమంతా మన్ననలు అందుకున్నాయి. చంద్రబాబు తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ జనం జేబులు ఖాళీ చేయడమే పనిగా పెట్టుకున్నారు. మరోవైపు చంద్రబాబు ఏర్పాటుచేశారనే కారణంగా అన్న క్యాంటీన్ల ఉనికిని సైతం జగన్ సహించలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్న క్యాంటీన్ల బోర్డులు మార్చేశారు. పట్టణాల్లో వాటిని వార్డు సచివాలయాలుగా మార్చు చేశారు. ఇతర చోట్ల వేరే అవసరాలకు వాడుతున్నారు. కోట్లమంది లబ్ధి పొందిన క్యాంటీన్ల విషయంలో సర్కారు వైఖరి ప్రజలకు నచ్చలేదు. వారి నుంచి తీవ్ర వ్యతిరేకత కావడంతో... త్వరలోనే క్యాంటీన్లు తెరుస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతూ వచ్చారు. అనంతరకాలంలో అయిష్టంగానే 'ఆహా క్యాంటీన్లు' తెరిచారు. నిర్వహణకు వ్యవస్థను ఏర్పాటుచేయకుండా...బడ్జెట్ ఇవ్వకుండా 'ఆహా క్యాంటీన్ల'ను కావాలనే నామ్‌కే వాస్తేగా జగన్ సర్కారు మిగిల్చింది.



216 క్యాంటీన్లకు రూ.100 కోట్లు మాత్రమే ఖర్చు కావాలి.

మరి రూ.150 కోట్ల అవినీతి ఎలా జరిగింది? ఎలాంటి సాక్ష్యాలు లేకుండా, ఏ మాత్రం విచక్షణ లేకుండా కోట్లాది మంది ఆకలి తీర్చిన ఈ వ్యవస్థపై విషం చిమ్మి మూసివేయించారు.

పట్టెడన్నంపై ఇంత పగా?

నరసరావుపేట, సత్తెనపల్లి వంటి ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. కొన్ని ప్రాంతాల్లో క్యాంటీన్లకు వైసీపీ పార్టీ రంగులు పులిమారు. చాలా ప్రాంతాల్లో క్యాంటీన్ అవుట్ లెట్‌లను వార్డు సచివాలయాలుగా మార్చారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో త్వరలోనే క్యాంటీన్లు తెరుస్తామంటూ మంత్రులు ప్రకటనలు చేసి కాలయాపన చేశారు.

'అన్నం పెడితే అడ్డుకోవడం ఏంటి?

అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచిత భోజనాలు పెడుతున్న వారిని వేధింపులకు గురి చేయడంపై కొందరు హైకోర్టులో కేసులు వేశారు. కృష్ణా జిల్లా నందిగామలో టీడీపీ నడుపుతున్న అన్న క్యాంటీన్‌ను అధికారులు అడ్డుకోవడంపై హైకోర్టు మండిపడింది. 'అన్నం పెడితే అడ్డుకోవడం ఏమిట'ని జగన్ సర్కారును ప్రశ్నించింది. అయినా ప్రైవేటుగా నడుస్తున్న క్యాంటీన్లు మూసివేస్తోంది.

పేదల బువ్వపై బురద

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ సర్కారు చేపట్టిన పోలవరం, అమరావతి, ఇతర పథకాలపై ఆరోపణలు చేసినట్లే అన్న క్యాంటీన్లపై కూడా దుష్ప్రచారం చేశారు. క్యాంటీన్ల ఏర్పాటు, నిర్వహణలో అవినీతి జరిగిందంటూ రోత పత్రికలో రాయించారు. రాబడిలేని వ్యవస్థను కొనసాగించాల్సిన అవసరం ఏముందని నాటి మున్సిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటులో రూ.150 కోట్ల అవినీతి జరిగిందంటూ..బాగా నడిచిన వ్యవస్థపై బురద చల్లారు. రూ.రెండు లక్షలతో చేపట్టే నిర్మాణానికి 50 లక్షలు ఖర్చు చేశారని ఎంపీ విజయసాయిరెడ్డి లాంటివారు ఆరోపణలు చేశారు.

పట్టణ పేదలకు నాడు రూ.5కే భోజనం
రోజుకు రెండున్నర లక్షల మందికి వడ్డన

రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడూ ఆకలితో నిద్రపోకూడదు అనే సదుద్దేశంతో టీడీపీ ప్రభుత్వం 2018 జూన్ 11న అన్న క్యాంటీన్లకు శ్రీకారం చుట్టింది. కూలీలు, కార్మికులు, చిరు వ్యాపారులు, యాచకులు...ఇలా పట్టణ పేదలు నామమాత్రపు ఖర్చుతో మూడుపూటలా కడుపు నింపుకొనేలా అన్న క్యాంటీన్లకు రూపకల్పన చేశారు. పల్లెల నుంచి పట్టణాలకు ఉపాధి కోసం వచ్చే కూలీలు, చిరుద్యోగులు తమ సంపాదనలో సగానికి పైగా భోజనానికి ఖర్చు చేయడం వారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేది. దీన్ని గమనించి రూ.5లకే కడుపు నిండా భోజనం అందించాలని చంద్రబాబు ప్రభుత్వం ఆలోచించింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణప్రాంతాల్లో మొదట 216 క్యాంటీన్లు ప్రారంభించి ఆ తర్వాత వాటి సంఖ్యను 368 దాకా పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేవలం రూ.15 ఖర్చుతో మూడు పూటలా పేదలకు కడుపునిండా అన్నం పెట్టేలా ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంటీన్‌లో సగటున ఉదయం 300 మందికి, మధ్యాహ్నం 400 మందికి, రాత్రి 250 మందికి.. ఇలా 950 మంది చొప్పున క్యాంటీన్లలో రోజుకు దాదాపు రెండున్నర లక్షల మంది ఆకలి తీర్చుకునేవారు. ప్రారంభించిన నాటి నుంచి జగన్ 2019 ఆగస్టు 1న క్యాంటీన్లు మూసివేసే నాటికి 7.25 కోట్ల మంది అన్న క్యాంటీన్లలో భోజనాలు చేశారు. దీనికోసం ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.132 కోట్లు. 'అక్షయపాత్ర' అనే స్వచ్ఛందసంస్థతో ఒప్పందం కుదుర్చుకుని వేడివేడి భోజనం అందించారు.



రోజుకు రెండున్నర లక్షల మంది తినేవారు

ముద్ద కోసం యుద్ధం

టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలో మూడు క్యాంటీన్లు నడుస్తున్నాయి. మంగళగిరి బస్టాండ్ వద్ద ఒకటి, దుగ్గిరాల రైలుపేట, నులకపేట సెంటరులో విగతా రెండు విజయవంతంగా నడుస్తున్నాయి. దుగ్గిరాల రైలుపేట వద్ద రెండు నెలలకుపైగా నడుస్తుండగా, మిగతావి దాదాపు రెండేళ్లకుపైగానే జనం ఆకలి తీర్చుతున్నాయి. అందులోనూ...జగన్ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రద్దుచేసిన తర్వాత.. రాష్ట్రంలోనే తొలి క్యాంటీన్ లోకేశ్ నాయకత్వంలో మంగళగిరిలోనే ఏర్పాటైంది. పెట్టిన అనతికాలంలోనే ఈ క్యాంటీన్లకు మంచి గుర్తింపు లభించింది. ప్రభుత్వ పాఠశాలలో పెడుతున్న భోజనం బాగా లేదని చాలామంది పిల్లలు మధ్యాహ్నం వేళ మంగళగిరి బస్టాండ్ వద్ద ఉన్న క్యాంటీన్‌లోనే భోజనాలు చేసేవారు. దీన్నిచూసి ఓర్వలేని జగన్ ప్రభుత్వం, స్థానిక వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి క్యాంటీన్ మూసివేతకు ప్రయత్నించారు. పబ్లిక్ స్థలంలో ఉన్నదనే సాకుతో మున్సిపల్ సిబ్బంది దానిని తొలగించింది. దీనిపై టీడీపీ నేతలు, జనం పెద్ద యుద్ధమే చేశారు. తిరిగి క్యాంటీనును అనుమతించేవరకు పెద్దఎత్తున ఆందోళనలను సాగించారు. చివరకు అక్కడే క్యాంటీన్ నిర్వహణకు అధికారులు అంగీకరించక తప్పలేదు. క్యాంటీన్‌ను తొలగించిన ప్రాంతంలోనే టీడీపీ నేతలు టెంటు ఏర్పాటుచేసి విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

'ఆహా'..లో అదిరిపోయే రేట్లు

అన్న క్యాంటీన్లు మూసివేతపై పట్టణ పేదల నుంచి తీవ్ర వ్యతిరేకతను జగన్ ప్రభుత్వం మూటగట్టుకుంది. దీంతో అయిష్టంగానే 'ఆహా క్యాంటీన్లు' ప్రారంభించింది. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 140 క్యాంటీన్లు ఏర్పాటుచేశారు. వాటిలో 53 క్యాంటీన్లు నిర్వహణాలోపంతో మూతపడ్డాయి. 87 క్యాంటీన్లు నడుస్తున్నాయని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో చాలాచోట్ల సరిగా నిర్వహించడం లేదు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లలో రూ.15కే మూడు పూటలా ఆహారం అందించారు. ఆహా క్యాంటీన్లలో టిఫిన్ల ధరలను నాలుగు రెట్లు అంటే రూ.20-25లకు, భోజనం ధరలను ఎనిమిది రెట్లు అంటే రూ.40లకు పెంచి వడ్డిస్తున్నారు. పోనీ ధర పెంచినా నాణ్యత ఉందా అంటే లేదు. వాటిని నిర్వహించడం సర్కారుకు చేతగాలేదు. ఉమ్మడి చిత్తూరు, విజయనగరం, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో కొన్నిచోట్ల అనేక ఏళ్లుగా నడుస్తున్న టిఫిన్ సెంటర్లకే 'ఆహా క్యాంటీన్లు' అంటూ బ్యానర్లు తగిలించారు. ఎక్కువగా ఈ క్యాంటీన్లు అల్పాహార వడ్డనకే పరిమితం అయ్యాయి.



మూణ్నాళ్ల ముచ్చట...

ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం, తణుకు పాలకొల్లు తదితర పట్టణాల్లో ఆహా క్యాంటీన్లు ప్రారంభించారు. అయితే, కొద్దిరోజులపాటు నిర్వహించిన తర్వాత భీమవరం, పాలకొల్లు, నరసాపురం, నూజివీడుల్లో క్యాంటీన్లు మూసేశారు. విజయనగరం జిల్లా రాజాంలో ప్రారంభించిన క్యాంటీన్ నెలరోజులకే మూతపడింది. అనంతపురంలో ప్రారంభించిన క్యాంటీన్ ఒక్కరోజే నడిచింది. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ కూడలి, తాటిచెట్లపాలెం, సీతంపేటల్లో 2021 సెప్టెంబరులో క్యాంటీన్లు ప్రారంభించారు. అయితే, రెండు నెలలు మాత్రమే అవి నడిచాయి. ఆ తర్వాత మూడూ మూతబడ్డాయి. నెల్లూరులోని పాత మున్సిపల్ కార్యాలయం, మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రారంభించిన ఆహా క్యాంటీన్లు కొన్ని రోజులకే మూతపడ్డాయి.

పైసా కేటాయించకుండానే..

అన్న క్యాంటీన్లతో 'ఆహా..'లను పోల్చడానికి లేదని పట్టణ పేదలు పెదవి విరుస్తున్నారు. క్యాంటీన్ల నిర్వహణకు అయ్యే ఖర్చును అప్పట్లో టీడీపీ ప్రభుత్వమే భరించింది. దీనికి భిన్నంగా వైసీపీ సర్కారు ఆహా క్యాంటీన్ల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. క్యాంటీన్ నిర్వాహకులకు ఆర్థిక సాయం కూడా చేయలేదు. పట్టణ మహిళా సమాఖ్య ద్వారా పొదుపు సంఘాల్లోని సభ్యులతో ఆహా క్యాంటీన్లను ప్రారంభించారు. ఒక్కో దాని ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.13,500 చొప్పున మొదట్లో సమకూర్చింది. దాన్ని కూడా క్యాంటీన్ నిర్వాహకులు నెలకు రూ.500 చొప్పున పట్టణ మహిళా సమాఖ్యకు తిరిగి చెల్లించాలనేది ఒప్పందం. అప్పట్లో అన్న క్యాంటీన్లలో తాగునీరు, ఫ్యాన్లు, నిల్చొని తినేందుకు టేబుళ్లు ఉండేవి. జగన్ తెరిచిన క్యాంటీన్లలో తీసుకున్న ఆహార ప్యాకెట్లను రోడ్లపై నిల్చుని తినాలి. దీంతో చాలామంది వాటి వైపు చూడటం లేదు. దీంతో వ్యాపారం సరిగా సాగక నిర్వాహకులు వాటిని మూసేస్తున్నారు. నష్టమని తెలిసీ వ్యాపారం ఎలా చేస్తామని పొదుపు సంఘం సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

నోట్ దిస్ పాయింట్!

ప్రతి 1,000 మంది జనాభాకు ఓటర్ల సంఖ్య 722

పురుష.. మహిళా ఓటర్ల నిష్పత్తి 1000:1,036



గంగమ్మ మాట..

"నా వయసు 75 ఏళ్లకు పైనే. మా తరంలో ఓటు నిజంగా వజ్రాయుధమే. మంచి చేస్తారని నమ్మకం ఉంటేనే ఓటు వేసేవాళ్లం. పోటీ చేసేది ఏ పార్టీవారైనా.. ఎదురు పడితే గౌరవంగా పలకరించుకునే వాళ్లు. ఇద్దరూ కలిసే ఓట్లు అడిగేవారు. అభ్యర్థుల మధ్య అంత స్నేహం ఉండేది. ఎన్నికలలో ఎలాంటి గొడవలూ ఉండేవి కావు. అమ్మ, అన్న, అత్త, చిన్నమ్మ, పెద్దమ్మ అని వరసలు పెట్టి పిలిచి ఓటు అడిగేవారు. అప్పట్లో ఓట్లు వేసేందుకు ఎద్దుల బండ్లను కట్టుకుని వెళ్లేవాళ్లం. రెండు పార్టీలవారు తమ తమ ఇళ్ల వద్ద టిఫిన్ ఏర్పాటు చేసేవారు. 'మన ఇంటి దగ్గర టిఫిన్ చేసి ఓటు వేసేందుకు వెళ్లండి' అని పిలిచేవారు. ఇది గౌరవమేగానీ.. లంచం కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ఇది చూస్తుంటే బాధ కలుగుతోంది!"

- గంగమ్మ, రెడ్డిపల్లి, పెద్దపప్పూరు మండలం, అనంతపురం జిల్లా

మేము సైతం

ఓటు లేకున్నా ఎన్నికల సేవలో...

స్టీల్ ర్యాకుల తయారీలో నెల్లూరు ఖైదీలు
ఈవీఎంలు భద్రపరిచేందుకు వినియోగం

వారు ఈ దేశ పౌరులే! కానీ... ఓటు మాత్రం వేయలేరు! ఎందుకంటే వారంతా వివిధ నేరాల్లో శిక్ష పడిన ఖైదీలు! ఓటు వేయలేకపోతేనేం... ఈ ఎన్నికల ప్రక్రియలో మాత్రం తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ఈవీఎం బటన్‌ను నొక్కలేకపోయినా... వాటిని భద్రపరిచేందుకు అవసరమైన స్టీల్ ర్యాక్‌లు సిద్ధం చేశారు. వారే... నెల్లూరు కేంద్ర కారాగారంలోని ఖైదీలు! శిక్ష పడిన ఖైదీలకు ఓటు హక్కు ఉండదు. వీరికి శిక్షాకాలంలో జైళ్లలో ఏదో ఒక వృత్తిలో శిక్షణ ఇస్తారు. అందులో భాగంగా నెల్లూరు కేంద్ర కారాగారంలో సుమారు వందమంది ఖైదీలు బీరువాలు, ఇనుప స్టాండ్లవంటివి తయారు చేస్తున్నారు. వాటిని బయట విక్రయించి వచ్చే లాభాన్ని ఖైదీలకు జైళ్ల శాఖ అధికారులు పంచుతారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే స్టీల్ ర్యాక్‌లను ఖైదీలతో తయారు చేయిస్తామని... వాటిని ఉపయోగించుకోవాలని ప్రకాశం, తిరుపతి, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల కలెక్టర్లను జైళ్ల శాఖ అధికారులు కోరారు. అందుకు కలెక్టర్లూ అంగీకరించారు. దీంతో... వంద మంది ఖైదీలు స్టీల్‌ర్యాక్‌ల తయారీలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే తయారైన వాటిలో ఒంగోలుకు 600, తిరుపతికి వెయ్యి ర్యాకులు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి



నెల్లూరు కేంద్ర కారాగారంలో ఈవీఎంలను భద్రపరిచే స్టీల్ ర్యాకులను సిద్ధం చేస్తున్న ఖైదీలు

జనసేన బరిలో ఉన్నచోటే ఆ పార్టీకి గ్లాసు గుర్తు
మిగిలిన చోట్ల స్వతంత్రులకూ ఇచ్చే చాన్స్
ఇదే జరిగితే ఎన్డీయే అభ్యర్థులకు కొత్త చిక్కే!



గాజు గ్లాసుపై పేచీ..!

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి గట్టి చిక్కే వచ్చి పడింది. జనసేన ఎన్నికల గుర్తు అయిన గాజు గ్లాసును స్వతంత్ర అభ్యర్థులకు కూడా అందుబాటులో ఉంచడం తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. జనసేనకు గాజు గ్లాసును ఎన్నికల గుర్తుగా ఇవ్వడాన్ని హైకోర్టు అనుమతించింది. కానీ ఆతర్వాత మరో సమస్య వచ్చి పడింది. ఆ పార్టీ పోటీ చేస్తున్న చోట మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులకు ఈ గుర్తు కేటాయిస్తారు. ఆ పార్టీ అభ్యర్థులు లేనిచోట స్వతంత్ర అభ్యర్థులు ఎవరైనా కోరుకుంటే వారికి ఈ గుర్తు ఇచ్చే అవకాశం ఉంది. ఇండిపెండెంట్లు కోరుకోవడానికి వీలుగా కొన్ని గుర్తులను ఫ్రీ సింబల్స్ పేరిట ఎన్నికల కమిషన్ ముందే ప్రకటించింది. అందులో గాజు గ్లాసు గుర్తు ఉంది. జనసేన అభ్యర్థులు లేనిచోట్ల స్వతంత్ర అభ్యర్థులు అడిగితే ఈ గుర్తు కేటాయిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం స్పష్టం చేసింది. కూటమిలో భాగస్వామిగా జనసేన 21 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లకు పోటీ చేస్తోంది. మిగిలినచోట్ల ఆ పార్టీ మిత్రపక్షాలు టీడీపీ, బీజేపీ బరిలో ఉన్నాయి. జనసేన అభ్యర్థులు లేనిచోట గాజు గ్లాసు గుర్తు స్వతంత్ర అభ్యర్థులకు కేటాయిస్తే తాము నష్టపోతామని ఈ రెండు పార్టీల నేతలు ఆందోళన చెందుతున్నారు. ఈ గుర్తు చూసి స్వతంత్ర అభ్యర్థులకు ఓట్లు వేస్తే తమకు రావలసిన ఓట్లు తగ్గిపోతాయని అంటున్నారు. ఈ పార్టీలకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న వైసీపీ.. జనసేన పోటీ లేని స్థానాల్లో తమకు కావలసిన వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయించి, వారికి గాజు గ్లాసు గుర్తు వచ్చేలా చేసే అవకాశం ఉందని టీడీపీ నేత ఒకరు చెప్పారు. ఇదే జరిగితే సంక్లిష్ట సమస్యలు వస్తాయని కూటమి నేతలు అంటున్నారు. 'కాకినాడ, మచిలీపట్నం ఎంపీ స్థానాల్లో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వాళ్లు తమ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో గాజు గ్లాసు గుర్తును ప్రచారం చేసుకుంటారు. అదే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో టీడీపీ, జనసేన పోటీచేసే అసెంబ్లీ స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు వస్తే పరిస్థితి ఏమిటి? ఓటర్లకు ఇది అయోమయం కలిగించదా? కూటమి ఓట్లు చెదిరిపోవా' అని ఒక నాయకుడు ప్రశ్నించారు. ఈ సమస్యను ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి జనసేన నాయకులు తీసుకెళ్లారు. నిర్ణయం వెలువడాల్సి ఉంది. స్వతంత్ర అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన గుర్తుల నుంచి గాజు గ్లాసును తీసేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఉద్యోగాలు కావాలా..

గంజాయి కావాలా..?

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ స్థానం పరిధిలోని సర్వేపల్లి, సత్యవేడు నియోజకవర్గాల్లో ప్రజాగళం సభల్లో ఆయన పాల్గొన్నారు. గూడూరులో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో కూడా మాట్లాడారు. ఇవి తమ కోసం జరుగుతున్న ఎన్నికలు కావని.. రాష్ట్ర భవిష్యత్ కోసం జరుగుతున్నాయని.. ఎన్డీయేతో పొత్తు తమ కోసం పెట్టుకున్నది కాదని.. రాష్ట్ర భవిష్యత్ కోసమేనని తేల్చిచెప్పారు. '14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశా. నేను చూడని పదవా ఇది. ముఖ్యమంత్రి పదవి నాకు బాధ్యత. జగన్మోహన్‌రెడ్డికి మాత్రం దోపిడీకి లైసెన్స్' అని దుయ్యబట్టారు. ఎన్డీయే ప్రభుత్వం రాగానే గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

నోరు విప్పితే అబద్ధాలే..

జగన్ ఎక్కడ నోరు విప్పినా అబద్ధాలే. సీఎంగా ఉన్నప్పుడు నేను ఏం చేశానని విమర్శిస్తున్నాడు. నేను అభివృద్ధి చేసిన డ్వాక్రా సంఘాలే లేకపోతే ఈరోజు ఆడవాళ్లలో ఇంత చైతన్యం వచ్చేది కాదు. ఈయన అసమర్థ ముఖ్యమంత్రి. గూడూరు నుంచి సిలికాన్ పోయింది. స్వర్ణముఖి నుంచి ఇసుక పోయింది. ఖనిజ సంపదను కూడా దోచేసిన దుర్మార్గులు. వైసీపీ హయాంలో కుంభకోణం లేని స్కీమే లేదు. ఇలాంటి సీఎంకు ఏం పేరు పెట్టాలో అర్థం కాదు. జగన్ రూ.10 ఇస్తే వెయ్యి సొంతానికి లాగేస్తాడు. ఆడబిడ్డకు ఆసరా, పెన్షన్ అంటాడు. అవేవీ కొత్తవి కాదు. రూ.200 నుంచి రూ.2 వేలకు నేను పెన్షన్ పెంచాను. నాసిరకం మద్యం తాగి జనం జబ్బుల పాలవుతున్నారు. ఎక్కడ చూసినా గంజాయి కనిపిస్తోంది. చిన్న కొట్టులో కూడా అందుబాటులోకి వచ్చేసింది. దిశ చట్టం లేనే లేదు. నిర్భయ చట్టం కిందైనా చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కొక్కరిపై రూ.10లక్షల అప్పు పెట్టాడు.

ఆడబిడ్డలు గొప్ప ఆర్థిక మంత్రులు

సమాజంలో ఆడ, మగ అనే తేడా లేదు. మగవాళ్లకు లెఫ్ట్ బ్రెయిన్ పనిచేస్తే ఆడవాళ్లకు రైట్ బ్రెయిన్ పనిచేస్తుంది. రైట్ అంటే ఎక్కువ బలం ఉంటుంది కాబట్టే మా ఆడబిడ్డలు గొప్ప ఫైనాన్స్ మినిస్టర్స్. కేంద్రంలో కూడా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ఉన్నారు. ఆడబిడ్డలకు పుట్టిల్లు టీడీపీ. అత్యధికంగా మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వబోయే పార్టీ. నా ఆడబిడ్డలను ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళలుగా తయారుచేసే బాధ్యత తీసుకుంటా. వారిని లక్షాధికార్లను చేస్తా. ఒకప్పుడు వంట చేయాలంటే ఆడవాళ్లకు పెద్ద సమస్య కళ్లలో నుంచి నీళ్లు వచ్చేవి. పొగతో ఆనారోగ్య సమస్యలు వచ్చేవి. ఆ పరిస్థితిలో నా తల్లిని చూశా. దాన్ని గుర్తుపెట్టుకుని నా తల్లి మాదిరిగా ఆడబిడ్డలు కష్టపడకూడదని సమైక్యాంధ్రలోనే వంటగ్యాస్ ఇచ్చింది టీడీపీ ప్రభుత్వం. ఈసారి అధికారంలోకి రాగానే 18 ఏళ్లపైబడిన ఆడవాళ్లకు నెలకు రూ.1,500 అందజేస్తాం. ఎంతమంది పిల్లలున్నా ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తాం.

జలగ ఎంత పీల్చిందో లెక్కించండి

గతంలో విద్యుత్ చార్జీలు ఎంత చెల్లించాం? ఇప్పుడు ఎంత చెల్లిస్తున్నామో ఆడబిడ్డలందరూ సెల్‌ఫోన్‌లో లెక్కించండి. గతంలో క్వార్టర్ మద్యం రూ.60 ఉంటే రూ.200 చేశారు. అంటే ఐదేళ్లకు రూ.2.50 లక్షలు. ఒక్క మద్యంలోనే జగన్ అనే ఈ జలగ ఎంత పట్టిపీల్చిందో అర్థం చేసుకోండి. డీజిల్, పెట్రోల్, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ఎంత దోచేస్తున్నాడో లెక్కవేయండి. మాట్లాడితే బటన్ నొక్కుతున్నా అంటున్నాడు. బటన్ నొక్కి ఎంత ఇచ్చావ్? నువ్వెంత బొక్కావో ప్రజలకు చెప్పాలి. బటన్ నొక్కడానికి జగనే కావాలా? మన ఇంట్లో ముసలివాళ్లకు ఇస్తే నొక్కలేరా? ఈ జగన్ పాలనలో ఐదుగురు మాత్రమే బలిసిపోయారు. జగన్మోహన్‌రెడ్డి, ఏ-2 విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ.సుబ్బారెడ్డి రూ.లక్షల కోట్లు దోచుకున్నారు. ఇప్పుడు ఆరో వ్యక్తిగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తయారయ్యాడు. జగన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఒక ప్యాలెస్, బెంగళూరులో ఒకటి, విశాఖ, చెన్నైల్లో కూడా ప్యాలెస్‌ల మీద ప్యాలెస్‌లు కట్టుకున్నాడు. పేదలకు మాత్రం ఒక సెంటు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోమన్నాడు, టీడీపీ హయాంలో నెల్లూరు జిల్లాలో 44 వేల టిడ్కో ఇళ్లు కట్టాం. వాటిని కూడా పేదలకు ఇవ్వడానికి మనసురాని దుర్మార్గుడు. ఇలాంటి వ్యక్తికి మళ్లీ ఓటు వేస్తారా.. నో చాన్స్ అంటూ ఇంటికి పంపిస్తారా? ప్రత్యేక హోదా అన్నాడు.. ఒక్క చాన్స్ ఇస్తే సాధిస్తానన్నాడు.. అది వస్తేనే యువతకు ఉద్యోగాలన్నాడు.. మరి హోదా సాధించాడా, ఉద్యోగాలు ఇచ్చాడా? సీపీఎస్ రద్దు అన్నాడు. చేశాడా..!? మరి నో చాన్స్ అంటూ సాగనంపాలా లేదా..? కరెంటు చార్జీలు తగ్గిస్తానన్నాడు, కానీ 8 సార్లు పెంచాడు. జగన్ విద్యా వ్యవస్థను నాశనం చేశాడు. స్కూలుకు రంగులేస్తే చదువులు వస్తాయా!? అవి రావాలంటే టీచర్ల నియామకం జరగాలి.. నా తొలి సంతకం మెగా డీఎస్సీ మీదే చేస్తా.

మేం శవ రాజకీయాలు చేయం..

పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దకు వెళ్లి ఇవ్వాలన్నది నిబంధన. ఆ అవకాశం ఉన్నా జగన్ చేయలేదు. ఉద్దేశపూర్వకంగా వృద్ధులను ఎండల్లో నిలబెట్టి, 60 మందిని చంపేశాడు. ఆయనలా మేం శవరాజకీయాలు చేయం. దివ్యాంగులకు రూ.6 వేలు, వలంటీర్లకు రూ.10 వేలు అందజేస్తాం. నవరత్నాల పేరు చెప్పి జగన్ ప్రజలను ఏమార్చాడు. అవి నకిలీ నవరత్నాలు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా తెలుగుదేశం కూటమి సూపర్ సిక్స్ పథకాలు సృష్టించింది. మరిన్ని సంక్షేమ పథకాలతో త్వరలోనే మేనిఫెస్టో విడుదల చేస్తాం. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.28 వేల కోట్లు ఖర్చుపెట్టని దుర్మార్గుడు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేశాడు. దళితులకు ఇన్నోవా కార్లు కొనిచ్చి జీవనాధారం కల్పిస్తే అదీ పక్కన పెట్టేశాడు. రోడ్డు లేదు. కరెంటు లేదు. నీళ్లు లేవు. ఇవన్నీ చేయకుండా ఇళ్లు ఇచ్చేశామని, మళ్లీ తానొస్తేనే మిగిలిన ఇళ్లు ఇస్తామని బెదిరిస్తున్నాడు. అవన్నీ నమ్మొద్దు. పవన్ రాజకీయాల్లోకి వస్తే ఎందుకంత కడుపుమంట? నీతి నిజాయితీతో, రాష్ట్ర ప్రయోజనాల కోసం ముందుకొచ్చాడు. ప్రభుత్వ వ్యతిరేకత చీలకూడదని పొత్తుకోసం వచ్చిన పవన్ కాలిగోటికి కూడా జగన్ సరిపోడు. పవన్ పెళ్లిళ్ల గురించి పదేపదే మాట్లాడతాడు? అందుకే నాలుగో పెళ్లాంగా రమ్మన్నారు. సిగ్గుంటే పవన్‌తో పోయి సంసారం చేయి. జగన్ ఒక అహంకారి.. విధ్వంసకారుడు.. దోపిడీదారు. రాష్ట్ర సంపదంతా ఆయనకే కావాలి. అడిగితే వారిపై దాడులు చేసి ఇబ్బందులు పెట్టారు. నాకు వయసైపోయిందని జగన్ హేళన చేస్తున్నాడు. నాతో సమానంగా ఒక్క గంట మాట్లాడగలడా? ఇలాంటి సైకో దగ్గర తిట్టించుకుంటుంటే బాధేస్తుంది. 25 ఎంపీలు, 160 అసెంబ్లీ సీట్లు గెలిపించే బాధ్యత మీది.

> చిన్నాన్న వివేకా శవాన్ని అడ్డం పెట్టుకుని హత్యను టీడీపీపై పెట్టాలని జగన్ రాజకీయం చేశాడు. కోడికత్తి డ్రామా ఆడి హత్యాయత్నం జరిగిందన్నాడు. ఇప్పుడు గులకరాయి దాడి పేరిట కొత్త డ్రామా మొదలుపెట్టాడు.
>
> ఐదేళ్లపాటు అందిన వరకు దోచేసిన ఈ సీఎం పేరు జగన్మోహన్‌రెడ్డి కాదు. జే గన్‌రెడ్డి.. మోసపురెడ్డి అని పెట్టాలి. ఆయన్ను నమ్మితే మనమంతా బానిసలుగా బతకాలి. - బాబు



కణేకల్లులో బాబు కేక్ కటింగ్

రాయదుర్గం/పొదలకూరు: టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నేతలు అనంతపురం జిల్లా కణేకల్లులో శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం టీడీపీ రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యానికేతన్ కళాశాలలో చంద్రబాబు చేత కేక్‌కట్ చేయించారు. అంతకు ముందు సర్వమత ప్రార్థనలను నిర్వహించి, మత పెద్దలు చంద్రబాబును ఆశీర్వదించారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. గూడూరులో మహిళలతో ముఖాముఖి సందర్భంగా వారు కూడా ఆయనతో కేక్ కట్ చేయించారు. చెన్నూరుకు చెందిన బాబు అభిమాని సాయిప్రియ.. 20 రోజుల తన కుమార్తెకు పేరుపెట్టాలని కోరగా చంద్రబాబు ఆ చిన్నారికి హాసిని అని పేరు పెట్టారు.



చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ వద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల సంబరాలు



కుప్పంలో కేక్ కట్ చేస్తున్న భువనేశ్వరి

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా
బాబు జన్మదిన వేడుకలు

- కుప్పంలో భువనేశ్వరి పూజలు, కేక్ కటింగ్‌లు, అన్నదానాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రం నలుమూలలా టీడీపీ అధినేత చంద్రబాబు 75వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఈ వేడుకల్లో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. సామగుట్టపల్లెలోని కదిరి నరసింహస్వామి ఆలయంలో ఉదయమే చంద్రబాబు పేరుమీద భువనేశ్వరి పూజలు చేశారు. ఆలయం బయట సూపర్ సిక్స్ పథకాలతో కూడిన భారీ కేక్ కట్ చేశారు. మధ్యాహ్నం కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు తెలుగుదేశం కార్యాలయ ప్రాంగణంలో ముస్లిం మైనారిటీ మహిళలతో కలసి కేక్ కట్ చేశారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలోనూ చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్సేలు పీ అశోక్‌బాబు, ఏఎస్ రామకృష్ణ, తెలుగురైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. గుంటూరు పార్లమెంట్ బీసీ సాధికారసమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళగిరి పానకాల స్వామి దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు వర్ల రామయ్య, కొమ్మారెడ్డి పట్టాభిరాం, వీరంకి గురుమూర్తి 75 కేజీల కేక్‌ను కట్ చేశారు. కాగా, తెలంగాణలో పలు ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరవ్యాప్తంగానూ తెలుగు తమ్ముళ్లు చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైటెక్ సిటీలోని సైబర్ టవర్స్ సాక్షిగా ఆయన పుట్టిన రోజు వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇక చంద్రబాబు అభిమాని సుధాకర్ నగరంలో సైకిల్ యాత్ర నిర్వహించారు.

చంద్రబాబుకు మోదీ శుభాకాంక్షలు

టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ (ట్విటర్)లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. అనుభవజ్ఞుడైన నేతగా ఆయన తన పూర్తి సమయాన్ని ఏపీ సమగ్రాభివృద్ధికి వెచ్చించారు. ఆయనకు సుదీర్ఘ ఆయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ప్రార్థిస్తున్నాను' అని మోదీ పేర్కొన్నారు. చంద్రబాబు స్పందిస్తూ... 'మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

అన్నా వదినలకు షర్మిల బాకీ!

- రూ.82 కోట్లకుపైగా అప్పిచ్చారని వెల్లడి
- అన్న జగన్ ఇచ్చింది రూ.82.58 కోట్లు
- వదిన భారతి ఇచ్చింది రూ.19.56 లక్షలు



నామినేషన్ పత్రాలను వైఎస్ సమాధిపై ఉంచి ప్రార్థిస్తున్న షర్మిల

కడప, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శనివారం కడప ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆమె సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను వెల్లడించారు. అప్పుల విషయానికి వస్తే షర్మిల తన సొంత అన్న, వదినలకే రూ.82 కోట్లకు పైగా బకాయి ఉన్నారు. అన్న జగన్ రూ.82,58,15,000, వదిన భారతి రూ.19,56,620 షర్మిలకు అప్పులు ఇచ్చారు. ఇక, షర్మిల తన భర్త అనిల్‌కు రూ.30 కోట్లు అప్పు ఇచ్చారు. తల్లి విజయలక్ష్మి ద్వారా భర్త అనిల్‌కు రూ.40 లక్షలు అప్పు ఇప్పించారు. షర్మిల పేరుతో బ్యాంకు డిపాజిట్లు రూ.14.64 కోట్లు ఉండగా, భర్త అనిల్ పేరిట రూ.3.80 కోట్లు ఉన్నాయి. షర్మిల పేరిట షేర్లు రూ.2 కోట్లు, అనిల్ పేరిట రూ.2.50 కోట్లు ఉన్నాయి. ఆస్తుల విషయానికి వస్తే షర్మిల పేరుతో రూ.123 కోట్లు, భర్త అనిల్ పేరుతో రూ.40 కోట్లు ఉన్నాయి. అదేవిధంగా షర్మిలకు ఉన్న బంగారు ఆభరణాల విలువ రూ.3.69 కోట్లు, వజ్రాల విలువ రూ.4.61 కోట్లు, అనిల్ పేరిట ఉన్న వజ్రాల విలువ రూ.42.60 లక్షలు, బంగారు ఆభరణాల విలువ రూ.81.60 లక్షలు ఉన్నట్టు అఫిడవిట్‌లో వివరించారు. షర్మిలకు బ్యాంకు ఖాతాల్లో నగదు రూ.22.09 లక్షలు ఉంటే, ఇడుపులపాయలో 39 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కేసుల విషయానికి వస్తే.. షర్మిలపై ఏపీ తెలంగాణలో 8 కేసులు నమోదయ్యాయి. వాటిలో కడపలో ఎన్నికల ప్రచార సమయంలో ఒకటి, విజయవాడలో ఒక కేసు, మిగిలినవి తెలంగాణలో ఉన్నాయి.

'మార్గదర్శి'లో రోజాకు చిట్!

- రూ.39 లక్షల చిట్ వేసిన మంత్రి.. బెంజ్ సహా తొమ్మిది కార్లు సొంతం



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20: మార్గదర్శి చిట్స్‌లో అక్రమాలు జరిగాయని వైసీపీ ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రభుత్వంలోనే మంత్రిగా ఉన్న నగరి ఎమ్మెల్యే రోజా అదే మార్గదర్శిలో రూ.39 లక్షల చిట్ వేయడం గమనార్హం. దీంతో మార్గదర్శిపై వైసీపీ చేస్తున్న విమర్శలు ఉద్దేశ పూర్వకమనే చర్చ సాగుతోంది. శుక్రవారం నగరిలో మంత్రి రోజా ఎన్నికల నామినేషన్‌తో సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు తెలిపారు. మార్గదర్శి చిట్స్‌లో రూ.39,21,120(చిట్ నెంబర్: ఎల్‌టీ030పీ ఎంఏ-48) చిట్ ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.కోటి విలువ చేసే బెంజ్‌కారు ఉందన్నారు. 2019 ఎన్నికల అఫిడవిట్‌లో ఆరు కార్లు, ఒక హోండా పల్సర్ బైక్ ఉన్నట్టు తెలిపిన రోజా, 2024 ఎన్నికల అఫిడవిట్ వచ్చేసరికి మరో 3 కార్లు అదనంగా ఉన్నట్టు తెలిపారు. దీంతో మొత్తం 9 కార్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే, 2019తో పోల్చితే రోజా ఆస్తులు 40 శాతం పెరిగాయి.

వైసీపీకి ఇబ్బందే!

మార్గదర్శిలో రూ.39 లక్షల చిట్ ఉన్నట్టు మంత్రి రోజా వెల్లడించడంతో వైసీపీ ఇరకాటంలో పడింది. మార్గదర్శిలో అక్రమాలు జరిగాయని జగన్ సర్కార్ సీఐడీతో దర్యాప్తు చేయిస్తున్న విషయం తెలిసిందే. గత రెండేళ్ల నుంచి అధికార పార్టీ నేతలు మార్గదర్శిపై విరుచుకుపడుతున్నారు. అయితే, రాష్ట్ర మంత్రి రోజాకు అదే సంస్థలో చిట్ ఉండడంతో ఈ వ్యవహారం అధికార పార్టీని ఇరకాటంలో పడేసింది. దీనిపై సోషల్ మీడియాలో ట్రోల్స్ వెల్లువెత్తాయి.

మూడో రోజు అసెంబ్లీకి 263 నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మూడో రోజు స్వతంత్రులు, చిన్న పార్టీల హవా కనిపించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పార్టీ, జైభారత్ నేషనల్ పార్టీ, జైభీమ్‌రావ్ పార్టీ, ఇండియన్ లేబర్‌పార్టీ, పిరమిడ్ పార్టీ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీల తరఫున నామినేషన్లు దాఖలయ్యాయి. పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. ఇక, గుంటూరు వెస్ట్ నుంచి టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, వైసీపీ అభ్యర్థి, మంత్రి విడదల రజనీ నామినేషన్లు వేశారు. శనివారం ఒక్కరోజే అసెంబ్లీ స్థానాలకు 227 మంది అభ్యర్థులు 263, 25 పార్లమెంటు స్థానాల్లో 37 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు సమర్పించారు.

పరదాల మహారాణి..
ఇక ఇంటికే!

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు అదృశ్యమైతే పట్టలేదని ధ్వజమెత్తారు. 'ప్రతిసారీ నామీద పడి ఏడవడం తప్ప, కనీసం పాలన కూడా చేతకానివాడు' అని దుయ్యబట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం పరిధిలోని కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన వారాహి విజయభేరి సభలో ఆయన మాట్లాడారు. పరదాల మహారాణిని కాకినాడలో ఆదిత్య విద్యార్థులు ఇబ్బంది పెట్టారని.. జగన్ వారిపై కక్షగట్టవచ్చని.. వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 'జగన్‌ను మోదీ గ్యారెంటీతో జైలులో పెడతాం. పైగా జగన్‌కు నచ్చినచోట ప్రత్యేక సెంట్రల్ జైలు ఏర్పాటు చేసి పెడతాం..' అని హెచ్చరించారు. జగన్‌పై 38 కేసులు ఉన్నాయి.. అవేమైనా అవార్డులా అని ఎద్దేవా చేశారు. 'చంచలగూడ జైలులో ఖైదీ నెంబర్ 6093తో 16నెలలపాటు చిప్పకూడు తిన్నాడు..' అని గుర్తుచేశారు. తాను తెగించిన మొండిఘటాన్ని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వస్తుందని.. వైసీపీ గూండాల తాట తీస్తుందని స్పష్టం చేశారు. క్రిస్టియన్లకు అండగా ఉంటానని.. జగన్ విషప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. 'నావల్ల తప్పు జరిగితే కత్తి ఇస్తా.. నా తల నరికేయండి' అని అన్నారు. జగన్‌తో సహవాసం వల్ల పచ్చని గోదావరి జిల్లాలకు విష సంస్కృతి వచ్చిపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఏమన్నారంటే...

అప్పుడలా.. ఇప్పుడిలా..

చిత్రపరిశ్రమలోని ఎందరో ప్రముఖులు, నిర్మాతలు, దర్శకులు రాజానగరం, రాజమహేంద్రవరం ప్రాంతాల్లోని ఇసుక తిన్నెల మీద ఎన్నో అద్భుత చిత్రాలు తీశారు. ఎన్నో అద్భుతమైన పాటలు చిత్రీకరించారు. కానీ ఇవాళ ఇసుక దోపిడీవల్ల తిన్నెలు మాయమయ్యాయి. ఇప్పుడు రాజానగరం అనగానే జిల్లాలోనే అతిపెద్ద గంజాయి వ్యాపారం, బెట్టింగ్ రాకెట్లు.. ఏకంగా మూడు ఇళ్లు తీసుకుని నడుపుతున్నారు. వైసీపీ రహిత రాష్ట్రం కోసమే కూటమి ఏర్పడింది. ఈసారి వైసీపీ పరిపాలన వస్తే ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం కావడం ఖాయం. అది తెలిసే నేను వైసీపీ రహిత రాష్ట్రం కోసం ప్రయత్నం చేస్తున్నాను. 2019 తర్వాత జనసేన బలం పెరిగిందని తెలిసినా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదు.. జగన్ మళ్లీ రాకూడదు.. రాష్ట్రం నాశనం కాకూడదనే లక్ష్యంతో వెళ్తున్నాం.

క్రిస్టియన్ల మీద ఈగవాలనివ్వను..

నేను అన్ని మతాలను సంపూర్ణంగా నమ్ముతా.. అన్ని కులాలను గౌరవిస్తా. నా భార్య కూడా ఓ రష్యన్ క్రిస్టియన్. నేను ఆర్థోడాక్స్ విధానాలు పాటిస్తాను. కానీ జగన్ ఇప్పుడు కొత్త వదంతి తీసుకొచ్చాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే క్రిస్టియన్లకు కష్టకాలమని తన బృందంతో ప్రచారం చేయిస్తున్నాడు. జగన్ జెరూసలెం ఎపుడు వెళ్లాడో తెలియదు. కానీ ఆయనకంటే ముందే జీసస్ నడయాడిన ప్రాంతాన్ని దర్శించాను. క్రిస్టియన్ సోదరులకు మనస్ఫూర్తిగా చెబుతున్నాను. మీ హక్కులకు, రక్షణకు ఏమాత్రం భంగం కలిగినా రాజ్యాంగం సాక్షిగా పూర్తిగా అండగా నిలబడే బాధ్యత తీసుకుంటాను. జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి. కాపులకు రిజర్వేషన్లు తొలగించిన వ్యక్తి జగన్. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు కేంద్రం కల్పించిన 5శాతం రిజర్వేషన్లను చంద్రబాబు అమలు చేస్తే జగన్ అధికారంలోకి రాగానే తొలగించాడు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు జగన్ పాలన మొదలుకాగానే ఎందుకు రద్దయ్యాయో వైసీపీ కాపు నాయకులు ఆయన్ను అడగాలి. ఎన్డీయే అధికారంలోకి వస్తుంది. రాజమహేంద్రవరం నుంచి పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి గెలిచి మంత్రి అవుతారు. కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తి చేసే బాధ్యత మాది.

గజమాలలు, పూలు వేయవద్దు!

- జనసేన శ్రేణులకు పార్టీ విజ్ఞప్తి

జనసేనాని పవన్ విజయ భేరీ యాత్ర నేటి నుంచి నిరాటంకంగా కొనసాగుతుంది. మే 11 వరకూ పవన్ షెడ్యూల్‌ను పార్టీ విడుదల చేసింది. కానీ కొంతకాలంగా ఆయన రికరెంట్ ఇన్ఫ్లూయెంజాతో(ఫ్లూ) బాధపడుతున్నారు. దీని కారణంగా ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి రోజూ ఏదో ఒక సమయంలో జ్వరంతో ఇబ్బందిపడుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని క్రేన్ గజమాలలు ఏర్పాటు చేయవద్దని పార్టీ సూచించింది. కరచాలనాలు, ఫొటోల కోసం ఒత్తిడి చేయవద్దని విన్నవించారు. శనివారం పవన్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు, రాజానగరంలో పర్యటనల సందర్భంగా పవన్ కాన్వాయ్‌లో నాలుగు పోలీసు వాహనాలతోపాటు ప్రైవేటు అంబులెన్స్ చేరింది.

జగనే నా నాలుగో పెళ్లాం

జగన్‌కు ఒకటే చెబుతున్నాను. పదేపదే వ్యక్తిగత దూషణలకు వెళ్తే నాకు కోపం రాదు. కానీ నువ్వు నా సతీమణిని పెళ్లాం అని సంబోధిస్తే నిన్ను నా నాలుగో పెళ్లాం అనాల్సి వస్తుంది జాగ్రత్త. నియోజకవర్గాలను మేమే మార్చామా? 70మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాలు నీవు మార్చలేదా? నీకో న్యాయం.. మాకో న్యాయమా? జగన్‌ది శాడిస్ట్ మనస్తత్వం. నన్ను చూస్తే కుళ్లిపోతున్నాడు. కలుగులో ఎలుక వంటివాడు. ఎవరికి పేరొచ్చినా తట్టుకోలేడు. అతడి స్వభావం అంతే. సినిమా టికెట్ల రేట్ల పెంపుపై మాట్లాడానికి వచ్చిన హీరోలను గేటు దగ్గర నుంచి నడిపించి భోజనం కూడా పెట్టకుండా కించపరిచి ఆనందం పొందిన శాడిస్ట్. అజాతశత్రువు అయిన చిరంజీవి వినయంగా మాట్లాడితే, వాటిని రహస్య కెమేరాల్లో తీసి అవమానపరిచాడు.

జగన్ కోసం 'హంస'!

(మొదటి పేజీ తరువాయి)

కడప జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పైగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను కూడా ఆహ్వానించడం మరిన్ని విమర్శలకు తావిస్తోంది. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ఈసీ అనుమతి లేకుండా చిన్న సమావేశం నిర్వహించడానికీ వీల్లేదు. ఏపీ హంస ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది.

ఇప్పుడే సమావేశం ఎందుకు?

ఆరోగ్య శాఖలో పని చేసే ఉద్యోగులు కొందరు ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం నేతలు సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డితో సన్నిహితంగా ఉంటారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కడప జిల్లాలోని హరిత హోటల్‌లో సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు శుక్రవారం ఏపీ హంస ఒక ప్రకటన విడుదల చేసింది. కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరింది. ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారం కోసం అవగాహన కల్పించనున్నట్టు తెలిపింది. ఈ సమావేశానికి ఏపీ హంస కడప జిల్లా అధ్యక్షుడు రాజారత్నం పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈసీ ద్వారా సస్పెండ్ అయిన వెంకట్రామిరెడ్డికి హంస నేతలు అత్యంత సన్నిహితంగా ఉంటారు. ఆయన సస్పెండ్ అయిన తర్వాత కూడా ఈసీ అనుమతి లేకుండా సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాంటిది.. ఎన్నికల సమయంలో ఏపీ హంస ఏ కారణంతో ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశానికి పిలుపునిచ్చిందో? సమావేశం నిర్వహించడం వెనుక ఆంతర్యం ఏమిటో? అందులోనూ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా కడపలో ఆయనకు అనుకూలంగా ప్రచారానికే ఈ సమావేశం ఏర్పాటు చేసిందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సచివాలయ సిబ్బందితో పనేంటి?

ప్రస్తుతం ఉద్యోగులంతా ఎన్నికల హడావుడిలో ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి కూడా ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈసీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో జగన్‌కు అనుకూలంగానే ఏపీ హంస సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగుల మద్దతు కోసం..

ఐదేళ్లుగా ప్రభుత్వం ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. సమయానికి జీతాలు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వంపై ఉద్యోగులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఈ ఆగ్రహాన్ని చల్లార్చడానికి కొంతమంది ఉద్యోగ సంఘాల నేతలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగుల నుంచి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టేందుకే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ చాంప్‌కు కోగంటి గౌరవ్

విజయవాడ స్పోర్ట్సు: ఇటీవల అన్నమయ్య జిల్లాలో జరిగిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి కోగంటి గౌరవ్ ప్రతిభ కనపరిచి ఈ నెల 28 నుంచి 30 వరకు బెంగళూరులో జరగనున్న జూనియర్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గమిడి సాంబశివరావు గౌరవ్‌ను అభినందించారు. ఈ నెల 21 నుంచి అనంతపురం ఆర్‌టీడీ మైదానంలో జరిగే శిక్షణా శిబిరంలో గౌరవ్ పాల్గొంటాడన్నారు. ఏపీ టీమ్ కోచ్‌గా నగరానికి చెందిన రాయన సురేష్ వ్యవహరిస్తున్నట్టు సాంబశివరావు తెలిపారు.

పశ్చిమలో ఐదుగురు నామినేషన్

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా శనివారం ఐదుగురు నామినేషన్‌లు దాఖలు చేశారు. జై భీమ్ భారత్ పార్టీ అభ్యర్థిగా పరస సురేష్‌కుమార్, స్వతంత్ర్య అభ్యర్థులుగా షేక్ రబ్బానీ, బొబ్బిలి లక్ష్మి, జగదీష్ రామచంద్రరావు, నక్కల సాయిబాబు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి నామినేషన్లను స్వీకరించారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు

ధర్నాచౌక్: ఈ నెల 22 నుంచి నెల రోజుల పాటు ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పీవీ రమణ, యోగా గురువు అంకాల సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియం ఆవరణలో ప్రతి రోజు ఉదయం 5.45 నుంచి 6.45 గంటల వరకు సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగినవారు 80082 234545, 90147 46719, 96668 66986 ఫోన్ నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వలంటీర్లు రాజీనామా

అజిత్‌సింగ్‌నగర్: సెంట్రల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన 19 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. 59వ డివిజన్‌లో 14 మంది, 60వ డివిజన్‌లో ఇద్దరు, 27వ డివిజన్‌కు చెందిన ఒక వలంటీరు, 31వ డివిజన్‌కు చెందిన మరో వలంటీరు మొత్తం 19 మంది రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల అడ్మిన్లకు అందజేశారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని 19 మంది వలంటీర్లు రాజీనామా చేయడం గమనార్హం.

వచ్చే మూడేళ్లలోనే అగ్రభాగాన ఏపీ

● వాడవాడలా ఘనంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు





ఎన్టీఆర్ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న కేశినేని చిన్ని, టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు, బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సుజనా చౌదరి

విద్యాధరపురం, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆధ్వర్యంలో మరో మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి కానుందని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినోత్సవం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం జరిగింది. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్‌తో కలిసి శివనాథ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు చంద్రబాబు మరెన్నింటినో నిర్వహించుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఏడాది సీఎం హోదాలో మరింత ఘనంగా ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించుకుంటారని ఆకాంక్షించారు. తమలాంటి నేతలకు, కార్యకర్తలకు క్రమశిక్షణ, సేవా నిరతిలో చంద్రబాబు స్ఫూర్తి అని చెప్పారు. రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు డూండీ రాకేష్, తెలుగు మహిళా నాయకురాలు షేక్ ఆశా, మహమ్మద్ ఫతావుల్లా, సయ్యద్ రఫీ, యరుబోతు రమణారావు, ఎమ్మార్పీఎస్ నేతలు పేరేలి ఎలిషా, మంద వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మైనార్టీ నేత కరీముల్లా, పశ్చిమ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి నసీమా, క్రిష్టియన్ సెల్ నేత ఉర్ల మోహనరావు, సీనియర్ న్యాయవాది ఎర్నేని వేదవ్యాస్, పొట్నూరి దర్శిత్ ఇంకా పలువురు నేతలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

ప్రజా సంక్షేమంలో చంద్రబాబు నిరంతర కృషీవలుడని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు శనివారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. 4వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గన్నె ప్రసాద్ (అన్న), సింహాద్రి కనకాచారి, కొత్త నాగేంద్రకుమార్ (నాగబాబు) కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. గన్నె ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు నిరంతరం ప్రజల మధ్యన ఉండే నాయకుడని, ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. బల్ల వెంకటేశ్వరరావు గౌడ్, బోయిన సుబ్రహ్మణ్యం, పామర్తి కిషోర్ బాబు, మాదాల రాజ్యలక్ష్మి, వాకా వెంకటేశ్వరగౌడ్, పలసాని నాగమణి, చిట్టా నిర్మల, పొన్నం రవికుమార్, జాస్తి సురేష్, యర్లగడ్డ రమేష్, కర్రి ఉమ, శ్రీలక్ష్మి, జ్యోతి, భాగ్యలక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

బాబు సీఎం కావడం చారిత్రక అవసరం

చంద్రబాబు జన్మదినోత్సవ సందర్భంగా శనివారం పశ్చిమలోని భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో 75కిలోల భారీ కేక్‌ను బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నంతరం మాట్లాడుతూ అరాచక పాలన పోయి రామరాజ్యం రావాలని ఆకాంక్షించారు. ఒక్క అవకాశమని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. అమరావతి అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలు సుఖశాంతులతో జీవించడం కోసం చంద్రబాబు సీఎం కావడం చారిత్రక అవశ్యకమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, బీజేపీ నేత పైలా సోమినాయుడు, జనసేన నేతలు అమ్మిశెట్టి వాసు, రజని పాల్గొన్నారు.

జెండాచెట్టు అభివృద్ధికి రూ.3లక్షలు

భవానీపురం బ్యాంక్ సెంటర్ వద్ద జెండా చెట్టు అభివృద్ధికి టీడీపీ బీసీ, మైనార్టీ నేత, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్‌మీరా రూ.3లక్షల విరాళం ప్రకటించారు. 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో శనివారం నూర్‌భాషా సంఘం నేతల ఆధ్వర్యంలో పార్టీ అధినేత చంద్రబాబు జన్మది వేడుకల సందర్భంగా జరిగిన కేక్ కటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి, పొనుగుపాటి చిన సుబ్బయ్య సూచనల మేరకు బ్యాంక్ సెంటర్ వద్ద జెండా చెట్టు అభివృద్ధికి రూ.3లక్షల విరాళం ప్రకటించామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పేరెంట్స్ కమిటీ మీటింగ్

- అక్కడా వదలని వైసీపీ భజన
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఏకేటీపీలో మీటింగ్
- అత్యుత్సాహం ప్రకటించిన హెచ్‌ఎం, ఇన్‌చార్జి హెచ్‌ఎం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 20: నగరపాలక సంస్థకు చెందిన సత్యనారాయణపురం ఏకేటీపీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఒకవైపు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉంది. పాఠశాలలకు సెలవులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాల మీటింగ్ హాలులో తల్లిదండ్రులను సమావేశపర్చి, వైసీపీ ప్రభుత్వ భజనలో మునిగిపోయారు. దీంతో తల్లిదండ్రులు విస్తుపోయారు. ముందుగా ప్రకటించినట్టు పిల్లల చదువులు గురించి అనుకుని హాజరైతే, దానికి విరుద్ధంగా జగన్మోహనరెడ్డి విద్యాభివృద్ధికి చేపట్టిన పథకాలు, తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం గురించి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుదీర్ఘమైన ఉపన్యాసం ఇవ్వడంతో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఇతర ఉపాధ్యాయులకు, ఇతరులకు అనుమానం రాకుండా రహస్యంగా పాఠశాల ఫిజిక్స్ లాబ్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడితో ఈ సమావేశం ఏర్పాటు చేసి వైసీపీ పట్ల తనకున్న వీరాభిమానాన్ని ప్రదర్శించారు. దీనిపై కొందరు తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మా ఇష్టం మాకు నచ్చినట్టు తల్లిదండ్రులతో మాట్లాడుకుంటాం, మీకు ఇష్టం లేకుంటే ఇక్కడ నుంచి వెళ్లండంటూ విరుచుకుపడ్డారు. దీంతో కొందరు తల్లిదండ్రులకు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడికి మాటల యుద్ధం నడిచింది. దీంతో స్టాఫ్‌రూంలో ఉన్న ఉపాధ్యాయులు వచ్చి గొడవ సద్దుమణిగేలా చేశారు. అయితే కొందరు పేరెంట్స్ వెనక్కి తగ్గకుండా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడి ప్రవర్తనపై ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఈనెల 23న తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి మార్కుల జాబితా ఇవ్వాలని ప్రకటించారని, దీనిపై రాజకీయ దుమారం లేచి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా దీన్ని నిర్వహించకూడదని ప్రభుత్వం వెనక్కి తగ్గి, జూన్ 12న పేరెంట్స్ మీటింగ్ పెట్టుకోవాలని సూచించిందని, ఈ లోగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ ఎందుకు పెట్టారని కొందరు తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. ప్రధానోపాధ్యాయుడు కూడా ఫిర్యాదును పట్టించుకోకుండా సమావేశం ఏర్పాటు చేయడాన్ని సమర్థిస్తూ ఇష్టం ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండి అంటూ ఉచిత సలహా ఇచ్చారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇలాంటి ప్రధానోపాధ్యాయుడిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులు

ఘనంగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 20: స్థానిక గ్రీన్ స్కూల్లో శనివారం రాష్ట్రస్థాయి అండర్-17 చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ఆంధ్రా చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి ఘనంగా ప్రారంభించారు. వేసవి సెలవుల నేపథ్యంలో టోర్నీకి క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. 2 రోజుల పాటు సాగే ఈ టోర్నీలో బాలుర విభాగంలో 100 మంది, బాలికల విభాగంలో 60 మంది పోటీ పడుతున్నారు. గ్రీన్‌స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయి అపర్ణ, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్‌ఎం ఫణికుమార్, నంద్యాల చీఫ్ కోచ్ ఇమామ్ హుస్సేన్ పాల్గొన్నారు.

మాడపాటి గెస్ట్‌హౌస్‌లో అనధికారిక విధులు

వన్‌టౌన్, ఏప్రిల్ 20: స్థానిక తారాపేటలో దుర్గగుడి ఆధ్వర్యంలో ఉన్న మాడపాటి గెస్ట్‌హౌస్‌లో ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వీరి అండతోనే గెస్ట్‌హౌస్‌లో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో దుర్గగుడిలో ప్రైవేట్ సెక్యూరిటీగా విధులు నిర్వహించిన ఓ ఉద్యోగి వ్యవహారశైలి నచ్చక సంస్థ నిర్వాహకులు తొలగించారు. అక్కడి ఉద్యోగుల సాయంతో మాడపాటి గెస్ట్‌హౌస్‌లో అనధికారికంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వారం క్రితం రాత్రివేళలో విధులు నిర్వహిస్తూ ఓ యువకుడికి అనధికారికంగా గెస్ట్‌హౌస్‌లో రూమ్ ఇవ్వడంతో ఆ యువకుడు ఓ యువతిని రూమ్‌కు తీసుకువెళ్లినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. అంతేకాకుండా కొందరు రూమ్‌లు తీసుకుని మందు పార్టీలు చేసుకుంటున్నట్టు ఆరోపణలు వచ్చాయి. పవిత్రమైన అమ్మవారికి చెందిన గెస్ట్‌హౌస్‌లో ఇలాంటి అసాంఘిక కార్యకలపాలు జరపడమేమిటని స్థానికులతో పాటు భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈవో కేఎస్ రామారావు స్పందించి మాడపాటి గెస్ట్‌హౌస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో మంచి భవిష్యత్

● గన్నవరంలో ఉత్సాహంగా యార్లగడ్డ వెంకట్రావు ప్రచారం ● అడుగడుగున మహిళల హారతులు ● ప్రజల నుంచి విశేష స్పందన

గన్నవరం, ఏప్రిల్ 20: పట్టణంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అధిక సంఖ్యలో పాల్గొని జై యార్లగడ్డ అంటూ నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి తనను గెలిపించాలని కోరారు. సమస్యలు తెలుసుకుంటున్నారు. మహిళలు ఎదురుగా వచ్చి హారతులిచ్చి విజయీభవ అని దీవిస్తున్నారు. అందరికీ అండగా ఉంటానని తనను ఆశీర్వదించి శాసనసభకు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు తాను కూడా మరో 6 పథకాలను అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు గన్నవరంలో బహుళ జాతి ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తామన్నారు.

బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్‌గా చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయటంతో పాటు తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన 9 మాసాల్లోపు అర్హులైన పేదలకు 15వేల ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు.



ప్రచారంలో భాగంగా యార్లగడ్డ వెంకట్రావుకు హారతి ఇచ్చి బొట్టు పెడుతున్న మహిళలు

ఏలూరు కాలువపై రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కలం, కేసరపల్లి గ్రామం వద్ద వంతెనలు నిర్మించి ప్రజలకు రహదారి ఇబ్బందులు తొలగిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో మొదటి ఓటు గాజు గ్లాసు గుర్తుకు వేసి పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని, 2వ ఓటు సైకిల్ గుర్తుకు వేసి ఎమ్మెల్యే అభ్యర్థినైన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, జాస్తి శ్రీధర్, ఆళ్ల గోపాలకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీలు శాంతి కిషోర్, పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరరావు, నేతలు అరవపల్లి బోస్, గూడపాటి తులసీమోహన్, కేహెచ్ కోటేశ్వరరావు, మేడేపల్లి రమా, తిరివీధి వినోదరావు, నిడమర్తి బుజ్జారావు, నల్లమోతు రమేష్, ముళ్లపూడి చంద, తిరివీధి నాగరాజు, మోజెస్, పీవీఎస్‌ఆర్ కృష్ణ, బీజేపీ నేతలు నాదిండ్ల మోహన్, కానూరు శేషమాధవి, ఫణికుమార్, కోటేశ్వరరావు, అశోక్, శేషుబాబు, జనసేన నేత చిమట రవివర్మ పాల్గొన్నారు.

యార్లగడ్డ జ్ఞానేశ్వరి ప్రచారం

గుణదల: టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రతినెలా రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్టు టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారని యార్లగడ్డ జ్ఞానేశ్వరి తెలిపారు. మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో గన్నవరం నియోజకవర్గం కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావును, మచిలీపట్నం ఎంపీగా బాలశౌరిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో చంద్రన్న పాలన రావాలని ఓటర్లు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. తన భర్త గెలిచాక చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. టీడీపీ సీనియర్ నేతలు గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, ఇజ్జి రామారావు, సర్నాల బాలాజి, పొదిలి దుర్గారావు, మహేష్ పాల్గొన్నారు.



తమ కావాల్సిన పుస్తకాలను ఎంచుకుంటున్న పుస్తక ప్రియులు

పుస్తక వితరణకు అపూర్వ స్పందన

పటమట, ఏప్రిల్ 20: స్థానిక సర్వోత్తమ గ్రంథాలయంలో శనివారం వేలాది పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. బెంగళూరు మనసు ఫౌండేషన్ స్థాపకులు మన్నెం వెంకటరాయుడు ఉచిత పుస్తక పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. తాము చదివిన పుసకలు గ్రంథాలయాల ద్వారా ఉచితంగా అందించాలని పౌరులకు అవగాహన రావడం గొప్ప విషయమన్నారు. ఎక్కడ దొరకని అపూర్వమైన పుస్తకాలు ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ 8ఏళ్లుగా ఈ పుస్తక ప్రదర్శన ద్వారా రూ.2లక్షలకు పైగా పుస్తకాలు అందించామని, ఇది తమకు ఆనందాన్ని ఇస్తోందన్నారు. పుస్తక పంపిణీలో సుమారు 35 వేలకు పైగా పుస్తకాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి.పూర్ణచంద్, డి.అశోక్‌కుమార్, వి.కేశవరావు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



సిద్ధార్థ మహిళా కళాశాల జట్టుకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ కల్పన

నెట్‌బాల్ పోటీల విజేత సిద్ధార్థ మహిళా కళాశాల

లబ్బీపేట, ఏప్రిల్ 20: సిద్ధార్థ మహిళా కళాశాలలో శనివారం కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల నెట్‌బాల్ మహిళల టోర్నమెంట్ జరిగింది. కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి ప్రారంభించారు, 4 కళాశాల నుంచి జట్లు పాల్గొనగా లీగ్ పద్ధతిలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సిద్ధార్థ మహిళా కళాశాల ప్రథమ స్థానంలో, ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, వికాస్ కాలేజ్ ఆఫ్ పీజికల్ ఎడ్యుకేషన్ తృతీయ స్థానంలో, సీహెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 4వ స్థానంలో నిలిచాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన బహుమతులు అందజేశారు. సెలక్షన్ కమిటీ మెంబర్స్ ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గులకరాయి దాడి పూర్తిగా
పోలీసుల వైఫల్యమే..!

● టీడీపీ జిల్లా లీగల్ సెల్ న్యాయవాది బాలస్వామి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 20: జగన్‌పై జరిగిన గులకరాయి దాడి ఘటన పూర్తిగా పోలీసుల వైఫల్యమేనని, సీఎం జగన్ భద్రతా వైఫల్యానికి కారణమైన పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ న్యాయవాది నెలిబండ్ల బాలస్వామి డిమాండ్ చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయిదాడి ఘటనలో మైనర్లను మేజర్లుగా చూపించి, ఏ1గా చెబుతున్న వేముల సతీష్‌ను అరెస్ట్ చేశారన్నారు. వేముల దుర్గారావును ఈనెల 16న అరెస్ట్ చేశారని, ఇప్పటి వరకు కోర్టుకు హాజరు పరచకుండా చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డారన్నారు. దుర్గారావును చిత్రహింసలు పెట్టి తప్పుడు స్టేట్‌మెంట్లు తీసుకోవడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. దుర్గారావు భార్య తన భర్త ఆచూకీ తెలీక ఆందోళనలో ఉందన్నారు. గులకరాయి కేసులో బొండా ఉమాపై అక్రమ కేసులు బనాయించి ఆయన్ను ఎన్నికల ప్రచారంలో తిరగనీయకుండా రాజకీయలబ్ధి పొందాలని వెలంపల్లి శ్రీనివాస్ చూస్తున్నాడన్నారు. ఆయన్ను చూసి సెంట్రల్ ప్రజలు అసలు తగిలిన దెబ్బ ఎంటి? కట్టిన కట్టు ఏంటని నవ్వుకుంటున్నారన్నారు. కేసుకు సంబంధం లేని అమాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారే గానీ జగన్‌పై దాడికి పాల్పడిన అసలు నిందితులను పట్టుకోవడంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఎన్నికల ముందు సానుభూతి కోసం ఏదో ఓ డ్రామా ఆడుతున్నాడని అలాగే 2024 ఎన్నికల్లో గులకరాయి డ్రామా ఆడాడని చెప్పారు. తక్షణమే గులకరాయి దాడి కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు మోటేపల్లి సత్యనారాయణ, పరుశురామ, శ్రీకాంత్, కొంగర సాయి పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు
ప్రభుత్వాల రెడ్‌కార్పెట్

● ప్రజా అజెండా అమలు చేయాలని 'జన చైతన్య యాత్ర': విమలక్క

ధర్నాచౌక్, ఏప్రిల్ 20: అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు రెడ్‌కార్పెట్ పరుస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశం, రాష్ట్రంలోని భూమి, సహజ వనరులను ధారదత్తం చేస్తున్నాయని తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) ఛైర్మన్ విమలక్క ధ్వజమెత్తారు. నవ్యాంధ్రకు ప్రత్యేకహోదాతో పాటు ప్రజా అజెండాను చాటుతూ ఈ నెల 14న ప్రారంభమైన 'జన చైతన్య యాత్ర' నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు మే 5వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. రాజకీయ పార్టీలు ప్రజల అజెండాను పక్కకు పెట్టి కులం, మతం, డబ్బు, మద్యంతో ప్రజలను ప్రలోభపెడుతున్నాయని విమర్శించారు. విభజన హామీల సాధన, ప్రత్యేకహోదా వంటి అంశాలను పార్టీలు తుంగలో తొక్కాయని మండిపడ్డారు. వ్యవసాయం, చేనేత, మత్స్యకార రంగాల అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆయా రంగాలకు రూపాయికే యూనిట్ విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. పాలకులు ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. తమ సమస్యలపై ప్రజలు వారిని ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కర్నాకుల వీరాంనేయులు, హైకోర్టు న్యాయవాది సైకం రాజశేఖర్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరీం బాషా, ఏసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.కృష్ణ, దుర్గారావు, నాగేంద్రరావు, మల్సూర్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

రావణాసుర వాహనంపై
ఊరేగిన ఉత్సవ మూర్తులు

వన్‌టౌన్, ఏప్రిల్ 20: దుర్గగుడిలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. వేదమంత్రాలు, భక్తుల ఆనందోత్సాలు, మేళతాళాల నడుమ ఊరేగింపు సాగింది. ఈవో రామారావు, ఏఈవో రమేష్‌బాబు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ వాహనాన్ని లాగారు.

మహామండపం నుంచి బయలుదేరిన ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, శ్రీనివాసమహల్, కోమల విలాస్ సెంటర్, సామారంగం చౌక్, మెయిన్‌రోడ్డు, ఐరన్ సెంటర్, రథం సెంటర్ మీదుగా తిరిగి కొండపైకి చేరుకుంది. ధర్మపథం వేదికపై భక్తిగీతాలాపన నిర్వహించారు. సంగీతకారులను ఈవో రామారావు అభినందించారు.



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాసన మండలి మాజీ చైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల పథకం మాజీ చైర్మన్ సాయిబాబా, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడపాటి లక్ష్మీనారాయణ, ఆచంట సునీత,పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బొండా ఉమకు జగన్ వేధింపులు: అచ్చెన్న

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 'ఎన్డీయే కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేసిన బొండా ఉమను, జగన్ కావాలనే వేధిస్తున్నారు. గులకరాయి కేసులో సీపీ ప్రకటనపై ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించాలి' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిని వేధించడంపై హైకోర్టు చీఫ్ జస్టిస్, ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా, కాపుల్ని అణిచివేయడమే లక్ష్యంగా జగన్ అడుగడుగునా కుట్రలకు తెరలేపుతున్నారని టీడీపీ ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గంటా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు ఆరోపించారు. కాపు నాయకుల్ని ఏకంగా ఎన్నికల్లో నిలబడనీయకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని గులకరాయి దాడి ఘటనతో సంబంధం లేని బీసీ బిడ్డను బలిచ్చి, ఆ కేసులో కాపుల్ని కూడా ఇరికించే కుట్రచేయడం దుర్మార్గమని అన్నారు.

పింఛన్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి: దేవినేని

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పేదల పింఛన్లు ఈసారి ఇళ్ల వద్దే పంపిణీ చేయాలని టీడీపీ డిమాండ్ చేసింది. తీవ్రమైన ఎండల్లో పోయిన నెలలో వృద్ధ పింఛనుదారులను గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిప్పడంతో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 60 మంది వృద్ధులు వడ దెబ్బకు ప్రాణాలు కోల్పోయారని, మళ్లీ ఆ పరిస్థితి రాకుండా చూడాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు. సీఎం జగన్, పేద పింఛనుదారులతో శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎండలో తిరిగి ఒక్క పింఛనుదారుడు కూడా మృత్యువాత పడకుండా చూడాలని ఉమా కోరారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ కుట్రలు

- బొండా అక్రమ అరెస్టుకు యత్నాలు: సీఈసీకి వర్ల లేఖ

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. శనివారం ఈ మేరకు సీఈసీకి లేఖ రాశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార వైసీపీ చేతిలోనే పోలీసు యంత్రాంగం పని చేస్తోందని ఆరోపించారు. ప్రత్యర్థులను వేధించడానికి వైసీపీ అభ్యర్థులు పోలీసులను అస్త్రంగా చేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక ఈసీ బృందాలు వచ్చి పోలీసుల పని తీరుపై పరిశీలించాలని, అప్పుడే ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుగుతాయని సూచించారు. ప్రకాశం జిల్లా కొండెపి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్ ఈ నెల 19న నామినేషన్ దాఖలు చేశారని, సురేష్ భార్య ఐఆర్ఎస్ అధికారి విజయలక్ష్మి కూడా ఆ కార్యక్రమంలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని వర్ల తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఐఆర్ఎస్ అధికారి విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. శనివారం అమరావతి సచివాలయంలో ఆయన రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధానాధికారి హరీంధర ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గులకరాయి దాడి ఘటనలో సీపీ, ఐజీ, డీజీపీ సహా అందరూ డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

సూర్యనారాయణపై మల్లాది విష్ణు ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని, ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వైసీపీ ఎమ్మెల్సీ మల్లాది విష్ణు అన్నారు. ఈ మేరకు అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరీంధర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

అనాథ బాలికలతో వైసీపీ ఎన్నికల ప్రచారం

నూజివీడు, ఏప్రిల్ 20: ఏలూరు జిల్లా నూజివీడులో అనాథ బాలికలకు ప్రభుత్వ, ప్రైవేట్ నిధులతో వైసీపీ నాయకుడు బసవరాజు నగేష్ ఆధ్వర్యంలో హోమ్(హాస్టల్) నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు 100మంది బాలికలు భోజన, వసతి పొందుతూ ప్రభుత్వ పాఠశాలలు/జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్నారు. శుక్రవారం రాత్రి వైసీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాతరావిచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారానికి రాగా, ఆయనకు వీరవిధేయుడైన నగేష్‌. అనాథ బాలికలను వాహనంలో తరలించారు. బాలికలకు వైసీపీ కండువాలు కప్పి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేయించారు. దీనిపై నూజివీడు జనసేన నాయకుడు ముత్యాల కామేష్ నూజివీడు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.భవానీ శంకరికి ఫిర్యాదు చేశారు.

జగన్‌కు బుద్ధి చెబుతాం: మంద కృష్ణ మాదిగ

ధర్మవరం, ఏప్రిల్ 20: వైసీపీ పాలనలో మాదిగలకు అన్నింటా అన్యాయం జరిగిందని, ఈ ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెబుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సదస్సులో ఆయన ప్రసంగించారు. మాదిగలపై దాడులు చేస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పాలంటే టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

'ఇండియా' అభ్యర్థులను గెలిపించండి: సీపీఐ

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 20: ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి బొట్టు సాయం కూడా చేయలేదన్నారు. సీఎం జగన్ తరచూ ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి తన కేసులు మాఫీ చేయాలని కాళ్లు పట్టుకోవడమే తప్ప, రాష్ట్ర అభివృద్ధి కోసం అడిగింది లేదన్నారు.

'దేవదాయ'లో కొట్టు దాష్టీకం

- ఆ సిబ్బందిని సస్పెండ్ చేయండి
- ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లడమే వాళ్ల నేరం
- పదోన్నతులపై అపరిష్కృతంగా వివాదం
- మంత్రి తీరుతో కొందరికి అన్యాయం
- వారు కోర్టుకు వెళ్లడంపై కొట్టు కన్నెర్ర
- చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులకు ప్రభుత్వమే బాస్. అలాగని ప్రభుత్వం చేసే అన్యాయమైన, అడ్డగోలు పనులను ఉద్యోగులు భరించాల్సిన పనిలేదు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల అన్యాయం జరుగుతుందనుకుంటే ఉద్యోగులు కోర్టులకు వెళ్లి న్యాయ పోరాటం చేయవచ్చు. ఇది వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ, అవేవీ తన ముందు చెల్లవంటున్నారు దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ. తాను చెప్పిందే వేదం అంటున్న ఆయన, తాను చేసిన శాసనం పాటించి తీరాల్సిందేనని కన్నెర్ర చేస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. దేవదాయశాఖలో పదోన్నతుల వ్యవహారం తీవ్రంగా ముదిరిపోయింది. డైరెక్ట్ రిక్రూటీలు, ప్రమోటీ అధికారుల మధ్య పదోన్నతుల విషయంలో విభజన రేఖను తీసుకొచ్చేలా ఆ శాఖ చర్యలున్నాయి. ఆ శాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ ఇరువర్గాలను కూర్చోబెట్టి తెలివిగా సమస్య పరిష్కరించాలి. ఉద్యోగులు, అధికారులకు న్యాయబద్ధమైన పదోన్నతులు దక్కేలా మంత్రి చూడాలి. మంత్రికి అది సాధ్యంకాలేదు. సహజంగానే కొందరికే మేలు జరిగింది. నష్టపోయిన వారు కోర్టుకెళ్లారు. కోర్టుకెళ్లి న్యాయం పొందడం ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి హక్కు. అయితే, ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మంత్రిది. అందుకు భిన్నంగా ఉన్న ఆయన తీరుతో నష్టపోయే అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఇది మంత్రి కొట్టుకు నచ్చనే లేదు. దీంతో కోర్టుకు వెళ్లినవారిని సస్పెండ్ చేయాలంటూ దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ మంత్రి ఇటీవల లేఖ రాశారు. "హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం ద్వారా ఇటీవల దేవదాయశాఖలో సీనియర్ అధికారులకు ఇచ్చిన పదోన్నతులను అడ్డుకోవాలని చూశారు. వారి చర్యలతో దేవాదాయశాఖను తీవ్ర అసౌకర్యానికి గురిచేశారు. శాఖలోని పలువురు అధికారులపై వారు క్రమం తప్పకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని నా దృష్టికి వచ్చింది. వారిపై అనేక అభియోగాలు నమోదైనట్లు తెలిసింది. కాబట్టి వారిని తక్షణమే సస్పెండ్ చేయాలి" అని ఆ లేఖలో ఆదేశించారు. అయితే, ఇది మంత్రిగా కొట్టు చేయాల్సిన పనికాదని ఐఏఎస్‌లు అభిప్రాయపడుతున్నారు. "న్యాయం కోరుతూ కోర్టుకెళ్లిన వారినల్లా సస్పెండ్ చేసుకుంటూ పోతే ప్రభుత్వంలో సగం మంది ఉద్యోగులు ఇంట్లో కూర్చోవాల్సి వస్తుంది. దీని వల్ల పాలనా సంక్షోభం వస్తుంది. ఉద్యోగుల సమస్యలను సామరస్యకోణంలో చూడాలి. ఎవరైనా అతిగా వ్యవహరిస్తే పిలిచి మాట్లాడాలి. అంతే తప్ప కోర్టుకెళ్లారు కాబట్టి సస్పెండ్ చేయమంటే అది నియంత చర్య కిందకు వస్తుంది. ఉద్యోగులంటే చిన్నచూపు ఉన్న దురహంకారులే అలాంటి పనులు చేస్తుంటారు" అని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.అందరికీ ఆమోదయోగ్యమైన పదోన్నతులు ఇవ్వలేకపోయినందుకు మంత్రిపై ఏం చర్యలు తీసుకోవాలని మరో సీనియర్ అధికారి ప్రశ్నించారు.

> వారంలో సీపీఎస్ రద్దు చేస్తానంటూ ఇచ్చిన హామీలను అమలు చేయండి అని కోరినందుకు ఉద్యోగులను జగన్ రోడ్డుమీదకు లాగారు. దేవదాయ శాఖలో చట్టబద్ధమైన హక్కులు కోరినందుకు సిబ్బందిని ఏకంగా సస్పెండ్ చేసేయాలంటున్నారు ఆ శాఖ మంత్రి. జగన్ చూపిన దారిలో మరింతగా దూకుడుగా వెళ్తోన్న కొట్టు సత్యనారాయణ చర్యలు ఎన్నికల వేళ ఉద్యోగ, అధికార వర్గాలను ఉడికిస్తున్నాయి.



పదోన్నతుల్లో అక్రమాలు..

దేవదాయ శాఖ ఈ మధ్య కాలంలో పదోన్నతులన్నీ అక్రమంగానే ఇచ్చింది. సీనియర్లను పక్కన పెట్టి, నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు పదోన్నతుల్లో మరీ దారుణంగా ప్రవర్తించారు. కేవలం మంత్రి అండదండలతోనే సీనియారిటీ లిస్ట్ కూడా సక్రమంగా విడుదల చేయకుండా మంత్రికి నచ్చి, ఆయన మెచ్చిన వారికి పదోన్నతులు ఇచ్చేశారు. అధికారులు కూడా ఇది తప్పు అని చెప్పకుండా, మంత్రి చెప్పింది చెప్పినట్లు చేసుకుంటూ వెళ్లారు. ఏసీ నుంచి డీసీ, గ్రేడ్ - 1 నుంచి ఏసీ పదోన్నతులు... మొత్తం ఇలానే ఇచ్చేశారు. చివరికి కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయలేదు. పదోన్నతుల విషయంలో నిబంధనలు పాటించి, సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ హైకోర్టు ఆదేశాలను కూడా మంత్రి, అధికారులు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పదోన్నతులు కల్పించారు. పైగా కోర్టుకు వెళ్లిన అధికారులను సస్పెండ్ చేయాలంటూ లేఖ ద్వారా బెదిరింపులకు గురి చేశారు.

విశాఖ ఉక్కు విలవిల..!

- బొగ్గులేక రోజుకు 4వేల టన్నులే ఉత్పత్తి
- సహకరించని అదానీ గంగవరం పోర్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు పరిస్థితి వెంటిలేటర్ తీసేసి ఆక్సిజన్‌తో ఊపిరి పీల్చుకునే రోగి మాదిరిగా ఉంది. పది రోజులుగా అదానీ గంగవరం పోర్టు నుంచి ప్లాంటుకు బొగ్గు, ఇతర ముడి పదార్థాల సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో అరకొర ఉత్పత్తికే విలవిల్లాడుతోంది. అదానీ పోర్టులో కార్మికుల మెరుపు సమ్మె కారణంగా అక్కడ ఎగుమతి, దిగుమతి ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. కార్మికులను ఏదో ఒక విధంగా ఒప్పించి విధుల్లోకి తీసుకోవలసిన యాజమాన్యం మొండి వైఖరితో చర్చలు కొనసాగించడం లేదు. ఏదైనా నష్టం జరిగితే పోర్టుపై ఆధారపడిన పరిశ్రమలే నష్టపోతాయనే భావనతో ఉంది. ఈ నేపథ్యంలో బొగ్గు అందక స్టీల్‌ప్లాంటులో కోక్ ఓవెన్ బ్యాటరీల పరిస్థితి బాగా దిగజారిపోయింది. వాటిని నిత్యం అధిక ఉష్ణోగ్రతల వద్ద నిర్వహించడానికి ఉక్కు యాజమాన్యం నానాపాట్లు పడుతోంది. సెయిల్ నుంచి 8వేల టన్నుల బొగ్గు అప్పుగా తీసుకొచ్చింది. పారదీప్ పోర్టులో కొంత బొగ్గు ఉందని తెలిసి వారితో చర్చలు జరుపుతోంది. అదానీ పోర్టు నుంచి విశాఖపట్నం పోర్టుకు తరలించిన నౌకల్లో ఒక దాని నుంచి శనివారం సాయంత్రం బొగ్గును దిగుమతి చేయడం ప్రారంభించారు. అది సోమవారం నాటికి ప్లాంటుకు చేరే అవకాశం ఉంది. అంతవరకు కోక్ ఓవెన్లను నిర్వహించడం, వాటిని ఆ తర్వాత సాధారణ స్థితికి తీసుకురావడం ఎంతవరకు సాధ్యమవుతుందో చెప్పలేమని అధికార వర్గాలు చెబుతున్నాయి. మూడు బ్లాస్ట్ ఫర్నేసు (బీఎఫ్)ల ద్వారా రోజుకు 20వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా మొన్నటివరకు రెండు బీఎఫ్‌లు మూసేశారు. అలా చేయడం కూడా నష్టమేనని మేల్కొని ఇప్పుడు రెండింటిని అతి కష్టం మీద నడుపుతూ రోజుకు 4వేల టన్నుల ఉత్పత్తి చేస్తున్నారు. బొగ్గు, ముడి ఇనుము, లైమ్ స్టోన్, అన్నీ పూర్తిస్థాయిలో సమకూరితే తప్ప ప్లాంటు పూర్వస్థితికి వచ్చే అవకాశం లేదు. దీనికి ఎన్ని రోజులు పడుతుందో అంచనా వేయలేకపోతున్నారు. అదానీ పోర్టు మొండిగా వ్యవహరిస్తూ కార్మికుల సమ్మెకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

హుద్‌హుద్ సమయంలోనూ ఈ పరిస్థితి లేదు

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఇలాంటి గడ్డు పరిస్థితి గత మూడున్నర దశాబ్దాల కాలంలో ఎప్పుడూ ఎదురుకాలేదు. హుద్‌హుద్ తుపాన్ సమయంలో కూడా విద్యుత్ సరఫరా రెండు రోజులే ఆగింది. మూడో రోజుకు సరఫరా పునరుద్ధరించి, యార్డులో ముడి పదార్థాలన్నీ తరలించడంతో నాలుగో రోజు నుంచి ఉత్పత్తి సాధారణ స్థితికి వచ్చింది. కానీ, పది రోజుల పాటు బొగ్గు సరఫరా లేకుండా కోక్‌ఓవెన్లను, బీఎఫ్‌లను నిర్వహించడం ఇదే తొలిసారని, దీనివల్ల సమీప భవిష్యత్తులో వీటి మరమ్మతులకు ఎన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తుందోనని ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

బాబుతో అభివృద్ధి.. జగన్‌తో విధ్వంసం

- టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల
- బొండాను ఇరికించాలని చూస్తున్నారని ఈసీకి ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్‌ది ఫ్యాక్షన్ పాలన అని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో అభివృద్ధి జరిగితే జగన్ పాలనలో విధ్వంసం తప్ప మరేమీ కానరావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం తన నివాసంలో కనకమేడల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన పుట్టినరోజు రాష్ట్ర ప్రజలకు, తెలుగు వారందరికీ ఒక పండగన్నారు. అభివృద్ధి సంక్షేమం, సంపద సృష్టికి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ఏపీలో రాజధాని కొరకు భూమి సేకరించారని దాని ఫలితమే అమరావతి రాజధాని తెలిపారు. జగన్ మాత్రం తన విధ్వంసకర ఆలోచనలతో అమరావతిని తిరోగమనంలోకి తీసుకెళ్లారని దుయ్యబట్టారు. కాగా, సీఎం జగన్‌పై రాయి దాడి కేసులో టీడీపీ నేత బొండా ఉమాను ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని ఈసీకి కనకమేడల లేఖ రాశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బొండా ఉమాను నిలువరించేందుకు అరెస్టు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలంటూ విజయవాడ పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఈసీకి ఫిర్యాదు చేశారు.

ముగ్గురు పిల్లలతో కలిసి మహిళ ఆత్మహత్య

- భర్త వివాహేతర సంబంధమే కారణం
- మృతురాలి భర్త వలంటీర్... కేసు నమోదు



నాగరాణి, ఆమె ముగ్గురు పిల్లలు

గాలివీడు, ఏప్రిల్ 20: భర్త వివాహేతర సంబంధంతో మనస్తాపానికి గురైన భార్య ముగ్గురు పిల్లలతో కలసి నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ విషాద ఘటన శుక్రవారం రాత్రి అన్నమయ్య జిల్లా గాలివీడులో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గాలివీడుకు చెందిన వేముల విక్రమ్‌కు రామాపురం మండలం చిట్లూరు పంచాయతీకి చెందిన నాగరాణి (30)తో 12ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి నవ్యశ్రీ(10), దినేశ్(6), జాన్వి(3) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. విక్రమ్ గ్రామ వలంటీర్‌గా పనిచేస్తూనే ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటి నుంచి భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. రెండు రోజుల క్రితం ఆ మహిళకు బిడ్డ పుట్టిన విషయం తెలియడంతో వారిమధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాణి శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన ఆవేదనంతా ఫోన్‌తో తల్లికి వివరించింది. అనంతరం వెలిగల్లు ప్రాజెక్టుకు దిగువనున్న గండిమడుగులో పిల్లలను తోసేసి ఆమె కూడా దూకింది. రాత్రి 10గంటల సమయంలో ఆమె తల్లి గాలివీడుకు చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, నాగరాణి కుటుంబ సభ్యులు గాలించగా.. గండిమడుగులో నవ్య, దినేశ్ మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడంతో బయటికి తీశారు. అనంతరం జాలర్ల సాయంతో నాగరాణి, జాన్వి మృతదేహాలను కూడా వెలికితీశారు. మృతురాలి భర్త విక్రమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా చేతన్

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి టీ.ఎస్.చేతన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ప్రస్తుతం ఆయన ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న వాసుదేవరెడ్డిని ఆరోపణల నేపథ్యంలో ఈసీ తొలగించింది. ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది.

మద్యం పారిస్తున్న వైసీపీ: రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అధికార వైసీపీ మద్యాన్ని ఏరులై పారిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. మద్యాన్ని నిషేధించిన తర్వాత మాత్రమే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న సీఎం జగన్ మాట తప్పి, మడమ తిప్పేశారని శనివారం ఎద్దేవా చేశారు. అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా జనసమీకరణకు వైసీపీ పెద్ద ఎత్తున మద్యం, డబ్బులు పంపిణీ చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని నివారించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

అభివృద్ధి ఏది మంత్రివర్యా!

- ఎన్నికల ప్రచారంలో అప్పలరాజును నిలదీసిన జనం

పలాస, ఏప్రిల్ 20: శ్రీకాకుళం జిల్లా పలాసలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి సీదిరి అప్పలరాజుకు స్థానికుల నుంచి నిలదీత ఎదురైంది. ఆరోవార్డు పెసరపాడులో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ్, స్థానికులు మంత్రి అప్పలరాజును నిలదీశారు. దీంతో మంత్రి అనుచరులు కలుగజేసుకుని.. వైసీపీని వీడి టీడీపీలో చేరిన నీకు అభివృద్ధిపై ప్రశ్నించే అర్హత లేదంటూ ఆయనను పక్కకు తోసేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు, పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్ చేరుకొని ధనుంజయ్‌కు సంఘీభావం ప్రకటించారు.

నవ్య | చిత్రజ్యోతి

హను-మాన్ కంటే పెద్ద విజయం సాధించాలి



ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి అశ్విన్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ మూవీ టైటిల్‌ను, ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'డార్లింగ్', ఉపశీర్షిక 'వై దిస్ కొలవెరి'. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'డార్లింగ్' సినిమా 'హను-మాన్' కంటే పెద్ద విజయం సాధించాలి" అని అన్నారు. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ "ప్రేక్షకులకు కావాల్సిన కంప్లీట్ ఎంటర్టైన్‌మెంట్ ఈ సినిమా" అని చెప్పారు. దర్శకుడు అశ్విన్‌రామ్ మాట్లాడుతూ "ఈ సినిమా కపుల్స్‌కి, లవర్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది" అని చెప్పారు.

ఎమోషన్స్, యాక్షన్ మెప్పించాయి


చిరంజీవి



కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'భజే వాయువేగం' చిత్రం టీజర్‌ను శనివారం చిరంజీవి ఆవిష్కరించారు. 'విశ్వంభర' సెట్‌లో చిత్రబృందం చిరంజీవిని కలిసింది. 'నా అభిమాని, తమ్ముడు లాంటి కార్తికేయ నటించిన 'భజే వాయువేగం' చిత్రం టీజర్‌తోపాటు టైటిల్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఎమోషన్స్‌తో పాటు యాక్షన్ అంశాలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ఘన విజయం అందుకోవాలి' అని ఈ సందర్భంగా చిరంజీవి ఆకాంక్షించారు. డ్రగ్స్ కేసులో పోలీసుల ఇన్వెస్టిగేషన్, తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగిన టీజర్ ఆద్యంతం అలరించింది. యాక్షన్ సీక్వెన్స్‌ల్లో కార్తికేయ విజృంభించారు. ఆయనకు జోడీగా ఐశ్వర్య మీనన్ నటిస్తున్నారు. రాహుల్ టైసన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి చంద్రపు దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్ నిర్మిస్తోంది. త్వరలో మేకర్స్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్, కపిల్ కుమార్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి. రాజశేఖర్

పైసా వసూల్ సినిమా అవుతుంది

విశాల్



విశాల్, ప్రియా భవానీ నటించిన చిత్రం 'రత్నం'. విశాల్‌తో 'భరణి', 'పూజ' చిత్రాలు చేసిన డైరెక్టర్ హరి ఈ సినిమాను తెరకెక్కించారు. కార్తికేయన్ సంతానం నిర్మించారు. ఈ నెల 26న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశాల్ మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. ఇందులో కేవలం మాస్ ఎలిమెంట్స్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే అంశాలు చాలా ఉన్నాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు మంచి సంగీతం ఇచ్చారు. ఇందులోని కంటెంట్, డైలాగ్స్ వల్ల అందరికీ ఇది స్ట్రయిట్ తెలుగు సినిమాలాగే అనిపిస్తోండటం సంతోషంగా ఉంది. హరి సినిమాల్లో హీరో పాత్ర కంటే హీరోయిన్‌కే అధిక ప్రాముఖ్యత ఉంటుంది. ఇందులో ప్రియా భవానీ శంకర్ పాత్ర తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. మీరు పెట్టే డబ్బులకు సరిపడా వినోదం ఇస్తాం. కచ్చితంగా పైసా వసూల్ సినిమా అవుతుంది" అని చెప్పారు.

హరోం హరకు ప్యాకప్



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'హరోం హర'. 'ది రివోల్ట్' అనేది ట్యాగ్‌లైన్. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయినట్టు మేకర్స్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సెట్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసిన వీడియోను చిత్రబృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లా కుప్పంలో 80వ దశకంలో జరిగిన సంఘటనల ఆధారంగా 'హరోం హర' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్నారు. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.

ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం...

ఛోటా కే నాయుడుకు దర్శకుడు హరీశ్ శంకర్ హెచ్చరిక



'ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం... మీ పిలుపు కోసం ఎదురు చూస్తుంటాను' అంటూ సినిమాటోగ్రాఫర్ ఛోటా కే నాయుడుకు దర్శకుడు హరీశ్ శంకర్ సవాల్ విసిరారు. పదే పదే తనను లక్ష్యంగా చేసుకొని విమర్శలకు దిగుతున్నారంటూ ఛోటా కే నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ లేఖను హరీశ్ శంకర్ విడుదల చేశారు. వయసులో పెద్దవారు అని గౌరవిస్తున్నానంటూనే ఆయన ఛోటాపై వ్యంగాస్త్రాలు సంధించారు. "రామయ్యా వస్తావయ్యా' సినిమా ఫ్లాప్ అయినా ఆ నింద మీపై మోపలేదు. ఆ సినిమా తీసి పదేళ్లు దాటిపోయింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా పలు ఇంటర్వ్యూల్లో మీరు కావాలని పదే పదే నా ప్రస్తావన తెచ్చి అవమానిస్తున్నారు. మీపైన ఉన్న గౌరవంతో ఇన్నాళ్లు భరించాను. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి. కాదూ కూడదు మళ్లీ కెలుక్కుంటాను అంటే ఎక్కడైనా, ఏ వేదికమీదైనా, నేను సిద్ధం' అని హరీశ్ శంకర్ హెచ్చరించారు. "రామయ్యా వస్తావయ్యా' షూట్‌లో కెమెరా డిపార్ట్‌మెంట్‌లో హరీశ్ శంకర్ జోక్యం చేసుకున్నారు. అది సబబు కాదని వారించినా ఆయన వినలేదు" అని ఛోటా కె నాయుడు విమర్శించడమే ఈ వివాదానికి కారణమైంది.



ఓటుకు రూ. ఐదువేలు

సాయికుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. 'ఫర్ ఓట్' అనేది ఉపశీర్షిక. వినయ్, అరుణ్, దీప్తివర్మ, ఆమని కీలకపాత్రలు పోషించారు. సూర్య దర్శకుడు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలు పన్నే రాజకీయ నాయకుడిగా సాయికుమార్ కనిపించారు. తను పోటీ చేసే నియోజకవర్గంలో ఒక్కో ఓటుకు రూ. 5వేలు చొప్పున మొత్తం రూ. 100 కోట్లు పంచేందుకు ఆయన ఎలాంటి ప్రయత్నం చేశారనేది ఆసక్తికరంగా అనిపించింది. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కే పేరుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫస్. సినిమాటోగ్రఫీ: నని ఐనవెల్లి

మరో సినిమా చేద్దాం అన్నారు

మహేంద్రనాథ్ కూండ్ల



వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'శబరి'. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. అనిల్ కాట్జ్ దర్శకుడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. "నిర్మాతగా నా సినిమా జర్నీని ప్రారంభించేందుకు చూస్తున్న సమయంలో దర్శకుడు అనిల్ ఈ కథ చెప్పారు. ఒక బిడ్డ కోసం తల్లి పడే తపనను సైకలాజికల్ థ్రిల్లర్‌గా దర్శకుడు చెప్పారు. ఇందులోని భావోద్వేగాలు అందరినీ కట్టిపడేస్తాయి. ఈ సినిమా కథను నాకంటే ముందే వరలక్ష్మీ శరత్‌కుమార్ విని ఓకే చేశారని దర్శకుడు చెప్పారు. ఆమె వండర్‌ఫుల్ నటి. నిర్మాతలను వరలక్ష్మీ శరత్‌కుమార్ ఎప్పుడూ ఇబ్బంది పెట్టరు. ఆమెతో ఈ సినిమాతో మంచి రిలేషన్ బిల్డ్ అయ్యింది. 'శబరి' తర్వాత మరో సినిమా చేద్దాం అని ఆమె అనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని చెప్పారు.

బెస్ట్ ఓటీటీ షోలు తెలుగులో



ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ మినీ టీవీ ప్రేక్షకులకు సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ భాషల్లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన షోల తెలుగు, తమిళ డబ్బింగ్ వెర్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 'రక్షక్, ఇండియాస్ బ్రేవ్స్, ఫిజిక్స్‌వాలా' లాంటి 200కు పైగా షోలతో పాటు పలు హాలీవుడ్ చిత్రాల డబ్బింగ్ వెర్షన్లు ఇందులో ఉచితంగా చూడొచ్చు అని ఆ సంస్థ తెలిపింది. వీటితో పాటు కొరియన్, టర్కిష్, మాండరిన్ షోలను సైతం వినియోగదారులు వీక్షించవచ్చు అని అమెజాన్ కంటెంట్ హెడ్ అమోఘ్ దుసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 21 ఏప్రిల్ 2024



ఊరికి దూరంగా విసిరేసినట్లుండే పాడుబడిన బంగ్లా... అందులో ఓ ప్రేతాత్మ...అమావాస్య అర్ధరాత్రి... అటుగా నడిచి వెళుతున్న ఒంటరి పాదచారి... అంటూ మొదలైన పలు దెయ్యం కథలు ఎన్నెన్నో మలుపులు తీసుకున్నా చివరకు బాక్సాఫీసు దగ్గర మాత్రం కాసుల వర్షం కురిపిస్తోంది. గత కొంతకాలంగా హారర్ జానర్‌లో వచ్చిన పలు చిత్రాలు టాలీవుడ్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. దీంతో మేకర్స్ కూడా ఈ తరహా చిత్రాలపై ఫోకస్ పెట్టారు. మరిన్ని దెయ్యం కథలు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

బాక్సాఫీసు వద్ద భూతం హవా



దెయ్యంతో ప్రేమ

దెయ్యానికి బాయ్ ఫ్రెండ్ ఉంటే ఏం జరుగుతుంది? అనే ఆసక్తికరమైన పాయింట్ చుట్టూ అల్లుకున్న కథతో తెరకెక్కిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యూ డేర్' అనేది ఉపశీర్షిక. 'రౌడీబాయ్స్' ఫేం ఆశిష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకుడు. వైష్ణవీ చైతన్య కథానాయిక. హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగమల్లిడి నిర్మిస్తున్నారు. ప్రేతాత్మ ప్రేమలో పడిన కుర్రాడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో దెయ్యం పాత్రలో కనిపించబోయే హీరోయిన్ ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్. దెయ్యంతో డేటింగ్ అనే సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా కావడంతో ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని క్రియేట్ చేయగలిగింది. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మారుతి మార్క్‌తో

'సలార్' 'కల్కి 2898 ఏడీ' చిత్రాలతో జోరుమీదున్నారు ప్రభాస్. ఆయన ఈ సారి తన పంథా మార్చారు. భారీ కమర్షియల్స్‌కు భిన్నంగా ఓ వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రభాస్ మారుతి కాంబినేషన్‌లో వస్తున్న 'రాజా సాబ్' చిత్రం హారర్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుందని తెలుస్తోంది. థ్రిల్లర్ కథాంశంతో సాగే ఈ సినిమాను మారుతి తన మార్క్‌తో తెరకెక్కిస్తున్నారు. పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. మాళవికా మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈసారి మిస్టిక్ థ్రిల్లర్

సాయి దుర్గ తేజ్ అపజయాలకు బ్రేక్ వేయడమే కాదు, బాక్సాఫీసు దగ్గర రూ. 100 కోట్ల వసూళ్లను సాధించింది 'విరూపాక్ష' చిత్రం. కార్తీక్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మిస్టిక్ థ్రిల్లర్ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతోందీ చిత్రబృందం. విరూపాక్ష దర్శకుడు కార్తీక్ వర్మతో ఆ చిత్ర నిర్మాతలు సుకుమార్, బీవీఎస్ఎన్ ప్రసాద్ మరో హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పౌరాణిక గాథ చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనుందని యూనిట్ తెలిపింది.

సీక్వెల్స్ సైతం

కొత్త చిత్రాలే కాదు ఈ జానర్‌లో ప్రేక్షకాదరణ పొందిన చిత్రాలకు సీక్వెల్స్ కూడా సిద్ధమవుతున్నాయి. గతేడాది అద్భుత విజయాన్ని సాధించిన చిత్రాల్లో 'మా ఊరి పొలిమేర 2' ఒకటి. సత్యం రాజేశ్, గెటప్ శ్రీను, మీనాక్షి భాస్కర్ల ప్రధాన తారాగణంగా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. చేతబడులు, గుప్తనిధుల నేపథ్యంలో సాగే కథలో అనూహ్య మలుపులు ఆకట్టుకున్నాయి. 'మా ఊరి పొలిమేర' సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలూ చక్కని ప్రేక్షకాదరణ అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా మూడో చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. అలాగే సాయి దుర్గ తేజ్ హీరోగా వచ్చిన 'విరూపాక్ష' చిత్రానికి కూడా కొనసాగింపు ఉంటుందని అప్పట్లో మేకర్స్



తెలిపారు. 2022లో వచ్చిన 'మసూద' చిత్రం బాక్సాఫీసు దగ్గర ఘన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. తిరువీర్, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించారు. ఓ కుటుంబంపై పగబట్టిన ప్రేతాత్మ ఎలాంటి దారుణాలను చేసిందనేది ఒళ్లు గగుర్పొడిచేలా ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమాకు ప్రీక్వెల్ తీయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా వెల్లడించారు.



జేజమ్మ కథనార్



అనుష్క కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన చిత్రం 'అరుంధతి'. అందులో పిశాచిగా మారిన పశుపతి పాత్రలో సోనూసూద్ సృష్టించిన బీభత్సం ప్రేక్షకులను వెన్నాడింది. ఆ తర్వాత ఇదే జానర్‌లో మరికొన్ని చిత్రాలు చేశారు అనుష్క. కానీ అవేవీ ప్రేక్షకాదరణకు నోచుకోలేదు. ఇప్పుడు మరోసారి హారర్ జానర్‌లో అనుష్క ఓ భారీ చిత్రం చేస్తున్నారు. అయితే ఇది మలయాళ చిత్రం. 'కథనార్: ది వైల్డ్ సోర్సెరర్' పేరుతో తెరకెక్కుతోంది. రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. మలయాళంలో అనుష్కకు ఇది తొలి చిత్రం. 9వ శతాబ్దానికి చెందిన కేరళ క్రైస్తవ మత గురువు కడమత్తత్తు కథనార్ జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు వెన్నులో వణుకు పుట్టించేలా ఉన్నాయి. ఓ భాగ్యహం లోపల దాగి ఉన్న అంతుచిక్కని రహస్యాలు, పిశాచాల దాడుల నేపథ్యంలో టీజర్ ఆసక్తికరంగా సాగింది. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదలవనుంది. తొలి భాగం ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నాగచైతన్య కార్తీక్ దండు కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కూడా ఇదే జానర్‌లో ఉండబోతోంది.






పరభాషల్లోనూ ఆదరణ

తెలుగుతో పాటు పరభాషల్లోనూ హారర్ చిత్రాల హవా కొనసాగుతోంది. ఈ తరహా చిత్రాల్లో హిందీలో వచ్చిన 'స్త్రీ' ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ హారర్ కామెడీకి సీక్వెల్ తెరకెక్కుతోంది. శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటిస్తున్నారు. అమర్ కౌశిక్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. ఆగస్టు 30న 'స్త్రీ 2' ప్రేక్షకుల ముందుకొస్తోంది. అలాగే తమిళ హారర్




ఫ్రాంచైజీ 'అరణ్మణై' నుంచి మరో చిత్రం వస్తోంది. తమన్నా, రాశీఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'అరణ్మణై 4'. తెలుగులో 'బాక్' పేరుతో మే 3న విడుదలవుతోంది.

మలయాళ అగ్ర హీరో మోహనల్‌లాల్ తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బరోజ్'. చారిత్రక కథాంశంతో కాల్పనిక గాథగా తెరకెక్కుతోంది. వాస్కోడిగామా చపోయాక ఆయన గుప్తనిధులకు కాపలా కాసే బరోజ్ అనే భూతం కథతో భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. మేలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



శృంగారతార సన్నీలియోన్ ప్రధాన పాత్రధారిగా మలయాళంలో ఓ హారర్ చిత్రం తెరకెక్కుతోంది. ఆర్ యువన్ దర్శకత్వం వహిస్తున్న ఈ హారర్ థ్రిల్లర్‌కు 'మందిర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది.





ఎన్టీఆర్ వేగం.. రామ్‌చరణ్ ఆందోళన

'ఆర్ఆర్ఆర్' చిత్రంతో పాన్ ఇండియా స్టార్స్‌గా మారిపోయారు జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్. ఆ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్..మరీ ముఖ్యంగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ను పరిచయం చేసే యాక్షన్ సీక్వెన్స్, వాళ్లిద్దరూ ఒకరితో ఒకరు ముఖాముఖి తలపడే ఇంటర్వెల్ బ్లాక్ పోరాట ఘట్టాలను సినీ ప్రియులు ఇప్పట్లో మరిచిపోలేరు. ఆ రేంజ్‌లో అందరినీ ఆకట్టుకున్న ఆ యాక్షన్ సన్నివేశాల వెనకున్న ఆసక్తికరమైన విషయాల్ని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె సెంథిల్ ఇటీవల మీడియాతో పంచుకున్నారు.

"సినిమాలో జూనియర్ ఎన్టీఆర్‌ను పరిచయం చేసే యాక్షన్ సన్నివేశాలలో ఆయనను నక్క, తోడేలు, పులి వెంటాడుతాయి. ఈ సన్నివేశాలను చిత్రీకరించేటప్పుడు ఆయన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు పరిగెట్టాలో ముందే మార్క్‌చేసి చెప్పేవాళ్లం. కానీ ఆయన కెమెరాకు అందకుండా వాయు వేగంతో పరిగెత్తేసేవారు. దీంతో ఎన్టీఆర్ మూమెంట్స్‌ను క్యాప్చర్ చేయడం కష్టసాధ్యమయ్యేది. అసలు, ఆయనకు ఇంత వేగం ఎలా వచ్చిందని ముక్కునవేలేసుకునేవాళ్లం. ఇదే విషయం ఆయన్ని అడగ్గా.. తను జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ప్లేయర్ అని, అందుకే అలా పరిగెత్తడం సాధ్యమైందని చెప్పారు. దీంతో చేసేది లేక మేము ఆయన వేగానికి తగినట్లు ఏర్పాట్లు చేసుకున్నాము. ఇక ఇంటర్వెల్ బ్లాక్‌లోనూ ఎన్టీఆర్ జంతువులతో దూకే సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ తర్వాత ఆయన రామ్‌చరణ్‌తో పోరాడుతారు. ఈ సన్నివేశంలో మిగిలిన నటులందరూ నిజంగా వారిని జంతువులు తరుముతున్నట్లే నటించాలి. అందుకోసం కార్లకు జంతువుల ముఖాలున్నట్లు డిజైన్ చేశాం. ఈ సన్నివేశాన్ని దాదాపు రెండు నెలలు షూట్ చేశాము. అలాగే, రామ్‌చరణ్ పరిచయ సన్నివేశంలో ఆయన రెండు వేల మంది భారతీయుల్ని కొట్టాల్సిన సందర్భం వస్తుంది. ఒక భారతీయుడు మరో భారతీయుడ్ని అలా కొట్టడం చూసి ప్రేక్షకులు ఏమనుకుంటారో అని రామ్‌చరణ్ మొదట ఆందోళనకు లోనయ్యేవారు. ఆ తర్వాత దర్శకుడు రాజమౌళి నచ్చజెప్పడంతో ఆయన ఆ పాత్రలో లీనమై నటించారు. ఈ సీన్‌ను షూట్ చేయడం కోసం మూడు నెలల పాటు రిహార్సల్స్ చేశాము. ఈ సన్నివేశంలో చరణ్ ఎక్స్‌ప్రెషన్స్ చాలా కీలకం. ఆయన తన భావోద్వేగాల్ని అద్భుతంగా పలికించడంతో థియేటర్లలో ఆ సన్నివేశానికి రెస్పాన్స్ అదిరిపోయింది" అని చెప్పారు.



నా హీరో తెరపైనా.. తెరవెనుకా

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే నటిస్తున్న తాజా చిత్రం 'సింహమ్ అగైన్'. అజయ్ దేవగణ్‌తో డైరెక్టర్ రోహిత్ శెట్టి తెరకెక్కిస్తోన్న 'సింహమ్' కాప్ యూనివర్స్‌లోని మూడో చిత్రమిది. ఈ సినిమాలో దీపికా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, ఆమె ఇందులో పోషిస్తున్న పాత్రను దర్శకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "ఈ లేడీ సింహం, నా హీరో. తెరపైనా..తెరవెనుకా" అని పోస్ట్ చేశారు. ఈ పోస్టర్‌లో అజయ్ దేవగణ్ ట్రేడ్ మార్క్ సింహం మ్యానరిజమ్‌ను ఆమె ఇమిటేట్ చేస్తున్నట్లు చూపించారు. దీపికా ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు.

అది ఒక ఎగ్జైటింగ్ ఐడియా!

సందీప్‌రెడ్డి వంగా



'యానిమల్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సందీప్‌రెడ్డి వంగా. రణబీర్ హీరోగా నటించిన ఈ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ చిత్రానికి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్'ను సందీప్ ఆ సినిమా ఎండ్ టైటిల్స్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా సీక్వెల్ ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుస్తున్నారు. తాజాగా ఆయన ఓ అవార్డు ఫంక్షన్‌లో ఈ సినిమా సీక్వెల్ గురించి మీడియాతో మాట్లాడారు. "2026లో 'యానిమల్-2' షూటింగ్ మొదలుపెడతాను. 'యానిమల్' సినిమా కంటే సీక్వెల్ మరిన్ని రెట్లు వయొలెంట్‌గా, వైల్డ్‌గా ఉంటుంది. ప్రస్తుతానికి ప్రభాస్‌తో తీస్తున్న 'స్పిరిట్' సినిమాపైనే నా దృష్టంతా. భవిష్యత్తులో నా సినిమా హీరోలందరినీ కలిపి సందీప్ రెడ్డి సినిమాటిక్ యూనివర్స్ ప్రారంభించే అవకాశం ఉందో లేదో ఇప్పుడే చెప్పలేను, కానీ అది ఒక ఎగ్జైటింగ్ ఐడియా" అని అన్నారు.

తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాను

బాలీవుడ్ నటి పరిణీతీ చోప్రా 'అమర్ సింగ్ చమ్కీలా' చిత్రంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కారు. ఇందులో గాయనిగా నటించి అందరినీ ఆకట్టుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "కొందరు ఇచ్చిన సలహాల వల్ల నేను నా కెరీర్‌లో తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాను. నేను గతంలో నటించిన కొన్ని పాత్రలు సంతృప్తికరంగా అనిపించలేదు. అందుకే కొంచెం గ్యాప్ తీసుకుని పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను. నేను ఇండస్ట్రీలోకి ఒంటరిగానే అడుగుపెట్టాను. నా కెరీర్ మొదట్లో నాకు వెంటనే అవకాశాలు రావడానికి ఇండస్ట్రీ పెద్దల సహకారం, ప్రముఖుల పరిచయాలు ఉండేవి కావు. నేను ఇండస్ట్రీ ప్రముఖులు చేసే సినిమాల్లో మంచి అవకాశాలు రావాలని కోరుకుంటున్నా. ప్రతిభకు తగ్గ అవకాశాలు వస్తేనే కదా ఎలాంటి పాత్రలో అయినా రాణించగలమని తెలిసేది" అని చెప్పారు.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డెడ్ బాయ్ డిటెక్టివ్స్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 25
టిల్లు స్క్వేర్	తెలుగు చిత్రం	ఏప్రిల్ 26
అమెజాన్ ప్రైమ్		
దిల్ దోస్తీ డైలమా	హిందీ సిరీస్	ఏప్రిల్ 25
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
భీమా	తెలుగు చిత్రం	ఏప్రిల్ 25
క్రాక్	హిందీ చిత్రం	ఏప్రిల్ 26
బుక్ మై షో		
కుంగ్‌ఫూ పాండా 4	యానిమేషన్ మూవీ	ఏప్రిల్ 26
లయన్స్ గేట్ ప్లే		
ది బీ కీపర్	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 26
జియో సినిమా		
ది జినెక్స్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 22
ఆపిల్ టీవీ ప్లస్		
ది బిగ్ డోర్ ప్రైజ్ 2	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 24





ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఏపీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎడ్‌సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా బీఈడీ రెగ్యులర్ కోర్సు, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ/ప్రైవేట్/ఎయిడెడ్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.



అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఏ/ బీఏ(ఓఎల్)/ బీఎస్సీ/ బీఎస్సీ(హోం సైన్స్)/బీకాం/బీసీఏ/బీబీఎం ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. సంబంధిత సబ్జెక్టులో పీజీ/సంబంధిత మెథడాలజీలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- ఎడ్‌సెట్‌లో మేథమెటిక్స్ ఎంచుకోవాలంటే మేథ్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఏ/బీఎస్సీ లేదా ఇంటర్(మేథమెటిక్స్)తోపాటు బీసీఏ లేదా బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఫిజికల్ సైన్సెస్ ఎంచుకోవాలంటే ఇంటర్(ఫిజిక్స్, కెమిస్ట్రీ)తోపాటు బీసీఏ లేదా బీఎస్సీ(ఫిజిక్స్, కెమిస్ట్రీ)/బీఎస్సీ(అలైడ్ మెటీరియల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ ఎంపీసీతో పాటు బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అర్హులే. బయలాజికల్ సైన్సెస్ ఎంచుకోవాలంటే ఇంటర్(బయలాజికల్ సైన్సెస్)తోపాటు బీసీఏ లేదా బీఎస్సీ(బోటనీ/జువాలజీ)/బీఎస్సీ(హోం సైన్స్)/బీఎస్సీ(అలైడ్ లైఫ్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. సోషల్ స్టడీస్ ఎంచుకోవాలంటే ఇంటర్(సోషల్ సైన్సెస్)తోపాటు బీసీఏ లేదా బీఏ/బీఏ(ఓఎల్)/బీకాం/బీబీఎం పూర్తిచేసి ఉండాలి. ఇంగ్లీష్ ఎంచుకోవాలంటే బీఏ(స్పెషల్ ఇంగ్లీష్)/ఎంఏ (ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి. అలైడ్ మెటీరియల్ సైన్సెస్, అలైడ్ లైఫ్ సైన్సెస్ సబ్జెక్టుల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ ఎడ్‌సెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 25; రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్టుకు సంబంధించిన మెథడాలజీ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులకు వాటినుంచే 100 ప్రశ్నలు ఇస్తారు. ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్ట్‌కు ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 50; బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టుకు బోటనీ, జువాలజీల నుంచి ఒక్కోదానిలో 50; సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు జాగ్రఫీ నుంచి 35, హిస్టరీ నుంచి 30, సివిక్స్ నుంచి 15, ఎకనామిక్స్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. అన్ని సబ్జెక్టులకూ మొదటి రెండు పార్ట్‌లూ కామన్‌గా ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రాన్ని(ఇంగ్లీష్ మెథడాలజీ మినహా) ఇంగ్లీష్, తెలుగు/ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు. ఉర్దూ మాధ్యమంలో ఎగ్జామ్ రాయాలనుకొనేవారు కర్నూలు టెస్ట్ సెంటర్‌ను ఎంచుకోవాలి.

- ఎడ్‌సెట్‌లో అర్హత పొందాలంటే కనీసం 37 మార్కులు (25 శాతం) రావాలి. ఫిజికల్ సైన్సెస్, మేథమెటిక్స్ మెథడాలజీ ఎంచుకొన్న మహిళలకు; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఏపీ ఎడ్‌సెట్ 2024కు సంబంధించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **కరెక్షన్ ఆఫ్ ఆన్‌లైన్ అప్లికేషన్:** మే 22 నుంచి 25 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 30 నుంచి
- **ఏపీ ఎడ్‌సెట్ 2024 తేదీ:** జూన్ 8
- **ప్రిలిమినరీ కీ విడుదల:** జూన్ 15
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ (ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్, కటక్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా సంస్థ నిర్వహిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం గంటన్నర. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

మాస్టర్ ఆఫ్ ఆక్యుపేషనల్‌థెరపీ(ఎంఓటీ)

ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
స్పెషలైజేషన్లు: రీహాబిలిటేషన్, హ్యాండ్ రీహాబిలిటేషన్, డెవలప్‌మెంటల్ డిజెబిలిటీస్, న్యూరాలజీ
అర్హత: రెగ్యులర్ బీఓటీ/బీఎస్సీ(ఆక్యుపేషనల్ థెరపీ) ఉత్తీర్ణులై ఉండాలి.

మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ)

ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
స్పెషలైజేషన్లు: రీహాబిలిటేషన్, మస్క్యులోస్కెలిటల్ కండిషన్స్, పీడియాట్రిక్స్, న్యూరాలజీ
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెగ్యులర్ బీపీటీ/బీఎస్సీ(ఫిజియోథెరపీ) ఉత్తీర్ణులై ఉండాలి.

మాస్టర్ ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ (ఎంపీఓ)

ఈ ప్రోగ్రామ్‌లో 10 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీపీఓ/బీఎస్సీ(ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్) పూర్తిచేసి ఉండాలి.

- 2024 సెప్టెంబరు 10 నాటికి అభ్యర్థుల ఇంటర్న్‌షిప్ పూర్తికావాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 4
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** సికింద్రాబాద్, విజయవాడ
- **ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ పీజీఈటీ 2024 తేదీ:** జూన్ 23
- **ఫలితాలు విడుదల:** జూలై 9
- **సీట్ల అలాట్‌మెంట్, సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్:** ఆగస్టు 9 నుంచి సెప్టెంబరు 30 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** admission.svnirtar.nic.in/

అపోలో ఇన్‌స్టిట్యూట్‌లో ఎండీహెచ్‌ఎం



హైదరాబాద్-జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్(ఏఐహెచ్‌ఏ-ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల)- 'మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్(ఎండీహెచ్‌ఎం)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి మూడు సెమిస్టర్లలో ఒక్కోదానిలో ఏడు పేపర్లు; చివరి సెమిస్టర్‌లో మూడు పేపర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో హాస్పిటల్ విజిట్స్, రెండో సెమిస్టర్‌లో ఆరు వారాల ప్రాజెక్ట్ వర్క్, మూడో సెమిస్టర్‌లో డిజర్టేషన్ వర్క్, చివరి సెమిస్టర్‌లో డిజర్టేషన్-వైవా-నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూం లెక్చర్స్, గెస్ట్ లెక్చర్స్, కేస్ స్టడీస్, ఫీల్డ్ విజిట్స్, ఆడియో విజువల్ ప్రజంటేషన్స్, గ్రూప్ డిస్కషన్స్, సెమినార్‌లు, జాబ్ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులకు కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

సీట్ల వివరాలు: మొత్తం సీట్లు 64. కన్వీనర్ కోటా కింద 46 సీట్లు ఉన్నాయి. వీటిలో నాలుగింటిని ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి ప్రత్యేకించారు. మేనేజ్‌మెంట్ కోటా కింద 18 సీట్లు ఉన్నాయి.

- స్థానికులకు 85 శాతం సీట్లు నిర్దేశించారు. మిగిలిన 15 శాతం సీట్లకు స్థానికులు సహా స్థానికేతరులందరూ పోటీపడవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని మెడికల్/నాన్ మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఫైన్ ఆర్ట్స్, ఓరియంటల్ లాంగ్వేజెస్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అండ్ యూసేజ్, హెల్త్ అండ్ హాస్పిటల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మే 30
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **ఫలితాలు విడుదల:** జూలై 10
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ప్రిన్సిపాల్, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, అపోలో హెల్త్ సిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500096.
- **వెబ్‌సైట్:** apolloiha.ac.in



ఆంధ్ర యూనివర్సిటీలో ఎంబీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- 'ఎంబీఏ(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇది సెల్ఫ్ సపోర్టెడ్ ప్రోగ్రామ్. దీనికి నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లాజిస్టిక్స్ కౌన్సిల్ సహకారం అందిస్తోంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 18
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.500
- **సీట్ల అలాట్‌మెంట్:** జూన్ 20
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017.
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

నిఫ్ట్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 37

వారణాసి/రాయ్‌బరేలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న గ్రూప్-సి పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. మెషిన్ మెకానిక్: **5 పోస్టులు**
2. అసిస్టెంట్(అడ్మిన్/ఎఫ్అండ్ఏ): **7 పోస్టులు**
3. అసిస్టెంట్ వార్డెన్(గర్ల్స్): **2 పోస్టులు**
4. నర్స్: **2 పోస్టులు**
5. జూనియర్ అసిస్టెంట్: **12 పోస్టులు**
6. లైబ్రరీ అసిస్టెంట్: **1 పోస్టు**
7. ల్యాబ్ అసిస్టెంట్: **7 పోస్టులు**
8. స్టెనోగ్రాఫర్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 27 సంవత్సరాలు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్/కాంపిటెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, నిఫ్ట్ క్యాంపస్, దూర్‌భాష్ నగర్, రాయ్‌బరేలి చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 25
వెబ్‌సైట్: www.nift.ac.in



జాబ్ కార్నర్

ఎమ్‌టీఆర్‌డీసీలో జేఆర్‌ఎఫ్

డీఆర్‌డీవో, మైక్రోవేవ్ ట్యూబ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, బెంగళూరు...జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో
అర్హత: సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎమ్మెస్సీ), బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్‌తో గేట్, నెట్ స్కోర్ ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించరాదు
వేతనం: నెలకు రూ.37,000
ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 23
ప్రదేశం: ఎమ్‌టీఆర్‌డీసీ రిసప్షన్, భారత్ ఎలక్ట్రానిక్స్ నార్త్ గేట్, జలహళ్లి పోస్ట్ బెంగళూరు.
వెబ్‌సైట్: www.drdo.gov.in/drdo/

జీఎంసీటీహెచ్‌లో సీనియర్ రెసిడెంట్స్

మొత్తం ఖాళీలు: 29

యాదాద్రి భువనగిరి జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అండ్ టీచింగ్ హాస్పిటల్(జీఎంసీటీహెచ్).. తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. సీనియర్ రెసిడెంట్: **22 పోస్టులు**
2. ట్యూటర్: **7 పోస్టులు**

విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ తదితరాలు
అర్హత: ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 45 సంవత్సరాలు మించకూడదు
వేతనం: సీనియర్ రెసిడెంట్ పోస్టుకు రూ.92,575, ట్యూటర్ పోస్టుకు రూ.57,700.
ఇంటర్వ్యూ తేదీ: 2024 ఏప్రిల్ 23
ప్రదేశం: ఆఫీస్ ఆఫ్ ద గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, యాదాద్రి భువనగిరి జిల్లా.
వెబ్‌సైట్: yadadri.telangana.gov.in/notice_category/recruit-ment/

లిటిల్స్



నీళ్లకు డబ్బు కట్టలేదు!

- బీర్బల్ పంచాయితీ

అది అక్బర్ రాజ్యం. ఆ సమయంలో సుఖ్‌దేవ్ అనే ఓ రైతు ఉండేవాడు. అతడు కష్టజీవి. నిజాయితీ మనిషి. తన పొలం పక్కన బాలరాజ్ అనే రైతు ఉండేవాడు. అతను టక్కరి. అబద్ధాలు చెప్పటంలో అందెవేసిన చేయి. తన పొలం ఎండిపోతుంటే సుఖ్‌దేవ్ చూడలేకపోయాడు. అప్పు చేసి మరీ తన పక్క చేను యజమాని బాలరాజ్‌తో ఒక బావి కొన్నాడు. డబ్బులన్నీ కూడా ఇచ్చాడు.

వారం తర్వాత 'ఇంకా డబ్బులు కావాల'ని పేదరైతుని వేధించాడు టక్కరి రైతు. పేద రైతు 'నేను ఇవ్వలేను. నీ డబ్బులు ఇచ్చాను' అంటూ గొడవపడ్డాడు. ఇద్దరూ కొట్లాడారు. పంచాయితీ కాస్త బీర్బల్ దగ్గరకు తీసుకెళ్లాడు. బక్క రైతును చూస్తూనే బీర్బల్‌కి విషయం అర్థమైంది.




ఇతను మంచివాడు.. ఆ పక్కరైతు టక్కరని అర్థమైంది. 'అయ్యా.. నేను నా పక్కచేను యజమానితో తన బావిని కొన్నా. డబ్బులిచ్చా. అయినా మళ్లీ డబ్బులు ఇవ్వాలంటున్నాడు' అన్నాడు. ఇంతలోనే బాలరాజ్ కలుగచేసుకుని 'అయ్యా.. నేను బావిని అమ్మాను. నీళ్లను అమ్మలేదు. దానికి డబ్బులు కావాలి కదా' అన్నాడు. బీర్బల్ ఇక వెంటనే కోప్పడుతూ ఇలా అన్నాడు. 'బాలరాజ్.. బావి నీదే కదా?' అన్నాడు. 'అవును' అన్నాడు అతను. 'బావిని సుఖ్‌దేవ్‌కు అమ్మావ్ కదా. నీళ్లు కూడా నీవే కదా?' అంటూనే.. గట్టిగా 'అవునవును' అంటూ గట్టిగా అరిచాడు.

మరింత కోపాన్ని ప్రదర్శిస్తూ బాలరాజ్‌తో బీర్బల్ ఇలా అన్నాడు- "నువ్వు నీ బావిని అమ్మావు. సరే. ఆ బావిలోని నీళ్లు కూడా నీవే అంటున్నావు కదా? అలాగైతే బావిలోని నీళ్లను తోడుకుని అమ్మాలి కదా. నీళ్లన్నీ తోడించి అతని బావి అమ్మాలి' అన్నాడు. బాలరాజ్‌కు మాటల్లేవ్. 'చూడు బాలరాజ్. నీ నీళ్లను సుఖ్‌దేవ్ తన బావిలో ఉంచుకుంటున్నాడు. కాబట్టి అందుకు అద్దె కట్టాల్సిందే' అన్నాడు గట్టిగా బీర్బల్. చేసేదేమీ లేక బీర్బల్ ముందు తప్పయిందని బాలరాజ్ అంగీకరించాడు. 'నా బుద్ధి గడ్డి తిని ఇలా చేశా. మీ ఇష్టం అయ్యా. ఈ ఒక్కసారి క్షమించండి' అంటూ వేడుకున్నాడు. బీర్బల్ హాస్యచతురత, ఆయన పంచాయితీ చూసి రైతు ఆశ్చర్యపోయి.. నమస్కరించాడు. ధన్యవాదాలు తెలిపాడు.

ఎన్ని పిల్లులు ఉన్నాయి?





10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 287

				3			8	
	5	2			4			
		7	9		2	3		
2				9	3			1
4			7	8				6
		5	4		9	2		
			5			7	3	
	2			1				

సుడోకు - 286 సమాధానం

6	2	9	8	7	3	4	5	1
7	8	5	4	9	1	3	6	2
1	3	4	2	6	5	7	9	8
4	5	2	7	3	6	1	8	9
8	1	6	5	4	9	2	7	3
9	7	3	1	8	2	6	4	5
3	9	8	6	2	4	5	1	7
5	4	7	3	1	8	9	2	6
2	6	1	9	5	7	8	3	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.